

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 236

శుక్రవారం 17-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

బహిరంగ ప్రకటన

వెస్టన్ తపోవన్ / ఈడెన్ గార్డెన్ ప్లాట్ల కొనుగోలుదార్ల కోసం

సాహెబ్‌నగర్ కలాన్ గ్రామం, హయత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, తెలంగాణ వద్ద గల సర్వే నం.లు 149, 150, 151 (పార్ట్), 152, 153, 154 (పార్ట్), 155, 156, 179 మరియు 199 (పార్ట్)

నా క్లయింట్ జి స్క్వేర్ రియల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సమాచారం మేరకు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా వెస్టన్ తపోవన్ పేరిట నా క్లయింట్‌చే అభివృద్ధి చేయబడి ఉండి సాహెబ్‌నగర్ కలాన్ గ్రామం, హయత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా వద్ద గల సర్వే నం.లు 149, 150, 151 (పార్ట్), 152, 153, 154 (పార్ట్), 155, 156, 179 మరియు 199 (పార్ట్)లోని 1,56,274 చ.గ.ల పూర్తి విస్తీర్ణం కోసం వెస్టన్ కన్‌స్ట్రక్షన్స్ మరియు శ్రీ లేఖ రియల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాతినిథ్యం వహించువారు శ్రీ ఆర్. సుదర్శన్ రెడ్డితో నా క్లయింట్ 21-12-2022 తేదీ గల న్యాయపరంగా అమలు చేయదగు అమ్మకం ఒప్పందం కలిగి ఉన్నారు. సదరు శ్రీ సుదర్శన్ రెడ్డి నా క్లయింట్‌కి తెలియకుండా మరియు నా క్లయింట్ అనుమతి లేకుండా పైన తెలిపిన సర్వే నంబర్లలోని ప్లాట్లను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలియవచ్చినది. అందువలన దావా షెడ్యూల్ ఆస్తిని అన్యాక్రాంతం చేయకుండా ఉండేందుకు మరియు దానిపై తాకట్టు రుణభారాలు కల్పించకుండా ఉండేందుకు సదరు వెస్టన్ కన్‌స్ట్రక్షన్స్ మరియు శ్రీ లేఖ రియల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాతినిథ్యం వహించువారు శ్రీ ఆర్. సుదర్శన్ రెడ్డిని నిరోధిస్తూ శాశ్వత నిషేధ ఉత్తర్వు కోసం గౌరవనీయ IX అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి, రంగారెడ్డి జిల్లా వారి సమక్షంలో నా క్లయింట్‌చే O.S. 530 of 2023 దాఖలు చేయబడింది. 20-10-2023న గౌరవనీయ IX అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి, రంగారెడ్డి జిల్లా వారు వివాదాల పరిష్కారం కోసం ఆర్బిట్రేషన్‌ను ఆశ్రయించాలని ఇరు పార్టీలను ఆదేశించారు. వెస్టన్ కన్‌స్ట్రక్షన్స్ మరియు శ్రీ లేఖ రియల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాతినిథ్యం వహించు వారు శ్రీ ఆర్. సుదర్శన్ రెడ్డి ఆమోదం కోసం మేము ఒక ఆర్బిట్రేటర్ పేరును ప్రతిపాదించాము. పైన తెలిపిన దానిని దృష్టిలో పెట్టుకుని, వివాదాల పరిష్కారం కోసం ఆర్బిట్రేషన్ అపరిష్కృతంగా ఉన్న సమయంలో, విక్రయించడానికి నా క్లయింట్ అనుమతి పొందకుండా మరియు వారికి తెలియకుండా వెస్టన్ తపోవన్ లేదా ఈడెన్ గార్డెన్ లేదా ఇతరుల ద్వారా ఎటువంటి పేరున అమ్మకం కోసం ఎటువంటి ఒప్పందం కుదుర్చుకోరాదని లేదా పైన తెలిపిన ఆస్తిలో గల ప్లాట్లలో వేటినైనా కొనుగోలు చేయరాదని సాధారణ ప్రజలు సూచించబడుతున్నారు. వివాదంలో ఉన్న ఆస్తిని అన్యాక్రాంతం చేసినా మరియు దాని పై తాకట్టు రుణభారం కల్పించినా అట్టి ఎవరేని వ్యక్తి / రిజిస్టరింగ్ అథారిటీపై క్రిమినల్ అదేవిధంగా సివిల్ ప్రొసీడింగ్స్ చేపట్టేందుకు నా క్లయింట్ తన హక్కు కలిగి ఉన్నారు.

లెఫ్టినెంట్ కల్నల్ గణేశన్ ఎస్.

అడ్వకేట్, 74 లోటస్ కాలనీ, 2వ స్ట్రీట్,
నందనం, చెన్నై - 35. మొబైల్ - 8939498000



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 237

శనివారం 18-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఏఐ దుర్వినియోగంతో సంక్షోభం

నేను పాట పాడినట్లు ఫేక్ వీడియో సృష్టించారు: ప్రధాని మోదీ - 6లో



ఏపీలో ఎలక్ట్రిక్ వాహన యూనిట్

ప్రపంచంలోనే అతి పెద్దది.. జర్మనీ సంస్థ పెప్పర్ మోషన్ ప్రకటన - 12లో

శుక్రవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే. చిత్రంలో వంశీచంద్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క, ఠాక్రే, రేవంత్‌రెడ్డి, సంపత్, మధుయాష్కీ గౌడ్, వి. హనుమంతరావు తదితరులు



ధరణి బదులు భూమాత

అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన కాంగ్రెస్

6 గ్యారంటీలు, 5 డిక్లరేషన్లకు అదనంగా కీలక ప్రకటనలు

- ఉద్యమ అమరుల కుటుంబాలకు రూ. 25 వేల పింఛన్, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం
- ఆడపిల్లల వివాహం కోసం రూ.లక్ష ఆర్థిక సాయం, తులం బంగారం
- రైతులకు ఎకరానికి రూ.15 వేలు ఆర్థిక సాయం. కౌలు రైతులకూ ఈ పథకం వర్తింపు రైతు కూలీలకూ ఏటా రూ.12 వేలు ఆర్థిక సాయం
- ఉద్యోగుల సీపీఎస్ రద్దు.. వెంటనే పీఆర్సీ, డీఏ బకాయిలు
- 200 యూనిట్లలోపు వాడే వారికి కరెంటు ఫ్రీ
- ప్రభుత్వ పథకాల అమలు కోసం గ్రామ వలంటీర్ల వ్యవస్థ
- బీసీలకూ సబ్‌ప్లాన్.. క్రీమీలేయర్ ఎత్తివేతపై కేంద్రానికి సిఫార్సు
- అనుబంధ మేనిఫెస్టోలో జాబ్ కేలండర్.. కేడర్ల వారీగా పోస్టుల భర్తీకి తేదీల ప్రకటన
- బీఆర్ఎస్ పాలనలో అవినీతి ఆరోపణలు, కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణలు

2లో

వారి అవినీతి సంపదను ప్రజలకు పంచుతాం

నర్సంపేట, వరంగల్, పినపాక రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లలో రాహుల్ - వివరాలు 16లో

కేసీఆర్ వెళ్లడానికి రెడీ.. ప్రజలు పంపడానికి రెడీ

కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే - 2లో

కాంగ్రెస్‌లోకి విజయశాంతి

- మాజీ ఎంపీ మందా జగన్నాథం కూడా.. ఖర్గే సమక్షంలో చేరిక - 2లో

నేడు బీజేపీ మేనిఫెస్టో విడుదల

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా షెడ్యూల్‌లో మార్పులు
- మధ్యాహ్నం గద్వాల, నల్లగొండ, వరంగల్ సభలకు హాజరు - 3లో

రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి!

- 4% ముస్లిం రిజర్వేషన్ ఎత్తివేత
- అక్రమ వలసదారుల బహిష్కరణ
- మహిళలకు 10 లక్షల ఉద్యోగాలు వృద్ధులకు ఉచితంగా కాశీ, అయోధ్య ప్రయాణాలు.. బీజేపీ మేనిఫెస్టోలో హామీల దశదిశ.. - 3లో

దర్జాగా బతుకుతున్నం.. మళ్లీ దగా పడదమా?

పరకాల, కరీంనగర్, చొప్పదండి, జమ్మికుంట ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్



జమ్మికుంట ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

- 58 ఏళ్ల తెలంగాణ గోసకు కాంగ్రెస్ పార్టీయే కారణం
- కొట్లాడి ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నం.. ఒక్కటొక్కటిగా సర్దుకుంటూ ఈ స్థాయికి చేరుకున్నం
- తలసరి ఆదాయంలో నేడు దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం
- తప్పుడు నిర్ణయం తీసుకుంటే ఆగమైతం
- పాలిచ్చే బర్రెను అమ్మి దున్నపోతును తెచ్చుకుంటే మెడకు తుంట కట్టుకున్నట్టు అవుతుంది
- కాంగ్రెస్ దోఖేబాజ్ పార్టీ.. బీజేపీది మతపిచ్చి అన్న ముఖ్యమంత్రి
- ఆ రెండు పార్టీలను నమ్మొద్దని, బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని విజ్ఞప్తి

5లో



మధ్యప్రదేశ్‌లో 76%, ఛత్తీస్‌గఢ్‌లో 70.59%

- రెండు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్
- పోలింగ్ శాతం పెరిగే అవకాశం
- పలు చోట్ల చెదురుమదురు ఘటనలు, ఘర్షణలు
- ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ బాంబు పేలి ఐటీబీపీ జవాను మృతి

- వివరాలు 8లో

నాలుగేళ్ల కుమార్తెకు ఉరివేసి...

దంపతుల ఆత్మహత్య

- ముషీరాబాద్‌లోని గంగపుత్ర కాలనీలో విషాదం..
- బిర్లా సైన్స్ సెంటర్‌లోని టికెట్ కౌంటర్‌లో పని చేస్తున్న యువతి
- అర్ధంతరంగా ఉద్యోగం తొలగించడంతో వేదన
- అక్కడ పని చేస్తున్న నలుగురే కక్ష గట్టి తొలగించారని ఆక్రందన
- వారిని విడిచిపెట్టవద్దంటూ సూసైడ్‌నోట్
- ముందుగా బిడ్డకు ఉరేసి.. ఆ తర్వాత భర్తతో కలిసి ఉరివేసుకుని బలవన్మరణం

- వివరాలు 16లో




గురువారం నర్సాపూర్, ఆదిలాబాద్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలకు హాజరైన ప్రజలు

‘చేతి’కి చిక్కొద్దు!

▶ మొదటి పేజీ తరువాయి

పొత్తు పెట్టుకుని లబ్ధి పొంది మళ్లీ మోసం చేశారు. తిక్కపుట్టి కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అని ఆమరణ దీక్షకు దిగిన. 36 పార్టీలు మద్దతు ఇవ్వడంతో కాంగ్రెస్‌కు గత్యంతరం లేక తెలంగాణ ఇవ్వాల్సి వచ్చింది.

ఒక పంథాలో అభివృద్ధి..

తెలంగాణ ఏర్పాటయ్యే నాటికి కరెంటు, మంచినీళ్లు, సాగునీళ్లు లేవు. రైతుల ఆకలిచావులు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు వంటి ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఒక పంథాలో ఒక్కొక్కటిగా తీర్చుకుంటూ, అభివృద్ధి చేసుకుంటూ వెళ్తున్నాం. వందల రూపాయల్లో ఉన్న పింఛన్‌ను వేల రూపాయలకు తీసుకెళ్లాం. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయి. టీఎస్ ఐపాస్, ఐటీ పాలసీలతో దూసుకెళ్లడంతో రాష్ట్ర ఆదాయం పెరిగింది. తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచింది. గతంలో రాష్ట్రంలో మూడే డయాలసిస్ కేంద్రాలుంటే.. ప్రస్తుతం వాటిని 103కు పెంచాం. రైతుల సంక్షేమం కోసం ఏ రాష్ట్రంలోనూ లేని అద్భుత పాలసీని తీసుకున్నాం. నీటి తీరువాను రద్దు చేశాం. 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రైతుబంధుతో పెట్టుబడి సమకూర్చుతున్నాం. పంటలనూ కొనుగోలు చేస్తున్నాం. దురదృష్టవశాత్తు రైతు చనిపోతే వారి కుటుంబం ఆగం కావద్దని రూ.5 లక్షలు రైతుబీమా అందేలా చేశాం.

రైతుబంధు కావాల్నా? రాబందులు కావాల్నా?

కాంగ్రెస్ నాయకులు బాధ్యత లేకుండా దళారులు, పైరవీకారుల రాజ్యం కోసం ధరణిని తీసేస్తామంటున్నారు. ధరణితోనే మీ భూములు భద్రంగా ఉన్నాయి. ఇల్లు గడప దాటకుండా, ఏ ఆఫీసుకు పోకుండా మీ దగ్గరికి రైతుబంధు డబ్బులు వస్తున్నాయి. ధరణి తీసేస్తే లంచాలు, కబ్జాలు, దళారీ వ్యవస్థ, కోర్టుల వివాదాలు పెరుగుతాయి. ధరణి లేకపోతే ఎన్ని హత్యలు జరిగేవో ఆలోచించాలి. పీసీసీ అధ్యక్షుడేమో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ వేస్ట్.. మూడు గంటల కరెంటు చాలు అంటున్నారు. కరెంటు కావాల్నా.. కాంగ్రెస్ కావాల్నా.. రైతుబంధు కావాల్నా, రాబందులు కావాల్నా.. ప్రజలు చర్చచేసి నిర్ణయించుకోవాలి.

యుద్ధం చేసేవారి చేతిలో కత్తి పెట్టాలి

మనపరంగా ఎవరు యుద్ధం చేస్తారో వాళ్ల చేతిలో కత్తి పెడితేనే మనం గెలుస్తాం. కత్తి ఒకరికి ఇచ్చి వేరొకరిని యుద్ధం చేయాలంటే సాధ్యం కాదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిస్తేనే మన బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుంది. ఓటు వేరే వాళ్లకు వేసి పనిచేయాలంటే ఎట్లా చేస్తాం. ఎన్నికల సమయంలో ఆగమవకుండా మంచి ఏమిటో, చెడు ఏమిటో గుర్తించే వివేచన శక్తిని పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

అసైన్డ్ భూములపై హక్కులిస్తాం

పచ్చి అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెస్ నేతలు మొనగాళ్లు. ఎస్సీ, ఎస్టీల పరంపోగు భూములను ప్రభుత్వం గుంజుకుంటుందన్న అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు. మేం మళ్లీ అధికారంలోకి వచ్చాక అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తాం. రాష్ట్రం నుంచి గల్ఫ్ వలస వెళ్లిన కార్మికులకు రూ.5 లక్షల బీమా వర్తింపజేస్తాం.

బీజేపీని చెత్తకుప్పలో పడేయాలి

ప్రధాని మోదీకి వంద ఉత్తరాలు రాసినా తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీగానీ, ఒక్క నవోదయ స్కూల్‌గానీ ఇవ్వలేదు. తెలంగాణకు ధోకా చేసిన బీజేపీకి ఒక్క ఓటు కూడా వేయద్దు. బీజేపీకి ఓటేస్తే మోరీలో వేసినట్టే. మత పిచ్చి లేపే బీజేపీని చెత్తకుప్పలో వేయాలి. రాబోయే రోజుల్లో దేశంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే. కాంగ్రెస్ పార్టీ ఇన్నాళ్లూ మైనార్టీలను ఓటు బ్యాంకుగానే చూసింది. కానీ బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో వారి కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేశాం. మైనార్టీ పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు రెసిడెన్షియల్ స్కూల్స్, రెసిడెన్షియల్ కాలేజీలను ఏర్పాటు చేశాం. కేసీఆర్ బతికున్నంత కాలం తెలంగాణ సెక్యులర్‌గానే ఉంటుంది'' అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

బూతులు కావాలా? భవిష్యత్ కావాలా?: హరీశ్‌రావు

తెలంగాణలో ఎజెండా లేని ప్రతిపక్ష పార్టీలు బూతులు మాట్లాడుతున్నాయని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ప్రతిపక్షాల బూతులు కావాలా? తెలంగాణకు బీఆర్ఎస్ సర్కారు అందించే ఉజ్వల భవిష్యత్తు కావాలా? ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల సంఘం నుంచి అనుమతి వచ్చిన వెంటనే రుణమాఫీని పూర్తి చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ తెలంగాణను ఇచ్చిందని కేంద్ర మాజీ మంత్రి చిదంబరం మాట్లాడటం విడ్డూరమని, ప్రజలు ఉద్యమం చేస్తే, కేసీఆర్ నిరాహార దీక్ష చేస్తే రాష్ట్రం వచ్చిందని పేర్కొన్నారు. సోనియాను బలిదేవత అన్న రేవంత్‌రెడ్డి ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.

సీఎం సభలో బుల్లెట్ల కలకలం



పోలీసుల అదుపులో ఉన్న యువకుడు అస్లాం

నర్సాపూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ సభలో ఓ యువకుడి వద్ద లభించిన బుల్లెట్లు కలకలం రేపాయి. బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ప్రజా ఆశీర్వాద సభ జరిగింది. మంత్రి హరీశ్‌రావు ప్రసంగిస్తున్న సమయంలో ప్రాంగణానికి కొంత దూరంలో అస్లాం అనే యువకుడి వద్ద రెండు బుల్లెట్లను పోలీసులు గుర్తించారు. అయితే అప్పటికి సీఎం సభా వేదికపైకి రాలేదు. పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకొని బుల్లెట్లు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అస్లాం సంగారెడ్డి జిల్లా రాయికోడ్‌కు చెందినప్పటికీ చిలిపిచెడ్ మండలం చండూర్‌లో అతని మేనమామల వద్ద ఉంటున్నట్లు తెలిసింది. కాగా, తాను ఎన్‌సీసీ శిక్షణ పొందిన సమయంలో తనకు ఎన్‌సీసీ క్యాంపు వద్ద బుల్లెట్లు దొరికాయని, వాటిని తన వద్ద ఉంచుకున్నానని పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. అస్లాంను విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ @ 28,057

కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో 28,057 మందికి పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. శాసనసభ సాధారణ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోసం వచ్చిన ‘ఫారం–12డీ’దరఖాస్తులను పరిశీలించిన అనంతరం రిటర్నింగ్ అధికారులు అనుమతించిన పోస్టల్ బ్యాలెట్ వివరాలను గురువారం ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం మొత్తం 44,097 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించిన అనంతరం అధికారులు 28,057 మంది అర్హులను గుర్తించారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజవర్గం పరిధిలో 707 దరఖాస్తులు రాగా, వాటన్నిటికీ రిటర్నింగ్ అధికారులు అనుమతిచ్చారు. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి నియోజకవర్గం పరిధిలో 706 దరఖాస్తులు రాగా వాటికి గ్రీన్‌సిగ్నల్ లభించింది. సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో 812 దరఖాస్తులకు గాను 757 పోస్టల్ బ్యాలెట్‌లకు రిటర్నింగ్ అధికారులు ఆమోదం తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో పోస్టల్ బ్యాలెట్ కోసం వచ్చిన 610 దరఖాస్తుల్లో 339 మాత్రమే అంగీకరించారు. అత్యల్పంగా మక్తల్ నియోజకవర్గ పరిధిలో 19 దరఖాస్తులురాగా, రిటర్నింగ్ అధికారులు అంగీకరించారు. నారాయణపేట్ నియోజకవర్గ పరిధి లో 28 దరఖాస్తులు రాగా, 28 దరఖాస్తులను, వికారాబాద్ నియోజకవర్గ పరిధిలో 30 దరఖాస్తులకుగాను 26 పోస్టల్ బ్యాలెట్‌లను అనుమతించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలో 31 దరఖాస్తులకుగాను 31 పోస్టల్ బ్యాలెట్‌లు, కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో 34 దరఖాస్తులు రాగా, వాటన్నిటినీ రిటర్నింగ్ అధికారులు అంగీకరించారు. ఎన్నికల విధులతో సంబంధం లేని 13 రకాల అత్యవసర సేవల్లో నిమగ్నమై ఉండే ఓటర్లకు తొలిసారిగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించాలన్న సీఈసీ ఆదేశాల మేరకు వారికి ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఇచ్చినట్టు తెలిసింది.

అలిగిన కోడళ్లకు గెలవగానే శుభవార్త

- తెల్ల రేషన్‌కార్డు ఉన్న వారందరికీ నెలకు రూ.3 వేల పెన్షన్
- మంత్రి కేటీఆర్ హామీ
- అత్తల పింఛను రూ.5 వేలకు పెంచుతాం
- వికారాబాద్, మొయినాబాద్, మర్పల్లిలో రోడ్ షోలు



వికారాబాద్ రోడ్‌షోలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

వికారాబాద్, మొయినాబాద్: ‘అందరికీ ఏదో ఒకటి ఇచ్చిండ్రు.. మాకే ఏమీ ఇవ్వలేదని కోడళ్లు కొంచం మా మీద అలిగిండ్రు.. గెలవగానే కోడళ్లకు శుభ వార్త చెప్తాం. తెల్ల రేషన్‌కార్డు ఉన్న కోడళ్లందరికీ నెలకు రూ.3 వేల పెన్షన్ ఇస్తాం. కోడళ్లకు, అత్తలకు అంతేనా అని అలగొద్దు.. అత్తలకు ఇస్తున్న పింఛన్‌ను రూ.5 వేలకు పెంచుతాం..’అని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. ప్రచారంలో భాగంగా గురువారం ఆయన వికారాబాద్, మర్పల్లి, మొయినాబాద్‌లో రోడ్ షోలు నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి కాలె యాదయ్య(చేవెళ్ల)ను, ఆనంద్ (వికారాబాద్)ను మరోసారి గెలిపించాలని కోరారు. ‘మన జుట్టు ఢిల్లీ వాని చేతికివ్వొద్దు.. ఇన్నాళ్లు పాలించింది వారే.. మళ్లీ ఒక్క చాన్స్ అని వస్తున్నరు. స్వాతంత్ర్యం వచ్చాక కాంగ్రెస్‌కు 11 చాన్స్‌లు ఇచ్చిండ్రు.. అప్పుడేమీ చేయని పార్టీ ఇప్పుడేం చేస్తుంది..?’అని కేటీఆర్ ప్రశ్నించారు. 52కిలోల బక్క కేసీఆర్‌ను కొట్టనీకి ఢిల్లీతో పాటు పక్క రాష్ట్రాల నుంచి గుంపులుగా వస్తున్నా రని ధ్వజమెత్తారు. బీజేపీ నుంచి మోదీ, అమిత్‌షాతో పాటు 15 మంది సీఎంలు, 15 మంది కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ నుంచి పక్క రాష్ట్రాల పెద్ద మనుషులు బయలుదేరానని తెలిపారు. అయినా ఏమీ చేయలేరని, తెలంగాణ బిడ్డ కేసీఆర్ సింహం లాంటోడని, సింహం సింగిల్‌గానే వస్తదని, గుంపులు గుంపులుగా వచ్చేటోళ్లను ఏమంటారో మీకే తెలుసంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

భూములు లేని పేదలకు కేసీఆర్ బీమా..

‘స్వతంత్ర భారత చరిత్రలో కేసీఆర్‌ను మించిన నేత లేడు. 75 ఏళ్ల చరిత్రలో రైతుబంధు, రైతు బీమా ఇచ్చిన సీఎం, పీఎం ఎవరైనా ఉన్నారా..? రాష్ట్రంలో 46 లక్షల మందికి పింఛన్లు, 75 లక్షల మంది రైతులకు రైతుబంధు, 13.5 లక్షల మందికి కల్యాణలక్ష్మి, 15 లక్షల మందికి కేసీఆర్ కిట్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది కాదా?..’అని కేటీఆర్ ప్రశ్నించారు. ‘ఎన్నికలు రాగానే ఆగమాగం కావద్దు.. ఆనంద్ మళ్లీ సీఎం అవుతారు..’(వెంటనే సవరించు కుని మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారు) అని అన్నారు. మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే భూములు లేని పేదలకు కేసీఆర్ బీమా అమలు చేస్తామన్నారు. తెల్లకార్డున్న వారందరికీ సన్న బియ్యం ఇస్తామని తెలిపారు. రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించారు. మైనార్టీ సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ.. బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్‌లో ఒక్కసారి కూడా గొడవలు కాలేదన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 111 జీఓను ఎత్తేశామని కేటీఆర్ చెప్పారు. గంగిగోవు లాంటి ఎమ్మెల్యే కాలె యాదయ్య కావాలా.. ఆయుధాలు సరఫరా చేసే కాంగ్రెస్ అభ్యర్థి కావాలా..? ప్రజలు తేల్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

కరెంటు కావాలా.. కాంగ్రెస్ కావాలా..?

ఇక్కడి కాంగ్రెస్ నాయకులకు చేవ లేదు, సత్తాలేదని మంత్రి విమర్శించారు. అందుకే ఢిల్లీతో పాటు పక్క రాష్ట్రాల నుంచి నాయకులను తెచ్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఊర్లల్ల ఎవరైనా చచ్చిపోతే స్నానాలు చేయడానికి ఓ అరగంట కరెంటు వదలండని కరెంటోళ్ల కాళ్లు మొక్కిన రోజులు ఇంకా మనం మర్చిపోలేదన్నారు. కరెంటు కావాలా.. కాంగ్రెస్ కావాలా..? ప్రజలు తేల్చుకోవాలని పిలుపునిచ్చారు. గులిగితే మామీద గులగండి.. ఓట్లు కూడా మాకే గుద్దండి అని కోరారు.

పోరు ఇక జోరు..!

▶ మొదటి పేజీ తరువాయి

మేనిఫెస్టో ప్రకటించనుంది. శనివారం బీజేపీ మేనిఫెస్టో విడుదలకానుంది.

విస్తృతంగా సభలు, రోడ్‌షోలకు ప్లాన్

పోలింగ్‌కు ఇంకా రెండు వారాల వ్యవధి కూడా లేకపోవడంతో.. అన్ని పార్టీలు ప్రచార వ్యూహాలకు మరింత పదునుపెడుతున్నాయి. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల నేతలు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారు. ఈక్రమంలో సభలు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. ప్రచారం ముగింపునకు వచ్చే సమయానికి అగ్రనేతలతో భారీ బహిరంగ సభలు, రోడ్‌షోలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

దూకుడుగా ముందుకెళ్తున్న బీఆర్ఎస్..

ఇప్పటికే రోజుకు మూడు, నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో బహిరంగ సభలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఈనెల 25న పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఆ సభ ద్వారా బీఆర్ఎస్ సత్తా ఏమిటో చాటాలనే ఉద్దేశంతో గులాబీ అధినేత ఉన్నారు. ఇదే సమయంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఇద్దరూ విస్తృతంగా రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌ల్లో పాల్గొంటున్నారు. బీఆర్ఎస్ సర్కారు సాధించిన ప్రగతిని వివరిస్తూనే.. కాంగ్రెస్, బీజేపీలను తూర్పారబడుతున్నారు.

కాంగ్రెస్ అగ్రనేతలంతా ఇక్కడికే..

రాష్ట్రంలో తమకు సానుకూల వాతావరణం ఏర్పడిందని చెప్తున్న కాంగ్రెస్ పార్టీ.. ప్రచారాన్ని ఉధృతం చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ సభలు, రోడ్‌షోలలో పాల్గొంటున్నారు. సీనియర్ నేతలు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఆరు గ్యారంటీలను ప్రచారం చేస్తూ ప్రజల్లో కాంగ్రెస్ పట్ల విశ్వాసం కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై, ప్రధానంగా సీఎం కేసీఆర్, కేటీఆర్‌లు లక్ష్యంగా ఘాటైన పదజాలంతో విరుచుకుపడుతున్నారు. శుక్రవారం (17న) గాంధీభవన్‌లో మల్లికార్జునఖర్గే కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేస్తారు. తర్వాత కుత్బుల్లాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. శుక్రవారమే.. అగ్రనేత రాహుల్‌గాంధీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పినపాక, వరంగల్ జిల్లాలోని నర్సంపేట, వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలు, రంగారెడ్డి జిల్లా పరిధిలోని రాజేంద్రనగర్ సెగ్మెంట్ల పరిధిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. రాజస్తాన్‌లో ఈ నెల 23తో ప్రచారం ముగుస్తుండటంతో.. వెంటనే కాంగ్రెస్ ముఖ్య నేతలంతా తెలంగాణలో ఉధృత ప్రచారం మొదలుపెట్టనున్నారు. ఇక ఈ నెల 27న లేదా 28న సోనియాగాంధీతో హైదరాబాద్ శివార్లలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు.

రంగంలోకి మోదీ, అమిత్ షా..

బీజేపీ తరఫున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ తదితరులు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఒక దశ ప్రచారం పూర్తిచేసిన ఆ పార్టీ జాతీయ నేతలు.. శనివారం నుంచి మరోసారి రంగంలోకి దిగుతున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా శనివారం (18న) బీజేపీ మేనిఫెస్టోను విడుదల చేయనున్నారు. అదే రోజున గద్వాల, నల్లగొండ, వరంగల్ సభల్లో పాల్గొంటారు. సికింద్రాబాద్‌లో ఎమ్మార్పీఎస్ నేతలతో సమావేశం అవుతారు. 19వ తేదీన పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా రాష్ట్రంలోని నారాయణపేట, చేవెళ్ల సభలతోపాటు మల్కాజిగిరి రోడ్‌షోలలో పాల్గొంటారు. ఈనెల 26–27 తేదీల మధ్య రెండు రోజులపాటు ప్రధాని మోదీ రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. 27న హైదరాబాద్ నగర రహదారులపై ఆయనతో భారీ రోడ్‌షో నిర్వహణకు బీజేపీ ప్రణాళిక సిద్ధం చేసింది. ఆయన మరో రెండు నగరాల్లో నిర్వహించే బహిరంగ సభల్లో కూడా పాల్గొననున్నారు.

మాటల తూటాలు.. విమర్శల బాణాలు..

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంటోంది. అధికార బీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ మధ్య విమర్శలు, ఆరోపణలు అయితే తారస్థాయికి చేరాయి. బీజేపీ కూడా ఈ రెండు పార్టీలను లక్ష్యంగా చేసుకుని విమర్శనాస్త్రాలు సంధిస్తోంది.

- కాంగ్రెస్ పాలన సమయంలో తెలంగాణ గోసపడ్డదని, మళ్లీ వారు వస్తే నాశనమే అంటూ బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. కర్నాటకలో ఇచ్చిన ఐదు గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ విఫలమైందంటూ విమర్శనాస్త్రాలు సంధిస్తోంది. ఢిల్లీ బానిసలు కావాలా? ప్రజల్లో ఉండే బీఆర్ఎస్ కావాలా తేల్చుకోవాలంటోంది. బీఆర్ఎస్ సర్కారు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతో రాష్ట్రం టాప్‌లోకి వెళ్లిందని.. వాటిని మరింత పకడ్బందీగా అమలు చేసేలా తమకే అధికారం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తోంది.
- తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినదే కాంగ్రెస్ పార్టీ అని.. ఎన్నో ఆకాంక్షలతో వచ్చిన తెలంగాణకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని, నిండా అప్పుల్లో ముంచేసిందని కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. కేసీఆర్ కుటుంబం వివిధ పథకాల్లో అవినీతికి, అక్రమాలకు పాల్పడిందంటూ ఆరోపణలు గుప్పిస్తోంది. బీఆర్ఎస్ చెప్పుకొంటున్న ప్రగతి డొల్ల అని, తాము వస్తే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామంటూ జనంలోకి వెళ్తోంది.
- బీఆర్ఎస్ కుటుంబ పాలన, అవినీతి, హామీల అమల్లో వైఫల్యాలను ఎత్తిచూపుతూ బీజేపీ విమర్శలు గుప్పిస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ కుటుంబ పాలన, అవినీతిమయం అంటూ ఆరోపణలు చేస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచినా బీఆర్ఎస్‌లోకే వెళతారని, అందువల్ల బీజేపీ అభ్యర్థులకే ఓటేయాలంటూ విజ్ఞప్తి చేస్తోంది. కేంద్రంలోని ప్రధాని మోదీ సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తోంది.
- బీఎస్పీ అధినేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కూడా అధికారపక్షంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తూ తమ అభ్యర్థుల పక్షాన దూకుడుగా ప్రచారం చేస్తున్నారు.

నల్లగొండ జిల్లాలో ఐటీ దాడులు..

రూ.5 కోట్లు స్వాధీనం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సన్నిహితుల ఇళ్లలో, రైస్ మిల్లుల్లో సోదాలు
- రూ.5 కోట్ల నగదు, పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం!

సాక్షి, హైదరాబాద్/ మిర్యాలగూడ అర్బన్, త్రిపురారం, హాలియా, నల్లగొండ క్రైం: నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. ఆయాచోట్ల రూ.5 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మిర్యాలగూడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భాస్కర్‌రావు సన్నిహితులు లక్ష్యంగానే ఈ సోదాలు జరిగినట్టు ప్రచారం జరిగింది. 40 మంది అధికారులు బృందాలుగా విడిపోయి భాస్కర్‌రావు అనుచరుల ఇళ్లు, రైస్‌మిల్లులు, ఓ కాంట్రాక్టర్ ఇంటిపై ఏకకాలంలో తనిఖీలు నిర్వహించిన అధికారులు పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ప్రముఖ కాంట్రాక్టర్ ఇంజమూరి శ్రీధర్ ఇంటితో పాటు రైస్ మిల్లుల యజమానులు రంగా రంజిత్, రంగా శ్రీధర్, బండారు కుశలయ్య, రేపాల అంతయ్య నివాసాలు వారి రైస్‌మిల్లుల్లోనూ తనిఖీలు నిర్వహించారు. త్రిపురారం మండల పరి ధిలోని వెంకటసాయి సాల్వెంట్ ఆయిల్ మిల్లులో గురువారం ఉదయం 6 నుంచి రాత్రి వరకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. హాలియా పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిప్రోలు యాదగిరి ఇంటిపై, ఆయన రైస్‌మిల్లుపైనా దాడులు కొనసాగాయి. నల్లగొండ పట్టణంలోని ఆయిల్, రైస్‌మిల్లు వ్యాపారి కందుకూరి మహేందర్ నివాసంలో కూడా ఐటీ అధికారులు గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు నిర్వహించారు. కాగా, పట్టుబడిన నగదును ఎన్నికల కోసం వివిధ పార్టీల నాయకులు నిల్వచేసినట్లు సమాచారం.

రాష్ట్రానికి మరో 275 కంపెనీల | కేంద్ర బలగాలు

ఈనెల 19 నాటికి రాష్ట్రానికి చేరనున్న కేంద్ర సాయుధ పోలీసు బలగాలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాల మోహరింపు పెరిగింది. ఈనెల 19 లేదా 20 తేదీల్లో మరో 275 కంపెనీల కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు రాష్ట్రానికి అదనంగా చేరనున్నట్టు శాంతిభద్రతల అదనపు డీజీ, ఎన్నికల నోడల్ అధికారి సంజయ్ కుమార్ జైన్ వెల్లడించారు. పోలింగ్ తేదీకి పది రోజుల ముందు నుంచే కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు పూర్తిస్థాయిలో ఎన్నికల విధుల్లో ఉండనున్నట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాల వర్గీకరణ ఆధారంగా కేంద్ర సాయుధ బలగాల మోహరింపు ఉంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 19,375 పోలింగ్ కేంద్రాల్లో క్లిష్టమైనవిగా గుర్తించిన 4,400 కేంద్రాలకు అదనంగా సిబ్బందిని కేటాయించనున్నారు. ఎన్నికల బందోబస్తు, చెక్‌పోస్టుల వద్ద గస్తీతోపాటు పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత విధుల్లోనూ కేంద్ర సాయుధ పోలీస్ బలగాలే ఉండనున్నాయి. పోలింగ్ తేదీకి రెండు నుంచి మూడు రోజుల ముందు ఇతర రాష్ట్రాల నుంచి అవసరం మేరకు సాయుధ పోలీసులు, హోంగార్డులను సైతం ఎన్నికల విధుల్లో ఉంటారని తెలిపారు.

క్లుప్తంగా...

మాకు మద్దతివ్వండి

సీపీఎం నేతలతో మంత్రి హరీశ్ భేటీ



సంగారెడ్డిలో సీపీఎం నేతలతో మాట్లాడుతున్న హరీశ్

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లాలో సీపీఎం పోటీ చేయని స్థానాల్లో.. బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు సీపీఎం నేతలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ తదితరులతో కలిసి ఆయన గురువారం సంగారెడ్డిలోని సీపీఎం కార్యాలయానికి వెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీపీఎం ముఖ్య నేతలు.. పార్టీ పెద్దలతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హరీశ్‌కు హామీ ఇచ్చారు.

కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి

కోరుట్ల ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఇబ్రహీంపట్నం/మెట్‌పల్లి రూరల్: రాష్ట్ర ప్రజలను పలు రకాలుగా కష్టపెట్టిన కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు తమ ఓటు ద్వారా బుద్ధిచెప్పాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. వ్యవసాయానికి మూడు గంటలే కరెంట్ కావాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అంటున్నారని, ధరణి పోర్టల్‌ను కూడా తీసేస్తమంటున్నారని, అదే జరిగితే రైతులు ఎలా బతుకుతారో గమనించాలని అన్నారు. ఎన్నికలప్పుడు వచ్చే బీజేపీ నాయకుల మాయలో పడొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ పనిచేస్తోందని, మరోమారు అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు కవిత వాహనాన్ని అంతర్‌జిల్లా చెక్‌పోస్ట్ వద్ద ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు.

దమ్ముంటే వాస్తవాలు చెప్పి ప్రజల్లోకి వెళ్లాలి

బీఆర్ఎస్ నేత పొన్నాల



సాక్షి, హైదరాబాద్: దమ్ముంటే ప్రజలకు వాస్తవాలు చెప్పి కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి వెళ్లాలని బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఇచ్చిన ఉద్యోగాలు, చేసిన అప్పుల గురించి తప్పుడు లెక్కలు చెప్పకుండా వాస్తవాలు చెప్పాలన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో లక్షా 95వేల ఖాళీలు ఉన్నాయని, ఇప్పుడు ఎన్ని ఖాళీలు ఉన్నాయో లెక్కలు వేసుకుని చూడాలని చెప్పారు. రాజకీయ దురుద్దేశంతో బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అప్పులు చేసే రాష్ట్రాలలో మన రాష్ట్రం 22వ స్థానంలో ఉందని, తొలిస్థానంలో అరుణాచల్‌ప్రదేశ్ ఉందని వివరించారు. కాంగ్రెస్ నేతలు రాజస్థాన్ అప్పుల మీద మాట్లాడాలని సవాల్ విసిరారు. అప్పులు చేయకుండా, భూములు అమ్మకుండా ఆరు గ్యారంటీ స్కీంలు అమలు చేయగలరా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇస్తున్న హామీలు అమలు కావని, మళ్లీ కేసీఆర్‌ను సీఎంను చేస్తారని జోస్యం చెప్పారు.

మేనిఫెస్టోల్లో బీసీ బిల్లు అంశాన్ని చేర్చాలి

కాంగ్రెస్, బీజేపీలకు ఆర్ కృష్ణయ్య డిమాండ్



కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, బీజేపీల మేనిఫెస్టోల్లో బీసీ బిల్లు అంశాన్ని చేర్చాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన గురువారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలోని బీసీలందరూ రాజ్యాధికారంలో వాటా కోరుతున్నారని తెలిపారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే 50% ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు బీసీలకే వస్తాయన్నారు. బీసీ డిక్లరేషన్‌లో రాజకీయ రిజర్వేషన్ల అంశాన్ని చేర్చితే ఆ పార్టీలపై నమ్మకం ఏర్పడేదని, కాంగ్రెస్, బీజేపీలు బిల్లు పెట్టడానికి ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. పార్టీలు అనుసరిస్తున్న బీసీ వ్యతిరేక విధానాలపట్ల బీసీలు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న వైఎస్ భారతీరెడ్డి

..స్ఫూర్తి ప్రదాతలు

▶ మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ.. విద్య, వ్యవసాయం, క్రీడలు, ఆరోగ్యం, పర్యావరణం లాంటి రంగాల్లో అవార్డు గ్రహీతలు సమాజంపై చెప్పుకోదగిన ప్రభావం చూపారని, వారి శ్రమకు ఈ పురస్కారాలు తగిన గుర్తింపు అని నజీర్ పేర్కొన్నారు ఈ సందర్భంగా ఏపీ గవర్నర్.. 'మానవ సేవను మించిన అత్యుత్తమ మతం లేదు..'అన్న ఉడ్రో విల్సన్ (ఒకప్పటి అమెరికా అధ్యక్షుడు) సూక్తిని ఉటంకించారు. సమాజ సేవ చేసే ఎన్జీవోలు, సంస్థలు, విభిన్న రంగాలకు చెందిన వ్యక్తులను ఎంపిక చేయడంలో సెలక్షన్ కమిటీ పనితీరును ఆయన అభినందించారు. వ్యయ ప్రయాసలకోర్చి సాక్షి మీడియా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిందన్నారు. అవార్డు గ్రహీతలను.. పేరు పేరునా వారి విజయాలను ప్రస్తావిస్తూ నజీర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ భారతీరెడ్డి, సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్లు, సీఈవో, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా.. రైతుల కష్టాలను కళ్లకు గట్టిన సుమధుర ఆర్ట్స్ అకాడమీ నృత్య రూపకం, సంగీత సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



గురువారం హైదరాబాద్ జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగిన సాక్షి ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, వైఎస్ భారతీరెడ్డి. చిత్రంలో సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్లు కేఆర్‌పీ రెడ్డి, ఏఎల్ఎన్ రెడ్డి, ఎడిటర్ వర్ధెల్లి మురళి, సీఈఓ అనురాగ్ అగర్వాల్, విట్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి, సాక్షి డైరెక్టర్ వైఈపీ రెడ్డి, భారతీ సిమెంట్స్ మార్కెటింగ్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, సాక్షి డైరెక్టర్ రాణిరెడ్డి

క్లుప్తంగా...

నేడు కాంగ్రెస్‌లోకి విజయశాంతి



సాక్షి, హైదరాబాద్: బీజేపీకి రాజీనామా చేసిన మాజీ ఎంపీ విజయశాంతి నేడు(శుక్రవారం) కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. కాగా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీలు శుక్రవారం హైదరాబాద్‌కు రానున్నారు. ఆ ఇద్దరి నేతలలో ఎవరో ఒకరి సమక్షంలో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరతారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

గోరటి ఆ ఇంటర్వ్యూ ఎలా చేస్తారు?

- కేటీఆర్ ఇంటర్వ్యూపై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: కవులు, కళాకారులకు గోరటి వెంకన్న మచ్చలాగా మారారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ వ్యాఖ్యానించారు. ఆయన గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వెంకన్న కేసీఆర్‌కు తొత్తులా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఆయన కేటీఆర్‌ను ఎలా ఇంటర్వ్యూ చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన అమరవీరుల స్తూపం వద్ద అంబేడ్కర్ విగ్రహం కనిపించేలా డ్రోన్‌లతో షూటింగ్‌కు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. ఈ ఇంటర్వ్యూపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజా సమితి మద్దతు

రాష్ట్ర అధ్యక్షురాలు నీరా కిశోర్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తున్నట్టు తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్) ప్రకటించింది. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కనీసం తెలంగాణ అమరవీరులను కూడా గుర్తించి గౌరవించే పరిస్థితి లేదని, ఈ నేపథ్యంలో తాము పెట్టిన డిమాండ్లను అంగీకరించినందున కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వాలని నిర్ణయించామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు నీరా కిశోర్ వెల్లడించారు. టీపీఎస్ నేతలతో గురువారం గాంధీభవన్‌కు వచ్చిన ఆమె ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్ రెడ్డి, మీడియా ఇన్‌చార్జి అజయ్‌కుమార్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ...రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే తెలంగాణ ఉద్యమకారులపై ఉన్న కేసులన్నింటినీ ఎత్తివేయాలన్నారు.

సుమన్‌కు వేల కోట్లు ఎలా వచ్చాయి?

ఓయూ జేఏసీ నేత సురేశ్‌యాదవ్

చెన్నూర్: చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌కు నాడు వెయ్యి రూపాయలు కూడా లేవు.. నేడు వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ఓయూ జేఏసీ నాయకుడు సురేశ్‌యాదవ్ ప్రశ్నించారు. గురువారం ఉస్మానియా వర్సిటీ విద్యార్థి నేతలు మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సుమన్‌కు వ్యతిరేకంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించాలని ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో పర్యటిస్తున్నామని చెప్పారు. ఉద్యమంలో సుమన్ స్వలాభం కోసం విద్యార్థులను రెచ్చగొట్టి జైలు పాలు చేసి, ఉద్యోగాలు రాకుండా జీవితాలను నాశనం చేశారని ఆరోపించారు.

ప్రవీణ్‌కుమార్‌పై ఎలాంటి చర్యలూ వద్దు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో నమోదైన కేసులో బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అరెస్టు సహా ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఎస్ పునీత్ మరి కొందరు తన వాహనాన్ని ఆపారని, తనను చంపేందుకు ప్రయత్నించారని పేర్కొంటూ కాగజ్‌నగర్‌కు చెందిన డ్రైవర్ అలీమ్ ఖాన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఈనెల 13న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. కాగా, ఎలాంటి ముందస్తు విచారణ చేపట్టకుండానే ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో తనపై కేసు నమోదు చేశారని, కాగజ్‌నగర్ అసెంబ్లీ స్థానం నుంచి తాను పోటీ చేస్తున్నానని, ఈ కేసులో పోలీసుల విచారణను వెంటనే నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.సురేందర్ గురువారం విచారించారు. ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.

రెండు లక్షల కొలువులిస్తాం

కాంగ్రెస్ సర్కారు రాగానే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ: రేవంత్‌రెడ్డి

- సీఎం కేసీఆర్, మంత్రి మల్లారెడ్డి ఇద్దరూ తోడు దొంగలు
- మేడ్చల్ కార్నర్ మీటింగ్‌లలో ప్రసంగించిన టీపీసీసీ అధ్యక్షుడు



గురువారం మేడ్చల్‌లో కాంగ్రెస్ నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు

జవహర్‌నగర్, మేడ్చల్ రూరల్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెసేనని, తమ ప్రభుత్వం ఏర్పాటుకాగానే రెండు లక్షల కొలువులను భర్తీ చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ వస్తే ఆగమవుతుందని కేసీఆర్, కేటీఆర్ ప్రచారం చేస్తున్నారని.. బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ ఆగమైందని మండిపడ్డారు. మంత్రి మల్లారెడ్డి మేడ్చల్‌ను అభివృద్ధి చేయకపోగా కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గురువారం మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్, మేడ్చల్ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్ (జంగయ్య) యాదవ్‌ను గెలిపించాలంటూ కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ''సీఎం కేసీఆర్‌కు, మంత్రులకు ఆస్తులున్న కోకాపేట వైపు ఐటీ సంస్థలను ఏర్పాటు చేశారు. జవహర్‌నగర్‌ను అభివృద్ధి చేయకపోగా డంపింగ్ యార్డ్‌ను బహుమతిగా ఇచ్చారు. మేడ్చల్, జవహర్‌నగర్‌లలో ఐటీ కంపెనీలు రాకుండా బీఆర్ఎస్ నాయకులు అడ్డుపడుతున్నారు. మేడ్చల్‌లో ఐటీ పార్క్ తెస్తామని గొప్పలు చెప్పిన కేటీఆర్ పత్తాలేకుండా పోయారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఐటీ కారిడార్‌ను ఏర్పాటు చేస్తాం..''అని తెలిపారు.

మల్లారెడ్డి టికెట్ కోసం ఎన్నికోట్లు ఇచ్చారు?

రాష్ట్రంలో కేసీఆర్ వందల కోట్లు దండుకుంటుంటే.. మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డి చెరువులను కబ్జాచేస్తూ, కిందిస్థాయి ప్రజాప్రతినిధులకు సీట్లు అమ్ముకుని వందల కోట్లు వెనకేసుకున్నారు. జవహర్‌నగర్‌లో ప్రభుత్వ స్థలంలో మంత్రి మల్లారెడ్డి ఆస్పత్రి కట్టినా పట్టించుకోవడం లేదుగానీ.. పేదలు 60 గజాల్లో గుడిసెలు వేసుకుంటే కూల్చివేస్తున్నారు. ఇంత అవినీతికి పాల్పడ్డ మల్లారెడ్డి ఎమ్మెల్యే టికెట్ కోసం కేసీఆర్‌కు ఎన్ని కోట్లు ఇచ్చారో చెప్పాలి..''అని రేవంత్ డిమాండ్ చేశారు. ఇక్కడ మూడుచింతలపల్లిని దత్తత తీసుకున్న సీఎం కేసీఆర్ ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి వంటి ఎన్నో హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని, ఇప్పుడు మూడోసారి గెలిపించాలంటూ వస్తున్నారని విమర్శించారు. ఇన్నాళ్లూ కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని కేసీఆర్ అడుగుతున్నారని.. హైదరాబాద్‌లో ఔటర్ రింగురోడ్డు, శంషాబాద్ విమానాశ్రయం, ఫార్మా కంపెనీలు, మెట్రో రైలు, ఫ్లైఓవర్లు, గోదావరి, కృష్ణా జలాల తరలింపు వంటివి వచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కాదా? అని ప్రశ్నించారు.

దొరల ప్రభుత్వాన్ని కూల్చాలి

అసలు తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీ, కాంగ్రెస్ పార్టీ అని.. రాష్ట్రం ఇవ్వకుంటే కేసీఆర్ కుటుంబం నాంపల్లి దర్గా వద్దో, బిర్లామందిర్ మెట్లపైనో బిచ్చమెత్తుకునే వారని రేవంత్ అన్నారు. హరీశ్‌రావుకు వేల కోట్లు ఎలా వచ్చాయని, కేసీఆర్, కేటీఆర్‌లకు వేల ఎకరాల భూములు, ఫామ్ హౌస్‌లు ఎక్కడివని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంటోందని ఆరోపించారు. ఈ అసెంబ్లీ ఎన్నికలు దొరల పాలనకు, పేదలకు మధ్య పోరాటమని.. పేదల ప్రభుత్వం రావాలంటే దొరల ప్రభుత్వాన్ని కూల్చాలని పిలుపునిచ్చారు.

రైతులను మోసం చేస్తున్న కేసీఆర్

కేసీఆర్ రైతుబంధు, రైతు బీమా అంటూ రైతులను మోసం చేస్తున్నారని.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటికే 91వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు నివేదికలే వెల్లడించాయని రేవంత్ చెప్పారు. సీఎం కేసీఆర్ కాళేశ్వరం పేరిట లక్ష కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా 30లక్షల మంది నిరుద్యోగులను ముంచిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో పేదలకు మేలు జరుగుతుందన్నారు. ఇల్లు లేని వారికి 250 గజాల స్థలంతోపాటు ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు ఇస్తామని.. ఆడపిల్లలకు పెళ్లినాడే రూ.లక్ష ఆర్థిక సాయంతోపాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపాలిటీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు, జవహర్‌నగర్ ముదిరాజ్ జిల్లా యువజన అధ్యక్షుడు అనిల్, రజక, కురుమ సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మళ్లీ 'హస్తం' మంత్రం!

కాంగ్రెస్ మేనిఫెస్టోలో అమ్మ హస్తం, అభయ హస్తం పథకాలు

- ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల ప్రణాళికలోనూ మహిళలకే ప్రాధాన్యం
- మహిళా సంఘాలకు పింఛను, రేషన్ కార్డుదారులకు 9 నిత్యావసరాలు
- ఏపీలో ఉన్న వలంటీర్ల తరహా వ్యవస్థ.. వార్డు మెంబర్ల ద్వారా పథకాల అమలు?
- ధరణి స్థానంలో భూభారతి పేరుతో కొత్త ప్రాజెక్టు
- నేడు గాంధీభవన్‌లో విడుదల చేయనున్న ఖర్గే



సాక్షి, హైదరాబాద్: ప్రజాకర్షక హామీలతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో సిద్ధమైంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకివ్వనున్న హామీలతో రూపొందించిన ఎన్నికల ప్రణాళికను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఆరు గ్యారంటీల పేరుతో మహిళల ఓట్లను ఆకర్షించే పనిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఎన్నికల మేనిఫెస్టోలోనూ మహిళలకే ప్రాధాన్యమివ్వనుంది. ముఖ్యంగా గత కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేసిన అమ్మ హస్తం, అభయ హస్తం పథకాలను మళ్లీ తెస్తామనే హామీ ఇవ్వనుంది. శుక్రవారం ఉదయం 11 గంటలకు గాంధీభవన్‌లో ఖర్గే పార్టీ మేనిఫెస్టోను విడుదల చేస్తారని, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కో చైర్మన్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లతో పాటు మేనిఫెస్టో కమిటీ సభ్యులు, టీపీసీసీ కీలక నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

ఉద్యోగాల భర్తీ..విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు

అమ్మ హస్తం ద్వారా రేషన్ దుకాణాల్లో 9 నిత్యావసర వస్తువుల పంపిణీ, అభయ హస్తం ద్వారా మహిళా సంఘాల సభ్యులకు జీవిత బీమాతో పాటు పింఛను సదుపాయాన్ని కల్పిస్తామని ప్రకటించనుంది. ఉద్యోగులకు సీపీఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు 25 శాతం పెంపుదల, ప్రతియేటా ఉద్యోగ కేలండర్, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, వార్డు మెంబర్ల గౌరవ వేతనాల పెంపుతో పాటు ఏపీలో అమలవుతున్న వలంటీర్ల వ్యవస్థ తరహాలో గ్రామ పంచాయతీ సభ్యులతోనే గ్రామాల్లో సంక్షేమ పథకాలను అమలు చేయించడం లాంటి హామీలు ఇవ్వనున్నట్టు సమాచారం. ధరణి పోర్టల్ పేరు మార్చి భూ భారతి పేరుతో కొత్త వ్యవస్థను అందుబాటులోకి తేవడం, మెట్రో రైళ్లలో విద్యార్థినులకు ఉచిత ప్రయాణం, ల్యాప్‌టాప్‌ల పంపిణీ తదితర అంశాలతో మొత్తం 36 విభాగాల్లో ఈ మేనిఫెస్టోను రూపొందించినట్టు గాంధీభవన్ వర్గాలు చెపుతున్నాయి.

నేడు రాహుల్, ఖర్గే పర్యటన

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఇప్పటికే ఖరారైన షెడ్యూల్ మేరకు పినపాక, నర్సంపేట, వరంగల్ ఈస్ట్, వెస్ట్‌తో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో రోడ్‌షోలు, పాదయాత్రలు, కార్నర్ మీటింగుల్లో రాహుల్ పాల్గొననున్నారు. బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 10 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి రానున్న ఖర్గే 11 గంటలకు గాంధీభవన్‌కు చేరుకుని టీపీసీసీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తారు. సాయంత్రం 4 గంటలకు కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. రాత్రికి హైదరాబాద్‌లోనే బస చేసి శనివారం ఉదయం 10:30 గంటలకు బెంగళూరు వెళతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

హంతకుడే సంతాపం తెలిపినట్లు ఉంది

సాక్షి, హైదరాబాద్

- కాంగ్రెస్ నేత చిదంబరం వ్యాఖ్యలపై మంత్రి హరీశ్‌రావు ట్వీట్
- కాంగ్రెస్‌కు ప్రజలు ఒక్కటి కాదు.. 11 చాన్స్‌లు ఇచ్చారని ఎద్దేవా



హంతకుడే సంతాపం వ్యక్తం చేసినట్లుగా కాంగ్రెస్ నేత చిదంబరం తీరు ఉందని మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. తొలుత తెలంగాణ ఏర్పాటుపై ప్రకటన చేసిన చిదంబరం.. దానిని వెనక్కి తీసుకున్న ఫలితంగానే కదా! ఉద్యమంలో యువకులు బలిదానం చేశారని గురువారం 'ఎక్స్'వేదికగా స్పందించారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేయడం గురించి చిదంబరం మాట్లాడటం.. దొంగే దొంగ అన్నట్టుగా ఉందని, పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం ఉద్యమించినపుడు కేంద్రంలో అధికారం లో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా ? అని ప్రశ్నించారు. జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం తాత్సారం చేయడం వల్లే పొట్టి శ్రీరాములు చనిపోయారనే విషయం చిదంబరానికి తెలియదని అన్నారు. అప్పట్లో మద్రాసు రాష్ట్రం ఉండేదని, తెలంగాణ రాష్ట్రం లేదని చిదంబరం మాట్లాడటం హాస్యాస్పదమని, హైదరాబాద్ ఓ రాష్ట్రంగా ఉండేదనే విషయాన్ని ఆయన మరచిపోతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ అప్పులు, ఆదాయంపై చిదంబరం దుష్ప్రచారం చేస్తున్నారని, తెలంగాణ ఆర్థిక క్రమశిక్షణ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల కన్నా ఎంతో బాగుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఆర్బీఐ నివేదికలు ఏం చెబుతున్నాయో చిదంబరం తెలుసుకుంటే మంచిదన్నారు. ఆయన ఒక్క చాన్స్ ఇవ్వండంటే, నమ్మేందుకు తెలంగాణ ప్రజలు అమాయకులు కారని, కాంగ్రెస్‌కు ఇప్పటికే పదకొండు సార్లు అవకాశమిచ్చారని అన్నారు. చిదంబరానికి దమ్ముంటే తన సొంత రాష్ట్రం తమిళనాడులో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చే ప్రయత్నం చేయాలని సవాల్ చేశారు. తెలంగాణ సాధించిన కేసీఆర్, దానిని అభివృద్ధి చేసి దేశానికే రోల్ మోడల్‌గా నిలిపారన్నారు. ఎవరు ఎన్ని ట్రిక్కులు చేసినా, ఎంతమంది వచ్చి దుష్ప్రచారం చేసినా తెలంగాణ ప్రజలు కేసీఆర్ వైపే ఉన్నారన్నారు.

శ్రీనివాస్‌గౌడ్ నామినేషన్‌ను తిరస్కరించాలి

ఈసీకి ఆదేశాలు జారీచేయాలంటూ హైకోర్టులో పిటిషన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రమంత్రి శ్రీనివాస్‌గౌడ్ దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్‌లో పలు అంశాలు పేర్కొనలేదని, ఆయన నామినేషన్‌ను తిరిస్కరించేలా ఈసీకి ఆదేశాలు జారీచేయాలని మహబూబ్‌నగర్‌కు చెందిన చలువగాలి రాఘవేంద్రరాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'సుప్రీంకోర్టులో ఆయనపై ఉన్న సివిల్ అప్పీల్ గురించి అందులో పేర్కొనలేదు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే బాండ్‌పేపర్ కొనుగోలు చేసి వివరాలు సమర్పించారు. హైకోర్టులో జడ్జి కమిషన్ ముందు తన భార్య సివిల్ కాంట్రాక్టర్ అని చెప్పిన మంత్రి ఈసారి అఫిడవిట్‌లో మాత్రం ఆ వివరాలు వెల్లడించలేదు. గోపనపల్లిలోని కమర్షియల్ కాంప్లెక్స్‌పై కిరాయి వస్తుందని పేర్కొన్న శ్రీనివాస్‌గౌడ్ మున్సిపల్ ట్యాక్స్ మాత్రం కట్టడం లేదు'అని పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని శ్రీనివాస్‌గౌడ్ నామినేషన్‌ను తిరస్కరించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అయితే ఈసీ తరఫు న్యాయవాది అవినాశ్ దేశాయ్ హాజరుకాకపోవడంతో విచారణను నేటి(శుక్రవారం)కి వాయిదా వేసింది. గత ఎన్నికలకు సంబంధించి అఫిడవిట్ ట్యాంపరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులంతా ఇంకా అక్కడే బాధ్యతలు నిర్వహిస్తున్నారని, వారిని వెంటనే బదిలీ చేసేలా ఆదేశాలు జారీచేయాలంటూ రాఘవేంద్రరాజు మరో పిటిషన్ దాఖలు చేశారు. ఆ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బదిలీ చేయాలని, పైన పేర్కొన్న అంశాలతో శ్రీనివాస్‌గౌడ్ నామినేషన్‌ను తిరస్కరించాలని తాను రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశానని, అయితే ఎలాంటి కారణం చూపకుండానే ఆర్ఓ దానిని తిరస్కరించారని వెల్లడించారు.

ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఉండదు: భట్టి



మధిర: అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణలో బీఆర్ఎస్ ఉండదని.. ఆ పార్టీకి భవిష్యత్ లేనట్లేనని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల తదితర హామీలన్నింటినీ బీఆర్ఎస్ విస్మరించిందని ఆరోపించారు. పదేళ్ల పాలనలో రూ.5 లక్షల కోట్ల మేర అప్పులు చేసి ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. తెలంగాణ సాధించింది ప్రజల కోసమా?, దొరల కోసమా?, ఇన్నేళ్లలో సంపద ఎవరి జేబులోకి వెళ్లిందనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలని కోరారు. సంపద ప్రజలకే చెందాలనే భావనతో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రకటించిందని.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వాటిని అమలుచేసి చూపిస్తామని భట్టి చెప్పారు.

పోలీస్ బలగాలను ఉపసంహరించండి

హైకోర్టులో 'ఇఫ్లూ'విద్యార్థుల తల్లిదండ్రుల పిటిషన్

సాక్షి, హైదరాబాద్: తార్నాకలోని ఇఫ్లూ ఆవరణ నుంచి పోలీస్ బలగాల ఉపసంహరణకు యూజీసీ, వర్సిటీ వైస్ చాన్స్‌లర్‌ను ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో విద్యార్థుల తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు. ఇదే అంశంపై రెండుసార్లు వీసీకి వినతిపత్రాలు సమర్పించినా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని, విద్యార్థులపై కేసుల ఉపసంహరణకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. విద్యార్థులపై పోలీసులు దాడికి పాల్పడుతున్నారని, దీన్ని నిరసిస్తూ ఆందోళన చేస్తున్నా వీసీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వివరించారు. తమ వినతిపత్రంపై పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలంటూ.. ప్రతివాదులుగా సీఎస్, డీజీపీ, వీసీ తదితరులను చేర్చారు.

ప్రజాగ్రహం ఓట్లుగా మారాలి

కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం

- తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం
- ద్రవ్యోల్బణం దేశంలో కెల్లా తెలంగాణలోనే ఎక్కువ
- పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం కూడా జాతీయ సగటు కంటే ఎక్కువే.. కేసీఆర్‌కు చరిత్ర తెలియనట్లుగా ఉంది
- కాంగ్రెస్ అభివృద్ధి పనులు చేసినప్పుడు పిల్లోడై ఉంటారు



అవరోధాల వల్లే తెలంగాణ ఏర్పాటు జాప్యం

రాష్ట్రాల ఏర్పాటు ప్రక్రియ చాలా సంక్లిష్టమైనదని, రాష్ట్రాలను కలపడం, విడదీయడమంటే పిల్లలాట కాదని చిదంబరం అన్నారు. మదరాసు నుంచి తెలుగు భాష ప్రాతిపదికన నిజాం రాష్ట్రంతో కలిపి ఉమ్మడి ఏపీ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినా, నేడు ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని విడగొట్టినా ప్రజల ఆకాంక్షల మేరకేనని ఆయన చెప్పారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో కాంగ్రెస్ చాలా అవరోధాలను అధిగమించాల్సి వచ్చిందని, ఈ క్రమంలోనే జాప్యం జరిగిందన్నారు. అప్పట్లో ఒక ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీల దగ్గర కూర్చుని ఇంకో ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీలు డిన్నర్ చేయడం ఉండేది కాదని, అలాంటి పరిస్థితుల్లో రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఇలాంటి కారణాల వల్లే కొంత సమయం తీసుకుందని, ఆ సమయంలో ప్రజా ఉద్యమ స్ఫూర్తితో కొందరు తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేస్తే దానికి నాటి కేంద్రం ఎలా బాధ్యత వహిస్తుందని ప్రశ్నించారు. దానికి అప్పటి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తే.. తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఆత్మహత్యల పాలైన 4వేల మంది రైతుల మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, ఆయన కుటుంబ సభ్యులపై ప్రజలకున్న కోపం ఓట్లుగా మారాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, కేంద్ర మాజీ హోం మంత్రి పి.చిదంబరం అన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్ రెడ్డి, మీడియా ఇన్‌చార్జి అజయ్‌కుమార్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. ద్రవ్యోల్బణం దేశంలో కెల్లా తెలంగాణలోనే ఎక్కువని, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, పెట్రో ఉత్పత్తుల ధరలు పెద్ద ఎత్తున పెరిగి తెలంగాణలోని ప్రతి కుటుంబం ఆర్థికంగా ప్రభావానికి గురవుతోందని చిదంబరం చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం కూడా జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా అదే పరిస్థితి ఉందని, 15–29 సంవత్సరాల వయసు వారిలో నిరుద్యోగం 15.1 శాతంగా నమోదైందని చెప్పారు. నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3,016 భృతి ఇస్తానని చెప్పిన కేసీఆర్ ఒక్కరికి కూడా ఇవ్వలేదన్నారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకపోవడం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళనకు కారణమవుతోందని చెప్పారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా కేసీఆర్ కుటుంబంలోని కొందరి చేతుల్లో ఉందని ఆరోపించారు. ఇలాంటి అంశాల్లో రాష్ట్ర ప్రజలకు ఉన్న కోపం ఓట్లుగా మారాలని అన్నారు.

అప్పుడు కేసీఆర్ పిల్లోడై ఉంటారు..: తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయలేదని సీఎం కేసీఆర్ చెప్పడాన్ని చిదంబరం తీవ్రస్థాయిలో తప్పుపట్టారు. చంద్రశేఖర్‌రావుకు చరిత్ర తెలియనట్లుగా ఉందని చిదంబరం ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఉంటున్న హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది ఎవరని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో డ్యామ్‌లు కట్టి, రోడ్లు నిర్మించి, పరిశ్రమలు ఏర్పాటు చేసి, హరిత విప్లవం తెచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని చెప్పారు. కేసీఆర్ వయసెంతో నాకు తెలియదు కానీ, కాంగ్రెస్ ఆ పనులు చేసినప్పుడు చాలా చిన్న పిల్లవాడు అయి ఉంటారని వ్యాఖ్యానించారు.

కేసీఆర్ దిగిపోతే మరో నేత తయారవుతాడు: కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఐదేళ్ల పాటు సుభిక్ష పాలన అందిస్తామని, రైతులు, మహిళలను ఆదుకుంటామని, ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చిదంబరం హామీ ఇచ్చారు. కేసీఆర్ సీఎం కుర్చీ నుంచి దిగిపోతే మరో నాయకుడు తయారవుతాడని, కేసీఆర్ లాంటి చరిష్మా కలిగిన నాయకులకు కాంగ్రెస్ పార్టీలో కొదవ లేదంటూ ఒక ప్రశ్నకు జవాబిచ్చారు.

సాక్షి
శుక్రవారం, 17 నవంబర్ 2023

ఒక్క అడుగు... ఒకే ఒక్క అడుగు!

అవును. 2023 ప్రపంచ వన్డే క్రికెట్ కప్‌కూ, భారత క్రికెట్ జట్టుకూ మధ్య మిగిలిన దూరం ఇక ఒకే ఒక్క అడుగు. 2011లో ఆఖరుసారిగా కప్ గెలిచిన తర్వాత మళ్ళీ పన్నెండేళ్ళకు తొలిసారిగా భారత జట్టు ప్రపంచకప్ ఫైనల్స్‌కు చేరడం అభిమానుల్లో ఆనందోత్సాహాల్ని నింపుతోంది. లక్ష్యం చాలా చేరువగా కనిపిస్తుండడంతో అందరిలో ఆశలు రేపుతోంది. బుధవారం ముంబయ్‌లోని వాంఖెడే స్టేడియమ్‌లో భారత, న్యూజిలాండ్ జట్ల మధ్య ఒక దశ వరకు పోటాపోటీగా సాగిన తొలి సెమీ ఫైనల్‌లో మన జట్టు విజయం సాధించిన తీరు మునుపెన్నడూ లేని ఆత్మవిశ్వాసాన్ని అందిస్తోంది. ఈ ప్రపంచకప్‌లో అప్రతిహతంగా 10 మ్యాచ్‌ల్లో విజయం సాధించిన టీమిండియా ఆదివారం అహ్మదాబాద్‌లో మరొక్కసారి చేసే ఫైనల్ ఇంద్రజాలానికై అందరూ ఎదురుచూస్తున్నారు.

2011లో ప్రపంచ కప్ గెలిచిన తర్వాత నుంచి చూస్తే గడచిన 2015, 2019 టోర్నీల్లో కన్నా ఈసారే భారత జట్టు విజయావకాశాలు మెరుగ్గా, అధికంగా ఉన్నాయని మొదటి నుంచి క్రికెట్ పండితుల మాట. నిరుడు టీ-20 వరల్డ్ కప్ సెమీ ఫైనల్ నుంచి అవమానకరమైన రీతిలో వెనుదిరిగిన జట్టు ఏడాది తిరిగేసరికల్లా ఇంత బలమైన జట్టుగా రూపొందడం ఒక రకంగా అనూహ్యమే. ఆ ఘోర ఓటమి తర్వాత జట్టును పటిష్ఠంగా తీర్చిదిద్దడం వెనుక కెప్టెన్ రోహిత్ శర్మ పట్టుదల, కోచ్ రాహుల్ ద్రావిడ్ కృషి, ఆటగాళ్ళ నిరంతర శ్రమ దాగి ఉన్నాయి. మునుపటి రెండు కప్‌ల కన్నా ఈసారి భారత జట్టు మరింత స్థిరంగా, నిలకడగా కనిపిస్తోంది. ఆటగాళ్ళందరూ కలసి కట్టుగా సాగుతూ, వ్యక్తులుగా కన్నా ఒక జట్టుగా ప్రతిభా ప్రదర్శన చేయడం కలిసొస్తోంది.

జట్టు సారథిగా రోహిత్ శర్మ ఆ విషయంలో అందరికీ ఆదర్శమయ్యాడు. ఈ టోర్నీలో కనీసం 3 సందర్భాల్లో వ్యక్తిగత మైలురాళ్ళకు దగ్గర ఉన్నా, దాని కన్నా జట్టు ప్రయోజనాల కోసం వేగంగా పరుగులు చేయడం మీదే దృష్టి పెట్టి, ఆ క్రమంలో ఔటవడమే అందుకు ఉదాహరణ. ఓపెనర్‌గా పరుగుల వరదతో ప్రత్యర్థి బౌలర్ల మానసిక స్థైర్యాన్ని చిత్తు చేసి, భారీ ఇన్నింగ్స్‌కు ఆయన పునాది వేస్తూ వస్తున్నారు. ఈ టోర్నీలో రోహిత్ శతకాలేమీ సాధించకపోయి ఉండవచ్చు. 124.15 స్ట్రైకింగ్ రేట్‌తో 550 పరుగులు చేసి, అత్యధిక పరుగుల వీరుల జాబితాలో నిలవడం విశేషం. సాధారణంగా వ్యక్తిగత విజయాలు, ప్రతిష్ఠను ఆశించే, ఆరాధించే చోట ఇది అసాధారణం. జట్టులో ఎవరి పాత్ర వారికి నిర్దిష్టంగా నిర్వచించడంలోనూ తెలివైన వ్యూహం, లక్ష్యంపై గురి కనిపిస్తున్నాయి.

బుధవారం నాటి సెమీస్ అందుకు మంచి ఉదాహరణ. ఓపెనర్లు వేసిన పునాదిని పటిష్ఠం చేయడంలో కోహ్లీ, శరవేగంతో పరుగుల వరద పారించడంలో శ్రేయాస్ అయ్యర్, కొనసాగింపుగా రాహుల్, బౌలింగ్‌లో ప్రత్యర్థుల భాగస్వామ్యాన్ని ఛేదించడానికి పేసర్లు బుమ్రా, షమీ, సిరాజ్‌ల త్రయం, స్పిన్నర్లుగా కుల్దీప్, జడేజాలు సమర్థంగా పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా జట్టులో ప్రతి ఒక్కరూ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తుండడం విశేషం. శుభ్‌మన్ గిల్ లాంటి వారి పాత్ర తక్కువేమీ కాదు. బ్యాటింగ్‌లో కోహ్లీ, శ్రేయాస్‌లు వరుసగా సెంచరీల మీద సెంచరీలు కొడుతున్నారు. సెమీస్‌లోనే వన్డేల్లో శతకాల అర్ధ సెంచరీ పూర్తి చేసి, బ్యాట్స్‌మన్ల కింగ్ కోహ్లీ అయ్యాడు. ఆరాధ్య దైవమైన సచిన్ చూస్తుండగా, అతని రికార్డును అధిగమిస్తూ ఈ కొత్త చరిత్ర సృష్టించాడు.

ఈసారి భారత బౌలర్ల అమోఘ ప్రతిభా ప్రదర్శన మళ్ళీ 1983 నాటి కపిల్ డెవిల్స్‌ను తలపిస్తోంది. ఈ వరల్డ్ కప్‌లో మొదటి 4 మ్యాచ్‌ల తర్వాత ఆలస్యంగా తుది జట్టులోకి వచ్చిన పేస్‌బౌలర్ షమీ ఇప్పటికే ఈ టోర్నీలో అత్యధిక వికెట్లు పడగొట్టి, వికెట్ల వేటగాడిగా నిలిచాడు. వికెట్లలో అర్ధశతకం పూర్తిచేశాడు. ప్రపంచ కప్ చరిత్రలో మరి ఏ ఇతర భారతీయ ఆటగాడికీ లేని రీతిలో 57 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టిన అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసి, నంబర్ 1గా నిలిచాడు. లయ తప్పకుండా, పిచ్ మీద వికెట్ల గురి తప్పకుండా, పరుగు వేగం తగ్గకుండా ప్రత్యర్థులపై పులిలా విరుచుకుపడుతున్న షమి ఈ భారత జట్టు అమ్ములపొదిలో బ్రహ్మాస్త్రం. ఈ 19న జరిగే ఫైనల్‌లో షమీ ఇలాగే విజృంభిస్తే మనం కప్పు కొట్టడం కష్టమేమీ కాదు.

గురువారం నాటి రెండో సెమీఫైనల్‌లో ఎప్పటిలానే సెమీస్ శాపం తప్పించుకోలేక సౌతాఫ్రికా బ్యాటింగ్‌లో తడబడింది. ఈ టోర్నీలో మొదట తడబడినా తర్వాత నిలబడిన ఆస్ట్రేలియా ఆఖరికి తక్కువ పరుగుల లక్ష్యాన్ని సైతం శ్రమించి, గెలిచింది. ఓడితేనేం పోరాటస్ఫూర్తిలో సౌతాఫ్రికా జనం మనసు గెలిచింది. అయిదుగురు రెగ్యులర్ బౌలర్లతోనే ప్రయోగం చేస్తున్న భారత్, అయిదుసార్లు ప్రపంచ విజేతగా నిలిచిన బలమైన ఆసీస్‌తో మహాయుద్ధానికి సమస్త శక్తియుక్తులూ కేంద్రీకరించాలి. అయితే, ఇప్పటికే భారత టాప్ 5 బ్యాట్స్‌మన్లు 65.8 సగటుతో 2570 పరుగులు సాధించారు. 2007 నాటి ఆసీస్ జట్టు బ్యాట్స్‌మన్ల సగటు కన్నా ఇది ఎక్కువ. అలాగే ఈ టోర్నీలో తొలి రెండు మ్యాచ్‌లలో ఓడిన ఆసీస్ ఆటను గమనిస్తే ఆ జట్టు మరీ అజేయమైనదేం కాదనీ అర్థమవుతుంది.

అందుకే, వరల్డ్ కప్ వేదికపై 1983లో అనామకంగా వెళ్ళి అద్భుతం చేసిన కపిల్ సేన, 2011లో ఒత్తిడిని తట్టుకొని అంచనాలందుకున్న ధోనీ అండ్ కో తర్వాత ముచ్చటగా మూడోసారి ఇప్పుడు రోహిత్ శర్మ అండ్ టీమ్ ఆ ఘనత సాధిస్తే ఆశ్చర్యం లేదు. పుష్కరకాలం నిరీక్షణ ఫలిస్తే శతకోటి భారతీయులకు అంతకన్నా ఆనందమూ లేదు. అనూహ్య ఘటనలు జరిగితే తప్ప ఆతిథ్య దేశమైన మనమే ఈ ఆదివారం ఐసీసీ వరల్డ్ కప్ అందుకోవచ్చు. ఎందుకంటే- ప్రతిసారి కన్నా భిన్నంగా ఈసారి మనది వట్టి ఆశ, అభిమానుల ప్రార్థన కాదు... అంతకు మించిన ప్రతిభా ప్రదర్శన, ఆత్మవిశ్వాస ప్రకటన!

దుష్ప్రవర్తనను నిగ్గు తేల్చడమెలా?

విశ్లేషణ



పి.డి.టి. ఆచారి

తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా తీవ్రమైన దుష్ప్రవర్తనతోపాటు, సభను ధిక్కరించినందుకు గానూ ఆమెను పార్లమెంటు నుండి బహిష్కరించాలని లోక్‌సభ ఎథిక్స్ కమిటీ సిఫార్సు చేసింది. లోక్‌సభ ఎథిక్స్ కమిటీ, దాని పేరు సూచించినట్లుగానే, ఎంపీల అనైతిక ప్రవర్తనను పరిశీలించి తగిన శిక్షలను సిఫారసు చేస్తుంది. నేటి వరకూ, 'అనైతిక ప్రవర్తన' అనేదానికి తగిన నిర్వచనం లేదు. ఎంపీల ప్రవర్తన తీరును పరిశీలించి, అది అనైతికమా, కాదా అని కమిటీ నిర్ణయిస్తుంది. ఎథిక్స్ కమిటీ చరిత్రలో ఎప్పుడూ ఒక ఎంపీని బహిష్కరించాలని సిఫారసు చేయలేదు. సభ్యులను విచారించి శిక్షించే అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికీ, సత్యాన్ని తెలుసుకునేందుకు అనుసరించే ప్రక్రియ సమర్థతపై సరైన అంచనా ఇంకా రావలసే ఉంది.

పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటు సభ్యురాలు మహువా మొయిత్రా తీవ్రమైన దుష్ప్రవర్తనతోపాటు, సభను ధిక్కరించినందుకుగానూ ఆమెను పార్లమెంటు నుండి బహిష్కరించాలని లోక్‌సభ ఎథిక్స్ కమిటీ సిఫార్సు చేసింది. పార్లమెంటులో ప్రశ్నలను లేవనెత్తడం కోసం ఆమెకు ఇచ్చిన లాగిన్ వివరాలు, పాస్‌వర్డ్‌ను దుబాయ్‌కి చెందిన ఒక వ్యాపారవేత్తతో పంచుకున్నారనేది ఆమెపై ఉన్న ప్రధాన అభియోగం. ఆ వ్యాపారవేత్త ఆమె పేరుతో లోక్‌సభకు ప్రశ్నలు పంపడానికి ఆమె లాగిన్, పాస్‌వర్డ్‌ను ఉపయోగించుకున్నారు. ఆయన వ్యాపార ప్రయోజనాల సమర్థవంతమైన ప్రమోషన్ కోసం ఆమె లాగిన్ ఐడీని దుర్వినియోగం చేయడానికి అనుమతించారనేది మొయిత్రాపై ఉన్న అభియోగంలోని ప్రధానాంశం.

ఎథిక్స్ కమిటీ రెండు రోజులపాటు సమావేశమై, మొయిత్రాను దోషిగా నిర్ధారించి, ఆమెను బహిష్కరించాలని కోరింది. లోక్‌సభ ఎథిక్స్ కమిటీ, దాని పేరు సూచించినట్లుగానే, ఎంపీల అనైతిక ప్రవర్తనను పరిశీలించి తగిన శిక్షలను సిఫారసు చేయవలసి ఉంటుంది. అయితే, నేటి వరకూ, 'అనైతిక ప్రవర్తన' అనేదానికి తగిన నిర్వచనం లేదు. ఎంపీల ప్రవర్తన తీరును పరిశీలించి, అది అనైతికమా కాదా అని కమిటీ నిర్ణయిస్తుంది.

కమిటీ చరిత్రలో లేని బహిష్కరణ

ఎథిక్స్ కమిటీ ఇప్పటివరకు పరిశీలించిన కేసులు ఏమంత ఎక్కువగా లేవు. సాధారణ ప్రవర్తనా నియమాలకు భిన్నమైన చిన్న చిన్న అతిక్రమణలతో ఈ కమిటీ వ్యవహరించింది. అటువంటి అతిక్రమణల తీవ్రతను బట్టి శిక్షలు మారుతూ ఉంటాయి: ఉపదేశించడం, మందలించడం, సభా సమావేశాల నుండి నిర్దిష్ట కాలానికి సస్పెండ్ చేయడం సాధారణంగా సిఫారసు చేస్తారు. లోక్‌సభ ఎథిక్స్ కమిటీ చరిత్రలో ఎప్పుడూ ఒక ఎంపీని సభ నుంచి బహిష్కరించాలని సిఫారసు చేయలేదు. పార్లమెంటు నుండి బహిష్కరించడం చాలా తీవ్రమైన శిక్ష. ఎందుకంటే బహిష్కరించబడిన ఎంపీకి చెందిన నియోజకవర్గ ప్రజలకు సభలో ప్రాతినిధ్యం వహించే హక్కు, అవకాశం లేకుండాపోతాయి. అందువల్ల, బహిష్కరణ చాలా అరుదుగా సిఫారసు చేస్తారు. 1951లో, తాత్కాలిక పార్లమెంటు సభ్యుడు హెచ్‌డి ముద్గల్, ఒక వ్యాపార సంస్థ ప్రయోజనాలను ప్రోత్సహిస్తున్నట్లూ, దానికిగానూ ఆర్థిక ప్రయోజనాలను పొందుతున్నట్లూ గుర్తించి సభ నుండి బహిష్కరించారు. హౌస్‌లోని ప్రత్యేక కమిటీ ఈ కేసును విచారించి, ఆయన బహిష్కరణకు సిఫారసు చేసింది.

అదే విధంగా, 2005లో, 10 మంది ఎంపీలు పార్లమెంట్‌లో ప్రశ్నలు వేసేందుకు డబ్బును స్వీకరిస్తున్నట్లు ఒక స్టింగ్ ఆపరేషన్‌లో దొరికిపోయిన సందర్భంలో వారిని లోక్‌సభ నుండి బహిష్కరించారు.



మహువా మొయిత్రా

ఈసారి కూడా ప్రత్యేక కమిటీ కేసు దర్యాప్తు చేసింది. ఒకరి వ్యక్తిగత ప్రయోజనాలను ప్రోత్సహించడానికి పార్లమెంటరీ పని చేయడం కోసం డబ్బును స్వీకరించడం సభా నియమాలకు సంబంధించి తీవ్రమైన ఉల్లంఘనగా పరిగణిస్తారు. కాబట్టి, అటువంటి దుష్ప్రవర్తనకు గాను అంగీకరించిన శిక్ష- బహిష్కరణ. రాజా రామ్ పాల్ వర్సెస్ గౌరవనీయ స్పీకర్, లోక్‌సభ (2007) ఉదంతంలో సుప్రీంకోర్టు... ప్రత్యేక హక్కును ఉల్లంఘించినందుకు సభ్యుడిని బహిష్కరించే సభ అధికారాన్ని ఆమోదించింది.

అధికారం ఉందా, లేదా?

అయితే, (ఆ సందర్భంలో) అటువంటి ప్రత్యేక హక్కు ఉందా లేదా అనే అంశాన్ని కోర్టు నిర్ధారిస్తుంది. అలాంటి హక్కు ఉనికిలో లేదని గుర్తిస్తే, సదరు బహిష్కరణను కొట్టివేస్తుంది. రాజా రామ్ పాల్ కేసు ప్రాముఖ్యత ఏమిటంటే, ఒక ఎంపీని బహిష్కరించే సభ అధికారం ఒక ప్రత్యేక హక్కు ఉనికితో నేరుగా ముడిపడి ఉండటం. దాన్ని ఉల్లంఘిస్తే బహిష్కరణ సాధ్యపడుతుంది. అయితే ఇది ఒక ముఖ్యమైన ప్రశ్నకు దారి తీస్తుంది. విశేషాధికారాల కమిటీకి కాకుండా, ఇతర కమిటీకి బహిష్కరణను సిఫార్సు చేసే అధికారం ఉందా? (1951, 2005 సంవత్సరాలలో ఎంపీల బహిష్కరణకు సిఫార్సు చేసిన కమిటీలు నైతిక లేదా విశేషాధికారాల కమిటీలు కావు. నిర్దిష్ట సమస్యలపై విచారణ కోసం సభ ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీలు.)

రాజా రామ్ పాల్ తీర్పులోని తర్కాన్ని అనుసరించినట్లయితే, విశేషాధికారాల కమిటీ లేదా సభ నియమించిన ప్రత్యేక కమిటీ మాత్రమే విశేషాధికారాల ఉల్లంఘనపై ఎంపీని బహిష్కరించే వ్యవహారాన్ని నడపగలదు. పార్లమెంట్‌లోని ఏ ఇతర సాధారణ కమిటీ ఆ సిఫారసు చేయలేదు. విశేషాధికారాల కమిటీ ముందుకు తేలేని సమస్యలతోనే ఎథిక్స్ కమిటీ వ్యవహరిస్తుంది. ఎథిక్స్ కమిటీని ఏర్పాటు చేయడంలోని తర్కం ఏమిటంటే, విశేషాధికారాల కమిటీ ముందుకు తేనక్కరలేనంతటి దుష్ప్రవర్తనలు చాలా ఉన్నాయి.

అయితే అదే సమయంలో అటువంటి ప్రవర్తనతో తగిన విధంగా వ్యవహరించడానికి సభా క్రమశిక్షణా యంత్రాంగం అందుబాటులో ఉండాలి. వివిధ కమిటీల పాత్రల్లోని ఈ వ్యత్యాసం పార్లమెంటు దృష్టిని డిమాండ్ చేస్తుంది. తద్వారా పార్లమెంట్ శిక్షాస్మృతి అధికారాల కార్యాచరణలో మరింత స్పష్టత తేవడం జరుగుతుంది. పార్లమెంటరీ కమిటీలు చేసే దర్యాప్తు పరిధి, ప్రయోజనం, దాని స్వభావం కూడా ఇక్కడ దృష్టిలో ఉంటుంది.

తక్షణ అవసరం

స్కామ్‌లు, ఇతర తీవ్రమైన కేసులకు దారితీసే ఆర్థిక దుర్వినియోగానికి సంబంధించిన విషయాలను పార్లమెంట్ పరిశోధిస్తుంది. ఇటువంటి పరిశోధనలు భారీ ఆర్థిక మోసాలకు దారి తీసే వ్యవస్థాగత లోపాలను వెలికితీసేంత సమగ్రంగా ఉంటాయి. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) వంటి దర్యాప్తు సంస్థ చేయలేని ఈ విధిని జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) నిర్వహిస్తుంది. అయితే సభ్యుడిని బహిష్కరించే అధికారంపై ఎటువంటి వివాదం లేనప్పటికీ, విచారణ విధానం గురించి కొన్ని ఆందోళన కలిగించే అంశాలు ఉన్నాయి.

ఫిర్యాదుదారు, ప్రతివాది ఎంపీ, ఇతర ప్రమేయం గల వ్యక్తులతో సహా సాక్ష్యం తీసుకోవడం కమిటీ సాధారణంగా అనుసరించే విధానం. వారు రాతపూర్వక పత్రాలను సమర్పించవచ్చు. అలాగే మౌఖిక ప్రకటనలు తీసుకోవచ్చు. ఆధారాలు సేకరించిన తర్వాత, సచివాలయ అధికారులు అటువంటి సాక్ష్యాలను జల్లెడ పట్టి, కనుగొన్న విషయాలు, సిఫార్సులతో కూడిన ముసాయిదా నివేదికను సిద్ధం చేస్తారు.

కాబట్టి, ఒక ఎంపీకి ఇచ్చే అత్యంత తీవ్రమైన శిక్ష అయిన బహిష్కరణను కమిటీలోని మెజారిటీ ఆధారంగా నిర్ణయిస్తారు. పార్లమెంటరీ విచారణ స్వభావాన్ని మనం పరిశీలించినప్పుడు. సాక్ష్యాధారాలను బేరీజు వేసే అధికారుల సామర్థ్యాలు, దర్యాప్తు రంగంలో వారి నైపుణ్యం, మరియు ఎక్కువగా నిపుణులు కాని, న్యాయపరంగా శిక్షణ పొందని కమిటీ సభ్యుల మనస్సును అన్వయించడం వంటి సంబంధిత అంశాలను ఎప్పుడూ పరిగణనలోకి తీసుకోవాలి.

పరిశోధనాత్మక యంత్రాంగాల ద్వారా విధానపరమైన సమగ్రతను కొనసాగించినప్పుడు మాత్రమే న్యాయం, సత్యం నిర్ధారించబడతాయి. ఏ తప్పు చేసినా దాని సభ్యులను విచారించి శిక్షించే అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికీ, సత్యాన్ని తెలుసుకునేందుకు, న్యాయం చేయడానికి అనుసరించే ప్రక్రియ సమర్థత, దాని పటిష్ఠతపై సరైన అంచనా అనేది ఇంకా రావలసే ఉంది. మహువా మొయిత్రా కేసు ఈ పనికి సంబంధించిన ఆవశ్యకతను మనకు గుర్తు చేస్తోంది.

వ్యాసకర్త లోక్‌సభ మాజీ ప్రధాన కార్యదర్శి
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నమో!



భారత్‌ను రూపాంతరీకరించడానికి నిస్వార్థ, గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకుంటున్న తీవ్ర చర్యలే నా మనసు మారడానికి కారణం. తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నప్పటికీ, ఎవరినీ విస్మరించని సంఘటిత అభివృద్ధి కోసం ఆయన స్థిరంగా నిలబడ్డారు.

– శెహలా రషీద్, యాక్టివిస్ట్

చివరికి ఒంటరే!



తన ఉచ్చస్థితిలో, సుబ్రతో రాయ్ (సహారా గ్రూప్) నడిచినప్పుడు, పెద్ద సినిమా తారలు, అత్యంత శక్తిమంతులైన రాజకీయ నాయకులు, పెద్ద వ్యాపార వేత్తలు ఆయన్ని అనుసరించడం చూశాను. ఆయన తీవ్ర కష్టాల్లోకి జారినప్పుడు, ఆయన దాదాపు ఒంటరిగా ఉన్నారు. ప్రియతములారా! దురదృష్టవశాత్తూ జీవిత నియమం ఇదే.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

అసలు అండ



మహమ్మద్ షమీ 2006 ప్రాంతంలో బెంగాల్‌లో క్లబ్ క్రికెట్ ఆడటానికి వచ్చారు. 2010లో బెంగాల్ తరఫున మొదటిసారి ఆడారు. జీత్ బెనర్జీ, కోచ్ దేవ్ వాట్‌మోర్‌ల సిఫార్సు మీద 2011లో వేలం లేకుండా కేకేఆర్ (కోల్‌కతా నైట్ రైడర్స్) జట్టు ఆయన్ని తీసుకుంది. (షమీని మమతా బెనర్జీ బెంగాల్‌కు ఆహ్వానించారన్నదాన్ని కొట్టేస్తూ.)

– జాయ్ భట్టాచార్య, స్పోర్ట్స్ ప్రొడ్యూసర్

ఎవరి జేబుల్లోకి?



పాకిస్తానీ ఎయిర్ లైన్స్‌ను రెండు బిలియన్ డాలర్లకు ఖతార్ కొంటున్నదని చదివాను. అలాగే, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ వచ్చే నెల 72 మిలియన్ డాలర్లు ఇవ్వనుంది. తర్వాతి బిలియనీర్ ఎవరు కానున్నారు?

– సాజిద్ ఎన్. తరార్, వ్యాపారవేత్త

కాబోలు!



పుష్పక విమానమే మొదటి విమానమనీ, పౌరాణిక గాథల్లో వర్ణించిన బ్రహ్మాస్త్రమే అణ్వాయుధాలకు మూలమనీ నమ్మేవాళ్లే ఇక నుంచీ ఐఐటీలను నడుపుతారేమో!

– రవి నాయర్, జర్నలిస్ట్

ఆ స్ఫూర్తిని కొనసాగిద్దాం

"గాలి, నీరు, వెలుతురు ఎంత సులభంగా సేవ్యమైయున్నవో అంత సులభంగా గ్రంథాలయ సేవ లభ్యం కావాలి."

– చిలకమర్తి లక్ష్మీనరసింహం

రాజమహేంద్రవరంలో 1839లో జేమ్స్ థామస్ పబ్లిక్ లైబ్రరీ స్థాపించడంతో తెలుగు నేలపై ఆధునిక గ్రంథాలయాలు ప్రారంభమయ్యాయని చెప్పవచ్చు. గ్రంథాలయ రంగంలో లబ్ధప్రతిష్ఠులైన గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, దేవులపల్లి రామానుజరావు, మాడపాటి హనుమంతరావు, భాగ్యరెడ్డి వర్మ, పాతూరి నాగభూషణం, వావిలాల గోపాలకృష్ణయ్య వంటివారు గ్రంథాలయ ఉద్యమ వ్యాప్తికి విశేష కృషి సల్పారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో 'ఫూల్స్ క్లబ్' స్థాపించి స్వాతంత్ర్య కాంక్ష రగల్చడానికి అందరినీ ఒక చోట చేర్చడానికి ఈ ఉద్యమం ఎంతో దోహదపడింది.

గుంటూరులో 'థియోసోఫికల్ సొసైటీ' గ్రంథాలయం, పులివెందులలో 'సరస్వతీ విలాసము' ఒంగోలులో 'సీపీఎస్ లైబ్రరీ', విజయనగరంలో 'సింహాచలపతిరావు గ్రంథాలయం', ఉండిలో 'నేరోజీ క్లబ్', పశ్చిమగోదావరి జిల్లా కుముదవల్లిలో 'కవి సమాజం', రాజమహేంద్రవరంలో 'గౌతమి గ్రంథాలయం', నెల్లూరులో 'వర్ధమాన సమాజం', హైదరాబాద్‌లో 'అసఫియా లైబ్రరీ, 'భారత గుణవర్ధక గ్రంథాలయం', 'శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం', గుంటూరు జిల్లా కొల్లూరులో 'ద రీడింగ్ క్లబ్', గుంటూరులో 'ది యంగ్ మెన్స్ అసోసియేషన్ (లిటరరీ)', విజయవాడలో 'రామ మోహన లైబ్రరీ' వంటివి తొలిదశలో స్థాపితమైన ముఖ్యమైన గ్రంథాలయాలుగా పేర్కొనవచ్చు.

స్వాతంత్ర్యానంతరం 'లోకల్ లైబ్రరీ అథారిటీ' ఆధ్వర్యంలో గ్రంథాలయాల స్థాపన జరిగింది. తదనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థల ఆధ్వర్యంలో నలుచెరగులా ప్రభుత్వ రంగంలో గ్రంథాలయాలను స్థాపించారు. 1970-90 కాలంలో ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ గాంధీ డా॥ వెలగా వెంకటప్పయ్య, గ్రంథాలయ సారథి బెజగం వెంకట దాశరథి ద్వయం ఎన్నో కార్యక్రమాలను నిర్వహించి గ్రంథాలయ ఉద్యమ వ్యాప్తిని ముందుకు తీసుకెళ్లిన మలితరం నాయకులయ్యారు.

నవంబర్ 14న నెహ్రూ జన్మ దినోత్సవం (బాలల దినోత్సవం) నాడు ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు ఇందిరాగాంధీ జన్మదినోత్సవం 20వ తేదీతో ముగుస్తాయి. పాఠకులను చైతన్యవంతులను చేయడం, గత చరిత్ర స్మరించుకోవడం, గ్రంథాలయాల ద్వారా స్వాతంత్ర్య కాంక్ష రగిల్చిన స్ఫూర్తిని జ్ఞాపకం చేసుకోవడం, పఠనాశక్తిని పెంపొందించడం, మంచి పుస్తకాలను పరిచయం చేయడం గ్రంథాలయ వారోత్సవాల ప్రధా నోద్దేశం. ఈ గ్రంథాలయ వారోత్సవాల ద్వారా మరింత స్ఫూర్తి కలగాలని ఆశిద్దాం.

– బెజగం వెంకట శ్రీనివాసు,
పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంఘం వైస్ ప్రెసిడెంట్
(నవంబర్ 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు)

సహకార స్వర్ణయుగం రానుందా?!

ఉమ్మడి ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక అవసరాలు తీర్చుకోవడానికి కొంతమంది తమ సమష్టి యాజమాన్యం ద్వారా ఏర్పాటు చేసుకొని ప్రజాస్వామికంగా తామే నిర్వహించుకునే వ్యాపార, సేవా సంస్థలే సహకార సంఘాలు. వ్యక్తులు, ప్రైవేటు సంస్థలు లాభార్జనే ధ్యేయంగా చేసే వ్యాపారానికి భిన్నమైనది సహకార వ్యవస్థ. ప్రపంచీకరణ నేపథ్యంలో బహుళ జాతి సంస్థల కేంద్రీకృత ఆధిపత్య లాభార్జన వాణిజ్య ధోరణికి భిన్నంగా సమష్టి ప్రయోజనాల కోసం నానాటికీ విస్తరిస్తున్న ఈ వికేంద్రీకృత వ్యవస్థకు స్వయంపాలన, స్వావలంబనలే మూలస్తంభాలు. కరోనా మహమ్మారి నేర్పిన కొన్ని గుణపాఠాల నేపథ్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సహకార వ్యవస్థను మరింత విస్తరింపజేయాల్సిన ఆవశ్యకత ఉంది. ఐక్యరాజ్యసమితి కూడా సహకార సంఘాల ప్రాధాన్యాన్ని నొక్కి చెబుతూ... 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా జరుపుకోవాలని ఇటీవలే తీర్మానం చేసింది. పుష్కర కాలం ముందు 2012లో కూడా అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని జరుపుకోవటం విశేషం. స్కాట్లండ్‌లోని ఫెన్‌విక్‌లో క్రీ.శ. 1761 మార్చి 14న ఏర్పాటైన ఫెన్‌విక్ చేనేత కార్మికుల సహకార సంఘమే తొట్టతొలి కోఆపరేటివ్ సొసైటీ. ప్రపంచంలో కనీసం 12 శాతం మంది ప్రజలు సహకారులే. సుమారు 30 లక్షల సహకార సంఘాలు ప్రపంచ దేశాల్లో లాభం కోసం కాకుండా విలువల కోసం పనిచేస్తున్నాయి.

భారతీయ సహకారోద్యమం ప్రపంచంలోనే అతిపెద్ద సహకార వ్యవస్థ. దేశం వలస పాలనలో మగ్గిపోతున్న కాలంలో సివిల్ సర్వీసెస్ అధికారిగా పనిచేసిన సర్ ఫ్రెడరిక్ నికల్సన్ మన దేశంలో సహకార వ్యవస్థకు బీజం వేశారు. మొట్టమొదటి సహకార సంఘం 1904లో ప్రస్తుత తమిళనాడులో తిరువళ్లూరు జిల్లాలోని 'తిరుర్' అనే గ్రామంలో ప్రారంభమైంది. ప్రస్తుతం మన దేశంలోని 8,54,355 సహకార సంఘాల్లో సుమారు 30 కోట్ల మంది సభ్యులున్నారు. మరో 2 లక్షల సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించి చురుగ్గా చర్యలు చేపట్టింది. మన దేశంలో వ్యవసాయ రుణాలిచ్చే సొసైటీల సంఖ్యే ఎక్కువ. కింది స్థాయిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార



సంఘాలు మొదలుకొని చాలా రాష్ట్రాల్లో మూడంచెల సహకార వ్యవస్థ అమల్లో ఉంది. జిల్లా, రాష్ట్రస్థాయి సొసైటీల రిజిస్ట్రేషన్లు రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉంటాయి. అనేక రాష్ట్రాల్లో వ్యాపార లావాదేవీలు, సేవలు అందించే సొసైటీల (మల్టీస్టేట్ కోఆపరేటివ్ సొసైటీలు) రిజిస్ట్రేషన్ కేంద్ర సహకార రిజిస్ట్రార్ పరిధిలోకి వస్తుంది. రెండేళ్ల క్రితం హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలో జాతీయ స్థాయిలో ప్రత్యేక సహకార మంత్రిత్వశాఖ ఏర్పాటు కావటంతో ఈ రంగంలో సరికొత్త కదలిక చోటుచేసుకుంది. జాతీయ సహకార విధానం రూపొందించేందుకు కసరత్తు జరుగుతోంది. పూర్వం నుంచి ఉన్న వ్యవసాయం, హౌసింగ్, ఉద్యోగుల సహకార సంఘాలు వంటి సంప్రదాయ రంగాలకు మాత్రమే పరిమితం కాకుండా... ముఖ్యంగా యువతను భాగస్వాముల్ని చేసే విధంగా అనేక సేవా రంగాల్లో సొసైటీల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

మన దేశ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి పెంపొందించగల శక్తి సహకార రంగానికి ఉందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా భారీ లక్ష్యాలతో మూడు వేర్వేరు మల్టీ స్టేట్ కోఆపరేటివ్‌లను కేంద్రం ఇటీవలే నెలకొల్పింది. మొదటిది మన ఉత్పత్తులను విదేశాలకు భారీస్థాయిలో ఎగుమతులను చేపట్టే లక్ష్యంతో ఏర్పాటైంది. సొసైటీల ద్వారా సర్టిఫైడ్/దేశీ విత్తనోత్పత్తి చేయటంతో పాటు విదేశాలకు ఎగుమతి చేయటమే లక్ష్యంగా రెండో సొసైటీ ఏర్పాటైంది. ఇక మూడోది మరింత ముఖ్యమైనది. వివిధ రాష్ట్రాల్లో ప్రకృతి సేద్యం చేసే రైతుల సొసైటీలు, ఎఫ్‌పీఓల నుంచి సేకరించి 'భారత్ ఆర్గానిక్స్' బ్రాండ్ పేరుతో ఆన్‌లైన్ ద్వారా, అవుట్‌లెట్ల ద్వారా దేశ విదేశాల్లో విక్రయించే లక్ష్యంతో ఇది ఏర్పాటైంది. భారీ వాణిజ్య లక్ష్యాలతో పనిచేసే ఈ సొసైటీలకు వచ్చే లాభాల్లో సగాన్ని నేరుగా రైతులు, ఇతర ఉత్పత్తిదారులకు అందించబోతున్నారు. అనుకున్నట్లు యువతను సహకార వ్యాపార, సేవా రంగాల వైపు సమర్థవంతంగా ఆకర్షించగలిగితే భారతీయ సహకార రంగానికి స్వర్ణయుగం తథ్యమని చెప్పొచ్చు.

– పంతంగి రాంబాబు, సీనియర్ జర్నలిస్టు
(ఈ నెల 20 వరకు 70వ జాతీయ సహకార వారోత్సవాలు)

పాములను కాపాడదాం!

ఆశ్వయుజ బహుళ అమావాస్య తరువాత వచ్చే కార్తీక శుద్ధ చవితిని 'నాగుల చవితి' పండుగగా జరుపుకొంటారు. మన తెలుగు రాష్ట్రాలతో పాటుగా కర్ణాటక, తమిళనాడుల్లో సైతం ఈ పండుగ జరుపుకొంటారు. పామును నాగ దేవతగా పూజించే పండుగ ఇది. ముఖ్యంగా హిందూ మహిళలూ, యువతులూ పాముల పుట్ట వద్దకు వెళ్లి పాలు పోసి కోడిగుడ్డును సైతం అక్కడ ఉంచడం లేదా దాన్ని కూడా పగులగొట్టి పుట్టలో పోయడం చేస్తారు. పుట్టలో పాలుపోస్తే పిల్లలు కలుగని వివాహిత స్త్రీలకు పిల్లలు పుడతారనీ, వివాహం కాని యువతులకు వివాహం అవుతుందనీ, అనారోగ్యవంతులకు ఆరోగ్యం బాగుపడుతుందనీ నమ్ముతారు.

పుట్టలో పాలు పోస్తే ఇవన్నీ జరిగే అవకాశం ఎంత మాత్రం లేదనేది సైన్స్ చెబుతున్న మాట. స్వచ్ఛమైన పాలను పుట్టలో పోయడమంటే పౌష్టికాహారం నేలపాలు చెయ్యడమేననీ, అంతేకాని కోరికలు తీరవనీ పరిశోధకులు అంటున్నారు. అసలు పాము పాలు తాగదు. పాము కప్పలను, ఎలుకలను, క్రిమి, కీటకాలను తిని బ్రతికే ప్రాణి. ఇది కేవలం మాంసాహార జీవి మాత్రమే. ద్రవ పదార్థాలను పాము తీసుకోదు. వాస్తవానికి పాలను జీర్ణం చేసుకోవాలంటే జీర్ణాశయంలో 'లాక్టోజ్' అనే ఎంజైము ఉత్పత్తి అవ్వాలి. పాముకు జీర్ణాశయంలో ఆ ఎంజైము విడుదల అవదు. అందువల్ల పాము పాలను జీర్ణం చేసుకోలేదు. ఈ ఎంజైము క్షీరదాలలో ఉంటుంది. సరీసృపాలయిన పాములలో ఉండదు. పాములకు ద్రవరూపంలో ఉన్న వాటిని నోటిలోకి పీల్చే సామర్థ్యం లేదు. వాటి నోటి నిర్మాణం అందుకు సహకరించదు.ప్రతి సంవత్సరం పుట్టల్లో పాలుపోయడం ద్వారా కేవలం ఒక్క రోజే 5 వేలకు పైగా పాములు పుట్టల్లోనే మరణిస్తున్నాయని అంచనా. జంతు పరిరక్షణ సంస్థలు పుట్టలో పాలు పోయొద్దని చెప్తున్నా నమ్మకాల పేరుతో మనం ఈ పద్ధతిని ఇంకా కొనసాగిస్తున్నాం.

పాములు నివసించే పుట్టలు పాములు నిర్మించుకున్నవి కావు. పాముల శరీర నిర్మాణం పుట్టలు నిర్మాణం చేసుకోవడానికి సహకరించదు. చెద పురుగులు ఏర్పాటు చేసిన పుట్టలలో పాములు వచ్చి చేరతాయి. పాములు రైతులకు సహజమిత్రులు. రైతు ఎంతో శ్రమకోర్చి పండించిన పంటను నాశనం చేసే చిన్న జీవులను అవి తింటాయి.

ఈ భూమి మీద ప్రతి జీవికీ ప్రకృతిలో దాని కంటూ ఓ పాత్ర ఉంటుంది. కొన్ని నమ్మకాల కారణంగా ప్రకృతిలో ఆ యా జీవులు పోషించాల్సిన పాత్రను పోషించకుండా చేస్తున్నాడు మానవుడు.అందుకు పాములకు పాలు పోసి వాటికి హాని కలుగజేయడం ఒక ఉదాహరణ మాత్రమే. మూఢ నమ్మకాలను నిర్మూలించి శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం అందరం కృషి చేద్దాం.

– చార్వాక, సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ సమన్వయకర్త

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.చవితి ఉ.11.31 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.2.31 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.12.40 నుండి 2.11 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.24 నుండి 9.09 వరకు, తదుపరి ప.12.08 నుండి 12.53 వరకు, **అమృతఘడియలు:** రా.9.34 నుండి 11.22 వరకు, నాగులచవితి ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.09, **సూర్యాస్తమయం:** 5.21.

రూ.1.11 కోట్లు విలువ చేసే బంగారం పట్టివేత


పట్టుబడిన బంగారం

శంషాబాద్: 1.11 కోట్లు విలువ చేసే బంగారాన్ని డీఆర్ఐ అధికారులు శంషాబాద్ విమానాశ్రయంలో స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు డీఆర్ఐ అధికారుల బృందం బుధవారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తిరుచనాపల్లి నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని 1.8 కేజీల బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ విమానంలో తీసుకొచ్చిన బంగారాన్ని విమానంలోనే దాచి పెట్టిన ముఠా, సంబంధిత బంగారాన్ని దేశీయ విమానంగా వెళ్లినప్పుడు తీసుకెళ్లాల్సిందిగా తనకు సూచించినట్లు ఆ ప్రయాణికుడు అధికారులకు వివరించాడు. అంతర్జాతీయ విమానాలు సంబంధిత గమ్యస్థానాలకు చేరుకున్న తర్వాత అనుసంధాన విమానంలో మరో దేశీయ గమ్యస్థానానికి బయలుదేరినపుడు వాటిని దేశీయ ప్రయాణికులతో తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

కాసేపట్లో పెళ్లి.. పీటలపై ఊహించని ట్విస్ట్

- వరుడికి నత్తి ఉందని పెళ్లి వద్దన్న వధువు
- వనపర్తి జిల్లా కొత్తకోటలో ఘటన

కొత్తకోట రూరల్: పెళ్లి ముహూర్తం దగ్గర పడింది. వధూవరుల కుటుంబాల సభ్యులు ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. బంధుమిత్రుల రాకతో పెళ్లిమండపంలో సందడి నెలకొంది. వరుడు తాళి కట్టేందుకు సిద్ధమయ్యాడు. అంతలోనే ఈ పెళ్లి వద్దంటూ పెళ్లికూతురు పీటల మీది నుంచి పైకిలేచింది. ఈ ఘటన వనపర్తి జిల్లా కొత్తకోటలో చోటుచేసుకుంది. కొత్తకోట పట్టణానికి చెందిన ఓ యువకుడితో వనపర్తికి చెందిన యువతికి పెళ్లి నిశ్చయించారు. గురువారం ఉదయం 7 గంటలకు కానాయపల్లి సమీపంలో శ్రీదత్త కోటిలింగేశ్వర ఆలయంలో పెళ్లికి అన్నిఏర్పాట్లు చేశారు. వధూవరులిద్దరినీ పెళ్లిపీటలపై కూర్చోబెట్టి వేడుకలను ప్రారంభించారు. జీలకర్ర–బెల్లం కూడా పెట్టించారు. తాళి కట్టేందుకు ఒక నిమిషం ముందు తనకు ఈ పెళ్లి ఇష్టంలేదని, పెళ్లికూతురు పీటల మీది నుంచి లేచి షాకిచ్చింది. పెళ్లి ఎందుకు ఇష్టం లేదని బంధువులు నిలదీయడంతో వరుడికి నత్తి ఉందని, చదువు తక్కువగా ఉందని చెప్పింది. పెద్దలు ఎంత నచ్చచెప్పినా పెళ్లికూతురు వినకపోవడంతో చేసేదేమీలేక ఇరు కుటుంబాలు పెళ్లిని రద్దు చేసుకున్నాయి.

దళితబంధు ఎందరికిచ్చారో చెప్పాలి

బీజేపీ నేత డాక్టర్ గురు ప్రకాశ్ పాశ్వాన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో దళితబంధు ఎంతమందికి ఇచ్చారో బీఆర్ఎస్ సర్కార్ ప్రకటించాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ గురు ప్రకాశ్ పాశ్వాన్ డిమాండ్ చేశారు. ఈ పథకంలో భాగంగా లబ్ధిదారుల నుంచి ఎమ్మెల్యేలు 30, 40 శాతం కమీషన్లు తీసుకుంటున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందని స్వయంగా సీఎం కేసీఆర్ వెల్లడించినట్టు వార్తా పత్రికల్లో వచ్చిందని గుర్తుచేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దళితబంధులో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాగా బీసీ, ఎస్సీ, ఎస్టీలను కాంగ్రెస్ కేవలం ఓటు బ్యాంక్‌గానే ఉపయోగించుకుందని మండిపడ్డారు. అణగారిన వర్గాలను అభ్యున్నతిలోకి తీసుకొచ్చే విషయంలో బీజేపీ కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే పార్టీలో సంస్థాగతంగా, కేంద్ర కేబినెట్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అత్యధికంగా భాగస్వామ్యం కల్పించిందన్నారు. దళితుడిని సీఎం చేస్తానంటూ కేసీఆర్ మోసం చేశారని, కేబినెట్‌లో కూడా ఎస్సీలకు తగిన ప్రాధాన్యం కల్పించలేదని ధ్వజమెత్తారు.

కేంద్రం నిధులతో బీఆర్ఎస్ పోజులు

- రైతులనుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యం డబ్బులు కేంద్రమే ఇస్తోంది
- గెలిచాక కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లోకి వెళ్లరన్న గ్యారంటీ ఇస్తారా?
- మొగ్దుంపూర్, రామచంద్రాపురంలో బండి సంజయ్ ఎన్నికల ప్రచారం


మొగ్దుంపూర్‌లో కార్యకర్తలతో కలసి పాదయాత్ర చేస్తున్న ఎంపీ బండి సంజయ్

కరీంనగర్ రూరల్/ రామచంద్రాపురం/పటాన్ చెరు): తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం నిధులు మంజూరు చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం తామే చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్, సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రైతులనుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యం డబ్బులు, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు కేంద్రమే నిధులు మంజూరు చేస్తోందని బండి చెప్పారు. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణానికి తాను నిధులు తీసుకొస్తే, మంత్రి గంగుల కమలాకర్ తానే తెచ్చినట్లు పోజులు కొడుతున్నాడని విమర్శించారు. గంగులకు దమ్ముంటే కేంద్ర నిధులపై చర్చించేందుకు బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. ఆర్టీసీ ఆస్తులను దోచుకునేందుకు సీఎం కేసీఆర్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కాగా, ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన వివిధ పార్టీల నాయకులు గురువారం బీజేపీలో చేరారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకటే..

కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులు గెలిచిన తర్వాత బీఆర్ఎస్‌లోకి వెళ్లరన్న గ్యారంటీ ఇవ్వగలదా అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం సభలో, అంతకు ముందు, పటాన్‌చెరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటేనని, ఈ విషయం అనేకసార్లు రుజువైందన్నారు. రాష్ట్రంలో బీజేపీ గెలవద్దని ఈ రెండు పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని చెప్పారు. ఈ రెండు పార్టీలు ఒక వర్గానికి చెందిన ఓట్ల కోసమే పోటీ పడుతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా 80 శాతం ఓట్లు ఉన్న హిందూ సమాజం ఒకటి కావాలని పిలుపునిచ్చారు. కాగా, కేసీఆర్‌ను అల్లాహ్‌తో పోల్చుతున్నారని ఒక విలేకరి ప్రశ్నించగా, రాత్రంతా తాగే వ్యక్తికి అల్లాహ్‌కు పోలికేంటని బండి అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మసీదుల్లో లౌడ్ స్పీకర్లు ఉండవని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన చెప్పారు.

అమిత్ షా చేతుల మీదుగా బీజేపీ మేనిఫెస్టో


రేపు సకల జనుల విజయ సంకల్ప సభల్లో పాల్గొననున్న ఆ పార్టీ అగ్రనేత



సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం రాష్ట్రంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఆరోజు ఉదయం హైదరాబాద్‌లో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను ఆయన విడుదల చేస్తారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా...సకల జనుల విజయ సంకల్ప సభల (బహిరంగ సభలు) పేరిట నిర్వహిస్తున్న మూడు సభల్లో అమిత్ షా పాల్గొంటారు. శనివారం ఉదయం 10 గంటలకు గద్వాలలో, మధ్యాహ్నం 12 గంటలకు నల్లగొండలో, 2 గంటలకు వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలో మొత్తం మూడు బహిరంగ సభల్లో ఆయన ప్రసంగిస్తారు. అదేరోజు సాయంత్రం సికింద్రాబాద్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులతో అమిత్ షా ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బీజేపీకి మద్దతుగా రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో చేపట్టబోయే ప్రచారం, ప్రాధాన్యతాంశాలపై ఆయన చర్చిస్తారని పార్టీ వర్గాల సమాచారం. బీజేపీ బీసీ సీఎం నినాదంతో పాటు, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసేందుకు మోదీ ప్రభుత్వం తీసుకున్న చొరవ, చేపడుతున్న చర్యలను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ, ఇతర నేతలకు వివరిస్తారని తెలుస్తోంది. బీసీ, ఎస్సీ ఇతర వర్గాల ఓట్లను ఆకట్టుకునేందుకు ఈ ప్రచారం దోహదపడుతుందని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు.

తదుపరి విచారణలోగా కౌంటర్ వేయాలి

- లేనిపక్షంలో సీఎస్ నేరుగా హాజరై వివరణివ్వాలి
- 'దివ్యాంగుల'పిటిషన్‌పై హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1, గ్రూప్–2 సహా ఇతర పరీక్షలకు తమకు నిర్దేశిత సమయానికి మించి అధిక సమయం ఇవ్వాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఆ నిబంధనను పాటించడం లేదంటూ దాఖలైన పిటిషన్‌పై తదుపరి విచారణలోగా కౌంటర్ వేయాలని టీఎస్‌పీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయడంలో విఫలమైతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, స్త్రీశిశు సంక్షేమ శాఖ కార్యదర్శి కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంటుందని తేల్చి చెప్పింది. పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉండి, రాయడం ఇబ్బంది ఉన్నవారికి ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో ప్రతి గంటకు 20 నిమిషాల అధిక సమయం కేటాయించాలని 2018, ఆగస్టు 29న కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో గ్రూప్–1, గ్రూప్–2 సహా పలు పరీక్షలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ దివ్యాంగుల విషయంలో కేంద్ర నిబంధనను పాటించడం లేదంటూ హైకోర్టులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా జవహర్‌నగర్‌కు చెందిన ఎం.అనిల్‌కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మాధవీదేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపున గొరారం రాజశేఖర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈ అంశంపై ప్రభుత్వ న్యాయవాది వాదనలు కూడా విన్న ధర్మాసనం.. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

18న టీచర్లు, పేరెంట్స్ సమావేశం

మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 18వ తేదీన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన ఆదేశాలు జారీ చేశారు. సమావేశానికి కొన్ని మార్గదర్శకాలను గురువారం పాఠశాలవిద్య డైరెక్టరేట్ విడుదల చేసింది. విద్యార్థుల అకడమిక్ పురోగతిపై చర్చించాలని సూచించింది. యూడైస్ యాప్‌లో విద్యార్థులను చేర్చడం, పాఠశాల పురోభివృద్ధి తదితర అంశాలపై చర్చించాలని పేర్కొంది. ఎన్నికల నియమాలను ఈ సందర్భంగా విధిగా పాటించాలని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. కాగా, ఎన్నికల నేపథ్యంలో ఇలాంటి సమావేశాలు ఎలా నిర్వహిస్తామని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఇవి రాజకీయ చర్చలకు దారితీసే ప్రమాదం కూడా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. తల్లిదండ్రుల కమిటీల్లో వివిధ పార్టీల వారుంటారని.. పాఠశాల పురోభివృద్ధి అంశంపై ఒక వర్గం సమర్థిస్తే, ఇంకో వర్గం విమర్శలు చేసే వీలుందని చెబుతున్నారు. ఇవి ఉద్రిక్తతకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు జరిగే వరకూ ఇలాంటివి వద్దని అంటున్నారు.

రసాయన మందులకు ప్రత్యామ్నాయంగా జీవ ఎరువులు


అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

ఏజీవర్సిటీ (హైదరాబాద్): ప్రొఫెసర్ జయ శంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనసాగుతున్న మొక్కల ఆరోగ్య నిర్వహణపై అంతర్జాతీయ సదస్సులో రెండోరోజు గురువారం పలు జీవపరిణామాలపై శాస్త్రవేత్తలు చర్చించారు. ముఖ్యంగా తెగుళ్లపై ప్రభావం, రసాయన పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా జీవ ఎరువులు, జీవశిలీంధ్ర నాశినులు, జీవరక్షణ, జీవపోషణ, జీవ వైవిధ్యం, జీవభద్రత, సాంకేతిక అభివృద్ధి అమలు వంటి అంశాలపై చర్చించారు. అనంతరం పలువురు శాస్త్రవేత్తలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శరత్‌బాబు, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, డాక్టర్ క ట్టి, టీవీకే సింగ్, డాక్టర్ జెల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్–కొల్లాం (07121/07122) స్పెషల్ ట్రైన్ ఈ నెల 19న ఆదివారం మధ్యాహ్నం 2.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సోమవారం రాత్రి 11.55 గంటలకు కొల్లాం చేరుకోనుంది. తిరుగు ప్రయాణంలో 21వ తేదీ తెల్లవారుజామున 2.30 గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి బుధవారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. నర్సాపూర్–కొట్టాయం (07119/07120) స్పెషల్ ట్రైన్ ఈ నెల 19న సాయంత్రం 3.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4.50 గంటలకు కొట్టాయం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 20వ తేదీ సాయంత్రం 7 గంటలకు కొట్టాయం నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 9కి నర్సాపూర్ చేరుకుంటుంది.

పీజీ కోర్సుల ప్రవేశాల చివరి జాబితా విడుదల

ఎంఈబీ, ఎంపీఈడీలో 546 సీట్ల కేటాయింపు

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సీపీజీఈటీ–2023 కౌన్సెలింగ్‌లో భాగంగా చివరి విడతలో సీటు సాధించిన విద్యార్థుల జాబితాను విడుదల చేసినట్లు కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగా రెడ్డి గురువారం తెలిపారు. చివరి విడత కౌన్సెలింగ్‌కు 11325 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ ఇవ్వగా.. 6491 మందికి సీట్లు కేటాయించినట్టు తెలిపారు. ఓయూతో పాటు కాకతీయ, శాతవాహన, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయాలు, జేఎన్‌టీయూల్లోని వివిధ పీజీ కోర్సుల్లో 50 వేల సీట్లకు.. 23 వేల సీట్లు భర్తీ కాగా 27 వేల సీట్లు మిగిలినట్లు వివరించారు. వివిధ కళాశాలల్లో ఎంఏ ఎకనామిక్స్, ఎంకాం, ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్, కెమిస్ట్రీ తదితర కోర్సుల్లో ఇంతవరకు ప్రవేశాలు జరగలేదని పేర్కొన్నారు.

ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో 546 సీట్ల భర్తీ

ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల మొదటి విడత కౌన్సెలింగ్‌కు 932 మంది వెబ్ ఆప్షన్స్ ఇవ్వగా.. 546 సీట్లు కేటాయించినట్టు ప్రొఫెసర్ పాండురంగా రెడ్డి పేర్కొన్నారు. పీజీ కోర్సులు, ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సులలో సీట్లు సాధించిన విద్యార్థులు ఒరిజినల్ టీసీతో పాటు ఇతర సర్టిఫికెట్లను ఆయా కళాశాలల్లో ఈ నెల 18 వరకు రిపోర్టు చేయాలని సూచించారు.

ఓయూలో సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని సివిల్ సర్వీస్ అకాడమీలో ఉచిత శిక్షణ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. పీహెచ్‌డీ విద్యార్థులు, క్యాంపస్ కాలేజీలతో పాటు సికింద్రాబాద్, సైఫాబాద్ పీజీ కళాశాలలు, నిజాం కాలేజీలకు చెందిన ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ విద్యార్థులు, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎల్ఎల్ఎం, ఇతర పీజీ కోర్సుల విద్యార్థులు డిసెంబర్ 2 వరకు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ డాక్టర్ కొంగ నాగేశ్వర్‌రావు తెలిపారు. సివిల్ సర్వీస్ అకాడమీలోని 100 సీట్లను డిగ్రీ మార్కులు, పీజీ ఎంట్రన్స్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా రిజర్వేషన్ల ప్రాతిపదికన ఉచిత శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. సీటు సాధించిన అభ్యర్థులకు మే 1 వరకు (నాలుగున్నర నెలలు) శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

కేసీఆర్, కేటీఆర్ పదవులు ఊడటం ఖాయం

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, మంత్రి కేటీరామారావు కాలికి బలపం పట్టుకుని తిరుగుతూ ప్రజలను ప్రలోభాలతో మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నా... ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక తండ్రీకొడుకుల పదవులు ఊడిపోవడం ఖాయమని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ అన్నారు. గురువారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ నిరుద్యోగులకు కొలువులు రావాలంటే కేసీఆర్, కేటీఆర్‌ల ఉద్యోగాలు పోవాల్సిందేనన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడంతో ఏ వర్గం కూడా ఇప్పుడు బీఆర్ఎస్‌కు ఓటు వేసేందుకు సిద్ధంగా లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ సందట్లో సడేమియా అన్నట్లుగా మధ్యలో దూరుదామని ప్రయత్నిస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలూ యువత, ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ వర్గానికి చెందిన ప్రజలను మోసం చేశాయని, అందుకే ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. బీజేపీకి చెందిన నేత బీసీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసి ఆగమైన యువత...కూలీలుగా మారలేక పల్లెల్లో, పట్టణాల్లో, వాడవాడలా కేసీఆర్ ప్రభుత్వ మోసాలను వివరిస్తూ..వారిని ఓడించడమే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి కుటుంబసభ్యులు రాజకీయ ఉద్యోగాలను మాత్రం రెగ్యులరైజ్ చేసుకున్నారు. 2018 ఎన్నికల మేనిఫెస్టోలో 3,016 రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇవ్వకుండా దగా చేశారన్నారు.

కరెంటు విషయంలో కేసీఆర్ మాటలు ఒట్టివే

అన్నీ అబద్ధాలేనని సీఈఏ నివేదికతో స్పష్టమైంది: ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్, వర్గల్ (గజ్వేల్): దేశంలోనే తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ అగ్రగామి రాష్ట్రమంటూ సీఎం కేసీఆర్ చేస్తున్న ప్రకటనలు అన్నీ తప్పేనని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ పునరుద్ఘాటించారు. కేంద్ర విద్యుత్ సంస్థ (సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ–సీఈఏ)–2023 వార్షిక నివేదిక ప్రచురణతో కేసీఆర్ చెప్పేవన్నీ అబద్ధాలేనని రుజువయ్యాయని పేర్కొన్నారు. ఇన్ని రోజులూ కేసీఆర్ గొప్పలు చెప్పుకున్న విషయం ఒట్టిదేనని సీఈఏ నివేదికతో స్పష్టమైందని ఈటల గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆ నివేదిక ప్రకారం చూస్తే... తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ పదవ స్థానంలో ఉందని, మన రాష్ట్రం కంటే కేంద్రపాలిత ప్రాంతాలు మెరుగైన స్థితిలో ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలోని అన్ని డిస్కంలలో తీవ్రమైన సమస్యలు నెలకొన్నాయని, డిస్కంలను పూర్తిగా నాశనం చేసిన కేసీఆర్ మరోవైపు ఏదో ఘనత సాధించినట్టు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ మళ్లీ వస్తే ఆలయాల భూములన్నీ మాయమే..

కేసీఆర్ సర్కారు మళ్లీ వస్తే దేవాలయాల భూములను కూడా అమ్మేస్తారని ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. గురువారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారంలో జరిగిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. నాచారంగుట్ట ఆలయాన్ని రూ.వంద కోట్లతో అభివృద్ధి చేస్తానని చెప్పిన కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లలో ఐదు పైసలు కూడా ఖర్చుపెట్టలేదని మండిపడ్డారు. మరోసారి కేసీఆర్‌కు ఓటేస్తే గ్రామాలను కూడా మిగలనివ్వడని విమర్శించారు.

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినందున జోక్యం చేసుకోలేం

జుక్కల్ కాంగ్రెస్ అభ్యర్థి కులవివాదంపై హైకోర్టు వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినందున చట్టప్రకారం ఎలక్షన్ కమిషన్(ఈసీ)కి సంబంధించిన అంశాల్లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. కామారెడ్డి జిల్లాలోని ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన జుక్కల్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి షెడ్యూల్ కులానికి చెందిన వ్యక్తి కాదన్న విషయంపై విచారణ జరిపేందుకు విముఖత వ్యక్తం చేసింది. ఎన్నికల్లో జుక్కల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తోట లక్ష్మీకాంతరావు నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఆయన షెడ్యూల్ కులానికి చెందినవారు కాదని, తప్పుడు కుల ధ్రువీకరణపత్రం అందజేశారని పేర్కొంటూ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారామ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసినా రిటర్నింగ్ అధికారి పట్టించుకోకుండా నామినేషన్ అంగీకరించారని, ఇది చట్టవిరుద్ధమని, అతని నామినేషన్ తిరస్కరించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఒకవేళ ఆ అభ్యర్థి ఎన్నికల్లో విజయం సాధిస్తే.. ఆ గెలుపును సవాల్ చేస్తూ ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని పిటిషనర్‌కు సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

26న 'గ్రేటర్ రాయలసీమ' వనభోజన మహోత్సవం

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆధ్వర్యంలో మియాపూర్ క్రాస్‌రోడ్స్‌లోని నరేన్ గార్డెన్స్‌లో ఈ నెల 26న ఉదయం 8 గంటల నుంచి కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, రాజకీయ, సినీ ప్రముఖులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, గ్రేటర్ రాయలసీమ ప్రాంతవాసులు పాల్గొననున్నారు. వివరాలకు 9908186395, 8008510670 నంబర్లలో సంప్రదించవచ్చు.

క్లుప్తంగా...

అమెరికా కోటీశ్వరుడు సింఘంకు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: న్యూస్‌క్లిక్ ఆన్‌లైన్ పోర్టల్‌పై నమోదైన మనీల్యాండరింగ్ కేసులో విచారణకు హాజరుకావాల్సిందిగా అమెరికన్ బిలియనీర్ నెవిల్లె రాయ్ సింఘంకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తాజాగా సమన్లు జారీ చేసింది. భారత్‌లో చైనాకు అనుకూలంగా కథనాలు రాసేందుకు న్యూస్‌క్లిక్‌కు డ్రాగన్ దేశం నుంచి నిధులు అందుతున్నట్లు గతంలో న్యూయార్క్‌టైమ్స్, తదితర పత్రికల్లో కథనాలు వచ్చాయి. నెవిల్లె రాయ్ సింఘం, ఆయనకు చెందిన న్యూస్‌క్లిక్‌ను అత్యంత ప్రమా దకరమైనవని పేర్కొన్నాయి. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన ఈడీ..న్యూస్‌క్లిక్ ఫౌండర్, ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రబీర్ పురకాయస్థకు చెందిన ఢిల్లీలోని రూ.4.52 కోట్లు విలువ చేసే భవనాన్ని, రూ.41 లక్షల బ్యాంకు డిపాజిట్లను అటాచ్ చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న సింఘం ప్రస్తుతం చైనాలోని షాంఘైలో ఉన్నారు. దీంతో, ఆయనకు విదేశాంగ శాఖ ద్వారా నోటీసులు పంపింది. కాగా, ఈడీ ఆరోపణలను సింఘం ఖండించారు. దర్యాప్తు చేపట్టిన ఈడీ మొదటిసారిగా 2021లో సింఘంకు నోటీసు పంపింది.

ఖలిస్తానీల ఆగడాలను అడ్డుకోండి

యూకే హోంమంత్రికి జైశంకర్ వినతి

లండన్: దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ దుర్వినియోగం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) హోం శాఖ మంత్రి జేమ్స్ క్లెవర్లీ, జాతీయ భద్రతా సలహాదారు టిమ్ బారోకు భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ విజ్ఞప్తి చేశారు. యూకేలో ఖలిస్తాన్ తీవ్రవాదం నానాటికీ పెరిగిపోతుండడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఖలిస్తాన్ సభ్యుల ఆగడాలు, భారత్‌కు వ్యతిరేకంగా వారు సాగిస్తున్న కార్యకలాపాలను జేమ్స్ క్లెవర్లీ, టిమ్ బారో దృష్టికి తీసుకెళ్లారు. జైశంకర్ బుధవారం లండన్‌లో వారిద్దరితో సమావేశమయ్యారు. ఖలిస్తాన్ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. అనంతరం యూకే ప్రధానమంత్రి రిషి సునాక్‌తో భేటీ అయ్యారు. ఇండియా–యూకే సంబంధాల్లో పురోగతిపై చర్చించారు. ఇండియా–యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ప్రస్తుతం జరుగుతున్న సంప్రదింపులతోపాటు రోడ్‌మ్యాప్–2030 అమలు తీరును ఇరువురు నేతలు సమీక్షించారు. ఇరు దేశాల మధ్య సంబంధాల్లో సానుకూల పురోగతి కనిపిస్తోందని వారు హర్షం వ్యక్తం చేశారు. యూకేలో జైశంకర్ ఐదు రోజుల పర్యటన బుధవారం ముగిసింది.

ఆ శకలంతో ఎటువంటి ప్రమాదం లేదు: ఇస్రో

బెంగళూరు: చంద్రయాన్–3 అంతరిక్ష నౌకను జూలై 14న నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడంలో కీలకమైన క్రయోజనిక్ రాకెట్ ఇంజిన్‌లోని ఒక భాగం భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించిందని ఇస్రో తెలిపింది. ఎల్‌వీఎం–3 ఎం4కు చెందిన ఈ శకలం బుధవారం మధ్యాహ్నం 2.42 సమయంలో భూ వాతావరణంలోకి ప్రవేశించినట్లు గుర్తించామని గురువారం ఇస్రో వివరించింది. దీని వల్ల ఎలాంటి ప్రమాదం లేదని తెలిపింది. ఇది ఉత్తర పసిఫిక్ సముద్రంలో పడే అవకాశాలున్నాయని తెలిపింది. భారత గగనతలంలోకి ప్రవేశించే అవకాశాల్లేవని ఒక ప్రకటనలో ఇస్రో స్పష్టం చేసింది.

చైనాలో భారీ అగ్ని ప్రమాదం

26 మంది సజీవ దహనం

బీజింగ్: చైనాలోని షాంగ్జి ప్రావిన్స్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో 26 మంది చనిపోగా మరో 38 మంది గాయపడ్డారు. లియులింగ్ నగరంలోని లిషి ప్రాంతంలో గురువారం ఉదయం 6.50 గంటలకు ఘటన చోటుచేసుకుంది. బొగ్గు గని కంపెనీకి చెందిన అయిదంతస్తుల భవనంలోని రెండో అంతస్తులో మొదలైన మంటలు భవనమంతటికీ వ్యాపించినట్లు అధికారులు తెలిపారు. అగ్ని మాపక సిబ్బంది శ్రమించి మంటలను మధ్యాహ్నం 1.45కి అదుపులోకి తెచ్చారని చెప్పారు. చైనాలోని పారిశ్రామిక ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి. భద్రతా ప్రమాణాలను పట్టించుకోకపోవడం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యమే వీటికి కారణమని చెబుతున్నారు.

యూపీలో మరో రైలులో మంటలు

ఇటావా: ఉత్తరప్రదేశ్‌లోని ఇటావా జిల్లాలో బుధవారం సాయంత్రం దర్భంగా స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలులో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. కొద్ది గంటల వ్యవధిలోనే అదే జిల్లాలో మరో రైలులో మంటలు చెలరేగాయి. ఢిల్లీ–సహర్సా వైశాలి ఎక్స్‌ప్రెస్ రైలు ఎస్–6 బోగీలో తెల్లవారుజామున 2.40 గంటల సమయంలో మంటలు మొదలైనట్లు ఇటావా ఎస్పీ సంజయ్ కుమార్ చెప్పారు. మంటల విషయం తెలిసిన వెంటనే అధికారులు ఫ్రెండ్స్ కాలనీ సమీపంలోనే రైలును నిలిపివేశారు. అగ్ని మాప సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో 21 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

రైలు బోగీలో పేలుడు.. నలుగురికి గాయాలు

సమస్తీపూర్: బిహార్‌లోని సమస్తీపూర్ రైల్వే స్టేషన్‌లోని అవుటర్ సిగ్నల్ వద్ద నిలిపి ఉంచిన ఓ రైలులో పేలుడు సంభవించింది. ఓ బోగీలోని అప్పర్ బెర్త్‌లో ఉంచిన బ్యాగులో ఉంచిన గన్ పౌడర్ ప్రమాదవశాత్తు పేలినట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. భాగల్పూర్– దర్భంగా ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో సంభవించిన ఈ ఘటనలో మహిళ సహా నలుగురు ప్రయాణికులు గాయపడ్డారు.

టార్గెట్ దక్షిణ గాజా!

ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని ప్రజలకు ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరిక

పల్లెలు, పట్టణాలు ఖాళీ చేయాలంటూ కరపత్రాల పంపిణీ

- మిలిటెంట్లు ఎక్కడ దాగి ఉన్నా దాడులు: ఇజ్రాయెల్ రక్షణ మంత్రి
- అల్–షిఫా ఆసుపత్రిలో హమాస్ ఆయుధాలు స్వాధీనం
- వీడియో విడుదల చేసిన ఇజ్రాయెల్ సైన్యం

ఖాన్ యూనిస్: గాజాలో సాధారణ పాలస్తీనియన్ల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. హమాస్ మిలిటెంట్లపై యుద్ధం పేరిట ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడుతోంది. భూతల, వైమానిక దాడులతో భారీ భవనాలు క్షణాల్లో శిథిలాల దిబ్బలుగా మారిపోతున్నాయి. జనం పిట్టల్లా రాలిపోతున్నారు. నిత్యం వందల సంఖ్యలో జనం కాళ్లు, చేతులు విరిగి క్షతగాత్రులుగా మారుతున్నాయి. యుద్ధం దక్షిణ గాజాకు విస్తరించే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఉత్తర గాజాపై భీకర దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ సైన్యం ఇప్పుడు దక్షిణ గాజాపై దృష్టి పెట్టింది. ఇక్కడి నుంచి వెంటనే వెళ్లిపోవాలంటూ కరపత్రాలు పంపిణీ చేస్తోంది. పల్లెలు, పట్టణాలను ఖాళీ చేసి మరో చోటుకు వెళ్లాలని ఇజ్రాయెల్ సేనలు హెచ్చరిస్తుండడంతో ప్రజలకు దిక్కుతోచడం లేదు. ఇలాంటి కరపత్రాలను ఉత్తర గాజాలోనూ జారవిడిచిన సంగతి తెలిసిందే. ఉత్తర గాజా నుంచి ఇప్పటికే లక్షలాది మంది ప్రాణభయంతో దక్షిణ గాజాకు వలస వచ్చారు. ఇక్కడ కూడా దాడులు ఉధృతం చేస్తామని ఇజ్రాయెల్ చెబుతుండడంతో ఇక ఎక్కడికి వెళ్లాలని విలపిస్తున్నారు. ఉత్తర, దక్షిణ గాజా అనే తేడా లేకుండా హమాస్ మిలిటెంట్లు ఎక్కడ దాగి ఉన్న దాడులు తప్పవని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గల్లాంట్ స్పష్టంచేశారు. గాజా ప్రజలను తమ భూభాగంలోకి అనుమతించే ప్రసక్తే లేదని పొరుగు దేశం ఈజిప్టు మరోసారి తెగేసి చెప్పింది.

అల్–షిఫా ఆసుపత్రిలో రెండో రోజూ తనిఖీలు

గాజా స్ట్రిప్‌లో అతిపెద్దదైన అల్–షిఫా ఆసుపత్రిలో ఇజ్రాయెల్ సైన్యం తనిఖీలు రెండో రోజు గురువారం కూడా కొనసాగాయి. ఈ హాస్పిటల్ ప్రాంగణంలో ఓ భవనంలోని ఎంఆర్ఐ ల్యాబ్‌లో హమాస్ మిలిటెంట్ గ్రూప్ పెద్ద ఎత్తున ఆయుధాలు నిల్వ చేసిందంటూ సంబంధిత వీడియోను సైన్యం విడుదల చేసింది. అసాల్ట్ రైఫిల్స్, గ్రెనేడ్లు, హమాస్ దుస్తులు ఈ వీడియోలో కనిపిస్తున్నాయి. అయితే, ఇన్నాళ్లూ చెబుతున్నట్లు అల్–షిఫా ఆసుపత్రి కింద భూగర్భంలో హమాస్ కమాండ్ సెంటర్ ఉన్నట్లు ఇప్పటిదాకా ఎలాంటి సాక్ష్యాన్ని బయటపెట్టలేదు. అల్–షిఫా ఆసుపత్రి చుట్టూ ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు మోహరించాయి. అల్–షిఫాలో తుపాకీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని ప్రత్యక్ష సాక్ష్యులు గురువారం చెప్పారు. ఇజ్రాయెల్ జవాన్లు కాల్పులు జరుపుతున్నారని ఆరోపించారు.



అల్–షిఫా ఆసుపత్రి ఎంఆర్ఐ సెంటర్‌లో హమాస్ దాచిన ఆయుధాలను చూపిస్తున్న ఇజ్రాయెల్ అధికారులు

ఆసుపత్రుల్లో మృత్యు ఘంటికలు

గాజాలో ఆసుపత్రులన్నీ తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నాయి. ప్రాణం పోయాల్సిన ఆసుపత్రుల్లో మృత్యు ఘంటికలు వినిపిస్తున్నాయి. గాజాలో మొత్తం 35 ఆసుపత్రులు ఉండగా, వీటిలో 26 ఆసుపత్రులు పని చేయడం లేదు. విద్యుత్, ఇంధనం, ఔషధాల కొరత వల్ల ఇక్కడ వైద్య సేవలు నిలిపివేశారు. పని చేస్తున్న కొన్ని ఆసుపత్రుల్లో వసతులు లేక రోగులు, శిశువులు విగత జీవులవుతున్నారు. యుద్ధం మొదలయ్యాక గాజాలో ఇప్పటివరకు 12,000 మందికిపైగా మరణించారు. 2,700 మంది అదృశ్యమయ్యారు. వీరంతా శిథిలాల కింద చిక్కుకొని మృత్యువాత పడినట్లు తెలుస్తోంది.

హమాస్ నాయకుల ఇళ్లపై క్షిపణుల వర్షం

గాజాలో హమాస్ ముఖ్యనేతల నివాసాలను ఇజ్రాయెల్ సైన్యం టార్గెట్ చేసింది. ఇప్పటికే పలువురు నాయకులను హతమార్చింది. సీనియర్ హమాస్ కమాండర్ ఇస్మాయిల్ హనియేహ్ ఇంటిని నేలమట్టం చేశామని సైన్యం గురువారం ప్రకటించింది. అయితే, ఆ ఇంట్లో ఎవరైనా ఉన్నారా? లేదా? అనేది తెలియరాలేదు.

'ఆగ్నేయ ఆసియా' రక్షణ మంత్రుల వినతి

ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతుండడం బాధాకరమని ఆగ్నేయ ఆసియా దేశాల రక్షణ శాఖ మంత్రులు పేర్కొన్నారు. 1967 నాటి సరిహద్దులతో ఇజ్రాయెల్‌తోపాటు స్వతంత్ర పాలస్తీనా దేశాన్ని ఏర్పాటు చేసే దిశగా శాంతి చర్చలు ప్రారంభించాలని సూచించారు. ఈ మేరకు 'అసోసియేషన్ ఆఫ్ సౌత్‌ఈస్టు ఆసియన్ నేషన్స్' పేరిట గురువారం ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.

తీర్మానం ఆమోదం

ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం విషయంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తీర్మానం ఎట్టకేలకు ఆమోదం పొందింది. ఇజ్రాయెల్ దాడుల వల్ల గాజాలో సామాన్య పాలస్తీనియన్లు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారని మండలి ఆందోళన వ్యక్తం చేశారు. గాజా ప్రజలకు మానవతా సాయం అందించేందుకు గాజా అంతటా ప్రత్యేక కారిడార్లు ఏర్పాటు చేయాలని, వారికి తగిన రక్షణ కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని, దాడులకు విరామం ఇవ్వాలని ఇజ్రాయెల్‌కు సూచిస్తూ మండలిలో తీర్మానాన్ని ఆమోదించారు. బందీలను వెంటనే విడుదల చేయాలని ఈ తీర్మానంలో హమాస్‌కు విజ్ఞప్తి చేశారు. మండలిలో 15 సభ్యదేశాలుండగా, మాల్టా దేశం ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి మద్దతుగా 12 దేశాలు ఓటువేశాయి. అమెరికా, యూకే, రష్యా గైర్హాజరయ్యాయి.



బుధవారం కాలిఫోర్నియాలోని ఫిలోలి ఎస్టేట్‌లో బైడెన్, జిన్‌పింగ్

జిన్‌పింగ్ ఓ నియంత

- అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్య
- చైనా అధినేతతో 4 గంటలపాటు భేటీ
- పరస్పరం కలిసి పని చేయడానికి ఇరువురు నేతల అంగీకారం

కాలిఫోర్నియా/బీజింగ్: చైనా అధినేత షీ జిన్‌పింగ్ ముమ్మాటికీ ఒక నియంత అని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి తేల్చిచెప్పారు. జిన్‌పింగ్‌తో సమావేశమైన తర్వాత కొద్దిసేపటికే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. బైడెన్, జిన్‌పింగ్ అమెరికాలోని కాలిఫోర్నియాలో స్థానిక కాలమానం ప్రకారం బుధవారం సమావేశమయ్యారు. అమెరికా–చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకొనే దిశగా చర్చలు జరిపారు. ఇరువురు నాయకులు భేటీ కావడం ఏడాది తర్వాత ఇదే మొదటిసారి. శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన ఆసియా–పసిఫిక్ ఆర్థిక సహకార మండలి శిఖరాగ్ర సదస్సులో వారిద్దరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలిఫోర్నియాలో ప్రత్యేకంగా దాదాపు 4 గంటలపాటు భేటీ అయ్యారు. సమావేశం అనంతరం బైడెన్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ''నిజమే, అతడు(జిన్‌పింగ్) ఒక నియంత'' అని స్పష్టంచేశారు. కమ్యూనిస్టు దేశమైన చైనాను పరిపాలిస్తున్నాడన్న కోణంలో జిన్‌పింగ్‌ను నియంతగా అభివర్ణిస్తున్నట్లు చెప్పారు. అమెరికా కంటే పూర్తి భిన్నమైన పరిపాలన చైనాలో కొనసాగుతోందని అన్నారు. చర్చల్లో తామిద్దరం కొంత పురోగతి సాధించామని వెల్లడించారు. ఫలవంతమైన, నిర్మాణాత్మక చర్చలు జరిపామని తెలియజేశారు. బైడెన్ గతంలో కూడా జిన్‌పింగ్‌ను నియంతగా అభివర్ణిస్తూ వ్యాఖ్యలు చేశారు. దీనిపై చైనా ఘాటుగా ప్రతిస్పందించింది. బైడెన్ రెచ్చగొట్టేలా మాట్లాడారని విమర్శించింది. అసంబద్ధ, అనుచిత వ్యాఖ్యలు చేశారని అభ్యంతరం వ్యక్తం చేసింది. బైడెన్ తాజా వ్యాఖ్యలు మళ్లీ వివాదాన్ని సృష్టించే అవకాశం కనిపిస్తోంది.

మిలటరీ కమ్యూనికేషన్లు పునఃప్రారంభిద్దాం..

అమెరికా, చైనా మధ్య ఉన్నత స్థాయి సైనిక పరమైన సంబంధాలు, కమ్యూనికేషన్లను పునఃప్రారంభించాలని జో బైడెన్, షీ జిన్‌పింగ్ నిర్ణయానికొచ్చారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టే విషయంలో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు. అత్యాధునిక కృత్రిమ మేధ(ఏఐ) వ్యవస్థలతో ఎదురవుతున్న సమస్యలను కలిసికట్టుగా పరిష్కరించుకుందామని అంగీకారానికి వచ్చారు. 4 గంటలపాటు సాగిన చర్చల్లో బైడెన్, జిన్‌పింగ్ పలు కీలక అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలోని తాజా పరిస్థితులు, ప్రాంతీయ అంతర్జాతీయ పరిణామాలపై చర్చించారు. ఇరు దేశాలతోపాటు ప్రపంచానికి మేలు చేకూర్చే అంశాలపై చర్చలు జరిపామని బైడెన్ మీడియాతో చెప్పారు. తాము ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బెల్ట్ అండ్ రోడ్ కార్యక్రమం(బీఆర్ఐ)లో భాగస్వామిగా మారాలని అమెరికాను జిన్‌పింగ్ ఆహ్వానించారు. అమెరికా చేపట్టే సహకార కార్యక్రమాల్లో తాము పాలుపంచుకుంటామని చెప్పారు. ప్రపంచంలో రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనా మధ్య ఉద్రిక్తతలు ఆగిపోవాలని, పరస్పరం సహకరించుకోవాలని జిన్‌పింగ్ ఆకాంక్షించినట్లు చైనా మీడియా వెల్లడించింది. సంఘర్షణలు, అర్థంపర్థం లేని పోటీతో నష్టమే తప్ప ప్రయోజనం ఉండదని జిన్‌పింగ్ తేల్చిచెప్పారని పేర్కొంది. చైనా ఆర్థిక వ్యవస్థ ఇటీవలి కాలంలో తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. అందుకే జిన్‌పింగ్ ఒక మెట్టు దిగి వచ్చినట్లు తెలుస్తోంది.

దత్తత ఇచ్చిన బిడ్డకు డీఎన్ఏ పరీక్ష వద్దు

పోలీసులకు బాంబే హైకోర్టు ఆదేశం

ముంబై: అత్యాచారానికి గురైన బాధితురాలికి జన్మించిన బిడ్డను ఇతరులు దత్తత తీసుకున్న తర్వాత ఆ బిడ్డకు డీఎన్ఏ పరీక్ష నిర్వహించాలనుకోవడం సమంజసం కాదని బాంబే హైకోర్టు తేల్చిచెప్పింది. బిడ్డ ప్రయోజనాలను కాపాడాలని, ఆమె భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని డీఎన్ఏ పరీక్ష నిర్వహించవద్దని పోలీసులను ఆదేశించింది. బాంబే హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఈ మేరకు ఈ నెల 10న తీర్పు వెలువరించింది. మహారాష్ట్ర రాజధాని ముంబైలో 2020లో ఓ వ్యక్తి 17 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె గర్భం దాల్చింది. బిడ్డకు జన్మనిచ్చింది. బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అతడిని జైలుకు పంపించారు. మైనర్ బాలికకు జన్మించిన బిడ్డను గుర్తుతెలియని దంపతులు దత్తత తీసుకున్నారు. నిందితుడు 2 సంవత్సరాల 10 నెలలుగా జైల్లోనే ఉన్నాడు. తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం పోలీసులను ప్రశ్నించింది. బాధితురాలి బిడ్డకు డీఎన్ఏ పరీక్ష చేశారా? అని ఆరా తీసింది. బిడ్డను ఇతరులు దత్తత తీసుకున్నారని పోలీసులు బదులివ్వడంతో ఇక డీఎన్ఏ పరీక్ష అవసరం లేదని ఆదేశించింది. నిందితుడికి బెయిల్ మంజూరు చేసింది.

యుద్ధ వ్యతిరేక లేబుళ్లు అంటించినందుకు.. రష్యా కళాకారిణికి ఏడేళ్ల జైలు



మాస్కో: సూపర్‌మార్కెట్‌లోని వస్తువులపై ఉండే ధరల లేబుళ్లను తొలగించి, వాటి స్థానంలో యుద్ధ వ్యతిరేక నినాదాలున్న లేబుళ్లు అంటించిన నేరంపై ఓ కళాకారిణికి రష్యా కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. గత ఏడాది ఉక్రెయిన్‌పై రష్యా దాడులు మొదలయ్యాక.. సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు చెందిన సాషా స్కోచిలెంకో(33) అనే కళాకారిణి స్థానిక ఫెమినిస్టు బృందం పిలుపు మేరకు స్థానిక సూపర్ మార్కెట్‌లోని వస్తువుల ధర లేబుళ్లను తీసేసి..'రష్యా ఆర్మీ మరియుపోల్‌లోని స్కూల్‌పై బాంబు వేసింది'... 'రష్యా ఫాసిస్ట్ రాజ్యంగా మారి ఉక్రెయిన్‌పై దాడి చేసినందుకు మా ముత్తాత రెండో ప్రపంచ యుద్ధంలో పోరాడలేదు' అంటూ రాసి ఉన్న కొన్ని లేబుళ్లను అంటించింది. ఈ నేరానికి అధికారులు గత ఏడాది ఏప్రిల్ అదుపులోకి తీసుకున్నారు. యుద్ధానికి వ్యతిరేకంగా ఎలాంటి వైఖరి తీసుకున్నా కఠిన శిక్షలకు అవకాశం కల్పిస్తూ పుతిన్ ప్రభుత్వం చట్టాలు తీసుకువచ్చింది. ఈ చట్టాలు అమల్లోకి వచ్చాక జరిగిన మొట్టమొదటి అరెస్ట్ ఇది. దీంతో, విచారణ సుదీర్ఘంగా సాగింది. తనపై వచ్చిన ఆరోపణలను సాషా అంగీకరించింది కూడా. తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సాషా జైలులోనే చనిపోయే ప్రమాదముందని ఆమె తరఫు లాయర్లు తెలిపారు. అయినప్పటికీ జడ్జి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ప్రభుత్వ టీవీలో లైవ్‌లో వ్యతిరేకించారన్న ఆరోపణలపై కోర్టు ఒకటి మరినా అనే జర్నలిస్టుకు ఎనిమిదిన్నరేళ్ల జైలు శిక్ష విధించింది. యుద్ధాన్ని నిరసించిన వ్లాదిమిర్ కారా ముర్జా అనే ప్రతిపక్ష నేతకు ఏప్రిల్‌లో 25 ఏళ్ల జైలు శిక్ష పడింది.

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌ల్లో నేడే పోలింగ్

- ఎంపీలో మొత్తం 230 సీట్లు
- ఛత్తీస్‌లో 70 అసెంబ్లీ స్థానాలు
- బీజేపీ, కాంగ్రెస్ హోరాహోరీ

భోపాల్/రాయ్‌పూర్: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోరు కీలక దశకు చేరింది. కీలకమైన మధ్యప్రదేశ్‌లో మొత్తం 230 అసెంబ్లీ స్థానాలకు శుక్రవారం ఒకే దశలో పోలింగ్ జరగనుంది. ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 90 సీట్లకు గాను రెండో, తుది దశలో భాగంగా 70 అసెంబ్లీ సీట్లకు కూడా పోలింగ్ జరుగుతుంది. ఆ రాష్ట్రంలో నవంబర్ 7న తొలి దశలో 20 నక్సల్స్ ప్రాబల్య స్థానాల్లో పోలింగ్ ముగియడం తెలిసిందే. అదే తేదీన ఈశాన్య రాష్ట్రం మిజోరంలో మొత్తం 40 స్థానాకలు ఒకే దశలో పోలింగ్ జరిగింది. మరో కీలక రాష్ట్రమైన రాజస్థాన్‌లో నవంబర్ 25న, చివరగా తెలంగాణలో నవంబర్ 30న పోలింగ్ జరగనుంది. మొత్తం ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలూ డిసెంబర్ 3న వెల్లడవుతాయి.



ఇండోర్‌లో ఎన్నికల సామగ్రితో వెళుతున్న సిబ్బంది

మధ్యప్రదేశ్‌లో..

మధ్యప్రదేశ్‌లో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 114 స్థానాలతో అతి పెద్ద పార్టీగా అవతరించింది. బీఎస్పీ, స్వతంత్రుల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 15 నెలలకే జ్యోతిరాదిత్య సింధియా సారథ్యంలో 22 మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడంతో కుప్పకూలింది. శివరాజ్‌సింగ్ చౌహాన్ సారథ్యంలో బీజేపీ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈసారి ఆ రెండింటితో పాటు సమాజ్‌వాదీ పార్టీ కూడా మరోసారి గట్టిగా ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తోంది...

రాష్ట్రంలో బరిలో ఉన్న అభ్యర్థులు	2,553 మంది
మొత్తం ఓటర్లు	5,60,58,521
పురుషులు	2,87,82,261
మహిళలు	2,71,99,586
మొత్తం పోలింగ్ స్టేషన్లు	64,626

ఛత్తీస్‌గఢ్ రెండో దశలో...

రాష్ట్రంలో 15 ఏళ్ల బీజేపీ పాలనకు తెర దించి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 68 సీట్లతో కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది. ఈ ఐదేళ్లలో సీఎం భూపేశ్ బఘెల్ పలు ప్రజాకర్షక పథకాలతో రైతులతో పాటు అన్ని వర్గాలనూ ఆకట్టుకుంటూ వచ్చారు. అనంతరం ఉప ఎన్నికల విజయాలతో అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 71కి పెరిగింది. ఈసారి బీజేపీ, కాంగ్రెస్‌లతో పాటు బీఎస్పీ, ఆమ్ ఆద్మీ పార్టీ కూడా పోటీలో ఉన్నాయి...

రెండో దశ బరిలో అభ్యర్థులు	958 మంది
మొత్తం ఓటర్లు	1,63,14,479
పురుషులు	81,41,624
మహిళలు	81,72,171
పోలింగ్ బూత్‌లు	18,833

స్పెయిన్ ప్రధానిగా మళ్లీ పెడ్రో సాంచెజ్

మాడ్రిడ్: స్పెయిన్ ప్రధాని పీఠాన్ని సోషలిస్ట్ పార్టీకి చెందిన మరోసారి పెడ్రో సాంఛెజ్ అధిష్టించనున్నారు. గురువారం పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో 350 మందికి గాను 179 మంది ఎంపీలు ఆయనకు మద్దతు తెలిపారు. కేటలోనియా వేర్పాటు ఉద్యమ నేత చార్లెస్ పిడ్గెమాంట్‌కు క్షమాభిక్ష ప్రకటించేందుకు పెడ్రో సాంఛెజ్ అంగీకరించడం.. బదులుగా వేర్పాటువాద పార్టీలు ఆయన ప్రభుత్వంలో చేరేందుకు అంగీకరించడంతో మైనారిటీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. నూతన ప్రభుత్వంలో రెండు కేటలోనియా వేర్పాటువాద పార్టీలు సహా మొత్తం ఆరు చిన్న పార్టీలు భాగస్వాములు కానున్నాయి. జూలై 23న జరిగిన ఎన్నికల్లో పార్లమెంట్‌లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ దక్కలేదు. 2017లో స్పెయిన్ నుంచి విడిపోతున్నట్లు కేటలోనియా వేర్పాటువాదులు ప్రకటించడంతో దేశంలో సంక్షోభం ఏర్పడింది. వేర్పాటువాద నేత చార్లెస్ పిడ్గెమాంట్‌ను ప్రభుత్వం నేరగాడిగా ప్రకటించింది.

అది విద్వేష ప్రసంగమే.. ప్రధానిపై చర్య తీసుకోండి: కాంగ్రెస్

న్యూఢిల్లీ: రాజస్తాన్‌లోని బర్మేర్‌లో బుధవారం ఎన్నికల ప్రచారంలో విద్వేష పూరిత ప్రసంగం చేసిన ప్రధాని మోదీపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘం(ఈసీ)ని కోరింది. కాంగ్రెస్‌కు మరణ శాసనం లిఖించేందుకు కమలం బటన్‌పై నొక్కాలంటూ ఓటర్లకు పిలుపునిచ్చారని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ తెలిపారు. ప్రధాని అహంకారానికి ప్రజలు తగు గుణపాఠం చెబుతారన్నారు. 'కాంగ్రెస్ నేతలను మోదీ ఎంతగా ద్వేషిస్తున్నారో ఆయన ప్రసంగాన్ని చూస్తేనే తెలుస్తుంది. ప్రధానమంత్రి వంటి బాధ్యతాయుత పదవిలో ఉన్న వ్యక్తి ఇటువంటివి మాట్లాడొచ్చా? ఆయన ప్రజాస్వామ్యం గొంతు పిసికేస్తున్నారు. ఇది కచ్చితంగా విద్వేష ప్రసంగమే'అని జైరాం రమేశ్ గురువారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రధానిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. బీజేపీ ఎన్నికల గుర్తు కమలం అన్న విషయం తెలిసిందే.

వచ్చే అయిదేళ్లలో 3 వేల కొత్త రైళ్లు

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ: రానున్న నాలుగయిదేళ్లలో మూడు వేల కొత్త రైళ్లను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు.వీటివల్ల రైల్వేల ప్రయాణికుల సామర్థ్యం ప్రస్తుతమున్న 800 కోట్ల నుంచి వెయ్యి కోట్లకు పెరుగుతుందని వెల్లడించారు. రైళ్ల వేగాన్ని పెంచడం, నెట్‌వర్క్‌ను విస్తరించడం ద్వారా ప్రయాణ సమయాన్ని బాగా తగ్గించడం కూడా తమ శాఖ ప్రథమ లక్ష్యమని గురువారం ఆయన రైల్వే భవన్‌లో మీడియాకు తెలిపారు.ప్రస్తుతం 69 వేల కొత్త కోచ్‌లు అందుబాటులో ఉండగా, ఏటా 5 వేల కోచ్‌లు కొత్తగా తయారవుతున్నాయని రైల్వే వర్గాలు తెలిపాయి. వీటితో ఏడాదికి 200 నుంచి 250 వరకు కొత్త రైళ్లు అందుబాటులోకి వస్తాయని, వీటికి తోడు రానున్న సంవత్సరాల్లో మరో 400 నుంచి 450 వరకు వందేభారత్ రైళ్లు కూడా ఉంటాయని పేర్కొన్నాయి.

21 ఏళ్ల తర్వాత.. లాడెన్ లేఖ వైరల్

లండన్: ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం తీవ్రరూపం దాల్చిన వేళ.. ఒకప్పటి అంతర్జాతీయ ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్‌ను మరోసారి జనం స్ఫురణకు తెచ్చుకుంటున్నారు. 2001లో అమెరికాపై అనూహ్య రీతిలో ఉగ్రదాడులు జరిపి ప్రపంచ దేశాలకు షాకిచ్చిన బిన్ లాడెన్.. ఆ తర్వాత అమెరికా ప్రజలనుద్దేశించి రాసిన రెండు పేజీల లేఖ టిక్–టాక్‌లో వైరల్‌గా మారడం గమనార్హం. ఒసామా లేఖకు సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరలవుతున్నాయి. పాలస్తీనాను ఆక్రమించి అణచివేతకు పాల్పడుతున్న ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు కూడా 9/11 దాడులకు ఓ కారణమని అందులో లాడెన్ సమర్థించుకున్నాడు. ''పాలస్తీనా దశాబ్దాలుగా ఆక్రమణలో ఉంది. అమెరికా అధ్యక్షులెవరూ పట్టించుకోలేదు. పాలస్తీనా ఎప్పటికీ ఆక్రమణలోనే ఉండిపోదు. సంకెళ్లను తెంచుకునేందుకు ప్రయత్నిస్తాం. అమెరికా అహంకారానికి క్రైస్తవుల రక్తంతో మూల్యం చెల్లించక తప్పదు'అని లాడెన్ హెచ్చరించాడు.

నేపథ్యం ఆధారంగా జడ్జీలపై ఆ ముద్రలు వేయొద్దు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ: అడ్వొకేట్ లక్ష్మణచంద్ర విక్టోరియా గౌరీని మద్రాస్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సమర్థించారు. విక్టోరియా గౌరీ గతంలో మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్‌లో కేంద్ర ప్రభుత్వం తరఫున వాదించారు. ఆమె బీజేపీ అభిమాని అనే పేరుంది. ఆమెను మద్రాస్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేయడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 7న ఆమె మద్రాస్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఈ నియామకం వివాదానికి దారితీసింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టు బార్ సభ్యులు కొందరు జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు లేఖ రాశారు. కొలీజియం సిఫార్సును రద్దు చేయాలని కోరారు. విక్టోరియా గౌరీ గతంలో పలు సందర్భాల్లో క్రైస్తవులకు, ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. జస్టిస్ డీవై చంద్రచూడ్ ఇటీవల హార్వర్డ్ లా కాలేజీ సెంటర్ కార్యక్రమంలో మాట్లాడారు. మద్రాస్ హైకోర్టు బార్ సభ్యుల లేఖపై స్పందించారు. కొలీజియం అన్ని అంశాలను క్షుణ్నంగా పరిశీలించిన తర్వాతే న్యాయమూర్తుల పేర్లను సిఫార్సు చేస్తుందని గుర్తుచేశారు. లాయర్లుగా ఉన్నప్పుడు వారి నేపథ్యాన్ని, వెలిబుచ్చిన సొంత అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని జడ్జిలపై ఒక వర్గం వ్యతిరేకులుగా ముద్ర వేయడం సరైంది కాదని అన్నారు. గొప్ప తీర్పులు వెలువరించిన జస్టిస్ కృష్ణ అయ్యర్‌కు కూడా రాజకీయ నేపథ్యం ఉండేదని అన్నారు.

జంగ్ తెలంగాణ



కొండాయి బ్రిడ్జి వద్ద తాత్కాలికంగా ఇసుకబస్తాలు వేసి నిర్మిస్తున్న రోడ్డు



ఓటేయాలంటే.. వాగు దాటాలె

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

ఓటేయడానికి 'దారి'

జంపన్నవాగుపై తాత్కాలిక రోడ్డు

ఏటూరునాగారం: 'ఓటు వేయాలంటే వాగు దాటాలె' శీర్షికన ఈ నెల 15వ తేదీన 'సాక్షి' పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్అండ్‌బీ శాఖ జంపన్నవాగుపై తాత్కాలిక బ్రిడ్జికోసం నిర్మాణ పనులు చేపట్టింది. మరికొద్ది రోజుల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఈవీఎంల తరలింపు, పోలింగ్ సిబ్బంది కొండాయి ప్రాంతానికి వెళ్లి అక్కడే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునేందుకు కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తున్నారు. తదుపరి జరిగే మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర సమయంలో పెద్ద ఎత్తున వాహనాలు ఈ తాత్కాలిక రోడ్డుపై వెళ్లేలా నిర్మాణాలు చేపడుతున్నట్టు ఆర్అండ్‌బీ డీఈఈ రఘువీర్ 'సాక్షి'కి తెలిపారు. 60 మీటర్ల పొడవున ఇసుక బస్తాలు వేసి దానిపై సిమెంటు పైపులు, తర్వాత మళ్లీ బస్తాలు వేసిన తర్వాత మట్టితో రోడ్డు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజల సదుపాయం కోసం ఈ రోడ్డును త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. అధికారుల్లో కదలిక తీసుకొచ్చిన 'సాక్షి'కి ముంపు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్



సాయుధ బలగం ఎవరివైపో?

శ్రీనాథ్

ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరగాలంటే రాష్ట్ర పోలీసులతో పాటు సాయుధ దళాల బందోబస్తు కూడా ఎంతో ముఖ్యం. ఆ సాయుధ బలగాల ఓట్లు కూడా అంతే ముఖ్యంగా అభ్యర్థులు భావిస్తున్నారు. అందుకే సర్వీస్ ఓటర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలలో అభ్యర్థులు వారిని ఆకర్షించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తుంటారు. ఇక ఈ ఎన్నికలలో మెజారిటీ సర్వీస్ ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపిస్తారోనన్న చర్చ కూడా సాగుతోంది.

15,406
రాష్ట్రంలో సాయుధ దళాల ఓటర్లు

సర్వీస్ ఓట్లు గ్రామీణ నియోజకవర్గాల్లోనే అత్యధికం

బహదూర్‌పుర, చార్మినార్, మలక్‌పేటలో అత్యల్పం

ఇక్కడ ఒక్కో నియోజకవర్గంలో కేవలం 9 సర్వీస్ ఓట్లే

అత్యధికంగా నిర్మల్ జిల్లాలో...

రాష్ట్రవ్యాప్తంగా 15,406 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా నిర్మల్ జిల్లాలో 930 మంది, అత్యల్పంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో 98 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. గ్రామీణ నియోజకవర్గాలలో వందల సంఖ్యలో సర్వీస్ ఓటర్లు ఉండగా.. అర్బన్ నియోజకవర్గాలలో 10 కంటే తక్కువ మంది ఓటర్లు ఉండటం గమనార్హం.

అత్యల్ప సర్వీస్ ఓటర్లు గ్రేటర్‌లోనే..

హైదరాబాద్‌లో 404 మంది, రంగారెడ్డి జిల్లాలో 592, మేడ్చల్ జిల్లాలో 732 మంది సర్వీస్ ఓటర్లున్నారు. రాష్ట్రంలో అత్యల్ప సర్వీస్ ఓటర్లు ఉన్న నియోజకవర్గాలు గ్రేటర్ హైదరాబాద్‌లోనే ఉన్నాయి. బహదూర్‌పుర, చార్మినార్, మలక్‌పేటలో ఒక్కో నియోజకవర్గాలలో కేవలం 9 మంది సర్వీస్ ఓటర్లు ఉండగా.. సనత్‌నగర్, గోషామహల్ సెగ్మెంట్లలో 10 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు.

సర్వీస్ ఓటర్లు ఎవరంటే.. భారత సాయుధ దళాలు, అస్సాం రైఫిల్స్ పారామిలటరీ దళం, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీఎఫ్, జీఆర్ఈఎఫ్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ఉద్యోగులను సర్వీస్ ఓటర్లుగా పరిగణిస్తారు. వీళ్లు పోస్టల్ బ్యాలెట్ లేదా ప్రాక్సీ ఓట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు.



ఓటు ఎలా వేస్తారంటే.. సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ సర్వీస్ ఓటరుకు పోస్టల్ బ్యాలెట్ పంపిస్తారు. ఒకవేళ సర్వీస్ ఓటరు విదేశాల్లో ఉంటే విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ద్వారా పంపిస్తారు. ఆ పేపర్ మీద మీకు నచ్చిన అభ్యర్థి పేరుకు ఎదురుగా స్పష్టమైన గుర్తును ఉంచితే ఓటు వేసినట్టు. ఒకవేళ వీరు సూచించిన గుర్తు స్పష్టంగా కనిపించకపోయినా, బ్యాలెట్ పేపర్ మీద సంతకం లేదా ఏదైనా పదాలు రాసినా ఓటు చెల్లదు. ఓటు వేసిన తర్వాత బ్యాలెట్ పేపరుతో పంపిన 'ఏ' గుర్తు ఉన్న చిన్న కవర్‌లో పెట్టి, సీల్ చేసి, రిటర్నింగ్ అధికారికి పోస్టులో పంపించాలి.

సర్వీస్ ఓటర్లు ఉన్న టాప్-5 నియోజకవర్గాలివే

నియోజకవర్గం	సర్వీస్ ఓటర్లు
బోథ్	546
ఖానాపూర్	416
నర్సంపేట	336
మంచిర్యాల	333
మహబూబ్‌నగర్	322

మహిళ సర్వీస్ ఓటరైతే..

ఉద్యోగరీత్యా ప్రస్తుతం వేరే చోట నివాసం ఉంటున్నప్పటికీ సర్వీస్ ఓటర్లు వారి స్థానిక నియోజకవర్గంలో ఓటు వేయవచ్చు. ఒకవేళ కుటుంబంతో సహా కలిసి పోస్టింగ్ చేస్తున్న ప్రాంతంలోనే నివసిస్తే గనక అక్కడే సాధారణ ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశం ఉంది. అయితే సర్వీస్ ఓటర్లుగా నమోదు చేసుకునే కుటుంబ సభ్యుల అర్హత ప్రమాణాలలో ఆసక్తికరమైన అంశం ఒకటుంది. సాధారణంగా సర్వీస్ ఓటరు భార్య, కుటుంబ సభ్యులు కూడా సంబంధిత నియోజకవర్గంలో సర్వీస్ ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చు. అయితే ఒకవేళ సర్వీస్ ఓటరు గనక మహిళ అయితే మాత్రం భర్తకు ఈ నిబంధన వర్తించదు.

మాస్టార్ తిప్పండి

ఉపాధ్యాయ ఓటర్లపై పార్టీల దృష్టి సంఘ నేతలతో మంతనాలు ● విందులు, రహస్య భేటీలు

వనం దుర్గాప్రసాద్

ఉపాధ్యాయ ఓటర్లను సానుకూలంగా మార్చుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలూ ప్రయత్నిస్తున్నాయి. అన్ని పార్టీలూ ఆయా అనుబంధ సంఘాలతో సంప్రదింపులు చేస్తున్నాయి. పరోక్ష సహకారం అందించాలని కోరుతున్నాయి. ఇటీవల ఓ పార్టీ నేత హైదరాబాద్‌లో ఓ ఉపాధ్యాయ సంఘం నేతలకు పెద్దఎత్తున విందు ఏర్పాటు చేయడం వివాదమైంది. ఈ విందు సందర్భంగా జిల్లాలవారీగా సంఘ నేతలను పరోక్ష ప్రచారంలోకి దించాలని నిర్ణయించినట్టు చర్చ జరుగుతోంది. ఇదే మాదిరి ఇప్పుడు ఇతర పార్టీలూ తమ అనుబంధ సంఘాల నేతలతో భేటీలు నిర్వహిస్తున్నాయి. ఉపాధ్యాయ ఓటర్లను ఆకట్టుకునే విధంగా ఏయే హామీలివ్వాలనే దిశగా పార్టీలు పావులు కదుపుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.05 లక్షల ప్రభుత్వ ఉపాధ్యాయులున్నారు. ఇందులో 80 వేల మంది వరకూ ఎన్నికల విధుల్లో ఉంటారు. వీళ్లంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగిస్తారు. ఉపాధ్యాయ కుటుంబాల నుంచి దాదాపు 4 లక్షల ఓట్లు ఉంటాయి. దీంతో వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పార్టీలున్నాయి.

ఓడీల తాయిలం...

ఉపాధ్యాయ సంఘాలు కొన్నేళ్లుగా ఆన్ డ్యూటీ కోసం పోరాడుతున్నాయి. గత ఏడాది ఏకంగా 14 సంఘాలకు ప్రభుత్వం ఓడీ ఇచ్చింది. కానీ గత ఏడాది డిసెంబర్‌తో పూర్తయ్యింది. అప్పట్నుంచీ దీన్ని పొడిగించకపోవడంతో పలు ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఎన్నికల సందర్భంగా నేతల వద్ద కూడా ఇదే అంశాన్ని ఉపాధ్యాయులు ప్రస్తావిస్తున్నారు. సంఘాల నేతలకు ఓడీ ఇస్తామన్న భరోసా ఉండాలని అన్ని సంఘాలు పార్టీలను కోరుతున్నాయి. ఓడీ ఇవ్వడం ద్వారా టీచర్ల సంఘ నేతలు విధులకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఎన్నికల ముందు కేవలం ఒకేఒక సంఘానికి ఓడీ లభించడం కూడా ఉపాధ్యాయ సంఘాల మధ్య భిన్న ధోరణికి కారణమైంది. ఓడీ ఇచ్చిన సంఘానికి వ్యతిరేకంగా ఓడీ రాని సంఘాలు ఏకమవ్వడాన్ని వివిధ పార్టీలు గుర్తిస్తున్నాయి. వీరిని సమన్వయం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

బదిలీలు, పదోన్నతులూ కీలకమే.. దీర్ఘకాలంగా బదిలీలు, పదోన్నతులపై టీచర్లు ఆశలు పెట్టుకున్నారు. కొత్త జిల్లాలకు ఉపాధ్యాయుల కేటాయింపులో భాగంగా 317 జీఓ అమలు చేశారు. ఇది కూడా కొంతమంది ఉపాధ్యాయుల్లో అసంతృప్తి కలిగించింది. సాధారణ బదిలీల్లో కొన్ని మార్పులుంటాయని టీచర్లు ఆశించారు. కానీ 2022లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వం భావించినా, కోర్టు స్టే ఇవ్వడంతో ఆగిపోయింది. ఈలోగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేసింది. దీంతో బదిలీలు, పదోన్నతులపై పార్టీలు స్పష్టత ఇవ్వాలని మెజారిటీ టీచర్లు కోరుతున్నారు. దీన్ని గుర్తించిన పార్టీలు ఆ దిశగా అడుగులేసేందుకు సిద్ధపడుతున్నాయి. వీలైతే ఎన్నికల ప్రచారంలో ఎక్కడో చోట దీన్ని ప్రస్తావించి, టీచర్ ఓటర్లను తమవైపు తిప్పుకోవాలని అన్ని పార్టీలూ భావిస్తున్నాయి. దీంతో పాటు ఖాళీల భర్తీ, కొత్త పోస్టుల నియామకంపై కూడా ఎన్నికల ప్రచారంలో ప్రస్తావన వచ్చే అవకాశముంది.



విందు, వినోద రాజకీయాలు మాతో వద్దు



టీచర్లకయినా వ్యక్తిగత అభిప్రాయాలుంటాయి. ఇదేమీ తప్పుకాదు. కానీ విధి నిర్వహణపై ప్రభావం చూపకూడదు. ఎన్నికలవేళ రాజకీయ పార్టీల విందులు, వినోదాలకు వెళ్లే చిల్లర రాజకీయాలు ఆమోదయోగ్యం కాదు. నాయకులే కాదు.. ఓటర్లనూ ఇది ప్రలోభ పెట్టే చర్యగానే చూడాలి. ఆదర్శవంతమైన ఉపాధ్యాయుడి పవిత్రతను అందరూ కాపాడాలి.

– చావా రవి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

వృత్తి గౌరవమే ముఖ్యం



ఉపాధ్యాయుడు బాధ్యతాయుతమైన వ్యక్తి. ఈ విషయాన్ని రాజకీయ పార్టీలు, ఉపాధ్యాయ సంఘ నేతలూ గుర్తించాలి. ఓట్ల ప్రలోభాలకు టీచర్లను లక్ష్యంగా చేయొద్దు. ఉపాధ్యాయులూ దీనికి దూరంగా ఉండాలి. వృత్తి గౌరవాన్ని భంగపరిచే చర్యలకు పాల్పడొద్దు. విందులు, వినోదాలకు దూరంగా ఉండాల్సిన బాధ్యత సంఘ నేతలకు ఉంది.

–సయ్యద్ షౌకత్ అలీ, తెలంగాణ రాష్ట్ర ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

పైసా.. వాపస్ దే!

తాండూరులో ఓ పార్టీ నుంచి అడ్వాన్స్ తీసుకుని.. మరో పార్టీలోకి జంప్ అయిన కొందరు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

ఇచ్చిన డబ్బులు వెనక్కి ఇవ్వాలంటూ ఇళ్లకు వెళ్లి హెచ్చరిస్తున్న అడ్వాన్స్ ఇచ్చిన నేతలు

బషీరాబాద్: ఎన్నికల్లో చిత్ర విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. వికారాబాద్ జిల్లా తాండూరులో ఓ ప్రధాన పార్టీ తమ సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు దసరా పండుగ సందర్భంగా రూ.3 లక్షల చొప్పున ఇస్తామని చెప్పింది. పండుగకు ముందుగానే రూ. 50 వేల చొప్పున ముట్టజెప్పింది. మిగిలిన డబ్బులు ఎన్నికలు ముగిసేలోపు రెండు దశల్లో ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే అడ్వాన్స్ (రూ. 50వేలు) పుచ్చుకున్న కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు.. తీరా ఆ తర్వాత ప్రత్యర్థి పార్టీలో చేరారు. అక్కడ కూడా రూ.3 లక్షల ఆఫర్, కొందరికి అంతకంటే ఎక్కువ ఆఫర్ రావడంతో కండువా మార్చేశారు. అయితే ఇప్పుడు మొదట అడ్వాన్స్ డబ్బులిచ్చిన పార్టీ వారు సీన్‌లోకి వచ్చేశారు. తమ వద్ద డబ్బులు తీసుకొని పార్టీ మారడంతో ఫైరయ్యారు. సదరు సర్పంచ్‌లు, నాయకుల ఇళ్లకు వెళ్లి తమ డబ్బులు వాపస్ ఇవ్వాలని హెచ్చరించారు. అయితే అవతలి పార్టీ నుంచి తమకు ఇంకా డబ్బులు అందలేదని, రాగానే తిరిగి ఇచ్చేస్తామని సదరు సర్పంచ్‌లు, నేతలు చెప్పుకొస్తున్నారు. మొత్తంగా స్థానిక ప్రజాప్రతినిధులకు రేటు కట్టి కొనుగోలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల అధికారులకు ఈ తతంగం తెలిసినా సరే.. ఫిర్యాదు అందితేనే చర్యలు తీసుకుంటామని అంటున్నారు.

బ్రాండెడ్ సెల్‌ఫోన్లను ఆస్తిగానే చూడాలట!

అఫిడవిట్‌లో పేర్కొనాలని డిమాండ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులంతా తమ ఆస్తుల వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పిస్తున్నారు. ఇందులో రూ. 5000 నుంచి రూ.వందల కోట్ల ఆస్తుల వరకు ఉంటున్నాయి. అయితే, అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యుల వద్ద ఉండే రూ.లక్షల విలువ చేసే బ్రాండెడ్ ఫోన్ల వివరాలు కూడా సమర్పించాల్సిందేనని అంటున్నారు కరీంనగర్ అసెంబ్లీకి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తోన్న ప్రొఫెసర్ పెంచల శ్రీనివాస్. ''ఈ రోజుల్లో అసెంబ్లీకి పోటీ చేసే నాయకులు, వారి కుటుంబసభ్యుల వద్ద బ్రాండెడ్ సెల్‌ఫోన్లు ఉంటున్నాయి. ప్రతీ నేత ఇంట్లో వీటి విలువ కనీసం రూ.లక్షల్లో ఉంటుంది. వీటిని మాత్రం అఫిడవిట్‌లో పెట్టకపోవడం ఎన్నికల సంఘాన్ని తప్పుదోవ పట్టించడమే'' అని ఆయన అభిప్రాయపడుతున్నారు. నామినేషన్లు వేసిన ప్రతీ అభ్యర్థి వాడే సెల్‌ఫోన్లను కూడా ఆస్తుల కింద చూపాలని కేంద్ర ఎన్నికల సంఘానికి తాను ఫిర్యాదు చేస్తానని 'సాక్షి'కి వెల్లడించారు.

యెన్నెళ్లి సురేందర్

మలివిడత తెలంగాణ ఉద్యమ కాలం నుంచి 2021వరకు ఎంతో సాన్నిహిత్యం, అనుబంధం ఉన్న సీఎం కేసీఆర్, మాజీ మంత్రి ఈటల రాజేందర్ నేడు ప్రత్యర్థులుగా పోటీ పడుతున్నారు. గజ్వేల్ గడ్డ పై మూడోసారి పోటీ చేస్తున్న కేసీఆర్ అభివృద్ధి మంత్రంతో హ్యాట్రిక్ ధీమాతో ఉండగా, ఈటల బీసీ నినాదంతో బరిలోకి దిగారు.

కేసీఆర్ : అభివృద్ధి ఎజెండా
ఈటల : బీసీ మంత్రం
నర్సారెడ్డి : లోకల్ ఫ్లేవర్



గజ్వేల్ జేజేల కోసం..

హాట్ ఫైట్

అభివృద్ధి మంత్రం.. బహుముఖ వ్యూహం

'సెంటిమెంట్'గా ఈ నియోజకవర్గాన్ని ఎంచుకొని రెండుసార్లు సీఎం పదవి చేపట్టిన కేసీఆర్ గజ్వేల్‌ను రాష్ట్రంలోనే అభివృద్ధికి నమూనాగా మలచడంలో సఫలమయ్యారు. నియోజకవర్గంలోని మర్కూక్ వద్ద కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్, కొండపాక మండలంలో మల్లన్నసాగర్ మిషన్ భగీరథ పథకం, ములుగులో హార్టికల్చర్ యూనివర్సిటీ, ఫారెస్ట్రీ యూనివర్సిటీ, గజ్వేల్–ప్రజ్ఞాపూర్‌లో రింగురోడ్డు, వంద పడకల జిల్లా ఆస్పత్రి, మరో వంద పడకలతో మాతా శిశురక్షణ ఆస్పత్రి, ఎడ్యుకేషన్ హబ్ వంటి అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరిగాయి. గజ్వేల్ గడ్డ.. కేసీఆర్ అడ్డా అంటూ బీఆర్ఎస్ శ్రేణులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా జరిగిన అభివృద్ధిని చూపిస్తూ కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు బీఆర్ఎస్ యంత్రాంగం బహుముఖ వ్యూహంతో ముందుకు సాగుతోంది. మంత్రి హరీశ్‌రావు ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ సుడిగాలి ప్రచారం చేస్తున్నారు. అన్నింటికీ మించి బూత్‌లెవల్ మేనేజ్‌మెంట్ సక్రమంగా జరిగేలా వంద ఓట్లకు ఒక ఇన్‌చార్జిని నియమించారు.

ప్రజా ఉద్యమాలకు ఊపిరి... గజ్వేల్, తూప్రాన్, మనోహరాబాద్, ములుగు, మర్కూక్, వర్గల్, జగదేవ్‌పూర్, కొండపాక, కుకునూర్‌పల్లి మండలాలతో కూడుకొని ఉన్న గజ్వేల్ నియోజకవర్గం యాదాద్రి, జనగామ, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల సరిహద్దున ఉన్నది. ప్రత్యేకించి గ్రేటర్ హైదరాబాద్‌ను ఆనుకొని ఉండటం వల్ల ఇక్కడ నగర వాతావరణం కనిపిస్తోంది. ఈ నియోజకవర్గంలో 179 పంచాయతీలున్నాయి.



నిర్వాసితులను ఆకట్టుకునే ప్రయత్నం

గజ్వేల్ అసెంబ్లీ ఎన్నికల్లో మల్లన్నసాగర్ నిర్వాసితులను తమవైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు ఆరాటపడుతున్నాయి. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణం వల్ల తొగుట మండలంలో పల్లెపహాడ్, వేములగాట్, ఏటిగడ్డ కిష్టాపూర్, లక్ష్మాపూర్, రాంపూర్, బ్రాహ్మణ బంజేరుపల్లి, కొండపాక మండలం సింగారం, ఎర్రవల్లి గ్రామాలు పూర్తిగా ముంపునకు గురైన సంగతి తెలిసిందే. ఆయా గామాల్లో 10వేలకుపైగా ఓట్లు ఉన్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, ఎన్నికల్లో తమకు మద్దతు ప్రకటిస్తే పోరాడుతామని బీజేపీ, కాంగ్రెస్ నేతలు హామీ ఇస్తున్నారు.



ఈటల ముమ్మర ప్రచారం

బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్ బీసీ నినాదం, స్థానిక సమస్యలే ఎజెండాతో ఎన్నికల బరిలో దిగారు. నియోజకవర్గంలో సుమరుగా 1.40లక్షల బీసీ ఓటర్లు ఉండగా..అందులో తన సొంత సామాజికవర్గం ముదిరాజులు 55వేల వరకు ఉంటారు. వీరిని ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు. అభివృద్ధి పేరిట 30వేల కుటుంబాలకు చెందిన భూములను లాక్కొని, సరైన నష్ట పరిహారం ఇవ్వకపోవడంతో రోడ్డున పడ్డారని చెబుతూ...వారందరికీ అండగా ఉంటామని హామీ ఇస్తున్నారు. బీఆర్ఎస్‌లో అసంతృప్తి నేతలను తనవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. 1992 నుంచి సుమారు పదేళ్లకుపైగా ఈటల ఇక్కడ పార్టీ పరిశ్రమ నిర్వహించారు.



కాంగ్రెస్ అభ్యర్థి 'లోకల్'

కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి నేను లోకల్ అంటూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తనను గెలిపిస్తే 24గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రచారం చేస్తున్నారు. ఈటల రాజేందర్ కూడా స్థానిక వ్యక్తి కాదని, ఆయన గెలిచినా ఉపయోగం ఉండదని చెబుతున్నారు.



పర్యావరణ పరిరక్షణే ప్రచార అస్త్రం

చిలుకూరు: భూమాత ప్రేమికుడిగా పేరు పొందిన సూర్యాపేట జిల్లా చిలుకూరుకు చెందిన కొల్లు లక్ష్మీనారాయణ వరుసగా మూడోసారి కోదాడ సెగ్మెంట్ నుంచి పోటీ చేస్తున్నారు. పర్యావరణ పరిపరక్షణే ధ్యేయంగా ఆయన ఇరవై ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు. తన ప్రచారంలో ఎలాంటి ఖర్చు లేకుండా సైకిల్‌పై చెట్ల కొమ్మలను కట్టుకొని వీధుల్లో తిరుగుతున్నారు. పర్యావరణాన్ని కాపాడాలని ఓటర్లను కోరుతున్నారు. అధ్యాపక వృత్తిలో కొనసాగుతూనే పర్యావరణ పరిరక్షణకు ఫైట్ చేస్తున్నాడు.

బల్దియా టు అసెంబ్లీ

గ్రేటర్ హైదరాబాద్‌లో కార్పొరేటర్ నుంచి ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా | ఇలా ఎదిగిన నేతలెందరో.. | ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోటీ



చెరుపల్లి వెంకటేశ్

కార్పొరేటర్ నుంచి ఎమ్మెల్యేలు, మంత్రులుగా ఎదిగిన వారెందరో ఉన్నారు. హైదరాబాద్ బల్దియా నుంచే ఇలా ఎదిగిన వారూ చాలామంది ఉన్నారు. కార్పొరేటర్లుగా పోటీ చేసి గెలిచినా, ఓడినా పట్టు వదలకుండా కృషి చేసి పైమెట్టు ఎక్కారు. ఎక్కువ పర్యాయాలు ఎమ్మెల్యేలుగా గెలవడంతో పాటు మంత్రులైన తలసాని శ్రీనివాస్ యాదవ్, టి.పద్మారావుగౌడ్, సి.కృష్ణయాదవ్, ముఖేశ్‌గౌడ్ తదితరులు నగరపాలకసంస్థ కార్పొరేటర్లుగా పోటీ చేసిన వారే.

ఎంసీహెచ్ నుంచే మొదలు

తొలిసారిగా చాలామంది ఎంసీహెచ్(మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్) 1986 ఎన్నికల్లో రాజకీయ అరంగేట్రం చేశారు. ఆ ఎన్నికల్లో మోండా డివిజన్ నుంచి జనతాపార్టీ అభ్యర్థిగా పోటీచేసిన తలసాని, పద్మారావు చేతిలో ఓడిపోయారు. అనంతరం తలసాని 5 పర్యాయాలు ఎమ్మెల్యే గా గెలిచి టీడీపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల్లో మంత్రిగా పలు శాఖలు నిర్వహించారు. ఇక 3 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన పద్మారావు బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగానూ, డిప్యూటీ స్పీకర్‌గా నూ పనిచేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన కృష్ణయాదవ్ టీడీపీ హయాంలో మంత్రిగానూ, ప్రభుత్వ విప్‌గానూ పనిచేశారు. మూడుసార్లు ఎమ్మెల్యే అయిన ముఖేశ్‌గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. తొలుత టీడీపీ కార్పొరేటర్‌గా ఉన్న రాజాసింగ్ బీజేపీ నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికై మూడోసారి పోటీ చేస్తున్నారు.

ఎక్కడి నుంచి ఎక్కడకు

కార్పొరేటర్(డివిజన్)	ఎమ్మెల్యే(నియోజకవర్గం)
టి.పద్మారావుగౌడ్(మోండా) :	సికింద్రాబాద్
సి.కృష్ణయాదవ్(అలియాబాద్):	హిమాయత్‌నగర్
ముఠా గోపాల్ (జవహర్‌నగర్)	ముషీరాబాద్
డి.సుధీర్‌రెడ్డి(అక్బర్‌బాగ్):	ఎల్‌బీనగర్
కాలేరు వెంకటేశ్(గోల్నాక):	అంబర్‌పేట
ముఖేశ్‌గౌడ్ (జాంబాగ్):	మహరాజ్‌గంజ్/ గోషామహల్
జాఫర్‌హుస్సేన్(టోలిచౌకి):	నాంపల్లి
రాజాసింగ్(మంగళ్‌హాట్):	గోషామహల్
పాషాఖాద్రి(దబీర్‌పురా):	చార్మినార్
ముంతాజ్ అహ్మద్‌ఖాన్ : (రియాసత్‌నగర్)	యాకుత్‌పురా

ఈ జాబితాలో ఉన్నవారిలో ముఖేశ్‌గౌడ్ మృతి చెందగా, ముంతాజ్ అహ్మద్‌ఖాన్, పాషాఖాద్రి మినహా మిగతా వారంతా ప్రస్తుత ఎన్నికల్లోనూ ఆయా పార్టీల నుంచి ఆయా నియోజకవర్గాలకు పోటీ చేస్తున్నారు.

ఓటమి నుంచి గెలుపు..

దోమలగూడ, జవహర్‌నగర్ నుంచి కార్పొరేటర్లుగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ జి.సాయన్న, డా.కె.లక్ష్మణ్ తర్వాతి కాలంలో ఎమ్మెల్యేలుగా గెలిచారు. వీరిలో సాయన్న ఐదు పర్యాయాలు, లక్ష్మణ్ రెండుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారు. లక్ష్మణ్ ప్రస్తుతం రాజ్యసభ సభ్యునిగా కొనసాగుతున్నారు. సాయన్న మరణానంతరం ప్రస్తుతం ఆయన కుమార్తె లాస్య నందిత తండ్రి ప్రాతినిధ్యం వహించిన కంటోన్మెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్నారు. మూసారాంబాగ్ కార్పొరేటర్‌గా ఓడిపోయిన తీగల కృష్ణారెడ్డి 2002లో జరిగిన ప్రత్యక్ష ఎన్నికల్లో మేయర్‌గా గెలిచారు. ఆ తర్వాత మహేశ్వరం నియోజకవర్గం నుంచి 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

సీన్ రివర్స్

- మోండా డివిజన్‌కు పోటీ చేసిన పద్మారావు చేతిలో శ్రీనివాస్‌యాదవ్ కార్పొరేటర్‌గా ఒకసారి, సికింద్రాబాద్ నుంచి శాసనసభ ఎన్నికల్లో ఒకసారి ఓడిపోగా, శ్రీనివాస్‌యాదవ్ చేతిలో ఎమ్మెల్యే ఎన్నికల్లో పద్మారావు ఒకసారి ఓడిపోయారు.
- జవహర్‌నగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా గోపాల్ చేతిలో ఓటమిపాలైన లక్ష్మణ్, ముషీరాబాద్‌లో 2014లో గోపాల్‌పై ఎమ్మెల్యేగా గెలిచారు. తిరిగి 2018లో గోపాల్ గెలవగా లక్ష్మణ్ ఓడారు.

పార్టీ అధ్యక్షులుగానూ

కార్పొరేటర్లుగా పోటీ చేయడం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలైన శ్రీనివాస్‌యాదవ్, కృష్ణయాదవ్, సాయన్న, ముఠా గోపాల్ హైదరాబాద్ జిల్లా టీడీపీ అధ్యక్షులుగానూ పనిచేశారు. పద్మారావు టీఆర్ఎస్ గ్రేటర్ అధ్యక్షుడిగా పనిచేశారు. లక్ష్మణ్ బీజేపీ జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు.

ఎంపీలుగానూ..

ఎంఐఎం వ్యవస్థాపకుడు సలావుద్దీన్ ఒవైసీ సైతం కార్పొరేటర్ నుంచి ఎంపీ స్థాయికి ఎదిగారు. బంజారాహిల్స్ కార్పొరేటర్‌గా చేసిన రేణుకాచౌదరి ఎంపీగా, కేంద్రమంత్రిగానూ పనిచేశారు. ఇలా బల్దియా నుంచి రాజకీయప్రస్థానం ప్రారంభించి తదనంతరం గెలిచినవారు, ఓడిన వారు ఇంకా ఎందరో ఉన్నారు. పలువురు వివిధ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లుగానూ పనిచేశారు. కృష్ణారెడ్డి, సుధీర్ రెడ్డి హుడా చైర్మన్లుగానూ వ్యవహరించారు.

పోటీలో సిట్టింగ్ కార్పొరేటర్లు

ప్రస్తుతం బల్దియా సిట్టింగ్ కార్పొరేటర్లలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జగదీశ్వర్‌గౌడ్ శేరిలింగంపల్లి నుంచి, విజయారెడ్డి ఖైరతాబాద్ నుంచి శాసనసభకు పోటీ చేస్తున్నారు. తోకల శ్రీనివాసరెడ్డి(బీజేపీ) రాజేంద్రనగర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. శాస్త్రిపురం కార్పొరేటర్‌గా ఉన్న మహ్మద్ మోబిన్ బహదూర్‌పురా నుంచి ఎంఐఎం అభ్యర్థిగా బరిలో ఉన్నారు. షేక్‌పేట కార్పొరేటర్ రాషెద్ ఫరాజుద్దీన్ జూబ్లీహిల్స్ సెగ్మెంట్ నుంచి పోటీ చేస్తున్నారు.

మాజీలు సైతం..

మాజీ కార్పొరేటర్ పరమేశ్వర్‌రెడ్డి ఉప్పల్ నుంచి కాంగ్రెస్ తరఫున బరిలో ఉన్నారు. ఎంఐఎం మాజీ కార్పొరేటర్ బి.రవియాదవ్ రాజేంద్రనగర్ నుంచి పోటీ చేస్తున్నారు.

ఈ ఎన్నికల్లో...

మాజీ మేయర్లు, డిప్యూటీ మేయర్ కూడా

జీహెచ్ఎంసీ మేయర్లుగా పనిచేసిన జుల్ఫికర్ అలీ, మాజిద్‌హుస్సేన్ ఎంఐఎం అభ్యర్థులుగా చార్మినార్, నాంపల్లి నియోజకవర్గాల నుంచి ప్రస్తుతం పోటీ చేస్తున్నారు. డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన జాఫర్ హుస్సేన్ ఇప్పటికే రెండు పర్యాయాలు నాంపల్లి ఎమ్మెల్యేగా చేసి మూడోసారి యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి బరిలో నిలిచారు. వీరిలో జుల్ఫికర్‌అలీ, మాజిద్ హుస్సేన్‌లు మేయర్ల పదవీకాలం ముగిశాక సైతం తిరిగి కార్పొరేటర్లుగానూ పనిచేశారు. మాజిద్ ప్రస్తుతం సిట్టింగ్ కార్పొరేటర్‌గా కూడా ఉన్నారు.

- తలసాని శ్రీనివాస్‌యాదవ్ సనత్‌నగర్ నుంచి పోటీ చేస్తున్నారు.
- సుధీర్‌రెడ్డి ఎల్‌బీనగర్ నుంచి రెండుపర్యాయాలు గెలిచి మళ్లీ బరిలో ఉన్నారు.
- ముఠాగోపాల్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉండి, తిరిగి పోటీ చేస్తున్నారు.
- పద్మారావు సికింద్రాబాద్‌లో మూడుసార్లు గెలిచారు. మళ్లీ బరిలో నిలిచారు.
- హిమాయత్‌నగర్ నియోజకవర్గంగా ఉన్నప్పుడు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కృష్ణయాదవ్ రూపాంతరం చెందిన అంబర్‌పేట నియోజకవర్గం నుంచి ప్రస్తుతం బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

మనమంతా పొలిటికల్ జాతిరత్నాలం!

సినిమాలో...
''తిన్నవా?''
''ఆ... తిన్న...నువ్వు?''
''నేనూ తిన్న... మీ ఇంట్ల ఏం కూర?''
''తమాట పప్పు..ఇప్పుడు మీ గడియారంల టైమెంతయ్యింది?''
''మా తాన పదకొండున్నరయ్యింది''
''అరె... మాతన ఇంకా పదకొండు ఇరవై యయ్యిదే !!''

సినిమాలోని 'జాతిరత్నాలు' ఇలా మాట్లాడుకుంటుంటారు కదా. బయట కూడా ఈ ఎలక్షన్ సీజనంతా ఓటర్లంతా ఇంచుమించు ఇదే తరహాలో మాట్లాడుకుంటూ ఉంటారు.
''అవ్... మీకాడ ఎవరొస్తున్రు?''
''మాకాడ బీఆర్ఎస్ జోరుగున్నది. మల్ల మీ కాడ?''
''మాకాడ కాంగ్రెస్ ఊపుమీదున్నది గని... బీఆర్ఎస్‌ను కొట్టలేస్తరా ఎవరన్న?''
''హంగొస్తదా?''
''హంగొచ్చిందంటే బీఆర్ఎస్ గెలిసినట్టేనాయ్''

సినిమాల మాటలతోని కామెడీ అనిపిస్తదేమోగానీ..ఈ ఎలక్షన్ సీజన్‌ల అది కామెడీ కాదు..ఎవరేందో తెలుస్తది. ఎవరి అవాకులూ, చెవాకులూ, బలాలూ, బలహీనతలూ, కవర్ చేయనీకి మేకపోతులూ...గాంభీర్యాలూ ఇయన్నీ ఉంటయ్.

మొదట ఇట్లాంటి లైట్ లైట్ సంభాషణతోనే మొదలైతది. తర్వాత్తర్వాత కొంచెం కొంచెం లోపలికి వెళ్తరు. చిన్నగ క్లారిటీ వస్తది. తర్వాత అభిప్రాయ పరికల్పన జరుగుతది. ఆ ఎమ్మట్నే ఎవరికి ఓటేస్తె మంచిదో ఒక నిర్ణయం జరుగుతది. ఇదో అంచెలంచెల ప్రక్రియ.

ఈ యాంగిల్ల చూస్తె..జనాలందరూ జాతిరత్నాలే. సేమ్‌టుసేమ్..ఇట్లనే మాట్లాడుకుంటరు. మనం సినిమాలల్ల మాటలు చూసి ఓన్లీ కామెడీ అనుకుంటం. బయట కూడా ఉబుసుపోని కబుర్లు అనుకుంటం. కానీ ఇక్కడిది సీరి'యస్'. ఎందుకంటే యోగిపేట శ్రీనాథ్ అనేటోడు ఒకడు... 'జాబు సంపాయిస్త, కంపెనీ ట్యాగు మెళ్ల ఏసుకుంట'..అనుకుంట యోగిపేట నుంచి వస్తడు. ఇంకోడు రైసు పెట్టి..కడుపుల ఆకలి గుర్‌గుర్‌లు కుక్కర్ సీటీల లెక్క కొడుతుంటే..బీఆర్ఎస్ వాళ్లు ఇచ్చే నాలుగొందల సిలిండరు కోసమో, కాంగ్రెస్ ఇచ్చే ఐదొందల గ్యాసు కోసమో వెయిట్ చేస్తూ..వెయిట్ తగ్గుతుంటడు.

కానీ నాయకుల మాటల్లోని తెలిసేదేందంటే..వాళ్ల ఇంటర్వ్యూలతోనీ, వాళ్ల స్పీచ్‌లతోనీ, రోడ్‌షోల వాళ్ల ప్రసంగాలతోనీ తెలిసేదేంటంటె.. వాళ్లెప్పుడూ కరెక్టే అన్నట్టు మాట్లాడతరు. ఎవరైనా ఏదైన అడిగితే అడిగినోడిదే తప్పన్నట్టు అదరగొడతరు. వాళ్లు చేసేదే రైటు. కావాలంటే..ఆ తప్పును ఎదుటి పార్టీవాళ్ల మీదికి నెడతారే తప్ప..వాళ్లదే తప్పూ ఉండదు..అది బీఆర్ఎస్ అయినా, కాంగ్రెస్, కమ్యూనిస్ట్, బీజేపీ, మరింకే పార్టీ అయినప్పటికీ ఇదే ధోరణి.

అందుకే చివరకు ఓటరే అంటడు...
''తప్పు నా నుంచే అయ్యిందంటే ఎల్లిపోతరా..ఈడికెల్నుంచీ..'' అంటడు.

ఊకె పోకుండ..పోతపోత వాడు ఓటేసి పోతడు. గెలిసినోడికి తప్ప మిగతా అందరికీ ఓటరుగాడు పెంటపెంట చేసి పొయ్యిండనిపిస్తంది. ఎట్లకేలకు జాతిరత్నాల్లాంటి మనమందరమూ క్లైమాక్స్‌ల చెప్పుకోవాల్సిన రత్నం లాంటి సూక్తీ, తెలిసే సత్యం ఏమిటంటే...

ఓటో ఓటరు రక్షితహ!

దీని అర్థం... ఓటరేసే ఓటు ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తది. ఆ ప్రజాస్వామ్యమే మల్ల ఓటర్ని కాపాడతది. బస్ అంతే.



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

2.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

సాక్షి, న్యూఢిల్లీ: రాజస్తాన్ అసెంబ్లీకి ఈ నెల 25న జరగనున్న ఎన్నికలకు బీజేపీ గురువారం మేనిఫెస్టోను విడుదల చేసింది. ఉజ్వల పథకం లబ్ధిదారులకిచ్చే వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.450 చొప్పున సబ్సిడీ, వచ్చే అయిదేళ్లలో 2.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, పీఎం కిసాన్ యోజన కింద రైతులకిచ్చే ఆర్థిక సాయం పెంపు వంటివి ఇందులో ఉన్నాయి. ఈ మేరకు మేనిఫెస్టో 'సంకల్ప పత్ర'ను బీజేపీ చీఫ్ జేపీ నడ్డా గురువారం జైపూర్‌లో జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ప్రశ్నపత్రాల లీకేజీతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణాలపై దర్యాప్తునకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తుందని కూడా ఈ సందర్భంగా నడ్డా ప్రకటించారు.



గురువారం జైపూర్‌లో పార్టీ మేనిఫెస్టో విడుదల చేస్తున్న జేపీ నడ్డా, మాజీ సీఎం వసుంధరా రాజె, కేంద్ర మంత్రి షెకావత్

పీఎం కిసాన్ యోజన ఆర్థిక సాయం పెంపు

- 'ఉజ్వల'గ్యాస్ సిలిండర్‌పై రూ.450 సబ్సిడీ
- రాజస్తాన్ ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ హామీలు
- విడుదల చేసిన ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా

సంకల్ప పత్రలోని మరికొన్ని హామీలు..

- గోధుమలను కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు బోనస్‌తో కలిపి క్వింటాలుకు రూ.2,700 చొప్పున కొనుగోలు.
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ఆర్థిక సాయం ఏడాదికి రూ.6 వేల నుంచి రూ.12 వేలకు పెంపు.
- ఈస్టర్న్ రాజస్తాన్ కెనాల్ ప్రాజెక్టు(ఈఆర్‌సీపీ)ను కేంద్రం సాయంతో నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయడం. ఈ ప్రాజెక్టుతో 13 జిల్లాలకు తాగు, సాగునీటి సమస్య తీరుతుంది.

మహిళలు, బాలికల కోసం...

- జిల్లాకో మహిళా పోలీస్ స్టేషన్. ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళా డెస్క్..ప్రతి నగరంలో యాంటీ రోమియో స్క్వాడ్‌ల ఏర్పాటు.
- లాడో ప్రోత్సాహన్ యోజన కింద పుట్టిన ప్రతి బాలిక పేరిట రూ.2 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్.
- లక్పతి దీదీ పథకం ద్వారా ఆరు లక్షల మంది గ్రామీణ మహిళలకు నైపుణ్య శిక్షణ.
- 12వ తరగతి పూర్తి చేసుకున్న ప్రతిభావంతులైన బాలికలకు స్కూటీల పంపిణీ.
- పేద కుటుంబాల బాలికలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య.
- రాష్ట్రంలో మూడు మహిళా బెటాలియన్ల ఏర్పాటు.
- పీఎం మాతృ వందన్ పథకం కింద అందించే ఆర్థిక సాయం రూ.5 వేల నుంచి 8 వేలకు పెంపు.

యువత కోసం..

- వచ్చే అయిదేళ్లలో 2.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ
- పేద కుటుంబాల విద్యార్థులు పుస్తకాలు, దుస్తులు కొనుక్కునేందుకు ఏటా రూ.12 వేలు పంపిణీ.
- ప్రతి డివిజన్‌లో రాజస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రాజస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఏర్పాటు.

ఆరోగ్యరంగంలో..

- భామాషా హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ ద్వారా ఆరోగ్య రంగంపై రూ.40 వేల కోట్ల పెట్టుబడి
- కొత్తగా 15 వేల మంది వైద్యులు, 20 వేల పారామెడికల్ సిబ్బంది నియామకం.

వీటితోపాటు 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, జైపూర్ మెట్రో విస్తరణ, పారదర్శక బదిలీ విధానం, పేద కుటుంబాలకు ఉచిత రేషన్, దివ్యాంగులకు రూ.1,500 పింఛను, వృద్ధాప్య పింఛను పెంపు వంటివి ఉన్నాయి. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 350 బిలియన్ డాలర్లకు పెంచుతామని వాగ్దానం చేసింది. జైపూర్, ఉదయ్‌పూర్, కోటా, అజ్మీర్, జోధ్‌పూర్, బికనీర్‌లను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేయడాన్ని కూడా మేనిఫెస్టో పేర్కొంది. ఓబీసీలకు నిర్ణీత వ్యవధిలో ధ్రువీకరణ పత్రాల జారీ, వారికి రూ.15 వరకు విద్యారుణం. ప్రత్యేకంగా వెల్ఫేర్ బోర్డు. ఇవి కాకుండా, ఎస్సీ,ఎస్టీలు, గిరిజనులు, వీధి వ్యాపారులు, గిగ్ వర్కర్లు, ఆటో డ్రైవర్లకు సంక్షేమ పథకాలు కూడా ఉన్నాయి.

81 స్థానాలకు మహిళా అభ్యర్థులు కరువు

- రాజస్తాన్ ఎన్నికల బరిలో తగ్గిన మహిళల సంఖ్య
- కేవలం 183 మందికి మాత్రమే అవకాశం
- వీరిలో బీజేపీ నుంచి 20 మంది, కాంగ్రెస్ తరఫున 28 మంది

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్, బీజేపీ ఈసారి రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు పెద్ద సంఖ్యలో టికెట్లివ్వలేదు. నారీ శక్తి వందన్ చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించినప్పుడు కాంగ్రెస్ సహా ఇతర పార్టీలు మద్దతిచ్చాయి. సీట్ల కేటాయింపులో మాత్రం ఆ స్ఫూర్తి ప్రతిఫలించలేదు. ఈ నెల 25న పోలింగ్ ప్రక్రియకు సిద్ధమైన రాజస్తాన్‌లోని 81 స్థానాల్లో ఒక్క మహిళా అభ్యర్థి కూడా బరిలో లేరని గణాంకాలు చెబుతున్నాయి.


రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 200 స్థానాలకు గాను మొత్తం 1,875 మంది అభ్యర్థులు బరిలో ఉండగా వారిలో 1,692 మంది పురుషులు, 183 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ 28 (14%) మంది మహిళా అభ్యర్థులను నిలబెట్టగా, బీజేపీ 20 (10%) మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దింపింది. కాగా 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 189 మంది మహిళా అభ్యర్థులు పోటీ చేయగా 24 మంది విజయం సాధించారు. ఈసారి బరిలో బీజేపీకి చెందిన ప్రముఖ మహిళా అభ్యర్థులలో మాజీ సీఎం వసుంధర రాజే సింధియా, బికనీర్ ఎమ్మెల్యే సిద్ధి కుమారి, మాజీ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అనితా భాదేల్, రాజ్‌సమంద్ ఎమ్మెల్యే దీప్తి మహేశ్వరి, రాజ్‌సమంద్ ఎంపీ దియా కుమారి ఉన్నారు. కాగా, కాంగ్రెస్‌లో మాల్వీయా నగర్ నుంచి అర్చన శర్మ, చోము నుంచి శిఖా మీల్ బరాలా, ప్రస్తుత మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి మమతా భూపేష్, కామా నుంచి జాహిదాలకు ఉన్నారు. ఈ మహిళా అభ్యర్థులలో ఎక్కువ మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు కాగా... అల్వార్‌లోని రామ్‌గఢ్ జిల్లా నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సఫియా జుబేర్ స్థానంలో ఆమె భర్త జుబేర్ అహ్మద్‌కు కాంగ్రెస్ టిక్కెట్ ఇచ్చింది.

జంగ్ తెలంగాణ ఓట్ల పంచతంత్రం

ఎవరి ధీమా వారిదే!

ఆసక్తికరంగా ఛత్తీస్‌గఢ్ పోరు ● గెలుపు తమదేనంటున్న కాంగ్రెస్, బీజేపీ ● హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారం


కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీగా తలపడ్డ ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల పోరు తుది దశకు చేరింది. రెండో, చివరి దశలో 70 స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరగనుంది. రైతు అనుకూల ప్రభుత్వమనే ముద్రతో అధికారం నిలుపుకుంటామని కాంగ్రెస్ ధీమాగా ఉంది. వరి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు అనేకానేక సంక్షేమ పథకాలు తమకు శ్రీరామరక్ష అని సీఎం భూపేశ్ బఘేల్ అంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు సీఎం, మంత్రులపై అవినీతి ఆరోపణలు తమకు కలిసొస్తాయని బీజేపీ భావిస్తోంది. ఎన్నికల ప్రచారం కోసం దుబాయ్ బెట్టింగ్ యాప్ నుంచి 508 కోట్ల దాకా ముడుపులు అందుకున్నారంటూ బఘేల్‌పై వచ్చిన ఆరోపణలు ఓటర్లపై గట్టి ప్రభావం చూపుతాయని ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో గత మూడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఓసారి చూస్తే...



పార్టీ	సీట్లు	ఓట్లు	ఓట్ల శాతం
బీజేపీ	50	4,333,934	40.3
కాంగ్రెస్	38	4,150,377	38.6
బీఎస్పీ	2	656,210	6.1
ఎన్సీపీ	0	56,257	0.5
ఇతరులు	0	1,548,409	14.4

2008


అసెంబ్లీ ఎన్నికల వేడి మొదలైన తొలినాళ్లలో అధికార బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటాపోటీ నడిచింది. కానీ పోలింగ్ సమీపించే కొద్దీ పరిస్థితి బీజేపీకి అనుకూలంగా మారుతూ వచ్చింది. ముఖ్యంగా సీఎం రమణ్‌సింగ్ మిస్టర్ క్లీన్ ఇమేజీ ఆ పార్టీకి బాగా కలిసొచ్చింది. దాంతో ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించింది. 50 స్థానాలు సాధించి అధికారం నిలుపుకుంది. ఇటు బస్తర్ మొదలుకుని అటు సర్గుజా దాకా మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలన్నింట్లోనూ బీజేపీ హవా సాగింది. అక్కడి 26 స్థానాలకు గాను ఆ పార్టీ ఏకంగా 23 చోట్ల నెగ్గింది! ప్రజల్లో బాగా ఆదరణ ఉన్న కాంగ్రెస్ నాయకుడు అజిత్ జోగి సుడిగాలి ప్రచారం చేసినా లాభం లేకపోయింది. ఆ పార్టీ చివరికి 38 సీట్లతో సరిపెట్టుకుంది. దానికి పోలైన ఓట్లు కూడా 38 శాతమే కావడం విశేషం. బీజేపీ 40 శాతం ఓట్లు సాధించింది. బీఎస్పీ రెండు సీట్లు నెగ్గింది.



పార్టీ	సీట్లు	ఓట్లు	ఓట్ల శాతం
బీజేపీ	49	5,365,272	41.0
కాంగ్రెస్	39	5,267,698	40.3
బీఎస్పీ	1	558,424	4.3
ఇతరులు	1	1,843,315	14.1
ఎన్సీపీ	0	39,124	0.3

2013

ముఖ్యమంత్రిగా రమణ్‌సింగ్ హ్యాట్రిక్ కొట్టారు. 2003 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఆయన విజయ పథంలో నడిపి తొలిసారి సీఎం అయ్యారు. అప్పట్నుంచీ 15 ఏళ్లపాటు రాష్ట్రంలో ఆయన హవా సాగింది. రమణ్ పరిపాలనా శైలి కాంగ్రెస్ నేతల నుంచి కూడా ప్రశంసలు అందుకోవడం విశేషం! 2008 ఎన్నికల విజయం తర్వాత ఆయన అమలు చేసిన ఆహార భద్రత పథకం ఛత్తీస్‌గఢ్‌లో 60 శాతం మంది కనీసావసరాలు తీర్చింది. దాంతో ప్రజలు మరోసారి రమణ్ పాలనకే ఓటేశారు. బీజేపీకి 49 సీట్లు రాగా కాంగ్రెస్‌కు 39 స్థానాలొచ్చాయి. మొత్తమ్మీద బీజేపీకి 41 శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 40 శాతం పోలయ్యాయి. బీఎస్పీకి ఒక స్థానం దక్కింది.



పార్టీ	సీట్లు	ఓట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	68	6,143,176	43.0
బీజేపీ	15	4,706,188	33.0
ఇతరులు	5	2,843,700	19.9
బీఎస్పీ	2	552,313	3.9
ఎన్సీపీ	0	28,983	0.2

2018

సుదీర్ఘంగా అధికారంలో ఉండటంతో ప్రభుత్వ వ్యతిరేకత బీజేపీకి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బాగా ప్రతికూలంగా మారింది. దీనికి తోడు రైతు రుణ మాఫీని పాక్షికంగా అమలు చేసి చేతులెత్తేయడం కూడా రమణ్‌సింగ్ సర్కారుకు బాగా ప్రతికూలంగా మారింది. మార్పుకు పట్టం కట్టండంటూ కాంగ్రెస్ చేసిన ప్రచారానికి జనం జై కొట్టారు. దాంతో హస్తం పార్టీ 68 సీట్లతో ఘన విజయం సాధించింది. బీజేపీ కంచుకోటలైన సర్గుజా వంటి ప్రాంతాల్లో కాంగ్రెస్ ఏకంగా క్లీన్‌స్వీప్ చేయడం విశేషం! దాంతో 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ సరిగ్గా 15 సీట్లకు పరిమితమై ఘోర పరాజయం మూటగట్టుకుంది. కాంగ్రెస్ ఏకంగా 43 శాతం ఓట్లు కొల్లగొట్టగా బీజేపీ కేవలం 33 శాతంతో ఘోరంగా చతికిలపడింది. ఇక బీఎస్పీ మరోసారి రెండు స్థానాలతో రాష్ట్రంలో ఉనికి నిలుపుకుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 17 । నవంబర్ । 2023

30 ప్లస్సే కీలకం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు గెలిచేందుకు 30–39 ఏళ్ల మధ్య వయసున్న వారి ఓట్లే కీలకంగా మారనున్నాయి. జిల్లాలో మొత్తం ఓటర్లు 45,36,852 మంది. వీరిలో 13,87,744 మంది 30–39 ఏళ్ల మధ్య వయసు వారే ఉండటం గమనార్హం. అంటే 30.58 శాతం ఓటర్లు ఈ ఏజ్ గ్రూప్‌లోని వారే. వీరిలో ఎక్కువమంది ఎవరికి ఓట్లు వేస్తే వారు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉండనున్నాయి. 30–39 ఏజ్ గ్రూప్‌లో లక్ష మంది కంటే ఎక్కువ ఓటర్లున్న నియోజకవర్గాల్లో నాంపల్లి, కార్వాన్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా నియోజకవర్గాలు ఉన్నాయి.

నవయువ ఓటర్లకు నవరేటు

ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ప్రత్యేక పోలింగ్ బూత్



లాలాపేట: ఓటింగ్ శాతాన్ని పెంచాలనే లక్ష్యంతో ఎన్నికల సంఘం అనేక సంస్కరణలు, నూతన పద్ధతులు అవలంబిస్తోంది. ఇందులో భాగంగానే కొత్తగా ఓటు హక్కు పొందిన నవయువ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేక పోలింగ్ బూత్‌లను 'స్పెషల్ థీమాటిక్ పోలింగ్ స్టేషన్' పేరుతో ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ క్రమంలోనే సికింద్రాబాద్ నియోజకవర్గంలో మొత్తం 224 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని 210వ బూత్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు 750కి పైగా ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. తొలిసారి ఓటు హక్కు పొందిన యువత పోలింగ్ కేంద్రానికి వెళ్లగానే అయోమయానికి గురికాకుండా అక్కడ నియమించిన రిసెప్షనిస్టులు ఆహ్వానం పలుకుతూ గైడ్ చేస్తారు. అక్కడ విధుల్లో ఉండే యువ అధికారులు వారికి ఏ క్యూలో వెళ్లాలి, ఏ విధంగా ఓటు వేయాలనే అంశాలను వివరించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేస్తారు. ఇక్కడి వచ్చే యువ ఓటర్లను ఆకర్షించేలా ఓటు ప్రాముఖ్యతను తెలిపే బ్యానర్లు, పోస్టర్లతో అలకరిస్తారు.

ఒకే పేరు.. గుర్తే వేరు!

ఎన్నికలు జరిగినప్పుడల్లా ఒకే పేరు కలిగిన వేర్వేరు అభ్యర్థులు పోటీ చేయడం పరిపాటి. ఈసారి గ్రేటర్‌లో కొన్ని నియోజకవర్గాల్లో అలాంటి సమస్య ఉంది. ఎన్నికల ప్రచారం సంగతి ఎలా ఉన్నా ఓటు వేయడానికి వెళ్లినప్పుడు ఒకే పేరుతో ఇద్దరు ఉండడంతో ప్రధాన పార్టీ అభ్యర్థులు మల్లగుల్లాలు పడుతుంటారు. అలా ఒకే పేరు కలిగిన అభ్యర్థులు పోటీ పడుతున్న నియోజకవర్గాల్లో కొన్ని గ్రేటర్ పరిధిలో ఉన్నాయి. ఎల్బీనగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో పాటు స్వతంత్ర అభ్యర్థులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, డి.సుధీర్ రెడ్డిలు తలపడుతున్నారు. గోషామహల్‌లో వ్యాస్‌ల బెడద నెలకొంది. బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ కాగా శుభం వ్యాస్, సందీప్ వ్యాస్‌లు స్వతంత్ర అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఉప్పల్ నుంచి బండారి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి కాగా ఏడీఆర్ పార్టీ అభ్యర్థిగా మన్నె లక్ష్మారెడ్డి బరిలో ఉన్నారు. ముషీరాబాద్‌లో ముఠా గోపాల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలవగా.. ఎం. గోపాల్ ఏఐహెచ్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అలాగే.. సనత్‌నగర్‌లో తలసాని శ్రీనివాస్ యాదవ్ బీఆర్ఎస్ అభ్యర్థి కాగా ఉప్పలపాటి శ్రీనివాస్ యుగ తులసి అభ్యర్థిగా బరిలో నిలిచారు. రాజేంద్రనగర్‌లో తోకల శ్రీనివాస్ రెడ్డి బీజేపీ అభ్యర్థి కాగా కె. శ్రీనివాస్ రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ పడుతున్నారు. ఇబ్రహీంపట్నం నుంచి మంచిరెడ్డి కిషన్ రెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి కాగా కె.కిషన్ రెడ్డి ఏడీఆర్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మహేశ్వరంలో కాంగ్రెస్ అభ్యర్థిగా కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కాగా అదే పేరుతో ఉన్న కె. లక్ష్మారెడ్డి జన శంఖారావం పార్టీ అభ్యర్థిగా.. ఇదే నియోజకవర్గం నుంచి మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి కాగా ఎం. సబిత స్వతంత్ర అభ్యర్థిగా తలపడుతుండటం గమనార్హం.

– లక్డీకాపూల్/చైతన్యపురి

మేడ్చల్ గులాబీకి షాక్

కాంగ్రెస్‌లోకి ఐదుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న కార్పొరేటర్లు

బోడుప్పల్: బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరి మంత్రి చామకూర మల్లారెడ్డికి షాకిచ్చారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో గురువారం వీరు హస్తం గూటికి చేరారు. వీరిలో బింగి జంగయ్య యాదవ్, దానగల్ల అనిత, జడిగె మహేందర్ యాదవ్, రాసాల వెంకటేశ్ యాదవ్, గుర్రాల రమా ఉన్నారు. నిన్నా మొన్నటి దాకా మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్లు ఒక్కసారిగా కాంగ్రెస్ కండువా కప్పుకోవడం ఊహించని పరిణామం. వీరి చేరికతో మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలం మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా.. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన రాజకీయ పలుకుబడి, చతురతతో బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డిని దెబ్బతీసేలా పావులు కదుపుతున్నారు. తన పాత మిత్రులైన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, కార్యకర్తలు, నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ గెలుపు కోసం ఆయన వ్యూహాలు రచిస్తున్నారు.

ఆర్థిక వ్యవస్థను పరిరక్షిద్దాం: ఎఫ్‌డీఆర్

సాక్షి, సిటీబ్యూరో: ఆర్థిక వ్యవస్థ పరిరక్షణకు ఆలోచించి ఓటు వేయాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) పిలుపునిచ్చింది. మూడు సినిమా టీజర్లను లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ గురువారం రామానాయుడు ఫిల్మ్ స్టూడియోలో విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ డీజీపీ ఆంజనేయరెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర ప్రసాద్, దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.

ఓటేయడం.. గొప్ప అవకాశం



సెలబ్రిటీ కామెంట్

సికింద్రాబాద్‌లో పుట్టి పెరిగిన నేను చిన్నప్పటి నుంచీ ఎన్నికల సందడిని ఆసక్తిగానే గమనించేవాణ్ని. నాకు గత ఎన్నికల్లోనే తొలిసారి ఓటు హక్కు వచ్చింది. ఓటేయడం అద్భుతంగా అనిపించింది. రాష్ట్రం తలరాతను మనమే నిర్ణయిస్తున్నంత ఫీల్. ఎన్నికల్లో ఓటు వేయడం మనకు అందివచ్చే ఒక గొప్ప అవకాశం. మొదటి నుంచీ రాజకీయాలను, నేతలను దగ్గర నుంచీ పరిశీలిస్తూ ఒక అభిప్రాయానికి వచ్చి ఉంటే చాలా చాలా గుడ్. కానీ అంత తీరిక అందరికీ ఉంటుందా అనేది సందేహమే. ఐదేళ్లూ మన చుట్టూ ఏం జరుగుతుందో మనం అంతగా పట్టించుకున్నా పట్టించుకోకపోయినా. పోలింగ్‌కు కొన్ని రోజుల ముందైనా సరే ఒక్కసారి మన చుట్టూ జరిగిన మంచీ చెడూ బేరీజు వేసుకుని మేనిఫెస్టోల్ని విశ్లేషించుకుని ఓటు తప్పకుండా వేయడం అవసరం. గెలుపోటముల గురించి పక్కన పెట్టేద్దాం. పోలింగ్ రోజున ఓటు మాత్రం తప్పకుండా వేద్దాం.

– కార్తీక్, సినీనటుడు, కేరాఫ్ కంచరపాలెం ఫేం

● గులాబీ జోష్







కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ అభ్యర్థులు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్‌లకు మద్దతుగా గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కారు గుర్తుకు ఓటేసి అభివృద్ధికి పట్టం కట్టాలని ఓటర్లను కేటీఆర్ కోరారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు నుంచి ఎక్కడికి వెళ్లినా మెట్రో, ఫ్లైఓవర్లే కనిపిస్తాయన్నారు. ఐటీ కంపెనీలతోనే నగర ప్రజల బతుకులు బాగుంటాయన్నారు. ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ ఫలాలను అందించామన్నారు. మంత్రి పర్యటన గులాబీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది.








ఎక్సలెన్స్.. ఎక్సలెంట్

జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ ప్రాంగణంలో గురువారం 'సాక్షి' ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమధుర ఆర్ట్స్ అకాడమీ నృత్య రూపకం తదితర సంగీత సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఈవీఎం ఇలా..



- హైదరాబాద్ జిల్లాలో 4 నియోజకవర్గాలకు సింగిల్ బ్యాలెట్ యూనిట్లే
- మిగతా 11 నియోజకవర్గాలకు రెండేసి చొప్పున..
- సనత్‌నగర్ నియోజకవర్గానికి నోటా కోసమే మరో యూనిట్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను కేవలం నాలుగింటిలోనే ఈవీఎంలలో సింగిల్ బ్యాలెట్ యూనిట్లను వినియోగించనున్నారు. మిగతా 11 నియోజకవర్గాలకు రెండేసి బ్యాలెట్ యూనిట్లను వినియోగించనున్నారు. కారణమేమంటే.. ఆయా నియోజకవర్గాల్లో 15 మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉండటమే. ఒక్కో బ్యాలెట్ యూనిట్‌లో ఓటు వేసేందుకు 15 మంది అభ్యర్థుల వరకు, నోటాకు మొత్తం 16 బటన్లు ఉంటాయి. అభ్యర్థులు 15 మంది కాని, అంతకంటే తక్కువ కాని ఉంటే ఒకే బ్యాలెట్ యూనిట్ సరిపోతుంది. పోటీలో ఉండే అభ్యర్థులు 16 మంది ఉంటే అదనపు బ్యాలెట్ యూనిట్ వినియోగం తప్పనిసరి అని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

సింగిల్ యూనిట్ నియోజకవర్గాలు..

కంటోన్మెంట్ 10 మంది, బహదూర్‌పురాలో 12, చార్మినార్, చాంద్రాయణగుట్ట 14 మంది చొప్పున అభ్యర్థులున్నందున ఆయా నియోజకవర్గాలకు ఒకే బ్యాలెట్ యూనిట్ సరిపోతుంది.

డబుల్ యూనిట్ నియోజకవర్గాలు

ముషీరాబాద్ 31 మంది, మలక్‌పేట 27, అంబర్‌పేట 20, ఖైరతాబాద్ 25, జూబ్లీహిల్స్ 19, సనత్‌నగర్ 16, నాంపల్లి 34, కార్వాన్ 18, గోషామహల్ 21, యాకుత్‌పురా 27, సికింద్రాబాద్ 24 మంది అభ్యర్థులుండటంతో ఈ నియోజకవర్గాల్లో రెండేసి బ్యాలెట్ యూనిట్లను వినియోగించనున్నారు.

సనత్‌నగర్‌లో నోటా కోసమే..

సనత్ నగర్ నియోజకవర్గంలో 16 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అంటే ఒక బ్యాలెట్ యూనిట్‌లోనే అభ్యర్థులందరి పేర్లు వస్తాయి. కేవలం నోటా కోసమే మరో బ్యాలెట్ యూనిట్‌ను వినియోగించాల్సిన పరిస్థితి ఈ నియోజకవర్గంలో ఏర్పడింది. నోటాను అభ్యర్థులందరి పేర్ల తర్వాత చివరన ఉంచుతారు.

ఎల్బీనగర్ నియోజకవర్గంలో అత్యధికంగా 48 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇక్కడ మొత్తం 570 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఒక్కో పోలింగ్ కేంద్రంలో మూడు యూనిట్ల చొప్పున ఏర్పాటు చేయనున్నారు. ఇబ్రహీంపట్నంలో 28 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇక్కడ 319 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఒక్కో కేంద్రంలో రెండు యూనిట్ల చొప్పున చేయాల్సి వస్తోంది. మహేశ్వరంలో 27 మంది పోటీ పడుతున్నారు. ఇక్కడ మొత్తం 511 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో రెండు చొప్పున యూనిట్లు ఏర్పాటు చేయాల్సి వస్తుంది. అదే విధంగా రాజేంద్రనగర్‌లో 25 మంది అభ్యర్థులు పోటీపడుతుండగా, 355 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఒక్కో కేంద్రంలో రెండు చొప్పున యూనిట్లు సిద్ధం చేయాల్సి ఉంది. మల్కాజిగిరిలో 33 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, ఒక్కో పోలింగ్ కేంద్రంలో మూడు యూనిట్ల చొప్పున ఏర్పాటు చేయాల్సి వస్తుంది. ఉప్పల్‌లో 32 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇక్కడ కూడా రెండు యూనిట్ల చొప్పున ఏర్పా టు చేయాల్సి వస్తుంది. మేడ్చల్‌లో 22 మంది, కూకట్‌పల్లిలో 24 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, ఇక్కడ ఒక్కో పోలింగ్ కేంద్రంలో రెండు యూనిట్ల చొప్పున ఏర్పాటు చేయాల్సి వస్తుంది.

డబుల్ గుబుల్

ఎలక్షన్ ఎజెండా..

అందని ద్రాక్షగానే డబుల్ బెడ్రూం ఇళ్లు

- కుటుంబాలు లక్షల్లో.. ఇచ్చింది వేలల్లో
- నగరానికి మరో లక్ష గృహాలిస్తామని బీఆర్ఎస్
- ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తామన్న కాంగ్రెస్
- రెండు ప్రధాన పార్టీల హామీలతో సొంత గూటిపై పేదల ఆశలు



సాక్షి, సిటీబ్యూరో: విశ్వనగరిగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లో పేదల సొంతింటి కల పూర్తిస్థాయిలో సాకారం అవుతుందా? అప్పుడెప్పుడో ఎన్నికల సమయంలో పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించి ఇంటి తాళాలు చేతిలో పెడ్తామన్న బీఆర్ఎస్ సర్కారు హామీ కొద్ది కుటుంబాలకే పరిమితం చేసింది. తొమ్మిదేళ్లలో తొమ్మిది శాతం కుటుంబాలకు కూడా సొంత ఇళ్ల కల నెరవేరలేదు. తాజాగా ప్రధాన రాజకీయ పక్షాలు ఎన్నికల హామీతో నిరుపేదల కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం నగరంలో మరో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తామని పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించింది. మరోవైపు గృహలక్ష్మి పథకాన్ని కూడా కొనసాగిస్తామని పేర్కొంది. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలు, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల జాగా అందిస్తామని మేనిఫెస్టోలో వెల్లడించింది. ఈ రెండు ప్రధాన పార్టీల హామీలతో నిరుపేదల ఆశలు చిగురించనున్నాయి.

ఇదీ పరిస్థితి..

బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం నగరంలోని దాదాపు 111 ప్రాంతాల్లో ఒక లక్ష డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో పాత ఇళ్లు తొలగించిన (ఇన్ సీటు) 40 ప్రాంతాల్లో 8,898 గృహాలు, 71 ఖాళీ స్థలాల్లో 91,102 గృహాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించి పనులు చేపట్టింది. రెండు నెలల క్రితం నాటికి అతికష్టమ్మీద 68,176 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసింది. మిగతా 38 ప్రాంతాల్లో వివిధ దశల్లో ఉన్నాయి. రెండు లొకేషన్లలో 2,026 గృహాల నిర్మాణాలు వివిధ కారణాలతో నిలిచిపోయాయి.

లక్షల్లో దరఖాస్తులు.. వేలల్లో ఇళ్లు

- గ్రేటర్ పరిధిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం పేద కుటుంబాల నుంచి లక్షల్లో దరఖాస్తులు వచ్చినా.. అతి కొద్ది కుటుంబాలకు మాత్రమే ఇళ్ల కల సాకారమైంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో అర్బన్ నియోజకవర్గాలకు చెందిన దాదాపు పది లక్షల కుటుంబాలు డబుల్ బెడ్రూం ఇళ్లపై ఆశలతో దరఖాస్తు చేసుకున్నాయి. ఇందులో మీ–సేవ ఆన్‌లైన్ ద్వారా సుమారు 7.09 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకోగా, ఆఫ్‌లైన్ (నేరుగా)లో మూడు లక్షల వరకు కుటుంబాలు కలెక్టరేట్ ఆఫీసుల్లో దరఖాస్తులు చేసుకున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.
- ఎన్నికల నేపథ్యంలో సర్కారు ఆదేశాలతో అధికారులు కేవలం ఆన్‌లైన్ దరఖాస్తులపై దృష్టి సారించి హడావుడిగా ప్రాథమిక పరిశీలన నిర్వహించి సగం వరకు తిరస్కరించారు. మిగిలిన సుమారు 3.60 లక్షల దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకొని క్షేత్రస్థాయి విచారణకు ఆదేశించారు. రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ బృందాలు రంగంలోకి దిగి దాదాపు 1.60 లక్షల దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేశాయి. మరో రెండు లక్షల దరఖాస్తుల విచారణను పెండింగ్‌లో పడేశారు.

గ్రేటర్ పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిస్థితి ఇలా..


మొదటి విడత నిర్మాణ లక్ష్యం: లక్ష	
నిర్మాణ పనులు పూర్తి	68,176
ఇన్‌సీటు	5,660
దరఖాస్తులు	7.09 లక్షలు
ప్రాథమిక అర్హత సాధించిన దరఖాస్తులు	3.60 లక్షలు
క్షేత్రస్థాయి విచారణ	1.60 లక్షలు
ర్యాండమైజేషన్ డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక	61,784

67,444 కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్లు

మహానగర పరిధిలోని హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాలు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని నాలుగు అర్బన్ నియోజక వర్గాలు, రంగారెడ్డి జిల్లాలోని ఐదు అర్బన్ నియోజకవర్గాలకు చెందిన సుమారు 67, 444 నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్లు లభించాయి. అందులో పాత గృహాలు కోల్పోయిన సుమారు 5,666 కుటుంబాలకు పాత స్థలాల్లోనే, అసలు ఇళ్లు లేని దరఖాస్తు చేసుకున్న 61,784 కుటుంబాలకు శివారు ప్రాంతాల్లో సొంతింటి కల నెరవేరింది. ఎన్నికల నోటిఫికేషన్‌ముందు హడావుడిగా ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ పద్ధతిలో తొలి విడతలో 11,700, రెండో విడతలో 13,200, మూడో విడతలో 36,884 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి నగర శివారులోని 9 ప్రాంతాల్లో ఇళ్లను కేటాయించారు.

హైటెక్ పార్టీలు!

- జోరుగా పుట్టిన రోజు వేడుకలు
- సన్మానాల్లో వేడుకల జోష్
- డివిజన్ నాయకులకే బాధ్యతలు
- ఏరులై పారుతున్న మద్యం



కర్మన్‌ఘాట్‌కు చెందిన ఓ కార్మిక సంఘం నాయకుడికి చంపాపేట్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో బుధవారం సాయంత్రం సన్మానించారు. వందలాదిమంది 'అభిమానులు' తరలివచ్చారు. సదరు నాయకుడికి ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు ఏర్పాటు చేశారో ఆ 'అభిమానులె'వ్వరికీ తెలియదు. కానీ అంతా వేదిక వెనుక చేరిపోయారు. దావత్ మరింత ఘనంగా జరిగింది. ఖరీదైన మద్యం బాటిళ్లు తెరుచుకున్నాయి. మటన్ బిర్యానీలు, చికెన్ బిర్యానీలు ఘుమఘుమలాడాయి. అభిమానులు తాగేంత తాగారు. తినగలిగినంతా తిని వెళ్లిపోయారు. వాళ్లకందరికీ అందాల్సి సందేశాలు మొబైల్ ఫోన్‌లో ఆ రోజు సాయంత్రానికే చేరాయి. ఆ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలకు చెందిన చాలామంది 'అభిమానులతో' రాత్రి 12 గంటల వరకు సందడి కొనసాగింది. ఒక కర్మన్‌ఘాట్‌లోనే కాదు ఎన్నికల వేళ నగరంలోని అన్ని డివిజన్‌లలోనూ ఈ తరహా 'పార్టీలు' జోరుగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే దావత్‌లలో నేరుగా పాల్గొనలేని అభ్యర్థులు తమ అనుచరులకు, డివిజన్ నాయకులకు ఆ బాధ్యతలను అప్పగిస్తున్నారు. దీంతో వివిధ కాలనీలకు చెందిన ప్రముఖుల బర్త్‌డే పార్టీలు, సన్మానాలు 'భారీ'గా జరుగుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో ఇప్పుడు ఇదో నయాట్రెండ్‌గా కొనసాగుతోంది.

– సాక్షి, సిటీబ్యూరో

'ఆత్మీయ' పలకరింపులు..

ఎన్నికల ప్రచారం మొదలైనప్పటి నుంచి అన్ని ప్రధాన పార్టీలు ఓటర్లను ఆకట్టుకొనేందుకు వివిధ రకాలుగా వ్యూహాత్మకంగా తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి. ఎన్నికలకు మరో 14 రోజులే గడువు ఉండడంతో అన్ని పార్టీలు జోరును పెంచాయి. ఎక్కడికక్కడ కార్నర్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలతో ప్రచారాన్ని హీటెక్కిస్తున్నాయి. పరిశ్రమలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పని చేసే అసంఘటిత రంగానికి చెందిన కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, సీనియర్ సిటిజన్ సంఘాలు, మహిళాసంఘాలు, దివ్యాంగుల సంఘాలతో విడివిడిగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల వరకు వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఆత్మీయసమ్మేళనాలను ఏర్పాటు చేస్తున్నారు.

- కేడర్‌ను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా ఆత్మీయ సమ్మేళనాలు దోహదం చేస్తున్నాయి. పార్టీ నాయకత్వంపై అలక వహించిన వారిని, కొంతకాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నవారిని, అనుమానాస్పదంగా ఉన్న కార్యకర్తలు, నాయకులను తమవైపు తిప్పుకొనేందుకు అభ్యర్థులు ఆత్మీయ సమ్మేళనాల పేరుతో బుజ్జగింపులకు దిగారు. అదేసమయంలో ప్రతిపక్షాల్లోని అసంతృప్త నాయకులు, కార్యకర్తలను కూడా తమవైపు మళ్లించేందుకు ఈ సమ్మేళనాలు ఫలితాలనిస్తున్నాయి. ఇవి ఎక్కువగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకే జరుగుతున్నాయి. అభ్యర్థులు, నాయకుల ప్రసంగాలు, కేడర్ నుంచి వచ్చే వినతులతో సభలు సాగుతున్నాయి. మధ్యాహ్న భోజనంఅనంతరం సమ్మేళనాలు ముగుస్తున్నాయి. ఒక విధంగా ఇవి ఆయా పార్టీలు తమ కేడర్‌ను బలోపేతం చేసుకొనేందుకు ఏర్పాటు చేసే సమావేశాలు మాత్రమే. కానీ ఇప్పుడు సమ్మేళనాలతో పాటు దావత్‌లు జోరుగా సాగుతున్నాయి.

వేడుక మీది.. వేదిక మాది..

సాధారణంగా ఇళ్లలో కుటుంబసభ్యుల సమక్షంలో, స్నేహితుల సమక్షంలో చేసుకొనే పుట్టిన రోజు వేడుకలు ఎన్నికల వేళ ఫంక్షన్ హాళ్లకు వచ్చి చేరాయి. పుట్టిన రోజు చేసుకొనే వ్యక్తి ఏ కాలనీ సంఘానికో లేదా బస్తీ సంఘానికో నాయకుడైతే చాలు వేడుకలు ఘనంగా జరిగిపోతున్నాయి. అపార్ట్‌మెంట్ సంఘాలకు చెందిన ప్రతినిధులు, వాకర్స్ అసోసియేషన్‌లకు చెందిన నాయకులు, వివిధ కమ్యూనిటీలకు ప్రాతినిధ్యం వహించే నాయకులకు సైతం వేడుకలు ఘనంగా జరిగిపోతున్నాయి. ఏకంగా ఫంక్షన్ హాళ్లను బుక్ చేసి 'దావత్'లను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా వేడుకలను ఏర్పాటు చేయడంలో డివిజన్ నాయకులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. అభ్యర్థులు స్వయంగా పాల్గొంటే ఎన్నికల పరిశీలకులకు చిక్కే ప్రమాదం ఉన్న దృష్ట్యా ఆ బాధ్యతలను డివిజన్ స్థాయి నాయకులకు అప్పగించినట్లు సమాచారం.

సరిహద్దు రాష్ట్రాల నుంచి..

మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నప్పటికీ అన్ని చోట్ల ఇలాంటి 'పార్టీ'ల పేరిట మద్యం ఏరులై పారుతోంది. స్థానిక వైన్ షాపుల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర సరిహద్దు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున మద్యాన్ని తరలిస్తున్నారు. ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే 'పార్టీ'ల్లో మద్యం ఏరులై పారుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తెలంగాణ అభివృద్ధి ఘనత మాదే..

కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు గెలుపు ఖాయం

- ఎన్నికల ప్రచార సభలో మంత్రి కేటీఆర్‌


గొట్టిముక్కల పద్మారావుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్‌, చిత్రంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో మరోసారి మాధవరం కృష్ణారావు గెలుపొందడం ఖాయమని మంత్రి కేటీఆర్‌ అన్నారు. గురువారం ఆయన నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ వచ్చాక తొమ్మిదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్‌ పార్టీ ఎనలేని అభివృద్ధికి శ్రీకారం చుట్టిందన్నారు. తాము చేసిన అభివృద్ధి, గత 65 సంవత్సరాలుగా పరిపాలించిన వారు కూడా చేయలేదన్నారు. ఇది ప్రజలకు తెలుసన్నారు. హైదరాబాద్‌ మహానగరం ప్రశాంతంగా ఉందన్నారు. ఇక్కడ స్థిరపడ్డ ఏ బిడ్డ అయినా ఏ ప్రాంతం వ్యక్తి అయినా, ఆంధ్రా, రాయలసీమ, కర్ణాటక, తమిళనాడు నుంచి వచ్చిన ఎవరైనా వారు మా బిడ్డలే, వారు తెలంగాణ బిడ్డలే..వారిని కంటికి రెప్పలా చూసుకుంటామన్నారు. ఈ విషయం సీఎం కేసీఆర్‌ 10 సంవత్సరాల క్రితమే చెప్పటం జరిగిందన్నారు.

రజనీకాంత్‌ ఆశ్చర్యం వ్యక్తం చేశారు..

దేశంలోని అందరూ మన తెలంగాణ వైపు చూసే విధంగా అభివృద్ధి చేశామన్నారు. చెన్నై నుంచి రజనీకాంత్‌ వచ్చి ఇక్కడ కట్టిన ఫ్లైఓవర్లు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారన్నారు. అక్కడి నుంచి వచ్చిన రజనీకి కనిపించింది కానీ, ఇక్కడ ప్రతిపక్షంలో ఉన్న గజనీలకు అభివృద్ధి అర్థం కావటం లేదన్నారు. కూకట్‌పల్లి హౌసింగ్‌ బోర్డు నుంచి ఎక్కడికైనా వెళ్తే మీకు మెట్రో, ఫ్లై ఓవర్లు కనిపిస్తాయన్నారు. మోదీ ప్రభుత్వం గ్యాస్‌ ధరను రూ.1200కు పెంచిందన్నారు. ఆడబిడ్డల కష్టాలు తీర్చేందుకు కేసీఆర్‌ రూ.400కే సిలిండర్‌ ఇవ్వటానికి హామీ ఇచ్చారన్నారు. రేషన్‌ బియ్యంగా దొడ్డు బియ్యం స్థానంలో సన్నబియ్యం ఇస్తామని, అన్నపూర్ణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. అదే విధంగా విద్యార్థులకు ఉదయం టిఫిన్‌, మధ్యాహ్నం సన్న బియ్యంతో భోజనం పెడుతున్నామన్నారు. తొమ్మిదేళ్ల మా అభివృద్ధి, గతంలో ప్రతిపక్షాలు పరిపాలించినప్పుడు ఉన్న అభివృద్ధి..కరెంటు కష్టాల్ని పోల్చుకుని ప్రజలు ఓటేయాలన్నారు. హైదరాబాద్‌ బాగుండాలంటే కేసీఆర్‌ ప్రభుత్వమే ఉండాలన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆరు నెలలకు ఒక సీఎం వస్తాడన్నారు. పలు సంక్షేమ పథకాలు అందించి ప్రజల బాగు కోరిన బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికి ప్రజలు ఓటు వేయాలని కోరారు. కూకట్‌పల్లిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన మాధవరం కృష్ణారావుకు ఓటు వేసి మరోసారి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌కు కేపీహెచ్‌బీ డివిజన్‌ కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావు, బాలాజీనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ శిరీష, పార్టీలోకి విచ్చేస్తున్న గొట్టిముక్కల పద్మారావులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని కేటీఆర్‌ పేర్కొన్నారు. అలాగే ప్రచారానికి కొద్దిగా ఆలస్యంగా వచ్చానని, ప్రజలు మన్నించాలని కోరారు.

మూడోసారి సీఎంగా కేసీఆర్‌ ఖాయం

కుత్బుల్లాపూర్‌ రోడ్‌ షోలో మంత్రి కేటీఆర్‌

చింతల్‌/సుభాష్‌నగర్‌: తెలంగాణకు బ్రహ్మాండమైన సీఎం కేసీఆర్‌ ఉన్నారని, ఆయనకు ఎదురే లేదని తెలంగాణ ఐటీ, పురపాలక శాఖా మంత్రి కేటీఆర్‌ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద రోడ్‌ షోలో మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌ రెడ్డి అదే విధంగా కాంగ్రెస్‌ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొలన్‌ హన్మంత్‌రెడ్డిలపై నిప్పులు చెరిగారు. మనందరికీ కేసీఆర్‌ మూడోసారి కూడా ముఖ్యమంత్రిగా ఉంటారని, మనందరికీ మంచి జరుగుతుందని అన్నారు. కేసీఆర్‌ నాయకత్వంలో 9 సంవత్సరాలలో ఏ ఒక్కరోజు కూడా కులాల, మధ్య మతాల మధ్య చిచ్చు పెట్టలేదని, ప్రాంతాల పేరు మీద పంచాయతీలు అంతకన్నా పెట్టలేదని అన్నారు. కడుపు నిండా సంక్షేమం, కళ్ల ముందే అభివృద్ధి కన్పిస్తోందన్నారు. బాలా నగర్‌ చౌరస్తానే కాదు ఏ గల్లీకి వెళ్లినా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే కన్పిస్తున్నాయన్నారు. కొత్త రోడ్లు, 24 గంటలు నీళ్లు, నిరంతరం కరెంటు, పరిశ్రమల ఊపుతో అన్నిచోట్లా సమానమైన అభివృద్ధి ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. శాంతి భద్రతల విషయంలో ఏ ఒక్కరిపైనా ఈగ వాలకుండా తెలంగాణ ప్రభుత్వం కృషి చేసిందని పేర్కొన్నారు. మౌలిక వసతులు బాగా ఉన్నందునే హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి కంపెనీలు ఇక్కడికి అనేకం వచ్చాయన్నారు. తెలంగాణలో స్థిరమైన నాయకత్వం, దమ్మున్న లీడర్‌ సీఎంగా ఉన్నందునే ఈరోజు పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, సంపద పెరుగుతుందని, సంపదను సంక్షేమ రూపంలో పేదలకు అందిస్తున్నామని మంత్రి కేటీఆర్‌ చెప్పారు. కుత్బుల్లాపూర్‌లో కరెంటు, నీళ్లు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక వసతుల సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గం నుంచి మరోసారి వివేకానందను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆయన గెలిస్తేనే ఇక్కడ అభివృద్ధి మరింత సాధ్యమవుతుందన్నారు. గతంలో మాదిరిగానే బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని కోరారు. కాంగ్రెస్‌ పాలన వస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఈ రోడ్‌ షోలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి, ఎమ్మెల్యే వివేకానంద్‌, ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌ ప్రజలను ఉత్సాహ పరుస్తూ బీఆర్‌ఎస్‌ చేసిన పనుల్ని వారి చేతనే చెప్పించారు.


రోడ్‌ షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్‌, చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద్‌, ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు

20 శాతం రిజర్వు సిబ్బంది

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ హోళికేరి
- పోలింగ్‌ సిబ్బందితో కలెక్టరేట్‌లో సమీక్ష

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ భారతి హోళికేరి ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో పోలింగ్‌ సిబ్బందితో రెండో విడత ర్యాండమైజేషన్‌ ప్రక్రియ నిర్వహించారు. ఈ ప్రక్రియను సాధారణ పరిశీలకులు,ఐఏఎస్‌ చంద్రకాంత్‌ కృష్ణారావు, ఐఏఎస్‌లు.. రామ్‌కుమార్‌,శిల్పగుప్తాపర్యవేక్షించారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్‌ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్‌, సహాయ ప్రిసైడింగ్‌ అధికారులను, ఓపీఓలను ర్యాండమైజేషన్‌ ద్వారా కేటాయించారు. ఇప్పటికే వీరికి పలు విడతలుగా ఎంపిక చేసిన కేంద్రాల్లో మాస్టర్‌ ట్రైనర్స్‌చే పోలింగ్‌ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించామని కలెక్టర్‌ వివరించారు. అదే విధంగా జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 3,369 పోలింగ్‌ కేంద్రాలుండగా.. పోలింగ్‌ విధుల కోసం సిబ్బందిని నియమించినట్లు..దీంతో పాటు 20శాతం రిజర్వు సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. పోలింగ్‌ కేంద్రాలకు కేటాయించిన బృందంలో ప్రిసైడింగ్‌, సహాయ ప్రిసైడింగ్‌ అధికారితో పాటు పోలీసు సిబ్బంది కూడా ఉంటారని, ప్రతి నియోజకవర్గం పరిధిలో పోలింగ్‌ నిర్వహణ కోసం ప్రత్యేకంగా 5 పోలింగ్‌ కేంద్రాల చొప్పున.. మహిళా బృందం, ఒక దివ్యాంగుల బృందం, యువతతో కూడిన పోలింగ్‌ బృందాలను ఎంపికచేశామన్నారు. అనంతరం మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్‌ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి, నోడల్‌అధికారి రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్‌ హోళికేరీ

టీపీసీసీ ప్రచార కమిటీ కో ఆర్డినేటర్‌గా వజీర్‌ ప్రకాశ్‌గౌడ్‌

నాగోలు: తెలంగాణ కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కో ఆర్డినేటర్‌గా కొత్తపేటకు చెందిన జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ ఫ్లోర్‌ లీడర్‌ వజీర్‌ ప్రకాష్‌ గౌడ్‌ను నియమిస్తూ గురువారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీ గౌడ్‌ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వజీర్‌ ప్రకాష్‌గౌడ్‌ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీని బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఎల్‌బీనగర్‌ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఎల్‌బీనగర్‌ కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్‌ పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు జక్కిడి ప్రభాకర్‌ రెడ్డి, భూపతి రెడ్డి నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌, చరణ్‌ కౌశిక్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.


వజీర్‌ ప్రకాష్‌గౌడ్‌కు నియామక పత్రం అందజేస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీ గౌడ్‌

అక్రమ కేసులు పెట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్‌ ఫిర్యాదు

చార్మినార్‌: చార్మినార్‌ శాసనసభ నియోజకవర్గం నుంచి టికెట్‌ ఆశిస్తూ దరఖాస్తు చేయడమే కాకుండా నామినేషన్‌ దాఖలు చేసిన తమ పార్టీ నాయకుడు షహబాజ్‌ఖాన్‌పై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసిన పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని ఏఐసీసీ సభ్యులు, టీపీసీసీ సీనియర్‌ ఉపాధ్యక్షులు జి.నిరంజన్‌ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. చార్మినార్‌ శాసనసభ నియోజకవర్గం నుంచి తన నామినేషన్‌ ఉపసంహరణ కోసం మొగల్‌పురాలోని చార్మినార్‌ రిటర్నింగ్‌ అధికారి కార్యాలయానికి వచ్చిన షహబాజ్‌ ఖాన్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారన్నారు. పాతబస్తీ ఫతేదర్వాజకు చెందిన షహబాజ్‌ ఖాన్‌ పై శాలిబండ పోలీసులు తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. 2018లో జరిగిన ల్యాండ్‌ గ్రాబింగ్‌పై ఈ నెల 15న కేసులు నమోదు చేసినట్లు చెబుతున్న పోలీసులు..ఎవరు ఎక్కడ ఎలాంటి ఫిర్యాదులు చేయనప్పటికీ..అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంపై వెంటనే స్పందించి సంబంధిత పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర ఎన్నికల కమిషనర్‌ను కోరారు.

అక్రమంగా పార్కింగ్‌ ఫీజు వసూలు.. రూ.50 వేలు పెనాల్టీ

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌ సీటీసీ మాల్‌లో నిబంధనలకు విరుద్ధంగా వాహనానికి పార్కింగ్‌ ఫీజు వసూలు చేసినందుకు పార్కింగ్‌ ఏజెన్సీకి జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం విభాగం రూ.50 వేల పెనాల్టీ విధించింది. ఈ మేరకు ఈ–చలానా జారీ చేసింది. నగర పౌరుని నుంచి అందిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన ఈవీడీఎంలోని సీఈసీ విభాగం అక్రమ వసూలు నిర్ధారించడంతో పెనాల్టీ విధించింది.

కార్మికుల మధ్య ఘర్షణ.. ఒకరి మృతి

మణికొండ: పనిచేస్తున్న ప్రదేశంలో ఇద్దరు కార్మికుల మధ్య చెలరేగిన వివాదం హత్యకు దారితీసింది. తలపై ఇనుప రాడ్‌తో కొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కోకాపేటలో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పశ్చిమబెంగాల్‌కు చెందిన నయన్‌ పహారియా(24), రూబెల్‌ షేక్‌లు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ప్రెస్టీజ్‌ నిర్మాణ సంస్థలో కార్మికులుగా పనిచేస్తున్నారు. ప్రతి రోజు మాదిరిగానే గురువారం ఇద్దరూ 10వ అంతస్తులో పనిచేస్తున్నారు. అదే క్రమంలో వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగి వివాదంగా మారింది. ఈ క్రమంలో రూబెల్‌ షేక్‌ పక్కనే ఉన్న రాడ్‌తో నయన్‌ పహారియాను తలపై బలంగా కొట్టగా..తల పగిలి తీవ్ర రక్తస్రావం అయి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు 100కు ఫోన్‌ చేసి విషయం చెప్పటంతో విషయం నార్సింగి పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా కోటి దీపోత్సవం

- హాజరైన ఆంధ్రప్రదేశ్‌, హర్యానా గవర్నర్లు అబ్దుల్‌ నజీర్‌, బండారు దత్తాత్రేయ


గవర్నర్లు అబ్దుల్‌ నజీర్‌, బండారు దత్తాత్రేయలకు జ్ఞాపికను అందచేస్తున్న దృశ్యం

కవాడిగూడ: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఇందిరాపార్కు ఎన్‌టీఆర్‌ స్టేడియంలో తలపెట్టిన కోటి దీపోత్సవం మూడవ రోజు గురువారం రాత్రి అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌, హర్యానా గవర్నర్లు అబ్దుల్‌ నజీర్‌, బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు. నగరం నలుమూలల నుంచి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. శ్రీ చంద్రశేఖర శివాచార్య మహాస్వామి (కాశీ జగద్గురు), శ్రీసచ్చిదానంద సరస్వతి స్వామి (తపోవనం, తుని) అనుగ్రహ భాషణం చేయగా డాక్టర్‌ ఎస్‌.అనంతలక్ష్మి ప్రవచనామృతం వినిపించారు. ప్రధాన వేదికపై కంచి కామాక్షికి కోటి పుసుపు కొమ్ముల సుమంగళి పూజ, భక్తులచే కామాక్షి అమ్మవారికి కోటి పుసుపు కొమ్ముల అర్చన నిర్వహించారు.

తప్పుల తడక.. ఎప్పటికీ మారదిక!

సాక్షి, సిటీబ్యూరో: ఎన్ని సంస్కరణలు తెచ్చినా..ఎన్నిమార్లు సవరణలు చేసినా..ఎంత మంది ఫిర్యాదులు చేసినా ఓటరు లిస్టులో మాత్రం తప్పుల్ని నివారించలేకపోతున్నారు. ప్రతిసారీ తప్పుల తడకగానే దర్శనమిస్తోంది. గ్రేటర్‌ పరిధిలోని ఏ నియోజకవర్గం ఓటరు లిస్టు చూసినా కళ్లు బైర్లుకమ్మే విషయాలే బయటపడుతున్నాయి. ఎన్నో ఏళ్ల క్రితం మరణించిన వారి పేర్లు కూడా ఇప్పటికీ ఓటరు లిస్టులో యథాతథంగా ఉన్నాయి. అంతే కాదు ఒక నియోజకవర్గంలోని వ్యక్తికి రెండు మూడు బూత్‌లలో ఓటు హక్కు ఉంది. ఇక ఇంటి నెంబర్లు అన్నీ తప్పుల తడకగానే ఉన్నాయి. ఎంతో మంది ఇళ్లు మారినా..ఓటు మారలేదు. ఒక వ్యక్తి ఓటు అతడు నివసిస్తున్న నియోజకవర్గంలోనే ఉండాలి. అలా కాకుండా పలు నియోజకవర్గాల్లో వేర్వేరు ఇంటి నంబర్లతో అదే ఫోటోతో నమోదై ఉండడం గమనార్హం. ఓటరు నమోదు ప్రక్రియ, ఓటరు లిస్టు సవరణలు నిర్వహించిన బూత్‌ లెవల్‌ అధికారి నుంచి ఎఈఆర్‌ఓ, ఈఆర్‌ఓ, సూపర్‌వైజర్లు నిర్లక్ష్యంగా..బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించడం వల్లే ఇలా ఓటరు లిస్టులో పొరపాట్లు చోటుచేసుకున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఓటరు లిస్టులో పొరపాట్లు ఎన్నో...

- తప్పుగా ఇంటి నెంబర్లు.. డూప్లికేట్‌ ఓట్లు
- చనిపోయిన వారి పేర్లు సైతం తొలగించని వైనం
- అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే తీరు..

ఓటరు లిస్టులో తప్పులు కొన్ని మచ్చుకు పరిశీలిస్తే...

- నాంపల్లి నియోజకవర్గంలో వార్డు నంబర్‌ 12, సర్కిల్‌ నంబర్‌ 7లో పోలింగ్‌ బూత్‌ నంబర్‌ 16, సీరియల్‌ నంబర్‌ 152, ఇంటి నంబర్‌ 10-1-1148లో నివసించే నబీ షరీఫ్‌ ఫిబ్రవరి 27వ తేదీ 2018లో మరణించారు. మార్చి 3వ తేదీన జీహెచ్‌ఎంసీ వారు ఆయన మరణ ధృవీకరణ ప్రతం కూడా జారీ చేశారు. అయినా ఇతని పేరు..ఫోటో ఇంకా ఓటరు లిస్టులో ఉంది.
- నాంపల్లి నియోజకవర్గంలోని బూత్‌ నంబర్‌ 16, సీరియల్‌ నంబర్‌ 555, ఇంటి నంబర్‌10-1-1183లో నివసించే రఫత్‌ ఉన్నీసా బేగం 2008, సెప్టెంబర్‌ 11వ తేదీన మరణించారు. ఆమె మరణించినట్లు జీహెచ్‌ఎంసీ ధృవీకరణ పత్రం కూడా జారీ చేసింది. అయినా ఇంకా ఓటరు లిస్టులో పేరు నమోదై ఉంది. అంటే గత పదేళ్లుగా ఓటరు లిస్టు నుంచి ఆమె పేరు తీసివేయలేదంటే సిబ్బంది పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.
- నాంపల్లి నియోజకవర్గంలోని ఇంటి నంబర్‌11-1-889లో గంగారామ్‌ గత 40 ఏళ్లుగా నివసిస్తున్నారు. ఇతని ఇంట్లో లేని వారి పేర్లు కూడా ఓటరు లిస్టులో ఉన్నాయి. ఇదే ఇంటి నంబర్‌పై ఇతర మతస్తుల ఓట్లు కూడా నమోదై ఉన్నాయని గంగారామ్‌ కుమారుడు సన్నీ యాదవ్‌ 'సాక్షి'తో వాపోయారు. ఈ విషయాన్ని పలుసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ ఇంటి నంబర్‌పై ఐదుగురు ఇతర మతస్తుల ఓట్లు నమోదై ఉన్నాయని చెప్పారు.
- కార్వాన్‌ నియోజకవర్గం..ఇంటి నంబర్‌ 9-4-84/44/302, పోలింగ్‌ బూత్‌ నంబర్‌ 158, సీరియల్‌ నంబర్‌ 1044లో ఓటరుగా నమోదు అయి ఉన్న సురేష్‌ పబ్బోజు..అదే ఫోటో, అదే పేరుతో నాంపల్లి నియోజకవర్గంలో ఇంటి నంబర్‌ 12-2-720/4,5, పోలింగ్‌బూత్‌ నంబర్‌ 217, సీరియల్‌ నంబర్‌ 1373 ఓటరు లిస్టులో కూడా నమోదై ఉన్నాడు. ఇతనికి రెండు నియోజకవర్గాల్లో ఓటు ఉన్నా ఎవ్వరూ గుర్తించలేదు.
- ఇక నాంపల్లి నియోజకవర్గంలోని ఇంటి నంబర్‌ 10-2-317/76లో నివసిస్తున్న ఎస్‌.మంజుల ఓటు పోలింగ్‌ బూత్‌ నంబర్‌ 28, సీరియల్‌ నంబర్‌ 645గా ఓటరు లిస్టులో నమోదై ఉంది. ఇదే మంజుల ఫోటోతో పోలింగ్‌ బూత్‌ నంబర్‌ 25, సీరియల్‌ నంబర్‌ 630లో కలీమాబేగం పేరుతో డూప్లికేట్‌ ఓటు ఉంది. దీన్ని కూడా ఎవరూ గుర్తించలేకపోయారు.
- ఇలా గ్రేటర్‌ వ్యాప్తంగా దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఓటర్ల లిస్టులో తప్పులు, డూప్లికేట్‌ ఓట్లు, ఫోటోలు మారిన ఘటనలు ఎన్నో ఉన్నాయని అంటున్నారు.

లెక్క పక్కాగా ఉండాలి

● రోజువారీ ఖర్చులను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలి ● నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి



ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని అభ్యర్థులతో మాట్లాడుతున్న వ్యయ పరిశీలకులు మహేష్ జివాదె

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజక వర్గానికి సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం పూర్తి కావడంతో తుది పోరుకు సిద్ధంగా ఉన్న అభ్యర్థుల వివరాలను బహిర్గతం చేశారు. నియోజక వర్గంలో మొత్తం 25 మంది పోటీ చేస్తున్నారు. గురువారం వారితో నియోజక వర్గ వ్యయ పరిశీలకులు మహేష్ జి. జివాదె, రిటర్నింగ్ అధికారి వెంకటేష్ థోత్రే సమావేశమయ్యారు. ఈ సందర్భంగ జివాదె మాట్లాడుతూ ఎన్నికల వ్యయానికి సంబంధించిన నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని సూచించారు. రోజువారి ఖర్చుల రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ రిజిస్టర్ నిర్వహణకు సంబంధించి విధి విధానాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నియోజక వర్గ సహాయ వ్యయపరిశీలకులు హేమభాను, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఓటర్ల జాబితా సిద్ధం

కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లతో కూడిన అదనపు ఓటరు జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇందులో భాగంగా ఖైరతాబాద్ నియోజక వర్గంలో కొత్తగా 13,934 మంది ఓటర్లు నమోదయ్యారు. తాజాగా విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం నియోజక వర్గంలో 2,96,014 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,53,968 కాగా, మహిళలు 1,42,011, ఇతరులు 35 మంది ఉన్నారు.

జూబ్లీహిల్స్‌లో..

జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో 28,270 మంది కొత్త ఓటర్లు నమోదయ్యారు. తాజాగా విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం.. నియోజక వర్గంలో 3,85,265 మంది ఓటర్లు నమోదయ్యారు. ఇందులో పురుషులు 2,02,308, మహిళలు 1,82,937, ఇతరులు 20 మంది ఉన్నారు. గత ఆగస్టులో విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం నియోజక వర్గంలో ఓటర్ల సంఖ్య 3,56,995 మాత్రమే ఉంది.


జీహెచ్ఎంసీ కార్యాలయంలో నూతన ఓటర్ల జాబితా బండిళ్లు..



అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

ఈవీఎంపై గుర్తుతో పాటు అభ్యర్థి ఫొటో

జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో..

నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగియడంతో బరిలో నిలిచిన అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు గుర్తుల కేటాయింపును పూర్తి చేశారు. ఈసారి గుర్తు పక్కనే పోటీ చేస్తున్న అభ్యర్థి ఫొటోను కూడా కొత్తగా ప్రవేశ పెట్టారు. ఖైరతాబాద్ నియోజక వర్గంలో 25 మంది, జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో 19 మంది పోటీ చేస్తున్నారు.

బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు..

మాగంటి గోపీనాథ్(బీఆర్ఎస్)
అజహరుద్దీన్(కాంగ్రెస్)
లంకల దీపక్‌రెడ్డి(బీజేపీ)

ఖైరతాబాద్ నియోజక వర్గంలో...

ఖైరతాబాద్ నియోజక వర్గంలో 27 మంది అభ్యర్థులు ఉండగా వారిలో ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. నామినేషన్లు ఉపసంహరించుకున్న వారిలో వినయ్‌కుమార్, బొల్లబోయిన రాజుయాదవ్ ఉన్నారు. బరిలో 25 మంది అభ్యర్థులు నిలిచారు.

ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే..

దానం నాగేందర్(బీఆర్ఎస్)
పి. విజయారెడ్డి(కాంగ్రెస్)
చింతల రామచంద్రారెడ్డి(బీజేపీ)
మిద్దె కృష్ణ(బీఎస్పీ)

అవగాహనలేని అధికారులతో అభ్యర్థులు నష్టపోతున్నారు


మాట్లాడుతున్న హ్యారీ సెబాస్టియన్ తదితరులు

వెంగళరావునగర్ : ఎన్నికల నియమావళిపై సరైన అనుభవం, అవగాహనలేని అధికారుల కారణంగా పలువురు అభ్యర్థులు, దరఖాస్తుదారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఇండియన్ బిలీవర్స్ పార్టీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ హ్యారీ సెబాస్టియన్ అన్నారు. గురువారం వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్‌నగర్ వెస్ట్‌లోని ఐబీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీ నుంచి 15 మంది నామినేషన్లను వేయగా కేవలం ఆరు మాత్రమే స్వీకరించి మిగిలినవి తిరస్కరించారన్నారు. దరఖాస్తు చేయడానికి ముందుగా రిటర్నింగ్ ఆఫీసర్, ఏఆర్‌ఓలను వివరాలు అడగ్గా తమకు తెలియదని చెప్పారని, అన్నీ తెలుసుకుని తాము దరఖాస్తు చేయగా నామినేషన్‌ను తిరస్కరించారన్నారు. ఎస్‌ఏ, ఎస్ఏఎల్ అని నామినేషన్‌లో ఉండగా ఆర్‌ఓ మాత్రం నాట్ అప్లికబుల్ అని రాయాలంటూ తిరస్కరించారన్నారు. వాస్తవానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు తప్పుల తడకగా నామినేషన్ పత్రాలు దాఖలు చేసినా వాటిని స్వీకరించారని ఆరోపించారు. ఈ విషయంపై తాము హైకోర్టుకు వెళ్లనున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ దరఖాస్తులన్నీ క్యాన్సిల్ చేసి తిరిగి మరో తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐబీపీ జనరల్ సెక్రటరీ ఇమ్మాన్యుయేలు, పాస్టర్ రాజు, అభ్యర్థులు బిషప్ అరుణ్, రవికుమార్, మోషే, ఆర్.స్వరూప, బి.దేవదాస్, కృపాకర్, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ 2023

బీఆర్ఎస్‌తోనే మహిళా సంక్షేమం


దానం అనితకు జ్ఞాపిక అందజేస్తున్న కార్పొరేటర్ సంగీత యాదవ్

పంజగుట్ట: మహిళా సాధికారత సాధించాలంటే తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దానం నాగేందర్ సతీమణి దానం అనిత అన్నారు. గురువారం సోమాజిగూడలోని జయా గార్డెన్స్‌లో సోమాజిగూడ డివిజన్ కార్పొరేటర్ వనం సంగీత యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన మహిళా డివిజన్ మహిళా ఆశీర్వాద సభ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. తప్పకుండా మరోమారు ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఓటు వెయ్యడమే కాకుండా కుటుంబ సభ్యులందరితోనూ ఓటు వేయించాలని కోరారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే చీకట్లే



ఇందిరానగర్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి

పీజేఆర్ తనయుడు విష్ణు ధ్వజం

బంజారాహిల్స్: తనకు చిన్నప్పటి నుంచి ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌తో మంచి అనుబంధం ఉందని ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గెలుపు కోసం ప్రచారం చేయడం ఎంతో ఆనందంగా ఉందని బీఆర్ఎస్ నేత, పీజేఆర్ తనయుడు పి. విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్ డివిజన్ బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు బాబాయ్ లాంటి నాగేందర్‌ను ఈ ఎన్నికల్లో పెద్ద మెజార్టీతో గెలిపించాలని పీజేఆర్ అభిమానులందరూ బీఆర్ఎస్‌కు ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే చీకట్లేనని బీఆర్ఎస్‌కు ఓటేస్తే వెలుతురు నిండుకుంటుందని పేర్కొన్నారు. తనను మోసం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు ప్రజలను కూడా మోసం చేసేందుకు సిద్ధమవుతోందని ఆ పార్టీ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఖైరతాబాద్ నియోజక వర్గంలోని ప్రజలంతా సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించే దిశగా దానం నాగేందర్ రెండోసారి ఇక్కడి నుంచి గెలిపించాలని కోరారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్ బీఆర్ఎస్‌లో చేరారు. సోమాజిగూడలో నిర్వహించిన మహిళా ఆశీర్వాద సభలో దానం సతీమణి అనిత పాల్గొన్నారు. కార్యక్రమంలో సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతా యాదవ్ కూడా పాల్గొన్నారు.


బీఆర్ఎస్‌లో చేరుతున్న జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్

క్రైం కార్నర్..

డబ్బులు ఇవ్వకపోతే ఫొటోలు వైరల్ చేస్తా..

యువతి బెదిరింపులు.. కేసు నమోదు

వెంగళరావునగర్: అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే ఫొటోలు వైరల్ చేస్తానంటూ ఓ యువకుడిని ఒక యువతి వేధింపులకు గురి చేస్తున్న సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా, హుజూర్‌నగర్‌కు చెందిన కిరణ్‌కుమార్ కృష్ణానగర్‌లో ఉంటున్నాడు. ఏడాది క్రితం అతను రూంలో షేరింగ్ కోసం ఓఎల్ఎక్స్‌లో ప్రకకటన ఇవ్వడంతో ఓ యువతి స్పందించి తాను షేర్ చేసుకుంటానని చెబుతూ కూకట్‌పల్లిలో రూం తీసుకోవాలని కోరింది. దీంతో ఇద్దరూ కలిసి గదిలో ఉంటున్నారు. అయితే ఆమె ప్రవర్తన సరిగా లేకపోవడంతో కిరణ్ ఆమెను బయటికి పంపాడు. దీంతో ఆమె సైబరాబాద్ షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేసింది. వారు కౌన్సెలింగ్ చేయగా ఆమెకు రూ.4.70 లక్షలు పరిహారంగా చెల్లించాడు. ఈ నెల 13న ఆమె కిరణ్‌ను సారథి స్టూడియో వద్దకు రప్పించి మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి అతడిపై దాడి చేసింది. గురువారం అతను మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాక్ పోలింగ్ నిర్వహించిన వ్యక్తులపై కేసు...

వెంగళరావునగర్: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మాక్ పోలింగ్ నిర్వహించిన వ్యక్తులపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్మార్ట్ పొలిటికల్ సర్వే సంస్థకు చెందిన యువకులు గురువారం యాదగిరినగర్‌లో ఎన్నికల సర్వే పేరుతో డమ్మీ బ్యాలెట్ పత్రాలతో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ స్పాట్ టీం అధికారి అభిషేక్ తివారి వారిని అదుపులోకి తీసుకున్నారు. సదరు సంస్థకు చెందిన విజయ్‌కుమార్, మనోజ్, జాకీర్, హుస్సేన్, జితేందర్, వెంకట్, లింగయ్య అనే యువకులను మధురానగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

వెంగళరావునగర్ : అక్రమంగా గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు.చార్మినార్ ప్రాంతానికి చెందిన కీర్తి శ్రీకాంత్ అనే వ్యక్తి బుధవారం రాత్రి గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు జానకమ్మతోట వద్ద అతడిని సోదా చేయగా అతని వద్ద 150 గంజాయి చాక్లెట్ల పాకెట్లు లభ్యమయ్యాయి. పదిరోజుల క్రితం బిపిన్ అనే వ్యక్తి ద్వారా లక్నో నుంచి తెప్పించానని, అవసరమైన వారికి విక్రయిస్తున్నట్లు తెలిపాడు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెట్టుబడి పేరుతో రూ.63 లక్షలు టోకరా

హిమాయత్‌నగర్: నగరానికి చెందిన ఓ వ్యక్తి నుంచి పెట్టుబడి పేరుతో సైబర్ నేరగాళ్లు రూ.63 లక్షలు కాజేశారు. ఈ మేరకు సిటీ సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్‌లో పరిచయం చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. మొదట రూ.వేలల్లో పెట్టుబడి పెట్టించి లాభాలు చూపించారు. ఆ తర్వాత అతడి నుంచి విడతల వారిగా రూ 63 లక్షలు పెట్టుబడి పెట్టించి కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నన్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ తరహా మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పాలనను గాలికొదిలేశారు


జ్ఞానిజైల్‌సింగ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి

ఎమ్మెల్యే, కార్పొరేటర్లపై విజయారెడ్డి ధ్వజం


భోలానగర్‌లో విజయారెడ్డిని ఆశీర్వదిస్తున్న ముస్లింలు


ఫిలింనగర్‌లో టీడీపీ నేతలను ఓటు అభ్యర్థిస్తున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: అస్తవ్యస్త రహదారులు, డ్రైనేజీ ఓవర్ ఫ్లో, కలుషిత మంచినీటి సరఫరా, వెలగని వీధి దీపాలతో బస్తీవాసులు నరకాన్ని చవి చూస్తున్నారని స్థానిక ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్లు పాలనను గాలికొదిలేశారని ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి. విజయారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆమె ఫిలింనగర్‌లోని జ్ఞానిజైల్‌సింగ్‌నగర్, స్వామి వివేకానందనగర్, బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని భోలానగర్, ఖాజానగర్ బస్తీల్లో పర్యటించారు. అడుగడుగునా ఆమెకు సమస్యలు స్వాగతం చెప్పాయి. స్థానికులు అధికార పార్టీ నిర్వాకంపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందనే నిర్ణయానికి ప్రజలు వచ్చారని ఈ ఎన్నికల్లో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్లు పూర్తిగా తమవైపే మొగ్గుచూపుతున్నాయని ఆమె పేర్కొన్నారు. సమస్యలను ఎప్పటిప్పుడు నోట్ చేసుకుంటున్నానని అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నేతలను కూడా కలిసి ఓటు అభ్యర్థించారు.

మాదిగ జాతిని తాకట్టు పెట్టాడు



మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

పంజగుట్ట: పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభ ద్వారా దక్షిణాది రాష్ట్రాల మాదిగ ఓట్లను బీజేపీకి వేయిస్తానని మంద కృష్ణ మాదిగజాతిని మోదీ కాళ్ల వద్ద తాకట్టుపెట్టాడని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ .. సభ మొత్తం ఒకరినొకరు కీర్తించుకోవడంతోనే సరిపోయిందని, సభలో తాను ఎస్సీ రిజర్వేషన్ కోసం కమిటీ వేస్తానని మోదీ ఎక్కడా చెప్పలేదన్నారు. అయినా బీజేపీ ఎన్నో కీలక బిల్లులను ఎలాంటి కమిటీలు లేకుండా ఆమోదించుకుందని కేవలం ఎస్సీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం తెలిపేందుకు కమిటీ ఎందుకని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్‌లో లక్షలాది మంది కార్యకర్తలకు, బలిదానాలకు సంబంధంలేనట్లు కేవలం ఒక్క వ్యక్తి మాత్రమే ఉద్యమం చేసినట్లు ప్రకటించుకున్నాడని ఆరోపించారు. మోదీని చూడగానే కన్నీళ్లు పెట్టుకున్నావంటే ముందే బీజేపీ నాయకులతో మాట్లాడి ఎన్నికల స్టంట్ రూపొందించినట్లు అర్థమౌతుందన్నారు. తెలంగాణలో అన్ని సర్వేలు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యేపోటీ అని చెబుతుండగా ఆ రెండు పార్టీల్లో ఏదైనా అధికారంలోకి వస్తే వారు మాదిగజాతిని మరింత అణగదొక్కరన్న నమ్మకం ఏమిటని ప్రశ్నించారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని దాన్ని వారు ఇష్టం వచ్చినట్లు వినియోగించుకోవాలని సూచించారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదింపచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాదిగ రాజకీయ పోరాట సమితి అధ్యక్షులు బి.ఎస్.రమేష్, నర్సింహ్మా, బోయ ప్రవీణ్, ఎ.విజయ్‌కుమార్, మాతంగి ఓదెలు, శ్రీధర్, రమేష్, శంకర్, చిరంజీవి పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో నిత్యాన్నదానం ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

రహమత్‌నగర్: హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం నుంచి అన్న ప్రసాద కార్యక్రమం ప్రారంభమైంది. తొలిరోజు భక్తులు మురళీ కృష్ణ, రామకృష్ణ, సురేష్‌గౌడ్, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన అయ్యప్ప భక్తులు పెద్ద సఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, కమిటీ సభ్యులు బాలకృష్ణ, కేఎస్‌రావు, విజయ్, సత్యనారాయణ, తివారి, నాగరాజు, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్న దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

జీటీఎస్ దేవాలయంలో..

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీటీఎస్ కాలనీలోని జీటీఎస్ దేవాలయంలో అయ్యప్ప భక్తులకు గురువారం నుంచి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టెంపుల్ కమిటీ చైర్మన్ చిన్న రమేష్ మాట్లాడుతూ ప్రతి ఏటా అయ్యప్ప భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 16 నుంచి జనవరి 1 వరకు నిత్యాన్నదానం కొనసాగుతుందన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు భక్తులకు భిక్ష, రాత్రి 9.30 గంటలకు అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తులు ప్రతిరోజు అయ్యప్ప పడిపూజ, భిక్ష, అల్పాహారం కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

ఆశా వర్కర్ సస్పెన్షన్ అనైతికం

హిమాయత్‌నగర్: సూర్యాపేట జిల్లా, పెన్‌పహాడ్ పీహెచ్‌సీ ఎస్.అన్నాపురం సబ్ సెంటర్‌లో ఆశా వర్కర్ కవిత సస్పెన్షన్ అనైతికమని ఆమెను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ అన్నారు. గురువారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో బాధితురాలు కవితతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కంటే ముందు రాష్ట్రంలో ఆశా వర్కర్లు సమ్మె చేశారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిపై ఓ సందేశాన్ని ఆమె వాట్సాప్‌లో ఫార్వర్డ్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ కంటే ముందు ఫార్వర్డ్ చేసిన అంశం కోడ్ పరిధిలోకి రాదనే విషయాన్ని గ్రహించకుండా అధికారులు ప్రభుత్వ అనుబంధ యూనియన్ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో ఆమెపై వేటు వేయడం అన్యాయమన్నారు. అధికార కార్మిక సంఘం నేతలు ఆమెపై వ్యక్తిగతంగా కక్ష పెంచుకుని తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. అధికారులు సైతం ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ఆశా వర్కర్‌కు అన్యాయం చేశారని ఆరోపించారు. వెంటనే కవితను విధుల్లోకి తీసుకోవాలని లేనిపక్షంలో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అవసరమైతే హైకోర్టుకు వెళ్లనున్నట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు చేయూత

హిమాయత్‌నగర్: కోవిడ్ కష్ట కాలంలో ఆర్థికంగా సంక్షోభాన్ని ఎదుర్కొన్న ఆటో డ్రైవర్లకు ఆదర్శ్‌నగర్ అభినందన్ బజాజ్ ఆటో యజమాని రోహిత్ కొఠారి, మేనేజర్ సుమన్, సిబ్బంది ఆనంద్ చేయూతనందించారు. దాదాపు 5 వేల మంది ఆటో డ్రైవర్లకు నిత్యావసర సరుకులు అందజేసి మానవత్వం చాటారు. గురువారం షోరూం 18 వ వార్షికోత్సవం సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.బి.జామా మాట్లాడుతూ షోరూం నిర్వాహకులు ప్రారంభించిన పథకం నుండి తమ యూనియన్‌లో పేర్లు నమోదు చేసుకున్న ఐదు వేల మంది డ్రైవర్లకు తక్కువ ధరల ఆటోలు అందించారన్నారు. ఆ స్కీంలో ఆటోలు కొనుగోలు చేసిన డ్రైవర్లు, ఓనర్లు నేడు జీవితంలో నిలదొక్కుకుని ఆనందంగా ఉన్నారన్నారు. కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో తాము ఎలక్ట్రిక్ బజాజ్ ఆటో రిక్షాల కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని మంచి స్కీములు అందించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సంయుక్త కార్యదర్శి ఠాకూర్ జైసింగ్, అధ్యక్షుడు షేక్ రహీం, ఉపాధ్యక్షులు ఆనందపురి గోస్వామి, కోశాధికారి సయ్యద్ షాహీన్‌షా పాల్గొన్నారు.

వాకింగ్‌తోనే మధుమేహ వ్యాధి నియంత్రణ

హిమాయత్‌నగర్: నిరంతరం వాకింగ్ చేయడం వల్ల మధుమేహ వ్యాధి నియంత్రణలో ఉంటుందని ఉస్మానియా ఆసుపత్రి సీనియర్ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ రాకేశ్ సహాయ్ అన్నారు. నడక ద్వారా ప్రతి ఒక్కరూ మధుమేహ వ్యాధిని నియంత్రించుకోవాలన్నారు. ఈ మేరకు వరల్డ్ డయాబెటిస్ డేను పురస్కరించుకుని గురువారం నగరంలో ఐడియా క్లినిక్స్ ఆధ్వర్యంలో 5 కే వాక్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాకేశ్ సహాయ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా డయాబెటిస్‌పై ప్రజలకు అవగాహన పెంపొందించాలన్నారు. వరల్డ్ డయాబెటిస్ డే ను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. చాలామంది షుగర్ బాధితులు ఎప్పటికప్పుడు షుగర్ చెక్ చేసుకోకుండా సమస్యలు కొని తెచ్చుకుంటున్నారన్నారు. ఐడియా క్లినిక్స్ నిర్వాహకులు ఇంటికి వచ్చి కళ్లు, పాదాలు, గుండె, మెదడు, రక్త పరీక్షలు, యూరిన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐడియా క్లినిక్స్ ఫౌండర్ డాక్టర్ శ్యామ్ కలవలపల్లి మాట్లాడుతూ డయాబెటిస్ పేషంట్స్‌కు అత్యుత్తమ వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చెంచి రెడ్డి, డాక్టర్ ఉమా చక్రవధానుల, డాక్టర్ దుర్గాభవాని, డాక్టర్ పర్లిన్, తదితరులు పాల్గొన్నారు.


వరల్డ్ డయాబెటిస్ డే 5కే వాక్‌లో పాల్గొన్న డాక్టర్లు

సైఫాబాద్ సైన్స్ కాలేజీలో ఇండక్షన్ ప్రోగ్రామ్

బంజారాహిల్స్: యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ సైఫాబాద్‌లో పీజీ విద్యార్థులకు గురువారం ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఓయూ జెనిటిక్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ కవి కిషోర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూజీసీ, ఓయూ ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కరోనా తర్వాత ప్రజల్లో సైన్స్ మీద చాలా అవగాహన వచ్చిందని అలాగే ఔషధ మొక్కలపై కూడా ఆలోచించే స్థాయికి ఎదిగారన్నారు. మెడికల్ ప్లాంట్స్‌తో ఎన్నో రోగాలు నయం చేయగలమన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ జె. లక్ష్మన్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, డాక్టర్ జగదీష్, వాసవి పాల్గొన్నారు.

అత్యవసర సమయాల్లో 100కు డయల్ చేయాలి


ఠాణాను సందర్శించిన క్వీన్స్ స్కూల్ విద్యార్థులు..

బంజారాహిల్స్: పోలీస్ స్టేషన్లలో రోజువారిగా జరిగే కార్యక్రమాలు తెలుసుకోవడం, పోలీసుల పనితీరుపై అవగాహన పెంచుకోవడం, ఖాకీలంటే స్నేహితులే అనే భావనను తీసుకురావడమే లక్ష్యంగా శ్రీనగర్ కాలనీలోని క్వీన్స్ ఇంటర్నేషనల్ స్కూల్ 5, 6 తరగతుల విద్యార్థులు గురువారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ శివశంకర్ విద్యార్థులను ఠాణాలో అన్ని విభాగాలను తిప్పి ఎవరెవరి పనితీరు ఏమిటో వారికి కూలంకషంగా తెలియజేశారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు 100కు డయల్ చేయడం ద్వారా క్షణాల్లో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుంటారని ఈ విషయాన్ని ఇళ్లల్లో తల్లిదండ్రులకు, బంధుమిత్రులకు అవగాహన కలిగించాలని కోరారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సూత్ర ఎగ్జిబిషన్ ప్రారంభం



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో సూత్ర ఫ్యాషన్ డిజైనరీ ఎగ్జిబిషన్ గురువారం ప్రారంభమైంది. ఈ నెల 16 నుంచి 18వ వరకు మూడు రోజుల పాటు కొనసాగే ఈ ప్రదర్శనను పలువురు మోడల్స్ ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా ప్రఖ్యాతి చెందిన 60 మంది డిజైనర్లు ఈ ప్రదర్శనలో తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. పండుగలు, వివాహాది శుభకార్యాల కోసం ప్రత్యేక డిజైన్లతో కనువిందు చేసే వస్త్రాలు, ఆభరణాలు ఇక్కడ ఆకట్టుకుంటున్నాయి.

ఆకృతి ఎక్స్‌పో ప్రారంభం



లక్డీకాపూల్ : బంజారాహిల్స్‌లోని తాజ్ దక్కన్ హోటల్‌లో ఆకృతి ఎక్స్‌పో వస్త్ర ప్రదర్శన గురువారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనను ఆకృతి ఎగ్జిబిషన్ డైరెక్టర్ సాహ్నినాథ్ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో పండుగలు, వివాహాది శుభకార్యాల కోసం ప్రత్యేక డిజైన్లతో కనువిందు చేసే వస్త్రాలు, ఆభరణాలు ఆకట్టుకుంటున్నాయి.

చంద్రబాబు మెడికల్ రిపోర్టు ఇచ్చింది వైద్యులా? రాజకీయ నేతలా?

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజం
- బెయిల్‌పై బయట ఉండేందుకే ఆ రిపోర్టు ఇచ్చినట్లు ఉంది



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మరికొంత కాలం బెయిల్‌పై బయట ఉండటానికే ఆయనకు మెడికల్ రిపోర్టు ఇచ్చినట్లు ఉందని, ఆ మెడికల్ రిపోర్టు ఇచ్చింది వైద్యులా? లేక రాజకీయనేతలా? అంటూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎవరికైనా గుండెలో క్యాల్షియం స్కోర్ (స్థాయి) 900 దాటితే స్టంటో లేదంటే బైపాస్ సర్జరీనో చేయించుకోవాలని వైద్యులు సూచిస్తారన్నారు. అయితే చంద్రబాబు మెడికల్ రిపోర్టును పరిశీలిస్తే.. ఆయన గుండెలో క్యాల్షియం స్కోర్ 1,600 దాటిందని ఏఐజీ వైద్యులు పేర్కొన్నారని చెప్పారు. క్యాల్షియం స్కోర్ ఇంత ఉన్నా స్టంటో లేదంటే బైపాస్ సర్జరీనో చేయించుకోవాలని సూచించకపోగా.. చంద్రబాబు బయటకు వెళితే ఆయన వెంట అంబులెన్స్ ఉండాలంటూ నివేదికలో పేర్కొనడమేంటని ప్రశ్నించారు. దీన్ని బట్టి చూస్తే.. వైద్యులు పరిధి దాటి మెడికల్ రిపోర్టు ఇచ్చినట్లు స్పష్టమవుతోందన్నారు. వ్యవస్థలను మేనేజ్‌మెంట్ చేయడంలో దిట్టయిన చంద్రబాబు.. తాను మరింతకాలం బయట ఉండటానికే ఆ రిపోర్టు ఇప్పించుకున్నట్లుగా ఉందన్నారు. ఆ రిపోర్టు ఆధారంగా చంద్రబాబుపై ప్రజల్లో సానుభూతి పెంచడానికి ఎల్లో మీడియా హడావుడి చేస్తోందంటూ మండిపడ్డారు. చంద్రబాబు జైల్లోనే ఉండాలని తాము కోరుకోవడం లేదన్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు చేసిన కుంభకోణాలకు ప్రజలకు సంజాయిషీ చెప్పుకోవాల్సిన అవసరం చంద్రబాబుకు ఉందన్నారు. స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికి జైలుకు వెళ్లిన రోజు నుంచే చంద్రబాబు ఆరోగ్యంపై ఆయన కుటుంబ సభ్యులు రోజుకో నాటకానికి తెరతీశారని విమర్శించారు. 'తన ఆరోగ్య పరిస్థితి బాగోలేదంటూ చంద్రబాబు బతిమాలుకుంటే కోర్టు మెడికల్ బెయిల్ ఇచ్చింది. అనారోగ్య కారణాలతో జైలు నుంచి బయటకు వచ్చిన చంద్రబాబు.. రాజమండ్రి నుంచి విజయవాడ వరకూ రోడ్‌షో చేశారు. ఆరోగ్యం బాగోలేని వ్యక్తి 14 గంటలు రోడ్ షో చేస్తారా? 2004లో అలిపిరి ఘటనలో గాయపడకున్నా గాయపడినట్లు చేతికి కట్టుకట్టుకుని చంద్రబాబు ఆడిన నాటకాలను ప్రజలు అప్పుడు తిప్పికొట్టారు. ఇప్పుడు స్కిల్ స్కాం కేసులో అడ్డంగా దొరికిన దొంగ చంద్రబాబు సానుభూతి కోసం ఆడుతున్న నాటకాలను ప్రజలు ఛీకొడుతున్నారు' అని సజ్జల పేర్కొన్నారు.

దోచేసిన డబ్బును హవాలా మార్గంలో మళ్లించారు

చెన్నప్ప అనే వ్యక్తి ద్వారా సుమన్ బోస్‌కు డబ్బు.. వారి మధ్య కోడ్ భాష

- కుంభకోణం డబ్బులో కొంత మొత్తం టీడీపీ ఖాతాలకు
- ఆ వివరాలు ఇచ్చేందుకు టీడీపీ అంగీకరించడం లేదు
- సహనిందితుల ద్వారా చంద్రబాబు సాక్షులను ప్రభావితం చేస్తున్నారు
- చంద్రబాబుకు బెయిల్ ఇవ్వొద్దు.. పిటిషన్ కొట్టేయండి
- హైకోర్టుకు నివేదించిన అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు తదితరులు లూటీ చేసిన డబ్బు మొత్తాన్ని హవాలా మార్గంలో మళ్లించారని సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. సీమెన్స్ మాజీ ఎండీ సుమన్ బోస్ తనకు సంబంధించిన చెన్నప్ప అనే వ్యక్తి ద్వారా రూ. 10 నోట్లను వినియోగించి కావాల్సిన చోటుకు హవాలా మార్గంలో నిధులను మళ్లించారని తెలిపారు. దర్యాప్తులో భాగంగా వారి నుంచి స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా జరిగిన వారి చాటింగ్ వివరాలను ఆయన కోర్టుకు వివరించారు. నిధులు మళ్లింపు, డబ్బు జమకు వారి మధ్య కోడ్ భాషలో సంభాషణలు జరిగాయని తెలిపారు. సీమెన్స్ ప్రతినిధి మాథ్యూ థామస్ అసలు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుతో తమకు ఏ మాత్రం సంబంధం లేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు వాంగ్మూలం ఇచ్చారని ఆయన కోర్టుకు వివరించారు. 90 శాతం పెట్టుబడి పెట్టాల్సిన సీమెన్స్ ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టక ముందే చంద్రబాబు ప్రభుత్వం రూ. 270 కోట్లను ముందుగానే విడుదల చేసేసిందని, ఈ విషయంలో ప్రతీ దశలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

టీడీపీ ఖాతాల్లోకి నిధులు

స్కిల్ కుంభకోణం నిధుల్లో కొంత భాగం అంతిమంగా తెలుగుదేశం పార్టీ బ్యాంకు ఖాతాల్లో చేరాయని, ఇందుకు సంబంధించిన వివరాలను సీఐడీ కోరితే ఆ పార్టీ వర్గాలు ఇవ్వడం లేదని ఏఏజీ కోర్టుకు తెలిపారు. స్కిల్ కుంభకోణంపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి నిధుల దుర్వినియోగాన్ని ధ్రువీకరించిన శరత్ అసోసియేట్స్‌పై ఈ కేసులో నిందితుడైన వికాస్ ఖన్విల్కర్‌తో చార్టెడ్ అకౌంటెంట్స్ ఇండియా వద్ద ఫిర్యాదు చేయించారన్నారు. ఇలా చేయించడం ద్వారా ఈ కేసులో కీలక సాక్షి అయిన శరత్ అసోసియేట్స్‌ను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాక చంద్రబాబు అరెస్ట్ తర్వాత దర్యాప్తుకు విఘాతం కలిగేలా సుమన్ బోస్, ఖన్విల్కర్‌లు మీడియా సమావేశాలు నిర్వహించారన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయవద్దని.. ఆ పిటిషన్ కొట్టివేయాలని అభ్యర్థించారు.

గుండె జబ్బున్నారు.. ఈసీజీలో అలాంటిదేమీ లేదు

కంటికి శస్త్ర చికిత్స నిమిత్తం మధ్యంతర బెయిల్‌పై బయట ఉన్న చంద్రబాబు స్కిల్ కుంభకోణంలో సహనిందితుల ద్వారా సాక్షులను పరోక్షంగా ప్రభావితం చేస్తున్నారని ఏఏజీ తెలిపారు. బెయిల్ పొందేందుకు వీలుగా తప్పుడు మెడికల్ రిపోర్ట్‌ను కోర్టు ముందుంచారని ఆయన తెలిపారు. తాజా మెడికల్ రిపోర్టులో చంద్రబాబు 'హైపర్‌ట్రోఫిక్ కార్డియోపతి విత్ ఇర్రెగ్యులర్ హార్ట్ రిథమ్'తో బాధపడుతున్నట్లు పేర్కొన్నారని.. ఇది శుద్ధ అబద్ధమని, ఆ వ్యాధితో బాధపడేవారికి వైద్యులు ఐసీడీ అనే పరికరాన్ని అమరుస్తారని తెలిపారు. ఇదేమీ అసాధారణ వ్యాధి కాదన్నారు. ఆ జబ్బు ప్రభావం ఈసీజీ ద్వారా తెలుస్తుందని, అయితే చంద్రబాబు ఈసీజీలో అలాంటిది ఏమీ లేదని ఆయన వివరించారు. ప్రభుత్వ వైద్యుల బృందం పర్యవేక్షణలో వైద్య పరీక్షలు చేయించుకునేలా చంద్రబాబును ఆదేశించాలని కోరారు. చంద్రబాబును ఢిల్లీ ఎయిమ్స్‌కు తీసుకెళ్లేందుకు సైతం సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

కోర్టు ఆదేశాలు ఉల్లంఘించేలా వైద్య నివేదికలు

వాస్తవానికి మధ్యంతర బెయిల్ మంజూరు సమయంలో హైకోర్టు పలు షరతులు విధించిందని, చంద్రబాబు వైద్య నివేదికలను రాజమండ్రి జైలు సూపరింటెండెంట్‌కు సీల్డ్ కవర్‌లో ఇవ్వాలని వైద్యులను ఆదేశించిందని ఏఏజీ తెలిపారు. అయితే వైద్యులు నేరుగా చంద్రబాబుకే ఆ నివేదికలు ఇచ్చారని, ఇది కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమేనని చెప్పారు. హైదరాబాద్‌లో కూడా చంద్రబాబు కోర్టు షరతులను ఉల్లంఘించారన్నారు.

తీర్పు రిజర్వు

సీఐడీ వాదనలకు చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. నిధుల మళ్లింపుతో చంద్రబాబుకు సంబంధం లేదన్నారు. రాజకీయ ప్రతీకారంలో భాగంగానే చంద్రబాబు అరెస్ట్ జరిగిందన్నారు. ఆయన షరతులను ఉల్లంఘించలేదని తెలిపారు. ఆయనకు పూర్తి స్థాయి బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు తీర్పును రిజర్వ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

కీలక విషయాలను కోర్టు ముందుంచిన సీఐడీ...

స్కిల్ కుంభకోణంలో సీఐడీ పలు కీలక విషయాలను హైకోర్టు ముందుంచింది. కుంభకోణంలో నిధులను షెల్ కంపెనీల ద్వారా ఎలా మళ్లించారు.. వాటిని తిరిగి టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి ఎలా తీసుకొచ్చారు.. డీమానిటైజేషన్ సమయంలో డబ్బును ఎలా మార్పిడి చేశారు.. తదితర వివరాలను సీఐడీ లిఖితపూర్వకంగా కోర్టు ముందుంచింది. ఈమేర అదనపు కౌంటర్‌ను కోర్టులో దాఖలు చేసింది. 2014 జూన్ 1 నుంచి 2018 జూన్ వరకు మొత్తం రూ. 65.86 కోట్లు టీడీపీకి చెందిన నాలుగు బ్యాంకు ఖాతాల్లోకి చేరాయని సీఐడీ వివరించింది. అంతేకాక 2016 నవంబర్, 2017 జనవరి మధ్య మొత్తం నగదు డిపాజిట్లన్నీ కూడా రూ. 500, రూ. 1,000 నోట్ల ద్వారా మాత్రమే జరిగిన విషయాన్ని దర్యాప్తులో గుర్తించామని సీఐడీ తెలిపింది. డీమానిటైజేషన్‌ను నవంబర్ 8న ప్రకటించారని, అందువల్ల ఈ రూ. 500, రూ. 1,000 జమ లావాదేవీలన్నీ కూడా అత్యంత అనుమానాస్పదంగా ఉన్నాయంది. తెలుగుదేశం పార్టీ బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన వారి వివరాలేవీ సరిగా లేవని, కేవైసీ నిబంధనలు అసలు పాటించలేదని సీఐడీ హైకోర్టు దృష్టికి తీసుకొచ్చింది. ఈ డిపాజిట్లకు సంబంధించిన వివరాలను సమర్పించేందుకు టీడీపీ ఎంత మాత్రం సుముఖత వ్యక్తం చేయడం లేదని, తామిచ్చిన నోటీసులకు సైతం సరైన రీతిలో స్పందించడం లేదని వివరించింది.

టీడీపీ ఖాతాల్లోకి 'స్కిల్' సొమ్ము

- 2016 నోట్ల రద్దు సమయంలో రూ.65.86 కోట్లు జమ
- నాలుగు బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ
- స్కిల్ స్కాం కేసులో సీఐడీ దర్యాప్తులో వెల్లడి
- నిధుల వివరాలు చెప్పాలని టీడీపీకి సీఐడీ నోటీసులు

సాక్షి, అమరావతి: 'స్కిల్'స్కాంలో రోజుకో కథ వెలుగులోకి వస్తోంది. టీడీపీ హయాంలో చోటుచేసుకున్న ఈ కుంభకోణం ద్వారా దోచుకున్న సొమ్ములో సింహభాగం చంద్రబాబుకు చేరినట్లు సీఐడీ గుర్తించింది. ఆ తర్వాత ఈ సొమ్మును ఏఏ ఖాతాల్లోకి మళ్లించారన్న విషయాన్ని దర్యాప్తు సంస్థ తాజాగా ఆధారాలతో సహా తేల్చింది. నిజానికి.. సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఆ ప్రాజెక్టు పేరుతో దోచుకున్న రూ.371 కోట్లలో రూ.241 కోట్లు హవాలా మార్గంలో చంద్రబాబుకు చేరాయని సీఐడీ తన దర్యాప్తులో ఇప్పటికే నిగ్గుతేలింది. అనంతరం ఆ మొత్తాన్ని అక్రమంగా ఏ ఏ ఖాతాల్లోకి మళ్లించారో కూడా సీఐడీ ఇప్పుడు వెలుగులోకి తీసుకొచ్చింది. అందులోని రూ.65.86 కోట్లు టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి చేరినట్లు ఆధారాలతో సహా గుర్తించింది. దీంతో చంద్రబాబు అవినీతికి సంబంధించి మరిన్ని ఆధారాలు వెలుగులోకి వచ్చినట్లయింది.

నాలుగు ఖాతాలు.. రూ.65.86 కోట్లు..

రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులను చంద్రబాబు హయాంలో నిబంధనలకు విరుద్ధంగా విడుదల చేసిన సమయంలోనే.. గుర్తుతెలియని ఆదాయ మార్గాల ద్వారా టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి ఆ నిధులు చేరాయి. ఇందుకు సంబంధించి సీఐడీ కీలక ఆధారాలు సేకరించింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో నాలుగు బ్యాంకు ఖాతాల్లోకి టీడీపీ పేరిట మొత్తం రూ.65,86,47,510లు మళ్లించారు. జూబ్లీహిల్స్‌లోని బ్యాంకు ఆఫ్ బరోడా బ్రాంచిలో టీడీపీకి మూడు ఖాతాలున్నాయి. ఆ మూడు ఖాతాల్లో వరుసగా రూ.4,81,60,587, రూ.25,31,31,352, రూ. 2,26,28,500 జమచేశారు. అలాగే, అదే ప్రాంతంలోని యూనియన్ బ్యాంకు ఖాతాలో మరో రూ.33,47,27,071 డిపాజిట్ చేశారు.

గోప్యంగా ఆదాయ మార్గాలు..

దర్యాప్తులో భాగంగా ఆ బ్యాంకు ఖాతాల వివరాలను సీఐడీ పరిశీలించగా అసలు విషయం బయటపడింది. 2016 నవంబరు నుంచి 2017 జనవరి మధ్యలో ఆ నిధులను డిపాజిట్ చేశారు. అంతేకాక.. రూ.500, రూ.వెయ్యి నోట్ల కట్టలను తీసుకొచ్చి మరీ డిపాజిట్ చేసినట్లు సీఐడీ గుర్తించింది. ఇక ఈ నిధులు తమకు ఏ ఆదాయ మార్గాల ద్వారా వచ్చాయన్నది డిపాజిట్ సమయంలో టీడీపీ వెల్లడించకపోవడం ఆశ్చర్యకరం. ఎందుకంటే.. 2016లో పెద్దనోట్లు రద్దుచేసినప్పుడు భారీ డిపాజిట్లకు ఆదాయ మార్గాలను పేస్లిప్‌లో వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. కానీ, టీడీపీ అటువంటివేవీ వెల్లడించకుండానే దాని ఖాతాల్లోకి ఏకంగా రూ.65.86 కోట్లు జమయ్యాయి.

టీడీపీకి సీఐడీ నోటీసులు..

ఈ నేపథ్యంలో.. టీడీపీ బ్యాంకు ఖాతాల్లో చేరిన నిధుల వివరాలను చెప్పాలని సీఐడీ టీడీపీ ప్రధాన కార్యాలయానికి నోటీసులు జారీచేసింది. అందుకు టీడీపీ కోరిన నాలుగు వారాల గడువును కూడా అనుమతించింది. కానీ, గడువు ముగిసినప్పటికీ ఆ పార్టీ ఎలాంటి వివరాలను వెల్లడించలేదు. దాంతో 2014 నుంచి 2019 వరకు టీడీపీ బ్యాంకు ఖాతాల వివరాలను తెలపాలని సీఐడీ తాజాగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి–కోశాధికారి పేరిట నోటీసులు జారీచేసింది. ఈనెల 18న సీఐడీ కార్యాలయానికి వచ్చి ఆ వివరాలను చెప్పి దర్యాప్తునకు సహకరించాలని అందులో పేర్కొంది.

రెండంకెల పరుగు

సీఎం జగన్ పాలనలో అన్ని రంగాల్లో రెండంకెల వృద్ధి నమోదు

- నాలుగేళ్లలో ఏకంగా రూ.4.44 లక్షల కోట్లు పెరిగిన జీఎస్‌డీపీ
- ఏటా సగటున 12.70 శాతం వృద్ధితో మొత్తంగా 50.81 శాతం పెరుగుదల
- చంద్రబాబు హయాంలో వ్యవసాయం వృద్ధి తిరోగమనం.. 5.42 శాతం తగ్గుదల
- వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యవసాయ రంగంలో వృద్ధి 63.19 శాతం పెరుగుదల

రంగాలవారీగా స్థూల రాష్ట్ర విలువ పెరుగుదలపై ఆర్బీఐ నివేదిక

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సాక్షి, అమరావతి: నాలుగేళ్లలో దాదాపు రూ.నాలుగున్నర లక్షల కోట్లు పెరుగుదల! జీఎస్‌డీపీతోపాటు అన్ని రంగాల్లో ఏటా రెండంకెల వృద్ధి రేటు. ఆర్థిక మందగమనం, కోవిడ్ సంక్షోభాలను అధిగమించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వరుసగా నాలుగేళ్లుగా రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల నమోదు చేసింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తితో పాటు వ్యవసాయం, పారిశ్రామిక, సేవారంగం, నిర్మాణ, తయారీ తదితర అన్ని రంగాల్లో గత నాలుగేళ్లుగా సగటున ఏటా రెండంకెల వృద్ధి నమోదైంది. ఆయా రంగాల్లో ఆర్థిక కార్యకలాపాల ద్వారా స్థూల రాష్ట్ర విలువ జోడింపు పెరుగుదలపై 2022–23కి సంబంధించి ఆర్బీఐ గురువారం రాష్ట్రాల వారీగా నివేదికను విడుదల చేసింది. ప్రస్తుత ధరల ప్రకారం 2019–20 నుంచి 2022–23 వరకు వరుసగా నాలుగేళ్లుగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ పెరుగుతూనే ఉందని నివేదిక పేర్కొంది. 2018–19లో చంద్రబాబు హయాంలో ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ రూ.8,73,721.11 కోట్లు ఉండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 2020–23 నాటికి నాలుగేళ్లలో రూ.13,17,728.15 కోట్లకు పెరిగింది. అంటే నాలుగేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి ఏకంగా రూ.4.44 లక్షల కోట్లకుపైగా పెరగడం గమనార్హం. కోవిడ్ లాంటి సంక్షోభాలు లేనప్పటికీ టీడీపీ హయాంలో వ్యవసాయ రంగం వృద్ధి తిరోగమనంలోకి వెళ్లినట్లు ఆర్బీఐ గణాంకాలు స్పష్టం చేశాయి.

నగర వార్తలు

'ఘంటారావం' పుస్తకావిష్కరణ



నాంపల్లి: నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో గురువారం రాత్రి గంటా మనోహర్ రెడ్డి రచించిన మినీ కవిత్వం 'ఘంటారావం' పుస్తకావిష్కరణ సభ జరిగింది. గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షులు డాక్టర్ అర్ధచంద్ర ప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథులుగా అధికార భాషా సంఘం చైర్‌పర్సన్ మంత్రి శ్రీదేవి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షులు ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి హాజరై పుస్తక సమీక్ష చేశారు.

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రేడియాలజీలో శిక్షణ

- అపోలో రేడియాలజీ ఇంటర్నేషనల్ సీఈవో, ఎండీ డాక్టర్ శ్రీనివాస రాజు

లక్డీకాపూల్ : భారతదేశంలో రేడియాలజీ ల్యాండ్‌స్కేప్‌ను మార్చే దిశగా అపోలో రేడియాలజీ ఇంటర్నేషనల్ (ఏఆర్ఐ) అడుగులు వేస్తోందని అపోలో రేడియాలజీ ఇంటర్నేషనల్ సీఈవో, ఎండీ డాక్టర్ శ్రీనివాస రాజు కలిదిండి తెలిపారు. ఈ క్రమంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రేడియాలజీ శిక్షణ అందించడమే లక్ష్యమన్నారు. జూబ్లీహిల్స్ లోని అపోలో మెడికల్ కాలేజ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రంగంలో శిక్షణ, నైపుణ్యంలో ఉన్న అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. రేడియాలజిస్ట్‌ల నైపుణ్యాన్ని పెంచడమే కాకుండా రోగి సంరక్షణపై దీని ప్రభావం ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో రేడియాలజీ వేగంగా వృద్ధి చెందుతోందని... శిక్షణ, నాణ్యత కారణంగా ఆటంకం ఏర్పడుతుందన్నారు. దీనిని గుర్తించిన అపోలో గ్రూప్‌లో భాగమైన ఏఆర్ఐ అకాడమీ భారతీయ రేడియాలజిస్టులకు అంతర్జాతీయ విద్యా ప్రమాణాలను పరిచయం చేస్తూ గేమ్ ఛేంజర్‌గా ఉద్భవించిందన్నారు. ఏఆర్ఐ గ్లోబల్ రేడియాలజీ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కోర్సు డైరెక్టర్ ప్రొఫెసర్ సుభాసిస్ చక్రవర్తి మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే భారతదేశంలో రేడియాలజీ శిక్షణలో అసమానతలను ఏఆర్ఐ గుర్తించిందన్నారు. గ్లోబల్ రేడియాలజీ ట్రైనింగ్ ప్రోగ్రామ్ అనేది భారతదేశం, విదేశాల్లో రేడియాలజిస్ట్‌ల నైపుణ్యాలు, అవకాశాలను మెరుగుపరచడానికి రూపొందించిన ఒక కార్యక్రమమని చెప్పారు. దీని ద్వారా రేడియాలజీలో ప్రపంచ పురోగతికి సహకరించడం గర్వకారణంగా ఉందన్నారు.

మేజిస్ట్రేట్‌గా మారిన కొత్వాల్!

సీఆర్పీసీ 107 ప్రకారం కమిషనరేట్‌లో కోర్టు నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య గురువారం అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా (ఎగ్జిక్యూటివ్) మారారు. క్రిమినల్ ప్రోసీజర్ కోడ్‌లోని (సీఆర్పీసీ) సెక్షన్ 107 అనుసరించి బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఉన్న నగర కమిషనరేట్‌లో కోర్టు నిర్వహించారు. చిలకలగూడ ఠాణా పరిధిలో ఉన్న ఓ ప్రార్థన స్థలం నిర్వహణకు సంబంధించి ఎంఏ కరీంతో పాటు మరో తొమ్మిది మంది, మహ్మద్ మిన్హజుద్దీన్‌తో పాటు మరో 14 మంది మధ్య కొన్నాళ్ళుగా వివాదం నెలకొంది. దీనివల్ల గతంలోనూ అనేక సమస్యలు వచ్చాయి. ఈ రెండు వర్గాలను కమిషనరేట్‌లోని కోర్టుకు పిలిపించిన కొత్వాల్ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ హోదాలో వాదలను విన్నారు. ఎట్టకేలకు ఇరువర్గాలతోనూ ఏడాది కాలానికి బాండ్ రాయించిన ఆయన ఎలాంటి వివాదాలకు తావు ఇవ్వద్దని స్పష్టం చేశారు. కాలాపత్థర్ ఠాణా పరిధిలో నివసించే మహ్మద్ నవాజ్, మహ్మద్ ఖుతుబుద్దీన్ ముఠాల మధ్య కొన్నాళ్ళుగా వైరం నడుస్తోంది. ఈ ఆధిపత్య పోరులో దాడులు, ప్రతిదాడులు చోటు చేసుకున్నాయి. ఈ రెండు గ్యాంగ్స్‌ను తన కోర్టుకు పిలిచిన కొత్వాల్ మందలించారు.

- చంద్రాయణగుట్ట ఠాణా పరిధిలో నివసించే ఖాలిద్ బిన్ అబ్దుల్ సమద్ అల్ ఆమోదీ, సులేమాన్ బిన్ సయీద్ బామ్ వర్గాల మధ్య ఉన్న ఇలాంటి సమస్యనే పరిష్కరించారు. బంజారాహిల్స్ పోలీసుస్టేషన్ పరిధిలో నివసించే సయ్యద్ మజీద్–సయ్యద్ ఎజాజ్ ముఠాల మధ్య స్థానికంగా ఆధిపత్య పోరు నడుస్తుండటంతో కొత్వాల్ వీరినీ తీవ్రంగా మందలించారు.
- ప్రజా జీవితానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పనులు చేసినా, రౌడీ కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చూసేందుకు తనకు ఉన్న ఈ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలను భవిష్యత్తులోనూ వినియోగిస్తానని స్పష్టం చేశారు.
- వివిధ కారణాల నేపథ్యంలో రౌడీషీటర్ల చేతిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల స్థితిగతుల్ని అధ్యయనం చేయాలని సందీప్ శాండిల్య నిర్ణయించారు. గడిచిన ఐదేళ్ళల్లో ఇలాంటి ఉదంతాల్లో తమ వాళ్ళను కోల్పోయిన వారి జాబితాలు రూపొందించి, క్షుణ్ణంగా పరిశీలించాల్సిందిగా కొత్వాల్ డీసీపీలను ఆదేశించారు. ఈ కార్యకలాపాలను తక్షణం ప్రారంభించాలని స్పష్టం చేశారు. అలా రూపొందిన జాబితాల మహిళ డీసీపీలు చందనా దీప్తి, కె.శిల్పవల్లి, నితిక పంత్, డి.కవిత, డి.సునితా రెడ్డి వారి ఇళ్ళకు వెళ్ళి పరిస్థితులు అధ్యయనం చేయనున్నారు. వీళ్ళు ఇచ్చే నివేదిక ఆధారంగా కొత్వాల్ సందీప్ శాండిల్య సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నారు.

డబుల్ బెడ్ రూమ్ పేరుతో అరచేతిలో స్వర్గం

సాక్షి, సిటీబ్యూరో : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్ పేరుతో నిరుపేదలకు అరచేతిలో స్వర్గాన్ని చూపించి మోసం చేశారని ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి ఆరోపించారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ పేరుతో కేసీఆర్ అధికారంలోకి వచ్చి ప్రజలకు చేసింది శూన్యమన్నారు. 27 లక్షల మందికి ఇళ్లు లేవని సమగ్ర కుటుంబ సర్వేలో స్పష్టమైందని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్స్ కట్టడానికి స్థలాలు లేవని నిధులు లేవనిపేర్కొనే కేసీఆర్‌కు కొత్త సచివాలయం కట్టడానికి నిధులు ఎట్లా వచ్చాయని ప్రశ్నించారు.డబుల్ బెడ్ రూమ్ విషయంలో ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదు .. పూర్తిగా విఫలమైందన్నారు. పేద ప్రజల కోసం కాంగ్రెస్ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చింది.. దానిని కాంగ్రెస్ కొనసాగిస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జాగా లేని వారికి జాగా ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి ఐదు లక్షల రూపాయలు ఇస్తుందని హామీ ఇచ్చారు.

ఓపెన్ వర్సిటీ పరీక్షలకు 18 లోపు ఫీజు చెల్లించాలి

సనత్‌నగర్: బ్యాక్‌లాగ్ విద్యార్థుల కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ డిగ్రీ పరీక్షా ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు ఈ నెల 18న తుది గడువు అని బేగంపేటలోని మహిళా డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ వర్సిటీ సెంటర్ కో–ఆర్డినేటర్ మారోజు రామాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2016, అంతకముందు బ్యాచ్‌లకు చెందిన బీఏ, బీకామ్, బీఎస్సీ బ్యాగ్‌లాగ్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు డిసెంబర్ 9 నుంచి 12 వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు డిసెంబర్ 9 నుంచి 14 వరకు, తృతీయ సంవత్సరం విద్యార్థులకు డిసెంబర్ 16 నుంచి 21 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

సంపులో యువకుడి మృతదేహం



హేమంత్ (ఫైల్)

కుషాయిగూడ: అదృశ్యమైన ఓ యువకుడు సంపులో శవమై తేలిన సంఘటన గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన మేరకు.. కాప్రా, గాంధీనగర్ కాలనీకి చెందిన హేమంత్ అలియాస్ చింటుకు చిన్ననాటి నుంచే మానసిక పరిస్థితి బాగోలేదు. ఇంటి వద్దే ఉండే హేమంత్ బుధవారం సాయంత్రం నల్లా నీటిని పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు సంపులో పడిపోయాడు. గమనించని తల్లిదండ్రులు అతడి ఆచూకీ కోసం కాలనీలో వెతికారు. ఫలితం లేకపోవడంతో బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో తన కుమారుడు కనిపించడం లేదంటూ తండ్రి కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇంటికి వెళ్లి వివరాలు సేకరించగా నల్లా నీటిని పట్టేందుకు వెళ్లి కనిపించకుండా పోయాడని తల్లిదండ్రులు తెలిపారు. అనుమానం కలిగిన పోలీసులు సంపు వద్దకు వెళ్లి చూడగా హేమంత్ చెప్పులు సంపులో తేలాడుతు కనిపించాయి. సంపులో పడిపోయినట్లు భావించిన పోలీసులు సంపులో వెతికి హేమంత్ మృతదేహాన్ని గుర్తించారు. చివరకు పోలీసులు అనుమానమే నిజమైంది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

గుర్తుతెలియని యువకుడి మృతి..

మియాపూర్ : మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ దశరథ్ తెలిపిన మేరకు.. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రబాబు నాయుడు గెస్ట్ హౌస్ సమీపంలో రైల్వే పట్టాల పక్క ఓ యువకుడు పడి ఉన్నాడని స్థానికులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆ యువకుడు అప్పటికే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మణికొండలో కొండచిలువ కలకలం



మణికొండ: అడవుల్లో ఉండాల్సిన కొండ చిలువ జనావాసాల్లోకి రావటంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. బుధవారం రాత్రి మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ కమ్యూనిటీహాల్ పక్క నుంచి పారే పందెన్ వాగు గట్టుపై కొండచిలువ కనిపించింది. 15అడుగుల పొడవు, 50 కిలోల వరకు బరువు ఉండటంతో స్థానికులు భయాందోళన చెందారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పట్టుకుని జూపార్క్‌కు తరలించారు.

బాలికను బడిలో ఉంచి తాళం వేసుకెళ్లారు

- పాఠశాల అనంతరం గమనించని సిబ్బంది
- గదిలోనే బిక్కు బిక్కుమంటూ చిన్నారి
- బాచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్లక్ష్యం



తరగతి గదిలో ఉన్న చిన్నారి వేదాంజలి

నిజాంపేట్ : రోజూ బడికి వెళ్లే ఆరేళ్ల కూతురు స్కూల్ అయిపోయిన తరువాత సాయంత్రమైనా ఇంటికి రాకపోతే..ఆ తల్లిదండ్రులకు ఎంత నరకం.. ఎక్కడికెళ్లిందో.. ఏమో..ఎవరెత్తుకెళ్లారోనన్న ఆందోళన..! వెంటనే తెలిసిన వారందరినీ అడుగుతారు.. వారు తెలియదని సమాధానం చెబితే నరకం..!ఆ సమయంలో ఏం చేయాలో అర్థం కాదు.. ఎక్కడని వెతకాలి..పోలీసులకు ఫిర్యాదు చేయాలి.. ఈ టెన్షన్‌లో ఉన్న అమ్మానాన్నలకు వారి కూతురు పాఠశాలలోనే ఉందని తెలిస్తే వారి ఆనందం వర్ణనాతీతం.. అయితే ఆ బాలికను లోపలే ఉంచి తాళం వేసుకెళ్లారని చెబితే ఇంతకంటే దారుణం మరొకరటి ఉండదేమో. మరి.. ఇలాంటి సంఘటనే బాచుపల్లిలో చోటుచేసుకుంది. పాఠశాల సిబ్బంది బాలికను పాఠశాలలోనే ఉంచి గమనించకుండా తాళం వేసి నిర్లక్ష్యంగా వెళ్లిపోయారు. బాచుపలిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం, ప్రభావతి దంపతులకు వేదాంజలి(6) అనే కుమార్తె ఉంది. ఆ చిన్నారి స్థానికంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతోంది.

- రోజూ మాదిరిగానే గురువారం పాఠశాలకు వెళ్లిన చిన్నారి సాయంత్రం 4 గంటలకు స్కూల్ ముగిసిన తరువాత ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి చూడగా తాళం వేసి ఉండటంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోయింది.
- మరోమారు పాఠశాల వద్ద వెతుకుతుండగా తరగతి గది నుంచి చిన్నారి ఏడుపు వినిపించింది. దీంతో తమ కుమార్తె తరగతి గదిలో ఉందని గ్రహించిన సుబ్రహ్మణ్యం, ప్రభావతిలు చుట్టు పక్కల వారి సహాయంతో పాఠశాల తరగతి గది తాళం పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా చిన్నారి రోదిస్తూ కనిపించింది. దీంతో తమ కుమార్తెను అక్కున చేర్చుకుని ఇంటికి తీసుకువెళ్లారు.
- పాఠశాల ఆయా తప్పిదం వల్లే తమ చిన్నారి తరగతి గదిలో ఉండి పోయిందని.. పాఠశాల ముగిసిన తరువాత తరగతి గదిలో చిన్నారులు బయటకు వెళ్లారో లేదో చూసుకోకుండా తాళం వేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పెళ్లి పేరుతో మోసాలు...

- మ్యాట్రిమోనీని అడ్డుపెట్టుకొని చోరీలు
- నిందితుడి అరెస్టు
- రూ.27 తులాల బంగారు ఆభరణాల స్వాధీనం

రాంగోపాల్‌పేట్: మాట్రిమోనీలో పెళ్లిళ్ల కోసం నమోదు చేసుకున్న మహిళలను టార్గెట్ చేసుకుని మోసాలకు పాల్పడుతున్న ఓ నిందితుడిని మార్కెట్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 27 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. గురువారం ఉత్తర మండలం డీసీపీ కార్యాలయంలో మహంకాళి ఏసీపీ రవీందర్, మార్కెట్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ, డీఐ వెంకటరమణలతో కలిసి వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం నెడనూర్ గ్రామానికి చెందిన తుమ్మ మోహన్‌రెడ్డి (38) 2011లో కల్వకుర్తికి చెందిన మహిళతో వివాహం జరిగి గొడవలు రావడంతో ఆమెకు దూరంగా ఉంటున్నాడు. మ్యాట్రిమోనీలో శ్రీనాథ్ అనే పేరుతో పేరు నమోదు చేసికున్నాడు. భారత్ మాట్రిమోనీలో విడాకులు తీసుకున్న ఓ మహిళ రెండవ పెళ్లి కోసం నమోదు చేసుకోగా ఆమె ప్రొఫైల్‌ను సేకరించాడు. ఆమెకు ఫోన్ చేసి తాను పెళ్లి చేసుకుంటానని అయితే ఒక సారి నేరుగా కలుద్దామని చెప్పాడు. వచ్చే సమయంలో నగలతో పాటు వస్తే ఫొటో తీసుకుని తన తల్లిదండ్రులకు చూపించి పెళ్లి చేసికుంటానని నమ్మించాడు. దీన్ని నమ్మిన ఆ మహిళ ఈ నెల 7న సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాత్రి ఇన్ హోటల్‌కు వచ్చారు. రెడీ అయ్యే ముందు వాష్ రూమ్‌కు వెళ్లి ఫ్రెషప్ కావాలని చెప్పాడు. దీంతో ఆమె వాష్ రూమ్‌కు వెళ్లి వచ్చే లోపు ఆమెకు చెందిన 27 తులాల బంగారు ఆభరణాలున్న బ్యాగును తీసుకుని హోటల్ నుంచి పరారయ్యాడు. నిందితున్ని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వివిధ కేసుల్లో నిందితుడు

ఇదే విదంగా నిందితుడు మోహన్‌రెడ్డి షాదీ డాట్ కామ్‌లో గౌతమ్‌రెడ్డి పేరుతో పేరు నమోదు చేసికుని ఓ మహిళను నమ్మించాడు. ఆమెకు నమ్మకం కలిగిన తర్వాత ఆమె క్రెడిట్ కార్డు ద్వారా రూ.6.20 లక్షలతో బంగారు నగలు కొనుగోలు చేసి పరారయ్యాడు.

- మరో మాట్రిమోనీలో విజయరెడ్డి పేరుతో పేరు నమోదు చేసికుని రూ.9లక్షలు తన అకౌంట్‌లో వేసుకున్నాడు.
- కల్వకుర్తిలో ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తూ 10వ తరగతి చదువుతున్న బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించి 3 నెలలు జైలుకు వెళ్లివచ్చాడు.
- కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో తన బంధువుకే కారు పేరుతో రూ.4.50లక్షలు మోసం చేశాడు. మాదాపూర్‌లోని హాస్టల్‌లో ఉంటూ రూ.70వేల విలువ చేసే ల్యాప్‌టాప్ తదితర వస్తువులను దొంగతనం చేశాడు.
- చైతన్యపురిలో మరో హాస్టల్‌లో రూ.40వేల విలువ చేసే ల్యాప్‌టాప్ దొంగతనం చేశాడు. ఇలా పలు కేసుల్లో నిందితుడు పరారీలో ఉన్నాడు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం
17-11-2023

సంస్కృతి

ప్రతి సంస్కృతిలో స్థానిక బొమ్మలుంటాయి.
మనకు కొండపల్లి, నిర్మల్...
బిహార్‌లో కన్యాపుత్రి.
అయితే బార్బీలు, బాట్‌మేన్‌ల హోరులో
అవన్నీ వెనుకబడ్డాయి.
కాని పిల్లలకు
ఎటువంటి బొమ్మలు ఇష్టమో
తెలిసిన టీచరమ్మ నమితా ఆజాద్
అక్కడ వాటికి మళ్లీ జీవం పోసింది.
కొలువు తీర్చింది.
సంస్కృతిలో భాగమైన
ఆ బొమ్మలను చూడగానే
పిల్లలకు ప్రాణం లేచివస్తుంది.
నమిత చేస్తున్న కృషి గురించి..


నమితా ఆజాద్

బిహార్ బొమ్మలట కొలువుకు సిద్ధమట

ఒక టీచరమ్మ కేవలం పిల్లలు ఆడుకునే బొమ్మల కోసం బంగారం లాంటి ప్రభుత్వ ఉద్యోగం వదిలేసింది. మనుషులు అలాగే ఉంటారు. ఏదైనా మంచి పని చేయాలంటే చేసి తీరుతారు. పట్నాకు చెందిన నమితా ఆజాద్‌ను వారం క్రితం బిహార్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక 'బిహార్ హస్తకళల పురస్కారం-2023'తో సత్కరించింది. పిల్లల బొమ్మల కోసం ఆమె తన జీవితాన్ని అంకితం చేయడమే అందుకు కారణం.

కన్యాపుత్రి బొమ్మలు

వీటిని బిహార్‌లో 'గుడియా' అని కూడా అంటారు. బిహార్‌లో చంపారన్ జిల్లాలో గడ్డ పీలికలతో తయారు చేసే బొమ్మలు ఒకప్పుడు సంస్కృతిలో భాగంగా ఉండేవి. ముఖ్యంగా వర్షాకాలం వస్తే ఒక ప్రత్యేకమైన రోజున ఇంటి ఆడపిల్లలు ఈ బొమ్మలను విశేషంగా అలంకరించి దగ్గరలోని చెరువు ఒడ్డున నిమజ్జనం చేస్తారు. వారి అన్నయ్యలు ఆ బొమ్మలను వెలికి తెచ్చి చెల్లెళ్లకు ఇస్తారు. ఆ తర్వాత మిఠాయిలు పంచుకుంటారు. కన్యాపుత్రి బొమ్మలు ముఖ్యంగా అన్నాచెల్లెళ్ల అనుబంధానికి గుర్తుగా ఇళ్లల్లో ఉంచుతారు. పిల్లలు ఆడుకుంటారు. కొత్త పెళ్లి కూతురు అత్తారింటికి వచ్చేటప్పుడు తనతో పాటు కొన్ని అలంకరించిన కన్యాపుత్రి బొమ్మలు తెచ్చుకోవడం ఆనవాయితీ. 'నా చిన్నప్పుడు మా అమ్మ, అమ్మమ్మలు ఈ బొమ్మలు చూపిస్తూ ఎన్నో కథలు చెప్పడం జ్ఞాపకం' అంటుంది నమితా ఆజాద్.

వదలని ఆ గుడియాలు

నమితా ఆజాద్... చంపారన్ జిల్లాలో పుట్టి పెరిగింది. ఎం.ఏ. సైకాలజీ చేశాక చండీగఢ్‌లోని 'ప్రాచీన్ కళాకేంద్ర'లో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్‌లో మాస్టర్స్ చేసింది. ఆ సమయంలోనే ఆమెకు బాల్యంలో ఆడుకున్న కన్యాపుత్రి బొమ్మలు గుర్తుకొచ్చాయి. వాటిని తిరిగి తయారు చేయాలని అనుకుంది. ఇంట్లో పని చేసే ఇద్దరు మహిళలతో కొన్ని బొమ్మలు తయారు చేసి ఒక ప్రదర్శనలో ఉంచితే వెంటనే అమ్ముడుపోయాయి. ఆమెకు ఉత్సాహం వచ్చింది ఆ రోజు నుంచి ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు కన్యాపుత్రి బొమ్మలను తయారు చేస్తూ హస్తకళల ప్రదర్శనలో ప్రచారం చేసింది. 2013 నాటికి వాటికి దక్కుతున్న ఆదరణ, వాటి అవసరం అర్థమయ్యాక ప్రభుత్వ టీచర్ ఉద్యోగాన్నే మానేసింది.

పిల్లల సైకాలజీ తెలిసి

పిల్లల సైకాలజీ తెలిసిన వారికి బొమ్మలు పిల్లల వికాసానికి ఎంతగా ఉపయోగపడతాయో తెలుస్తుంది అంటుంది నమితా. ఆ బొమ్మలతో పశు పక్ష్యాదులను తయారు చేస్తారు కనుక కవాటి వల్ల సమిష్టి కుటుంబాలు, మైక్రో కుటుంబాలు, అన్నాచెల్లెళ్ల బంధాలు, సామాజిక బంధాలు, పర్యావరణ స్పృహ అన్నీ తెలుస్తాయి అంటుంది నమితా. పిల్లలకు సామాజిక సందేశాలు ఇవ్వాలన్నా, కొన్ని పాఠాలు వారికి అర్థమయ్యేలా చెప్పాలన్నా ఈ బొమ్మలు చాలా బాగా ఉపయోగపడతాయని ఆమె టీచర్లకు నిర్వహించి వర్క్‌షాప్‌ల ద్వారా తెలియచేస్తోంది.

నమితా లాంటి సంస్కృతీ ప్రేమికులు ప్రతిచోటా ఉంటే సిసలైన పిల్లల బొమ్మలు వారిని సెల్‌ఫోన్ల నుంచి వీడియో గేమ్స్ నుంచి కాపాడుతాయి.

ఎకో ఫ్రెండ్లీ బొమ్మలు



కన్యాపుత్రి బొమ్మలు ప్లాస్టిక్ లేనివి. అదీగాక మారణాయుధాలు, పాశ్చాత్య సంస్కృతి ఎరగనివి. మన దేశీయమైనవి. టైలర్ల దగ్గర పడి ఉండే పీలికలతో తయారు చేసేవి. అందుకే నమితా ఇప్పుడు 'ఎన్' క్రియేషన్స్ అనే సంస్థ పెట్టి 15 మంది మహిళలకు ఉపాధి కల్పించి ఈ బొమ్మలు తయారు చేస్తోంది. అంతే కాదు బిహార్ అంతా తిరుగుతూ వాటిని తయారు చేయడం మహిళలకు నేర్పించి వారికి ఉపాధి మార్గం చూపుతోంది.

వంటిల్లు

ఊ...రించే సిరి



తిన్న తిండి ఒంటికి పట్టేలా చేయడంతో ఉసిరి ప్రముఖ పాత్ర పోషిస్తుంది. చర్మాన్ని యవ్వనంగా ఉంచడం, క్యాన్సర్ ముప్పుని తగ్గించడంలో ఉసిరి చేసే మేలు అంతా ఇంతా కాదు. ఇన్ని సుగుణాలు ఉన్న ఉసిరి ప్రస్తుతం మార్కెట్లో దండిగా దొరుకుతోంది. అందుకే ఊరించే ఉసిరిని మరింత రుచిగా ఇలా చేసుకోమని చెబుతోంది ఈ వారం మన వంటిల్లు...

మెంతి ఉసిరి కుర్మా



కావలసినవి: ఉసిరి కాయలు – పది; మెంతిఆకు –రెండు కట్టలు ; పచ్చిమిర్చి – రెండు; అల్లం – అంగుళం ముక్క; వెల్లుల్లి రెబ్బలు – ఐదు; ఉల్లిపాయలు – రెండు; టొమాటోలు – రెండు; నూనె – రెండు టేబుల్ స్పూన్లు; జీలకర్ర – అర టీస్పూను; సోంపు – అర టీస్పూను; వాము – టీస్పూను; ఇంగువ – చిటికెడు; పసుపు – అర టీస్పూను; గరం మసాలా – టీస్పూను; ధనియాల పొడి – టీస్పూను; జీలకర్ర – టీస్పూను; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ఉసిరికాయలను శుభ్రంగా కడిగి ఉడికించాలి. • ఉడికిన తర్వాత గింజలు తీసేసి, పెద్దసైజు ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి • ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, టొమాటోలను సన్నగా తరిగి పెట్టుకోవాలి. అల్లం వెల్లుల్లిని సన్నగా తరగాలి • మెంతిఆకును కడిగి, సన్నగా తరిగి పెట్టుకోవాలి • మందపాటి బాణలిలో నూనెవేసి వేడెక్కనివ్వాలి • నూనె కాగిన తరువాత, మీడియం మంట మీద ఉంచి..జీలకర్ర, సోంపు, వాము వేయాలి • ఇవి చిటపటలాడాక పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి తరుగు వేసి నిమిషం పాటు వేగనివ్వాలి • ఇప్పుడు ఉల్లిపాయ ముక్కలు వేసి ఐదు నిమిషాలు మగ్గనియ్యాలి • ఉల్లిపాయ ముక్కలు చక్కగా వేగిన తరువాత టొమాటో ముక్కలు కొద్దిగా నీళ్లుపోసి మూతపెట్టి మగ్గనివ్వాలి • రెండు నిమిషాల తరువాత మూత తీసి పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి • మరో ఐదు నిమిషాలు మగ్గిన తరువాత టొమాటో ముక్కలు చక్కగా మెత్తబడతాయి. ఇప్పుడు మెంతిఆకు తరుగు వేసి కలపాలి • సన్నని మంట మీద కలుపుతూ ఉంటే మెంతి ఆకు ఇట్టే మగ్గిపోతుంది • మెంతిఆకు మగ్గిన తరువాత గరం మసాలా, జీలకర్ర, ధనియాల పొడులు వేయాలి • వెంటనే ఉసిరికాయ ముక్కలను వేసి మసాలాలు ముక్కలకు పట్టేలా కలపాలి • చివరిగా రెండు టేబుల్ స్పూన్లు నీళ్లు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి. ఐదు నిమిషాలు మూతపెట్టి మగ్గనిస్తే మెంతి ఉసిరి కుర్మా రెడీ • చపాతీ, రోటీ, అన్నం, సలాడ్‌లోకి ఈ కుర్మా మంచి కాంబినేషన్.

ఆమ్లా ఛుందా



కావలసినవి: ఉసిరికాయలు – అరకేజీ; బెల్లం – అరకేజీ; అల్లం – చిన్నముక్క; బ్లాక్‌సాల్ట్ – ఒకటిన్నర టీస్పూన్లు; మిరియాలు – టీస్పూను; యాలక్కాయలు – ఎనిమిది; దాల్చిన చెక్క – అంగుళం ముక్క; పసుపు – టీస్పూను; కశ్మీరీ కారం – ఒకటిన్నర టీస్పూన్లు; గరం మసాలా – అర టీస్పూను; నిమ్మకాయలు – రెండు.

తయారీ: ఉసిరికాయలను శుభ్రంగా కడిగి, ఆవిరి మీద మెత్తగా (10 నిమిషాలు) ఉడికించాలి • అల్లాన్ని సన్నగా తురిమి పెట్టుకోవాలి • యాలక్కాయలు, మిరియాలను విడివిడిగా దంచి పెట్టుకోవాలి • ఉడికిన ఉసిరికాయలు చల్లారాక గింజలు తీసి సన్నగా తురుముకోవాలి. • ఉసిరి తురుములో బెల్లం వేసి మీడియం మంట మీద పెట్టాలి • అడుగంటకుండా కలుపుతూ ఉండాలి. నీరు పైకి తేలగానే అల్లం తురుము, బ్లాక్ సాల్ట్, మిరియాల పొడి, యాలకుల పొడి వేయాలి • దాల్చిన చెక్కను తుంచి వేయాలి • చివరిగా పసుపు వేసి కలుపుతూ ఉడికించాలి • మీడియం మంట మీదే ఉంచి కలుపుతూ మిశ్రమం దగ్గర పడుతున్నప్పుడు కారం, గరంమసాలా వేసి కలపాలి. • బాగా కలిసిన తరువాత దించేసి, నిమ్మరసం పిండితే ఆమ్లా ఛుందా రెడీ.

గమనిక: గాజు లేదా పింగాణీ పాత్రల్లో నిల్వ చేస్తే ఎక్కువ కాలం తాజాగా ఉంటుంది.

స్పైసీ పచ్చడి



కావలసినవి: ఉసిరి కాయలు – ఆరు; పచ్చి శనగపప్పు – పావు కప్పు; పచ్చిమిర్చి – మూడు; వెలుల్లి రెబ్బలు – నాలుగు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – టీస్పూను; ఆవాలు – అర టీస్పూను; జీలకర్ర – అర టీస్పూను; పసుపు – పావు టీస్పూను; ఇంగువ – చిటికెడు; కరివేపాకు – రెండు రెమ్మలు; కొత్తిమీర తరుగు – కాస్తంత

తయారీ: పచ్చిశనగపప్పుని శుభ్రంగా కడిగి నాలుగు గంటలపాటు నానబెట్టుకోవాలి • ఉసిరికాయలను శుభ్రంగా కడిగి గింజలు తీసేసి ముక్కలుగా తరుగు కోవాలి. • ఉసిరికాయ ముక్కలు, నానిన శనగ పప్పు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, రుచికి సరిపడా ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి • అవసరాన్ని బట్టి కొద్దిగా నీళ్లుపోసి గ్రైండ్ చేయాలి • గ్రైండ్ అయిన పచ్చడిని గిన్నెలోకి తీసుకోవాలి • బాణలిలో నూనె వేసి, ఆవాలు జీలకర్ర, ఇంగువ, పసుపు, కరివేపాకు వేసి తాలింపు పెట్టాలి • ఈ తాలింపుని పచ్చడిలో వేసి కలపాలి. చివరిగా కొత్తిమీర తరుగు వేసి కలిపితే స్పైసీ పచ్చడి రెడీ. చపాతీ, రోటీ, అన్నంలోకి ఈ పచ్చడి చాలా బావుంటుంది.

యువర్స్

• టెక్.. టాక్

ఇన్‌స్టాలో ఫోటోలు ఎడిట్ చేయడానికి...



1) ప్రొఫైల్‌లోకి వెళ్లి ఎడిట్ చేయాలనుకుంటున్న పోస్ట్ కోసం స్క్రోల్ చేయాలి 2) టాప్-రైట్ కార్నర్‌లో మూడు డాట్స్ లేదా మెనూ ఐకాన్ కనిపిస్తుంది. 'మోర్ ఆప్షన్స్' కోసం దీనిపై ట్యాప్ చేయాలి 3) మెనూలో 'ఎడిట్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి 4) ఇప్పుడు ఫోటోలు, క్యాప్షన్... మొదలైన వాటిలో మార్పులు, ఇమేజ్‌ను ఎడిట్, రిప్లేస్ చేసుకోవచ్చు 5) ఎడిట్స్ పూర్తయిన తరువాత స్క్రీన్ టాప్-రైట్ కార్నర్‌లోని 'డన్' లేదా 'సేవ్' బటన్ నొక్కాలి.



టెలిస్కోప్ రీఫ్రాక్టరీ విత్ మొబైల్ స్టాండ్ అండ్ పోర్టబుల్ ట్రైపాడ్ స్టాండ్

బ్రాండ్	:	సెబో
ఆబ్జెక్టివ్ లెన్స్ డయామీటర్	:	20 మిల్లీ మీటర్స్
ప్రొడక్ట్ డైమెన్షన్స్	:	44డీx20 డబ్ల్యూx10 హెచ్
బరువు	:	920 గ్రా.
కంపాటబుల్ డివైజెస్	:	స్మార్ట్‌ఫోన్



సైజ్: 6.74 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 90 హెచ్‌జడ్
రిజల్యూషన్: 720X1600 పిక్సెల్స్
బరువు: 200 గ్రా.
బ్యాటరీ: 5,000 ఎంఏహెచ్

గెలాక్సీ ఏఐ



మెరుగైన కమ్యూనికేషన్ కోసం క్రియేటివ్ ఫీచర్‌ల ద్వారా 'గెలాక్సీ ఏఐ' రూపంలో 'ప్రతి ఒక్కరినీ ప్రతి చోట శక్తిమంతం చేసే ఏఐ సాంకేతికతను పరిచయం చేయనున్నట్లు టెక్ దిగ్గజం శాంసంగ్ ప్రకటించింది. రాబోయే కాలంలో స్మార్ట్‌ఫోన్‌ల కోసం సరికొత్త ఏఐ ఫీచర్‌లను తీసుకురానుంది. అందులో ఒకటి... ఏఐ పవర్డ్ ట్రాన్స్‌లేషన్ ఫీచర్. కొత్త ఏఐ లైవ్ ట్రాన్స్‌లేట్ కాల్ ఫీచర్‌తో ఇతర భాషలలో మాట్లాడే వారితో రియల్ టైమ్ ఆడియో, టెక్స్ట్ అనువాదానికి వీలవుతుంది. థర్డ్ పార్టీ ట్రాన్స్‌లేట్ యాప్‌లతో పనిలేదు. రాబోయే సంవత్సరాన్ని 'ఏ న్యూ ఎరా ఆఫ్ గెలాక్సీ ఏఐ' అని పిలుస్తోంది శాంసంగ్.

వివో వాచ్ 3

డిస్‌ప్లే: 1.43 అంగుళాలు
బ్యాటరీ: 505 ఎంఏహెచ్
ఇన్‌బిల్ట్ స్టోరేజ్: 64జీబి
కలర్స్: బ్లాక్, బ్రైట్ మూన్, మూన్‌లైట్ వైట్, స్టార్‌లైట్
రిజల్యూషన్: 466X466 పిక్సెల్స్



• మ్యూజిక్ వరల్డ్

ఇంటింటికీ సంగీతం


కామాక్షి, విశాల

'నేర్చుకున్న విద్యను పదిమందికి పంచుదాం' అంటున్నారు కామాక్షి, విశాల సిస్టర్స్. ముంబైకి చెందిన ఈ అక్కాచెల్లెళ్లు 'ది సౌండ్ స్పేస్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించి తాము నేర్చుకున్న సంగీతాన్ని పేద పిల్లల చెంతకు తీసుకువెళుతున్నారు. గత పది సంవత్సరాలుగా కామాక్షి, విశాల సిస్టర్స్ పది వేలమంది పిల్లలకు సంగీత పాఠాలు బోధించారు. టైమ్‌తో అప్‌డేట్ అవుతూ పిల్లలు సులభంగా అర్థం చేసుకునేలా పాఠాలను డిజైన్ చేశారు. 'జీవితంలో ప్రతి దశలో సంగీతం ఆహ్లాదాన్ని, శక్తిని ఇస్తుంది. సంగీతం అనేది బాగా డబ్బులు ఉన్న వాళ్ల కోసమే అనే భావనను మార్చాలనుకున్నాం' అంటుంది కామాక్షి. విశాల, కామాక్షి లక్నో యూనివర్శిటీలో మ్యూజిక్ కోర్సు చేశారు. 'చదువు, ఆరోగ్యం... మొదలైనవి మాత్రమే పిల్లలకు ముఖ్యం అనే వాళ్లు చాలామంది ఉన్నారు. అయితే కోవిడ్ కల్లోల కాలంలో మ్యూజిక్ థెరపి గొప్పదనం ఏమిటో తెలిసింది' అంటుంది విశాల.

• అవును... ఇది నిజమే!

మెంటల్ డిక్షనరీ



డిక్షనరీ అనేది బుక్‌షెల్ఫ్‌లోనే కాదు మనలోనూ ఉంటుంది. దీన్ని మెంటల్ డిక్షనరీ అంటారు. ఫిజికల్ డిక్షనరీలాగే ఈ మెంటల్ డిక్షనరీలోనూ రకరకాల పదాలు, వాటికి సంబంధించిన సమాచారం నిక్షిప్తమై ఉంటుంది. మెంటల్ డిక్షనరీ విషయంలో ఒక వ్యక్తికి మరో వ్యక్తికి మధ్య స్వల్ప తేడాలు ఉంటాయి. రకరకాల కారణాల వల్ల కొందరి మెంటల్ డిక్షనరీలో పరిమితమైన పదసంపద మాత్రమే ఉండొచ్చు. కొందరి విషయంలో మాత్రం విద్య, కళలు, జీవితానుభవాలు...మొదలైన వాటి వల్ల పదసంపద ఎక్కువగా ఉంటుంది. 20 సంవత్సరాల అమెరికన్ ఇంగ్లీష్ స్పీకర్‌కు 40,000 పదాల వరకు తెలిసి ఉంటాయని, 60 ఏళ్ల వయసులో ఆ పదాల సంఖ్య 48,000లకు చేరుతుందని, కొందరి విషయంలో ఇది మరీ ఎక్కువగా ఉండవచ్చు అంటున్నారు పరిశోధకులు. కొన్ని సందర్భాలలో మనం ఉపయోగించాల్సిన పదం గురించి తెలిసినా గుర్తు రాకపోవచ్చు. ఈ పరిస్థితిని టిప్-ఆఫ్-ది-టంగ్ ఫినామినన్ అంటారు. వయసు పెరుగుతున్న కొద్దీ ఈ పరిస్థితి ఎక్కువగా ఎదురవుతుంది.

• సక్సెస్ స్టోరీ


• ఆర్యన్, వైభవ్ కౌశిక్, అలాప్ నాయర్

విజయ వైభవం

బారెడు బారెడు 'క్యూ'లు అంటే భయం లేనిది ఎవరికి? ఎందుకంటే బోలెడు టైమ్ వృథా అవుతుంది. అసహనం పెట్రోల్ ధరలా పెరుగుతుంది. ఫ్యూయల్ స్టేషన్‌ల దగ్గర పెద్ద పెద్ద 'క్యూ'లను చూసిన, వాహనదారుల అసహనాన్ని విన్న అనుభవంతో వైభవ్ కౌశిక్ తన స్నేహితులు అలాప్ నాయర్, ఆర్యన్‌లతో కలిసి స్టార్ట్ చేసిన 'నవ్గతీ' స్టార్టప్ విజయపథంలో దూసుకుపోతోంది.

కొన్ని సంవత్సరాల క్రితం గ్రేటర్ నోయిడాకు చెందిన వైభవ్ కౌశిక్ క్యాబ్‌లో ప్రయాణిస్తున్నప్పుడు క్యాబ్ ఒక ఫ్యూయల్ స్టేషన్ దగ్గర ఆగింది. అక్కడ పెద్ద క్యూ ఉంది. చాలా టైమ్ తరువాత బండి రోడ్డు పైకి వచ్చింది.

'ఇలా అయితే కష్టం కదా' అని డ్రైవర్‌తో మాటలు కలిపాడు వైభవ్.

'ఎప్పుడూ ఇదే కష్టం. టైమ్ వృథా అవుతుంది. బేరాలు పోతున్నాయి' అసంతృప్తిగా అన్నాడు డ్రైవర్. 'ఈ సమస్యకు పరిష్కారం లేదా' అని ఆలోచించడం మొదలు పెట్టాడు వైభవ్. కొద్దిసేపటి తరువాత అతనిలో ఒక ఐడియా మెరిసింది. అదే నవ్గతీ. తన కాలేజీ ఫ్రెండ్స్ ఆలాప్ నాయర్, ఆర్యన్‌లతో కలిసి వైభవ్ కౌశిక్ స్టార్ట్ చేసిన నవ్గతీ (మార్గదర్శనం) స్టార్టప్ సక్సెస్‌ఫుల్‌గా దూసుకుపోతోంది.

ఇంధన స్టేషన్‌ల దగ్గర రద్దీ వల్ల వాహనదారుల టైమ్ వృథా కాకుండా, ప్రత్యామ్నాయ నిర్ణయాలు తీసుకోవడానికి ఈ వన్-స్టాప్ ఫ్యూయల్ అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్ రియల్-టైమ్ అప్‌డేట్స్‌ను అందిస్తుంది.

రెండు సంవత్సరాల క్రితం దిల్లీలోని ఇంద్రప్రస్థ గ్యాస్ స్టేషన్‌లో పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించారు.

డాటా-బ్యాక్‌డ్ ప్లాట్‌ఫామ్ ఆవెగ్, ఫ్యూయలింగ్ యాప్ అనే రెండు సర్వీసులను ఆఫర్ చేస్తోంది నవ్గతీ. బీ2సీ ఫ్యూయల్ డిస్కవరీ యాప్ ఫ్యూయల్ రేటు, అందుబాటు, సర్వ్ టైమ్...మొదలైన సమాచారాన్ని అందిస్తుంది. ఫ్యూయల్ స్టేషన్‌కు సంబంధించి రివ్యూకు అవకాశం కల్పిస్తుంది.

ఇక 'ఆవేగ్' ద్వారా ఫ్యూయల్ స్టేషన్‌లకు సంబంధించి రవాణా సమయం, వెయిటింగ్ టైమ్, సర్వింగ్ టైమ్, వనరుల వినియోగం తక్కువగా ఉందా, ఎక్కువగా ఉందా... సమగ్ర సమాచారం తెలుసుకోవచ్చు. దీని ద్వారా ఫ్యూయల్ స్టేషన్‌లు తమ సర్వీసులను మెరుగుపరుచుకోవడానికి వీలవుతుంది.

'గతంలో ఫ్యూయల్ స్టేషన్‌లు కాంప్లయెన్స్ డిటైల్స్, లావాదేవీలు, అటెండెన్స్... వాటికి సంబంధించి డే-టు-డే డాటాను మాన్యువల్‌గా రికార్డ్ చేసేవి. ఇప్పుడు మాత్రం 'ఆవేగ్' రూపంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని యాక్టివిటీలను ఆటోమేట్ చేయవచ్చు. దీనివల్ల ఫ్యూయల్ స్టేషన్‌లు తమ సామర్థ్యాన్ని మెరుగు పరుచుకోవచ్చు. ఖర్చులు తగ్గించుకోవచ్చు' అంటున్నాడు వైభవ్ కౌశిక్.

ఇంద్రప్రస్థా గ్యాస్ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్-దిల్లీ, మహానగర్ గ్యాస్ లిమిటెడ్-ముంబైకి సంబంధించిన 150 ఫ్యూయల్ స్టేషన్‌లలో ఈ స్టార్టప్ తమ ఎడ్జ్ కంట్రోలర్‌లను ఇన్‌స్టాల్ చేసింది.

దేశంలోని పెద్ద పట్టణాలతో పాటు చిన్న పట్టణాలలో కూడా విస్తరించే ప్రణాళికలు రూపొందించుకుంది.

మొదట్లో సూపర్ యూజర్‌లతో ఒక వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. కొత్త ఫీచర్‌లను పరీక్షించడానికి, మెరుగు పరచడానికి ఈ గ్రూప్ బీటా టెస్టింగ్ గ్రూప్‌గా ఉపయోగపడింది.

ఏకాంత ఆలోచనల్లో నుంచే కాదు చూసే సమస్యల్లో నుంచి కూడా స్టార్టప్ ఐడియాలు పుడతాయని, గట్టి కృషి చేస్తే స్టార్టప్ కలలు సాకారం అవుతాయని చెప్పడానికి 'నవ్గతీ' స్టార్టప్ ఒక ఉదాహరణ.

తెలియకపోయినా పట్టుదలతో...



ఇరవై సంవత్సరాల వయసులో మా ప్రయాణాన్ని ప్రారంభించాం. స్టార్టప్ ప్రపంచం ముఖ్యంగా ఫ్యూయల్-టెక్ గురించి పెద్దగా తెలియకపోయినా ఎప్పుడూ అధైర్యపడలేదు. వెనక్కి తగ్గలేదు. ఆసక్తి, పట్టుదలతో నేర్చుకున్నాం. సవాలుకు సక్సెస్‌తోనే జవాబు ఇవ్వాలనుకున్నాం. 'ఐడియా బాగానే ఉందిగానీ వర్కవుట్ అవుతుందా?' అని సందేహించిన వారికి కూడా మా సక్సెస్‌తో సమాధానం చెప్పాం.

– వైభవ్ కౌశిక్, కో-ఫౌండర్, సీఈవో నవ్గతీ స్టార్టప్

8 వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్ చేరడం ఆస్ట్రేలియా జట్టుకిది ఎనిమిదో సారి. గతంలో ఆ జట్టు 1975 (రన్నరప్), 1987 (విజేత), 1996 (రన్నరప్), 2003 (విజేత), 1999 (విజేత), 2007 (విజేత), 2015 (విజేత)లలో ఏడుసార్లు టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచి, రెండుసార్లు రన్నరప్‌తో సంతృప్తి పడింది.

5 వన్డే ప్రపంచకప్ చరిత్రలో ఐదో సెమీఫైనల్ ఆడిన దక్షిణాఫ్రికా ఐదుసార్లు ఈ అడ్డంకిని దాటలేకపోయింది. 1992లో ఇంగ్లండ్ చేతిలో ఓడిపోగా... 1999లో ఆస్ట్రేలియాతో సెమీఫైనల్ మ్యాచ్‌ను దక్షిణాఫ్రికా 'టై' చేసుకుంది. అయితే 'సూపర్ సిక్స్' దశలో ఎక్కువ పాయింట్లు సాధించినందుకు ఆస్ట్రేలియా ఫైనల్ చేరింది. దక్షిణాఫ్రికాకు నిరాశ ఎదురైంది. 2007లో ఆస్ట్రేలియా చేతిలోనే సెమీఫైనల్లో ఓడిన దక్షిణాఫ్రికా... 2015లో న్యూజిలాండ్ జట్టు చేతిలో పరాజయం పాలైంది. తాజాగా ఆస్ట్రేలియా చేతిలో మరోసారి ఓడిపోయింది.

1 భారత గడ్డపై వన్డేల్లో దక్షిణాఫ్రికాను ఓడించడం ఆస్ట్రేలియాకిదే తొలిసారి కావడం విశేషం. 1996లో భారత్ వేదికగా జరిగిన టైటాన్ కప్‌లో దక్షిణాఫ్రికా చేతిలో మూడుసార్లు ఓడిన ఆస్ట్రేలియా.. తాజా ప్రపంచకప్‌లో లీగ్ దశలో ఓటమి పాలైంది. అయితే కీలకమైన సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాను ఆస్ట్రేలియా ఓడించింది.

2 వన్డే ప్రపంచకప్ చరిత్రలో అవే జట్ల మధ్య ఫైనల్స్ జరగనుండటం ఇది రెండోసారి. 1996, 2007 ప్రపంచకప్ టోర్నీల్లో ఆస్ట్రేలియా–శ్రీలంక జట్ల మధ్య తుది పోరు జరగ్గా... ఆస్ట్రేలియా–భారత్ జట్ల మధ్య 2003లో తొలిసారి టైటిల్ పోరు జరిగింది. 20 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ రెండు జట్లు టైటిల్ కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి.



సారీ సఫారీ... ఆసీస్ ఎనిమిదోసారి

ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా • ఉత్కంఠభరిత సెమీఫైనల్లో విజయం
3 వికెట్లతో ఓడిన దక్షిణాఫ్రికా • డేవిడ్ మిల్లర్ శతకం వృథా
కమిన్స్ బృందం సమష్టి ప్రదర్శన • ఆదివారం ఫైనల్లో భారత్‌తో అమీతుమీ


క్లాసెన్ వికెట్ తీశాక హెడ్‌కు సహచరుల అభినందన

ఎన్ని మలుపులు... ఎంత ఒత్తిడి... గడియారపు లోలకంలా చేతులు మారుతూ వచ్చిన ఆధిపత్యం... కుప్పకూలిపోతున్న దశ నుంచి కోలుకున్న జట్టు... అయినా సరే తక్కువ స్కోరుతో కట్టడి చేశామనే సంబరం... మెరుపు ఆరంభంతో సునాయాసం అనుకున్న విజయం... కానీ ఆపై ప్రతీ బంతి ప్రమాదకరంగా మారి వికెట్ కాపాడుకుంటే చాలనే స్థితి... టెస్టు మ్యాచ్ తరహా సీమ్ బౌలింగ్... టెస్టుల్లాగే ఫీల్డింగ్ ఏర్పాట్లు... ఒక వన్డే మ్యాచ్‌లో ఇవన్నీ కనిపించాయి... పేరుకే తక్కువ స్కోర్ల మ్యాచే కానీ తొలి బంతి నుంచి ఆఖరి బంతి వరకు ఎన్నో ఉత్కంఠభరిత క్షణాలు... అదీ ప్రపంచకప్ సెమీఫైనల్ మ్యాచ్ అంటే ఆ లెక్కే వేరు... అది కూడా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య మ్యాచ్ అంటే అనూహ్యానికి లోటుండదు... తొలి ఇన్నింగ్స్ స్కోరుతో 1999 ప్రపంచ కప్ సెమీస్‌ను గుర్తుకు తెచ్చిన పోరు చివరకు ఆసీస్ పరమైంది... ప్రమాదాన్ని తప్పించుకొని ఎట్టకేలకు గట్టెక్కిన ఆస్ట్రేలియా ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే తుది పోరులో భారత్‌తో 'ఢీ'కి సిద్ధమైంది.

దక్షిణాఫ్రికా ముందుగా బ్యాటింగ్... 11.5 ఓవర్లలోనే స్కోరు 24/4... ఇక ఆట ముగిసినట్లే అనిపించింది... కానీ ఆసీస్ పట్టు విడిచింది. మిల్లర్ అద్భుత సెంచరీతో స్కోరు 212 వరకు చేరింది... ఎలా చూసినా సునాయాస లక్ష్యమే... ఆసీస్ అంచనాలకు తగినట్లుగా 6 ఓవర్లలో 60/0... ఇలాంటి తరుణంలో సఫారీ బౌలర్ల జోరు మొదలైంది. వరుసగా వికెట్లు కోల్పోవడంతో పాటు ఒక్క సింగిల్ తీయడానికి కూడా ఆసీస్ బ్యాటర్లు బెదిరే స్థితి వచ్చింది... స్పిన్‌తో కేశవ్ మహరాజ్, షమ్సీ భయపెట్టించేశారు. అనూహ్యంగా స్పందిస్తున్న పిచ్‌పై పరుగులు చేయలేక కంగారూలపై ఒత్తిడి పెరిగిపోయింది. చివరకు స్మిత్ కూడా కీలక స్థితిలో చెత్త షాట్‌తో పరిస్థితిని దిగజార్చాడు. అయితే లక్ష్యం మరీ చిన్నది కావడంతో చివరి వరుస బ్యాటర్లు సాహసాలు చేయలేదు. ఆఖరికి మరో 16 బంతులు మిగిలి ఉండగా మాజీ చాంపియన్ విజయ తీరం చేరింది. చివరి వరకూ పోరాడినా... కీలకదశలో క్యాచ్‌లు వదిలేసి... మరోసారి దురదృష్టాన్ని భుజాన వేసుకొని తిరిగిన దక్షిణాఫ్రికా సెమీస్‌కే పరిమితమై నిరాశగా నిష్క్రమించింది.

కోల్‌కతా: ఐదుసార్లు వరల్డ్‌కప్ విజేత ఆస్ట్రేలియా మరో టైటిల్ వేటలో ఫైనల్‌కు చేరింది. ఆదివారం భారత్‌తో తుది సమరంలో తలపడేందుకు సిద్ధమైంది. గురువారం ఈడెన్ గార్డెన్స్ మైదానంలో చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన రెండో సెమీఫైనల్లో ఆస్ట్రేలియా 3 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 49.4 ఓవర్లలో 212 పరుగులకే ఆలౌటైంది. డేవిడ్ మిల్లర్ (116 బంతుల్లో 101; 8 ఫోర్లు, 5 సిక్సలు) ఒంటరి పోరాటంతో శతకం సాధించగా... హెన్రీ క్లాసెన్ (48 బంతుల్లో 47; 4 ఫోర్లు, 2 సిక్సలు) రాణించాడు. స్టార్క్, కమిన్స్ చెరో 3 వికెట్లు...హాజల్‌వుడ్, ట్రవిస్ హెడ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆస్ట్రేలియా 47.2 ఓవర్లలో 7 వికెట్లకు 215 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రవిస్ హెడ్ (48 బంతుల్లో 62; 9 ఫోర్లు, 2 సిక్సలు) దూకుడైన ఆటతో ఆసీస్ విజయానికి పునాది వేయగా... స్టీవ్ స్మిత్ (62 బంతుల్లో 30; 2 ఫోర్లు), డేవిడ్ వార్నర్ (18 బంతుల్లో 29; 1 ఫోర్, 4 సిక్సలు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్లో భారత్‌తో ఆస్ట్రేలియా తలపడుతుంది.


నిరాశలో దక్షిణాఫ్రికా ఆటగాళ్లు

మిల్లర్ మినహా...

ఈడెన్ గార్డెన్స్‌లోనే భారత్‌తో మ్యాచ్‌లో లక్ష్యాన్ని ఛేదిస్తూ కుప్పకూలిన అనుభవంతో కావచ్చు దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌కు మొగ్గు చూపింది. అయితే మబ్బులు పట్టిన వాతావరణంలో ఈ నిర్ణయం కలిసి రాలేదు. పరిస్థితిని అనుకూలంగా మార్చుకొని ఆసీస్ బౌలర్లు చెలరేగిపోవడంతో సఫారీ జట్టు 12 ఓవర్ల లోపే 4 వికెట్లు కోల్పోయింది. బవుమా (0), డి కాక్ (3), మార్క్‌రమ్ (10), డసెన్ (6) విఫలమయ్యారు. ఈ స్థితిలో జట్టు కుప్పకూలుతుందేమో అనిపించినా... క్లాసెన్, మిల్లర్ కలిసి ఆదుకున్నారు. కొద్దిసేపు మ్యాచ్‌కు వాన అంతరాయం కలిగించినా... ఆట కొనసాగిన తర్వాత వీరిద్దరు చక్కటి షాట్లతో పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో 70 బంతుల్లో మిల్లర్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఐదో వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యం తర్వాత పార్ట్‌టైమ్ బౌలర్ ట్రవిస్ హెడ్ సఫారీలను దెబ్బ కొట్టాడు. వరుస బంతుల్లో క్లాసెన్, జాన్సెన్ (0)లను పెవిలియన్ పంపడంతో జట్టు వెనకడుగు వేసింది. ఆ తర్వాత మిల్లర్ ఒక్కడే బాధ్యతను తీసుకున్నాడు. జంపా బౌలింగ్‌లోనే అతను నాలుగు సిక్సర్లు బాదటం విశేషం. మిల్లర్‌కు కొయెట్జీ (19) కొద్దిసేపు సహకరించాడు. కమిన్స్ వేసిన 48వ ఓవర్ తొలి బంతిని భారీ సిక్సర్‌గా మలచిన మిల్లర్ 115 బంతుల్లో శతకం సాధించగా, ఇదే షాట్‌తో జట్టు స్కోరు 200 పరుగులు దాటింది.

కలిసొచ్చిన శుభారంభం...

స్వల్ప లక్ష్యమే అయినా ఆస్ట్రేలియా దూకుడుగా ఇన్నింగ్స్ ఆరంభించింది. అదే చివరకు ఆ జట్టు విజయానికి పునాది వేసింది. హెడ్, వార్నర్ పోటీ పడి పరుగులు సాధించడంతో 6 ఓవర్లలోనే స్కోరు 60 పరుగులకు చేసింది. రబడ బౌలింగ్‌లోనే వార్నర్ 3 సిక్సలు బాదాడు. అయితే వరుస ఓవర్లలో వార్నర్, మార్ష్ (0)లను అవుట్ చేసి సఫారీ కాస్త పైచేయి ప్రదర్శించింది. కొయెట్జీ ఓవర్లో వరుసగా 3 ఫోర్లు బాది హెడ్ 40 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. హెడ్ క్రీజ్‌లో ఉన్నంతసేపు ఆసీస్ ధీమాగానే ఉంది. అయితే దక్షిణాఫ్రికా ఇద్దరు స్పిన్నర్లు షమ్సీ, మహరాజ్‌లతో బౌలింగ్ మొదలు పెట్టిన తర్వాత కంగారూల్లో తడబాటు మొదలైంది. ఈడెన్ పిచ్‌పై అనూహ్యంగా టర్న్ అవుతున్న బంతి బ్యాటర్లను బాగా ఇబ్బంది పెట్టింది. ఆసీస్ ఒక్కో పరుగు తీయడానికి తీవ్రంగా శ్రమించింది. తన తొలి బంతికే హెడ్‌ను మహరాజ్ బౌల్డ్ చేయగా... షమ్సీ బౌలింగ్‌లో లబుషేన్ (18), మ్యాక్స్‌వెల్ (1) అనవసరంగా చెత్త షాట్‌లు ఆడి వికెట్లు సమర్పించుకున్నారు. దాంతో సఫారీలు పూర్తిగా ఆధిపత్యం ప్రదర్శిస్తూ ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టారు. ఇన్‌గ్లిస్ (49 బంతుల్లో 28; 3 ఫోర్లు)తో కలిసి ఆరో వికెట్‌కు 37 పరుగులు జోడించి స్మిత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. అయితే కొయెట్జీ అద్భుత బౌలింగ్‌తో తక్కువ వ్యవధిలో వీరిద్దరిని పెవిలియన్ పంపడంతో పరిస్థితి మళ్లీ మారింది. అయితే స్టార్క్ (16 నాటౌట్), కమిన్స్ (14 నాటౌట్) జాగ్రత్తగా ఆడుతూ అభేద్యంగా 22 పరుగులు జోడించి జట్టును గెలిపించారు.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి) కమిన్స్ (బి) హాజల్‌వుడ్ 3; బవుమా (సి) ఇన్‌గ్లిస్ (బి) స్టార్క్ 0; డసెన్ (సి) స్మిత్ (బి) హాజల్‌వుడ్ 6; మార్క్‌రమ్ (సి) వార్నర్ (బి) స్టార్క్ 10; క్లాసెన్ (బి) హెడ్ 47; మిల్లర్ (సి) హెడ్ (బి) కమిన్స్ 101; జాన్సెన్ (ఎల్బీ) (బి) హెడ్ 0; కొయెట్జీ (సి) ఇన్‌గ్లిస్ (బి) కమిన్స్ 19; కేశవ్ మహరాజ్ (సి) స్మిత్ (బి) స్టార్క్ 4; రబడ (సి) మ్యాక్స్‌వెల్ (బి) కమిన్స్ 10; షమ్సీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (49.4 ఓవర్లలో ఆలౌట్) 212.** **వికెట్ల పతనం:** 1-1, 2-8, 3-22, 4-24, 5-119, 6-119, 7-172, 8-191, 9-203, 10-212. **బౌలింగ్:** స్టార్క్ 10-1-34-3, హాజల్‌వుడ్ 8-3-12-2, కమిన్స్ 9.4-0-51-3, జంపా 7-0-55-0, మ్యాక్స్‌వెల్ 10-0-35-0, హెడ్ 5-0-21-2.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి) మహరాజ్ 62; వార్నర్ (బి) మార్క్‌రమ్ 29; మార్ష్ (సి) డసెన్ (బి) రబడ 0; స్మిత్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 30; లబుషేన్ (ఎల్బీ) (బి) షమ్సీ 18; మ్యాక్స్‌వెల్ (బి) షమ్సీ 1; ఇన్‌గ్లిస్ (బి) కొయెట్జీ 28; స్టార్క్ (నాటౌట్) 16; కమిన్స్ (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (47.2 ఓవర్లలో 7 వికెట్లకు) 215.** **వికెట్ల పతనం:** 1-60, 2-61, 3-106, 4-133, 5-137, 6-174, 7-193. **బౌలింగ్:** జాన్సెన్ 4.2-0-35-0, రబడ 6-0-41-1, మార్క్‌రమ్ 8-1-23-1, కొయెట్జీ 9-0-47-2, షమ్సీ 10-0-42-2, మహరాజ్ 10-0-24-1.


మిల్లర్ సెంచరీ అభివాదం



అంతిమ సమరం కోసం...

అహ్మదాబాద్: వన్డే ప్రపంచకప్ ఫైనల్లో పోటీపడేందుకు భారత క్రికెట్ జట్టు గురువారం అహ్మదాబాద్ నగరానికి చేరుకుంది. విమానాశ్రయంలో భారత జట్టుకు ఘనస్వాగతం లభించింది. నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం జరిగే టైటిల్ పోరులో ఐదుసార్లు విశ్వవిజేత ఆస్ట్రేలియా జట్టుతో భారత్ తలపడుతుంది.

ఫైనల్ వేదికపై ఎయిర్ షో

ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ఎయిర్ షో నిర్వహించేందుకు భారత వైమానిక దళం (ఐఏఎఫ్) సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీ సహా అతిరథ మహారథులు, లక్ష మంది ప్రేక్షకులు విచ్చేసే మ్యాచ్ వేదికపై ఐఏఎఫ్‌కు చెందిన 'ది సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్' ఎయిర్ షోతో మ్యాచ్‌కు ముందే కనువిందు చేయనుంది. దీనికి సంబంధించిన రిహార్సల్స్‌ను నేడు, రేపు స్టేడియంపై చేస్తారని గుజరాత్‌కు చెందిన డిఫెన్స్ ప్రొ ఒక ప్రకటనలో తెలిపింది. ఇలాంటి వైమానిక విన్యాసాలతో అలరించడం సూర్యకిరణ్ టీమ్‌కు కొత్తేం కాదు. దేశవ్యాప్తంగా ఎయిర్ షోలు ఈ జట్టే చేస్తుంది. మొత్తం తొమ్మిది ఎయిర్‌క్రాఫ్ట్‌లు నింగిలో తమ వైమానిక విన్యాసంతో ప్రేక్షకుల్ని ఆకట్టిపడేస్తాయి. మ్యాచ్ ప్రారంభానికి ముందుగా పది నిమిషాల పాటు ఈ ప్రదర్శన నిర్వహిస్తారు.



పోరాడి ఓడిన ప్రణయ్



కుమమోటో: జపాన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్ ఓటమి చవిచూశాడు. ప్రపంచ 12వ ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో జరిగిన మ్యాచ్‌లో ప్రణయ్ 21-19, 16-21, 19-21తో పరాజయం పాలయ్యాడు. 73 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రణయ్ తొలి గేమ్‌ను గెలిచినా ఆ తర్వాత తడబడి వరుసగా రెండు గేమ్‌లను కోల్పోయాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో ఒకదశలో ప్రణయ్ 4-12తో వెనుకబడ్డాడు. కానీ పట్టువదలకుండా పోరాడిన ప్రణయ్ చివరకు స్కోరును 19-19తో సమం చేశాడు. అయితే చౌ తియెన్ చెన్ కీలకదశలో రెండు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన ప్రణయ్‌కు 1,470 డాలర్ల (రూ. లక్షా 22 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 3600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ సీజన్‌లో ప్రణయ్ విశేషంగా రాణించాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం, ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించాడు. మలేసియా మాస్టర్స్ టోర్నీలో విజేతగా నిలిచిన ఈ కేరళ ప్లేయర్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచాడు.

గెలిచి నిలిచిన బోపన్న జోడీ



టురిన్ (ఇటలీ): పురుషుల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌లో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) సెమీఫైనల్ చేరే అవకాశాలను సజీవంగా నిలబెట్టుకుంది. రింకీ హిజికాటా–జేసన్ కుబ్లెర్ (ఆస్ట్రేలియా) జంటతో బుధవారం జరిగిన రెడ్ గ్రూప్ రెండో లీగ్ మ్యాచ్‌లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6-4, 6-4తో గెలిచింది. ఈ విజయంతో 43 ఏళ్ల బోపన్న ఏటీపీ ఫైనల్స్ టోర్నీ చరిత్రలో మ్యాచ్ నెగ్గిన పెద్ద వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ 12 ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు. నాలుగు జోడీలు ఉన్న రెడ్ గ్రూప్‌లో రాజీవ్ రామ్ (అమెరికా)–జో సాలిస్‌బరీ (బ్రిటన్) ద్వయం వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచి సెమీఫైనల్ బెర్త్‌ను దాదాపు ఖాయం చేసుకుంది. వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)–నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్), బోపన్న–ఎబ్డెన్ జోడీలు చెరో విజయంతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాయి. నేడు ఈ రెండు జోడీల మధ్య జరిగే చివరి లీగ్ మ్యాచ్ విజేత సెమీఫైనల్ చేరుకుంటుంది.

సెమీస్‌లో సినెర్

ఇదే టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో గ్రీన్ గ్రూప్ నుంచి యానిక్ సినెర్ (ఇటలీ) సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) చివరిదైన మూడో లీగ్ మ్యాచ్‌లో 7-6 (7/1), 4-6, 6-1తో హుబెర్ట్ హుర్కాజ్ (పోలాండ్)ను ఓడించి సెమీఫైనల్ రేసులో నిలిచాడు. జొకోవిచ్‌తో మ్యాచ్‌లో హుర్కాజ్ ఒక సెట్ నెగ్గడంతో ఇప్పటికే రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన సినెర్ గ్రీన్ గ్రూప్ నుంచి టాప్ లేదా రెండో స్థానంతో సెమీఫైనల్‌కు చేరుకోవడం ఖరారైంది. ఈ టోర్నీ చరిత్రలో సెమీఫైనల్ చేరిన తొలి ఇటలీ ప్లేయర్‌గా సినెర్ గుర్తింపు పొందాడు. సినెర్‌తో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో హోల్గర్ రూనె (డెన్మార్క్) గెలిస్తే మాత్రం జొకోవిచ్ లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమిస్తాడు. సినెర్ విజయం సాధిస్తే జొకోవిచ్‌కు కూడా సెమీఫైనల్ బెర్త్ లభిస్తుంది. మరోవైపు రెడ్ గ్రూప్ నుంచి మెద్వెదెవ్ (రష్యా) సెమీఫైనల్లోకి ప్రవేశించాడు.

సౌరవ్ పరాజయం




న్యూఢిల్లీ: సింగపూర్ ఓపెన్ అంతర్జాతీయ స్క్వాష్ టోర్నమెంట్ నుంచి భారత స్టార్ సౌరవ్ ఘోషాల్ నిష్క్రమించాడు. సింగపూర్‌లో గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో సౌరవ్ 3-11, 7-11, 10-12తో నాలుగో సీడ్ ముస్తఫా అసల్ (ఈజిప్ట్) చేతిలో ఓడిపోయాడు. భారత్‌కే చెందిన మరో ప్లేయర్ రమిత్ టాండన్ 3-11, 2-11, 4-11తో రెండో సీడ్ డీగో ఇలియాస్ (పెరూ) చేతిలో పరాజయం పాలయ్యాడు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సౌరవ్ 11-6, 7-11, 11-6, 11-5తో టాడ్ హారిటి (అమెరికా)పై, రమిత్ 11-7, 12-10, 12-10తో రోరీ స్టీవర్ట్ (స్కాట్లాండ్)పై గెలుపొందారు.

'ఆ రికార్డు' కూడా కోహ్లికి సాధ్యమే!

సచిన్ 100 సెంచరీల ఘనతనూ అధిగమిస్తాడన్న రవిశాస్త్రి

ముంబై: అంతర్జాతీయ క్రికెట్లో సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన 100 సెంచరీల రికార్డునూ బద్దలుకొట్టే సత్తా భారత బ్యాటింగ్ కింగ్ విరాట్ కోహ్లికి ఉందని భారత దిగ్గజం, మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి అన్నారు. ప్రస్తుతం విరాట్ 50వ శతకంతో వన్డేల్లో సచిన్ (49) సెంచరీల రికార్డును చెరిపేశాడు. ఓవరాల్‌గా చూస్తే టెస్టుల్లో 29, టి20ల్లో ఒక సెంచరీ కలుపుకుంటే 80 సెంచరీలతో ఉన్నాడు. దీనిపై ఓ ఇంటర్వ్యూలో శాస్త్రి మాట్లాడుతూ 'సచిన్ వంద సెంచరీలు చేసినపుడు ఇంతటి గొప్ప మైలురాయి దరిదాపుల్లోనే ఎవరూ రారని అనుకున్నాం. ఇప్పుడు కోహ్లి 80 దాకా వచ్చాడు. విరాట్‌లాంటి బ్యాటర్‌కు ఏదీ అసాధ్యం కాదు. శతక్కొట్టడం మొదలు పెడితే కొడుతూనే ఉంటారు. చూడండి అతని తదుపరి 10 ఇన్నింగ్స్‌ల్లో ఐదు సెంచరీలు గ్యారంటీ! పైగా తను మూడు ఫార్మాట్లు ఆడుతున్నాడు. ప్రతి ఫార్మాట్‌లోనూ అదే నిబద్ధత, అంకిత భావాన్ని కనబరుస్తున్నాడు. అతని కెరీర్‌లో ఇంకా మూణ్నాలుగేళ్ల ఆట మిగిలుంది. ఒత్తిడిని అధిగమించే సామర్థ్యం, పరిస్థితులకు అలవాటు పడే నైజం, అంతకుమించి పూర్తి ఫిట్‌నెస్ అతన్ని అసాధారణ క్రికెటర్‌గా నిలబెడుతోంది' అని అన్నారు.



తనెంత కీలకమో తనకే బాగా తెలుసు

భారత జట్టులో తన పాత్ర ఎంత కీలకమో... తన భుజాలపై ఎంతటి గురుతర బాధ్యతలున్నాయో కోహ్లికి బాగా తెలుసని కోచ్‌లెవరూ అతనికి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదని బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ వివరించారు. 'విరాట్ సన్నాహాలకు సాయమందిస్తాం. అంతేతప్ప కోచింగ్ పాఠాలు చెప్పాల్సిన పనేం రాదు. అతనికేమైనా కావాలంటే తనే వచ్చి అడుగుతాడు. ప్రాక్టీస్ అయినా... ఆటయినా అతనికే వదిలేస్తాం. ఎప్పుడు ఎలా ఆడాలో కోహ్లికే బాగా తెలుసు. నిజం చెప్పాలంటే ఎన్ని సెంచరీలు చేసినా, ఎన్ని మైలురాళ్లు దాటినా అతని పరుగుల ఆకలి తీరనే తీరదు. బౌలర్లలో షమీ పేస్ అద్భుతం. అందుకే అతను స్పెషల్ బౌలర్. అయినప్పటికీ ఆరంభంలో కొన్ని మ్యాచ్‌లకు పక్కనబెట్టడానికి కారణం జట్టు కాంబినేషనే తప్ప అతని సమర్థతపై ఏ సంకోచం లేదు' అని అన్నారు.



మా ఆయన దేవుడి కొడుకు...

కోహ్లి సతీమణి, బాలీవుడ్ స్టార్ అనుష్క శర్మ తన భర్త దేవుడి కొడుకని చెప్పుకొచ్చింది. 'దేవుడు ఉత్తమ స్క్రిప్ట్ రైటర్ కోహ్లి! నీ తలరాతను గొప్పగా రాశాడు. నీ ప్రేమను దక్కించుకున్న నేను దేవుడికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నిన్ను చూస్తుంటే, నీ ప్రదర్శనను గమనిస్తుంటే నాకనిపిస్తుంది. ఆడేకొద్దీ, పెరిగే కొద్దీ నీ సత్తా సామర్థ్యం పెరుగుతోంది. ఆటకోసం నిరంతరం నిజాయితీగా శ్రమించే నీవు నిజంగా దేవుడి బిడ్డవే' అని ఇన్‌స్టాగ్రామ్‌లో అనుష్క పోస్ట్ చేసింది.

సాక్షి బిజినెస్
శుక్రవారం
17-11-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్‌ ▲	నిఫ్టీ ▲
307	90
65,982	19,765

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్‌	14,093	▽	11
డోజోన్స్‌	38,875	▽	117
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,411	▲	76
డాక్స్‌	15,787	▲	38
షాంఘై	3,051	▽	22
నికాయ్‌	33,424	▽	95

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	60,505
బంగారం (99.5 స్వచ్ఛత)	60,263
వెండి (కేజీ)	72,855

ఫారెక్స్‌ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	82.43	84.10
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	101.46	104.81
€	యూరో	ఎస్‌బీఐ	88.64	91.77
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	54.21	55.88
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	52.79	55.10
S$	సింగపూర్‌ డాలర్‌	ఎస్‌బీఐ	60.60	62.59
SAR	సౌదీ రియాల్‌	[illegible]	21.24	22.86
UAE D	యూఏఈ దిర్హామ్‌	[illegible]	21.76	23.56
¥	చైనా యువాన్‌	[illegible]	10.36	12.43

స్టాండర్డ్‌ గ్లాస్‌లో అసాహీ పెట్టుబడి

జపాన్‌ కంపెనీ నుంచి రూ.200 కోట్లు

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: గ్లాస్‌ లైన్డ్‌ ఎక్విప్‌మెంట్‌ తయారీలో ఉన్న హైదరాబాద్‌ కంపెనీ స్టాండర్డ్‌ గ్లాస్‌ లైనింగ్‌ టెక్నాలజీలో ఇంజనీర్డ్‌ గ్లాస్‌ సిస్టమ్స్‌ రంగంలో ఉన్న జపాన్‌ దిగ్గజం అసాహీ గ్లాస్‌ప్లాంట్‌ (ఏజీఐ జపాన్‌) రూ.200 కోట్లు పెట్టుబడి చేసింది. తద్వారా ఏజీఐ జపాన్, జీఎల్‌ హాకో, అనుబంధ కంపెనీలకు స్టాండర్డ్‌ గ్లాస్‌ లైనింగ్‌ టెక్నాలజీలో మైనారిటీ వాటా దక్కనుంది. జపనీస్‌ విపణిలోకి తమ కంపెనీ ప్రవేశాన్ని ఏజీఐ జపాన్‌ సులభతరం చేస్తుందని స్టాండర్డ్‌ గ్రూప్‌ ఎండీ నాగేశ్వర రావు కందుల తెలిపారు. ఏజీఐతోపాటు ఆ సంస్థకు చెందిన కస్టమర్లు ఆశించే స్థాయిలో కఠిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ప్రైవేట్‌ లేబుల్‌ ఏర్పాట్లు, సహ–బ్రాండింగ్, విడిభాగాల సరఫరాను ఈ భాగస్వామ్యంలో భాగంగా అమలు చేస్తారు. జీఎల్‌ హాకో ఉత్పత్తుల ఉనికిని విస్తృతం చేయడంతోపాటు గ్లాస్‌–లైన్డ్‌ రియాక్టర్‌ల భద్రతను పెంపొందిస్తూ ఎస్‌ఈఎఫ్‌ గ్లాస్‌ టెక్నాలజీని రూపొందించాలని స్టాండర్డ్‌ గ్రూప్‌ నిర్ణయించింది.

భారీ ప్లాంటు ఏర్పాటు..

ఏజీఐ జపాన్‌ సీఈవో యసుయుకి ఇకేడ 2023 మార్చి నుంచి స్టాండర్డ్‌ గ్లాస్‌ నాన్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయంగా తమ సంస్థ విస్తరణకు ఇకేడ దోహదం చేస్తున్నారని నాగేశ్వర రావు తెలిపారు. ఈ పెట్టుబడి వ్యాపార అవకాశమేగాక అసాధారణ వ్యాపార భాగస్వామ్యం పెంపొందించి, వాటాదారులకు గణనీయంగా రాబడిని అందిస్తుందన్నారు. స్టాండర్డ్‌ గ్లాస్‌ హైదరాబాద్‌ సమీపంలో 36 ఎకరాల్లో భారీ స్థాయిలో గ్లాస్‌ ఎక్విప్‌మెంట్‌ తయారీ ప్లాంటును నిర్మిస్తోంది. వెల్డింగ్‌ రోబోలు, సెమీ ఆటోమేటెడ్‌ కట్టింగ్, బెండింగ్, వెల్డింగ్‌ మెషినరీ, అధునాతన వెల్డింగ్‌ పవర్‌ సోర్సెస్‌తో సహా అత్యాధునిక మెషినరీని ఏర్పాటు చేస్తున్నారు. ఉత్పత్తి నాణ్యతను పెంచడం, తక్కువ సమయంలో తయారీ లక్ష్యంగా సాంకేతికతను జోడిస్తున్నారు. 2012లో ప్రారంభమైన స్టాండర్డ్‌ గ్రూప్‌ టర్నోవర్‌ రూ.750 కోట్లు.

15% పెరిగిన సోనాలిక ట్రాక్టర్ల మార్కెట్‌ వాటా



న్యూఢిల్లీ: సోనాలిక ట్రాక్టర్స్‌ వార్షిక ప్రాతిపదికన ఏప్రిల్‌–అక్టోబర్‌ కాలంలో తన మార్కెట్‌ వాటాను 15% పెంచుకుంది. అక్టోబర్‌లో రికార్డు స్థాయిలో 18,002 ట్రాక్టర్ల విక్రయాలు విక్రయించింది. పండుగ సీజన్‌ సందర్భంగా 'హెవీడ్యూటీ ధమాకా', ఆకర్షణీయమైన ఫైనాన్స్‌ స్కీంల ప్రకటనలతో హెవీడ్యూటీ ట్రాక్టర్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. దేశీయ ట్రాక్టర్‌ పరిశ్రమలో గత ఆరు నెలల్లో ఈ స్థాయి వృద్ధి కనబరిచిన బ్రాండ్‌ తమదేనని సంస్థ ఎండీ రమణ్‌ మిట్టల్‌ తెలిపారు.

క్రెడిట్‌ కార్డు.. కొంచెం కష్టమే!

ఆర్‌బీఐ కొత్త నిబంధనలు



ముంబై: క్రెడిట్‌ కార్డులు, వ్యక్తిగత రుణ మంజూరీల వంటి అన్‌సెక్యూర్డ్‌ రుణాలు ఇకపై మరింత కఠినతరం కానున్నాయి. ఈ విషయమై బ్యాంకులకు, నాన్‌ బ్యాంకింగ్‌ ఫైనాన్షియల్‌ సంస్థలకు (ఎన్‌బీఎఫ్‌సీ) నిబంధనలను కఠినతరం చేస్తూ రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశాలు జారీ చేసింది. అన్‌సెక్యూర్డ్‌ వ్యక్తిగత రుణ మంజూరీలు ఇటీవలి కాలంలో పెరుగుతుండడం, ఈ నేపథ్యంలో ఆయా రుణ మంజూరీ పట్ల బ్యాంకింగ్‌ జాగరూకత పాటించడం ఆర్‌బీఐ తాజా ఆదేశాల లక్ష్యం. హై రిస్క్‌ వెయిటేజ్‌ అన్‌సెక్యూర్డ్‌ వినియోగ రుణాలపై 25 శాతం పెంచాలన్నది ఈ ఆదేశాల ప్రధానాంశం. అంటే కొన్ని వ్యక్తిగత రుణాల విషయంలో బ్యాంకింగ్‌ కేటాయింపులు మరింత పెంచాల్సి ఉంటుందన్నమాట. అటువంటి క్రెడిట్‌ మరింత ఖరీదైనదిగా మారడంతో ఇది బ్యాంకుల రుణ సామర్థ్యాన్ని పరిమితం చేస్తుంది. తాజా నిర్ణయం వల్ల క్రెడిట్‌ కార్డ్‌ రుణాలపై రిస్క్‌ వెయిటేజ్‌ బ్యాంకులపై 150 శాతానికి, ఎన్‌బీఎఫ్‌సీలపై 125 శాతానికి పెరుగుతుంది. కాగా గృహ రుణాలు, విద్యా రుణాలు, వాహన రుణాలు, బంగారం, బంగారు ఆభరణాల ద్వారా పొందే రుణాలపై కొత్త నిబంధనలు వర్తించవని రిజర్వ్‌ బ్యాంక్‌ సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. 2023 సెప్టెంబర్‌ చివరి నాటికి పర్సనల్‌ లోన్ల విభాగంలో బ్యాంక్‌ రుణ బకాయిలు రూ. 48,26,833 కోట్లు. ఇది 2022 అదే నెలతో పోలిస్తే దాదాపు 30 శాతం పెరిగింది.

మైగ్రేన్‌ నివారణకు పరికరం

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: పార్శ్వపు నొప్పి (మైగ్రేన్‌) నివారణకు ఔషధ రహిత పరిష్కారాన్ని ఫార్మా రంగ సంస్థ డాక్టర్‌ రెడ్డీస్‌ లేబొరేటరీస్‌ తీసుకువచ్చింది. నెరివియో పేరుతో చేతికి ధరించే పరికరాన్ని ప్రవేశపెట్టింది. యూఎస్‌ఎఫ్‌డీఏ అనుమతి ఉందని, 12 ఏళ్లు, ఆపై వయసున్న వారు వైద్యుల సిఫార్సు మేరకు దీన్ని వాడొచ్చని కంపెనీ గురువారం ప్రకటించింది. తలనొప్పి ప్రారంభమైన 60 నిమిషాలలోపు వాడాలి. లేదా పార్శ్వపు నొప్పి నివారణకు ప్రతి రెండు రోజులకు ఒకసారి ఉపయోగించాల్సి ఉంటుంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

17-11-2023	
విశాఖ	525–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	525–00
విజయవాడ	525–00
రిటైల్‌ ధర (డజను)	72.00
16-11-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	520–00
వరంగల్‌	522–00
రిటైల్‌ ధర	5.80

ఐటీ, ఆటో, ఫార్మా షేర్ల పరుగులు

కనిష్టాల నుంచి కోలుకున్న సూచీలు



ముంబై: ఐటీ, ఆటో, ఫార్మా, వినిమయ షేర్లు రాణించడంతో స్టాక్‌ సూచీలు రెండో రోజూ లాభాలు ఆర్జించాయి. విదేశీ ఇన్వెస్టర్ల తాజా కొనుగోళ్లు, అమెరికా ద్రవ్యోల్బణ దిగిరావడం, బాండ్లపై రాబడులు తగ్గుదల పరిణామాలు కలిసొచ్చాయి. ఫలితంగా సెన్సెక్స్‌ 307 పాయింట్లు పెరిగి 65,982 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 90 పాయింట్లు బలపడి 19,765 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు ప్రారంభంలోనే నష్టాల్లోకి జారుకున్నాయి. అయితే దేశీయంగా నెలకొన్న సానుకూల పరిణామాలతో నష్టాలు అధిగమించి లాభాల బాటపట్టాయి. ఒక దశలో సెన్సెక్స్‌ 682 పాయింట్లు ర్యాలీ చేసి 66,358 వద్ద, నిఫ్టీ 200 పాయింట్లు ఎగసి 19,875 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. ట్రేడింగ్‌ చివర్లో మరోసారి అమ్మకాల ఒత్తిడి నెలకొనడంతో సూచీల లాభాలు కొంతమేర తగ్గాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌ క్యాప్‌ సూచీలు అర శాతం చొప్పున రాణించాయి.

- ఈకామ్, ఇన్‌స్టా ఈఎంఐ కార్డుల ద్వారా రుణాల జారీ, పంపిణీలను తక్షణమే నిలిపివేయాలంటూ ఆర్‌బీఐ ఆదేశాలతో బజాజ్‌ ఫైనాన్స్‌ షేరు ట్రేడింగ్‌ ప్రారంభంలో 4% నష్టపోయి రూ.6937 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. అయితే కనిష్టాల వద్ద కొనుగోళ్ల మద్దతు, ఈక్విటీ మార్కెట్‌ ర్యాలీ అంశాలు కలిసిరావడంతో షేరు బౌన్స్‌బ్యాక్‌ అయ్యింది. ట్రేడింగ్‌ నష్టాలు భర్తీ చేసుకొని చివరికి 2% లాభంతో రూ.7366 వద్ద స్థిరపడింది.
- ఫెడ్‌ రిజర్వ్‌ వడ్డీ రేట్ల పెంపు అంచనాలు సన్నగిల్లడంతో ఎగుమతి ఆధారిత రంగ ఐటీ షేర్లకు భారీ డిమాండ్‌ నెలకొంది. బీఎస్‌ఈలో ఈ రంగ షేర్లకు ప్రాతినిధ్యం వహించే బీఎస్‌ఈ ఐటీ ఇండెక్స్‌ రెండున్నర శాతం ర్యాలీ చేసింది. సెన్సెక్స్‌ 30 షేర్లలో టీసీఎస్‌(3%), హెచ్‌సీఎల్‌ టెక్‌(2.80%), టెక్‌ మహీంద్రా(2.70%), ఇన్ఫోసిస్‌(2.50%)లు తొలి నాలుగు స్థానాలు దక్కించుకున్నాయి.

యూకో కస్టమర్ల ఖాతాల్లోకి రూ. 820 కోట్లు

- సాంకేతిక సమస్యతో బదిలీ
- రివర్స్‌ చేసే ప్రయత్నాల్లో బ్యాంకు సిబ్బంది

న్యూఢిల్లీ: సాంకేతిక సమస్య కారణంగా ప్రభుత్వ రంగ యూకో బ్యాంకులోని పలువురు కస్టమర్ల ఖాతాల్లోకి ఏకంగా రూ. 820 కోట్లు పొరపాటున జమయ్యాయి. దీన్ని గుర్తించిన బ్యాంకు రికవరీ ప్రక్రియ ప్రారంభించింది. ఆయా ఖాతాదారుల అకౌంట్లను బ్లాక్‌ చేసి రూ. 649 కోట్లు (సుమారు 79 శాతం) మొత్తాన్ని రాబట్టినట్లు గురువారం స్టాక్‌ ఎక్స్ఛేంజీలకు బ్యాంకు తెలియజేసింది. మిగతా రూ. 171 కోట్లు కూడా రాబట్టే ప్రయత్నాల్లో ఉన్నామని, తగు చర్యలు తీసుకునేందుకు ఈ విషయాన్ని దర్యాప్తు సంస్థలకు కూడా తెలియజేసినట్లు వివరించింది. ఈ సాంకేతిక సమస్య మానవ తప్పిదం వల్ల జరిగిందా లేక హ్యాకింగ్‌ ప్రయత్నమేదైనా జరిగిందా అనే అంశంపై బ్యాంకు స్పష్టత నివ్వలేదు. నవంబర్‌ 10–13 మధ్య ఇమ్మీడియెట్‌ పేమెంట్‌ సర్వీస్‌ (ఐఎంపీఎస్‌)లో సాంకేతిక లోపం కారణంగా ఇతర బ్యాంకులకు చెందిన కస్టమర్లు చేపట్టిన కొన్ని లావాదేవీల్లో తమ బ్యాంకు కస్టమర్ల ఖాతాల్లోకి నగదు క్రెడిట్‌ అయినట్లు బ్యాంకు తెలిపింది. అయితే, ఆయా బ్యాంకుల నుంచి తమకు నిధులు అందకుండానే ఈ లావాదేవీలు పోటు చేసుకున్నాయని గుర్తించినట్లు పేర్కొంది. దీంతో తగు చర్యలు ప్రారంభించినట్లు వివరించింది.

టాటా టెక్నాలజీస్‌ @ రూ. 475-500

ఈ నెల 22–24 మధ్య ఐపీవో

ప్రొడక్ట్‌ డెవలప్‌మెంట్, డిజిటల్‌ సొల్యూషన్స్‌ అందించే ఇంజినీరింగ్‌ సర్వీసుల కంపెనీ టాటా టెక్నాలజీస్‌ పబ్లిక్‌ ఇష్యూకి వస్తోంది. షేరుకి రూ. 475–500 ధరల శ్రేణిలో ఐపీవో ఈ నెల 22న ప్రారంభంకానుంది. 24న ముగియనున్న ఇష్యూలో భాగంగా కంపెనీ ప్రమోటర్, ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్‌తోపాటు.. ప్రస్తుత వాటాదారు సంస్థలు ఆల్ఫా టీసీ హోల్డింగ్స్, టాటా క్యాపిటల్‌ గ్రోత్‌ ఫండ్‌–1 మొత్తం 6.08 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనున్నాయి. తద్వారా దాదాపు రూ. 3,043 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. దాదాపు రెండు దశాబ్దాల తదుపరి డైవర్సిఫైడ్‌ దిగ్గజం టాటా గ్రూప్‌ నుంచి వస్తున్న తొలి పబ్లిక్‌ ఇష్యూ ఇదికాగా.. ఇంత క్రితం 2004లో టీసీఎస్‌ లిస్టయ్యింది. రిటైల్‌ ఇన్వెస్టర్లు కనీసం 30 షేర్లకు (ఒక లాట్‌) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

సెమీకండక్టర్లలో అపార అవకాశాలు

- కేంద్ర మంత్రి గోయల్‌ వెల్లడి
- మైక్రాన్‌ సీఈవో మెహ్రోత్రాతో భేటీ



శాన్‌ ఫ్రాన్సిస్కో: దేశీయంగా సెమీకండక్టర్ల రంగం గణనీయంగా వృద్ధి చెందుతోందని, ఈ విభాగంలో పుష్కలంగా వ్యాపార అవకాశాలు ఉన్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌ గోయల్‌ వెల్లడించారు. అమెరికాలోని శాన్‌ ఫ్రాన్సిస్కోలో మైక్రాన్‌ టెక్నాలజీ సీఈవో సంజయ్‌ మెహ్రోత్రాతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ విషయం తెలిపారు. 'మైక్రాన్‌టెక్‌ సీఈవో మెహ్రోత్రాతో భేటీ అయ్యాను. భారత్‌లో సెమీకండక్టర్ల రంగం వృద్ధి చెందుతున్న తీరు, కంపెనీకి గల వ్యాపార అవకాశాలు మొదలైన అంశాలను చర్చించాము' అని సోషల్‌ నెట్‌వర్కింగ్‌ ప్లాట్‌ఫాం ఎక్స్‌లో పోస్ట్‌ చేశారు. అటు యూట్యూబ్‌ సీఈవో నీల్‌ మోహన్‌తో కూడా గోయల్‌ సమావేశమయ్యారు.

సినిమా

''ప్రేక్షకులు థ్రిల్లర్‌ చిత్రాలను చాలా ఎంజాయ్‌ చేస్తున్నారు. స్కిన్‌ (చర్మం) మాఫియా ముప్పును చూపించే డార్క్‌ థ్రిల్లర్‌ చిత్రం 'మై నేమ్‌ ఈజ్‌ శృతి'. ఈ నేపథ్యంలో ఓ మూవీ చేయడం ఇదే తొలిసారి. ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకులకు నచ్చడమే కాదు.. ఆలోచింపజేస్తుందని నమ్మకంగా చెప్పగలను'' అని హీరోయిన్‌ హన్సిక మోత్వాని అన్నారు. శ్రీనివాస్‌ ఓంకార్‌ దర్శకత్వంలో హన్సిక మోత్వాని లీడ్‌ రోల్‌లో నటించిన చిత్రం 'మై నేమ్‌ ఈజ్‌ శృతి'. వైష్ణవి ఆర్ట్స్‌ పతాకంపై బూరుగు రమ్య ప్రభాకర్‌ నిర్మించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా హన్సిక మోత్వాని మాట్లాడుతూ....

మై నేమ్‌ ఈజ్‌ శృతి ఆలోచింపజేస్తుంది - హన్సిక



కెమెరా: చంద్రు సెల్వరాజ్, సంగీతం: శంకర్‌ శర్మ.

- మా అమ్మ డెర్మటాలజిస్ట్‌(చర్మ వైద్య నిపుణురాలు). 'మై నేమ్‌ ఈజ్‌ శృతి' సమయంలో నిజంగా స్కిన్‌ మాఫియా ఉందా? అని అమ్మను అడిగాను. 'ఇలాంటి ఘటన ఎక్కడో జరిగినట్లు చదివాను' అని చెప్పింది అమ్మ. ఈ మాఫియా ద్వారా సామాన్యుడి జీవితంలో చీకటి వ్యాపిస్తుంది. ఈ సినిమా కోసం శ్రీనివాస్‌ ఓంకార్‌ పరిశోధన చేస్తున్న సమయంలో కొన్ని అనుకోని సంఘటనలను ఎదుర్కొన్నారు. ఇటువంటి సున్నితమైన అంశాన్ని టచ్‌ చేస్తూ.. సినిమా చేయడం సవాలుతో కూడుకున్న అంశం. ఊహించని ట్విస్ట్‌లతో చూస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ మూవీ థ్రిల్‌ ఇస్తుంది. ఇలాంటి థ్రిల్లర్‌ స్పేస్‌లో భాగమైనందుకు చాలా సంతోషంగా అనిపించింది.
- ఈ సినిమాలో నా పాత్ర పేరు శృతి. ఆత్మ విశ్వాసం ఎక్కువ. ఎలాంటి అడ్డంకులు వచ్చినా వాటిని దాటుకుంటూ వెళ్తుంది. ఓ యాడ్‌ ఏజెన్సీలో పనిచేస్తున్న శృతి స్కిన్‌ మాఫియా ట్రాప్‌లో పడుతుంది. ఆ మాఫియా నుంచి తను ఎలా బయటపడింది? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ప్రతి కుటుంబాన్ని ఈ చిత్ర కథ కదిలిస్తుంది. కొన్ని ప్రశ్నలను లేవనెత్తుతుంది. రమ్యగారు ఈ సినిమాని ఎంతో ప్యాషన్‌తో తీశారు. మార్క్‌ కె.రాబిన్‌ నేపథ్య సంగీతం సినిమాకి హైలెట్‌గా ఉంటుంది.
- 2019లో వచ్చిన 'తెనాలి రామకృష్ణ' సినిమా తర్వాత నేను నటించిన తెలుగు చిత్రం 'మై నేమ్‌ ఈజ్‌ శృతి'. దాదాపు నాలుగేళ్ల గ్యాప్‌ వచ్చింది. అయితే తమిళ చిత్రాలతో చాలా బిజీగా ఉండటం వల్లే తెలుగులో గ్యాప్‌ వచ్చింది. ఒక నటిగా సంతృప్తి చెందలేదు.. ఇంకా ఎన్నో గొప్ప పాత్రలు చేయాలని ఉంది. నా కెరీర్‌ ప్రారంభంలో అల్లు అర్జున్, ప్రభాస్‌ వంటి వారితో కలిసి పనిచేసినందుకు గర్వపడుతున్నాను. వారి సినిమాలిప్పుడు సరిహద్దులను చెరిపిస్తూ పాన్‌ ఇండియా రేంజ్‌కి చేరుకున్నాయి. వారి కష్టానికి ఆ గుర్తింపు వచ్చిందని నేను భావిస్తాను. ఎంత పెద్ద స్టార్స్‌ అయినప్పటికీ ఎప్పటిలాగే వినయంగా ఉండటం వారి గొప్పతనానికి నిదర్శనం. అల్లు అర్జున్‌కి జాతీయ అవార్డు వచ్చినప్పుడు అభినందనలు తెలిపాను.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌



• ఉన్ని ముకుందన్‌

ఉన్ని ముకుందన్, మహిమా నంబియార్‌ జంటగా నటిస్తున్న పాన్‌ ఇండియా చిత్రం 'జై గణేష్‌'. రంజిత్‌ శంకర్‌ దర్శకత్వం వహిస్తున్నారు. రంజిత్‌ శంకర్‌కు చెందిన డ్రీమ్స్‌ ఎన్‌ బియాండ్‌ ప్రొడక్షన్స్, ఉన్ని ముకుందన్‌ ఫిలిమ్స్‌ భాగస్వామ్యంతో రూపొందుతోంది. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, ఒరియా భాషల్లో తెరకెక్కుతోన్న 'జై గణేష్‌' ఫస్ట్‌ లుక్‌ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్‌. ఈ సందర్భంగా రంజిత్‌ శంకర్‌ మాట్లాడుతూ– ''ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'జై గణేష్‌'. అన్నివర్గాల ప్రేక్షకులు మెచ్చే థ్రిల్లింగ్‌ అంశాలు చాలా ఉంటాయి. ఉన్ని ముకుందన్‌ పాత్ర గత చిత్రాలతో పోలిస్తే ఇందులో అత్యంత సవాల్‌గా ఉంటుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌ ఎర్నాకులం పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. 2024 వేసవిలో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి

నాకు కొత్తగా అనిపించింది - మెహరీన్‌



''స్పార్క్‌' సినిమా యాక్షన్‌ థ్రిల్లర్‌గా రూపొందింది. ఈ మూవీలో నేను లేఖ పాత్రలో కనిపిస్తాను. ఎంతో ప్రాధాన్యత ఉన్న రోల్‌ నాది. సినిమా నాతోనే ప్రారంభం అవుతుంది.. నాతోనే ముగుస్తుంది.. ఇలాంటి థ్రిల్లర్‌ మూవీలో నటించటం నాకు కూడా కొత్తగా అనిపించింది. ఈ సినిమా అన్నివర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని హీరోయిన్‌ మెహరీన్‌ అన్నారు. విక్రాంత్‌ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'స్పార్క్‌ లైఫ్‌'. మెహరీన్, రుక్సార్‌ థిల్లాన్‌ హీరోయిన్లుగా నటించారు. డెఫ్‌ ఫ్రాగ్‌ ప్రొడక్షన్స్‌ పై లీల నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా మెహరీన్‌ పంచుకున్న విశేషాలు...

- కొత్తవాళ్లు, అనుభవం ఉన్న నటీనటులతో పని చేసే క్రమంలో చాలా విషయాలు నేర్చుకుంటాం. 'స్పార్క్‌' సినిమాతో హీరోగా, దర్శకుడిగా పరిచయమవుతున్న విక్రాంత్‌ ఓ రోజు ఫోన్‌ చేసి, 'మీతో కలిసి నటించాలనుంది' అన్నారు. కథ నాకు నచ్చడంతో ఓకే చెప్పాను. విక్రాంత్‌గారు ఈ మూవీ కోసం చేసిన పరిశోధన నన్ను ఆకట్టుకుంది. నా పాత్ర, లుక్‌ కొత్తగా ఉంటుందని చెప్పారు.. నా లుక్, పాటలు తెరకెక్కించిన విధానం నన్నెంతో ఆకట్టుకుంది. విక్రాంత్‌ చెప్పిన మాటను నిలబెట్టుకున్నారని నాకు అర్థమైంది. లీల గారు ఎక్కడా రాజీపడకుండా ఈ మూవీ తీశారు.
- విక్రాంత్‌ అమెరికాలో మంచి స్థాయిలో స్థిరపడ్డారు. అయితే సినిమా చేయాలనే కలని పూర్తి చేసుకోవటానికి ఇక్కడకు వచ్చారు. అమెరికాలో జరిగిన కొన్ని వాస్తవ ఘటనల నేపథ్యంలో 'స్పార్క్‌' కథను తయారు చేసుకున్నారు విక్రాంత్‌. ఈ కథకి కమర్షియల్‌ అంశాలు జోడించి థ్రిల్లర్‌ మూవీగా తెరకెక్కించారు. తొలిసారి హీరోగా చేస్తూనే డైరెక్షన్‌ చేయటం ఎంతో కష్టం. కానీ, విక్రాంత్‌ ఎంతో కష్టపడి ఈ సినిమాను పూర్తి చేశాడు. తను ఓ డెబ్యూ హీరోగా, డెబ్యూ డైరెక్టర్‌గా మెప్పిస్తాడు.
- జీవితంలో ఉన్నతి స్థాయికి ఎదగాలని ప్రతి మనిషి కలలు కంటుంటారు.. నేను కూడా అంతే. నా కలలను నిజం చేసుకునే క్రమంలోనే ముందుకు వెళుతున్నాను. ఈ సినిమాలో నేను చేసిన లేఖ పాత్ర కూడా అలాగే ఉంటుంది.. అందుకే ఈ పాత్రకు నేను కనెక్ట్‌ అయ్యాను. నటిగా ప్రతి సినిమా నాకెంతో ప్రత్యేకమైనదే. కథ, నా పాత్ర నచ్చితేనే చేస్తాను.. లేకుంటే చేయను. అది నా కెరీర్‌కి ఎంతో సాయపడుతోంది. నన్ను ఇష్టపడే వారు, ప్రేక్షకులే నాలో స్ఫూర్తి నింపుతుంటారు. పాత్ర ఏదైనా నటిగా రెండు వందల శాతం న్యాయం చేయటానికి ప్రయత్నిస్తాను.
- నేను ఏదైనా వేడుకలకి వెళ్లినప్పుడు, నా సినిమా ప్రమోషన్స్‌లో ఉన్నప్పుడు ఎవరైనా నేను చేసిన పాత్ర పేరుతో పిలిస్తే నాకెంతో సంతోషంగా ఉంటుంది. చాలా మంది ఇప్పటికీ నా తొలి చిత్రం 'కృష్ణగాడి వీర ప్రేమగాథ' లోని మహాలక్ష్మి పాత్ర పేరుతో పిలుస్తుండటం హ్యాపీ.

నటుడిగా చేయడం అదృష్టం - విజయ్‌ ధరణ్‌



''లవ్, థ్రిల్లర్, హారర్‌ నేపథ్యంలో 'అన్వేషి' చిత్రం రూపొందింది. ఈ కథలోని అంశాలు ప్రేక్షకులకు కొత్తగా, ఫ్రెష్‌గా అనిపిస్తాయి. నిజ జీవితంలోని అన్ని పాత్రలను పోషించే అవకాశం నటీనటులకు మాత్రమే ఉంటుంది. ఓ రకంగా నటుడిగా చేయడం ఎంతో అదృష్టం'' అని హీరో విజయ్‌ ధరణ్‌ దాట్ల అన్నారు. వీజే ఖన్నా దర్శకత్వం వహించిన చిత్రం 'అన్వేషి'. అనన్యా నాగళ్ల, సిమ్రాన్‌ గుప్తా హీరోయిన్లుగా నటించారు. అరుణ శ్రీ ఎంటర్‌టైన్మెంట్స్‌పై టి.గణపతి రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విజయ్‌ ధరణ్‌ దాట్ల మాట్లాడుతూ–''వీజే ఖన్నాగారు ఆడిషన్‌కి పిలిచి 'అన్వేషి' కోసం నన్ను ఎంపిక చేశారు. ఒక ఊరిలోని ఆస్పత్రిలో కొందరు చనిపోతుంటారు. వారి మృతికి ఆత్మలే కారణమని గ్రామస్తులు భయపడుతుంటారు. ఇంతకీ వారు ఏ కారణం వల్ల చనిపోతున్నారు? నిజంగానే అక్కడ ఆత్మలున్నాయా? లేవా? అన్నది సినిమాలో ఆసక్తిగా ఉంటుంది. గణపతి రెడ్డిగారు ప్యాషనేట్‌ ప్రొడ్యూసర్‌.. ఎక్కడా రాజీ పడలేదు. 'అన్వేషి' కి రెండో భాగం ఉంటుంది. హీరో కంటే మంచి నటుడు అనిపించుకోవాలనుంది. ప్రస్తుతం రాజేంద్ర ప్రసాద్‌గారు లీడ్‌ రోల్‌లో చేస్తున్న ఓ సినిమాలో కీలక పాత్ర చేస్తున్నా. తమిళ సినిమాలో విలన్‌గా అవకాశం వచ్చింది'' అన్నారు.

రాజు యాదవ్‌ వినోదం



• అంకిత ఖరత్, 'గెటప్‌' శ్రీను

'జబర్దస్త్‌' ఫేమ్‌ గెటప్‌ శ్రీను హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'రాజు యాదవ్‌'. కృష్ణమాచారి కె. దర్శకునిగా పరిచయమవుతున్న ఈ సినిమాలో అంకిత ఖరత్‌ హీరోయిన్‌గా నటించారు. సాయి వరుణవి క్రియేషన్స్, చరిష్మా డ్రీమ్స్‌ ఎంటర్‌టైన్‌మెంట్‌ బ్యానర్‌లపై కె.ప్రశాంత్‌ రెడ్డి, రాజేష్‌ కళ్లేపల్లి నిర్మించారు. హర్షవర్ధన్‌ రామేశ్వర్‌ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'రాజు యాదవ్‌ చూడు..' అంటూ సాగే పాటని డైరెక్టర్‌ బాబీ (కేఎస్‌ రవీంద్ర) విడుదల చేసి, చిత్రయూనిట్‌కి అభినందనలు తెలిపారు. 'రాజు యాదవ్‌ చూడు..' పాటకి చంద్రబోస్‌ లిరిక్స్‌ అందించగా, రామ్‌ మిరియాల పాడారు. ''ప్రేమ, వినోదంతో పాటు ప్రేక్షకుల హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలు 'రాజు యాదవ్‌' సినిమాలో ఉన్నాయి. త్వరలో మూవీ విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్‌ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సాయిరామ్‌ ఉదయ్, ఎగ్జిక్యూటివ్‌ ప్రొడ్యూసర్‌: విప్లవ్‌.

పల్లెటూరి ప్రేమకథ



• అపర్ణా దేవి, వినాయక్‌ దేశాయ్‌

వినాయక్‌ దేశాయ్, అపర్ణా దేవీ జంటగా దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన చిత్రం 'రాధా మాధవం'. గోనల్‌ వెంకటేష్‌ నిర్మించిన ఈ మూవీ ఫస్ట్‌ లుక్‌ను నిర్మాత రాజ్‌ కందుకూరి విడుదల చేసి, మాట్లాడుతూ–''రాధా మాధవం' ఫస్ట్‌ లుక్‌ పోస్టర్‌ చాలా బాగుంది. కథ బాగుంటే చిన్న చిత్రాలను కూడా ప్రేక్షకులు ప్రోత్సహిస్తారు.. ఈ సినిమాని కూడా ఆదరిస్తారని నమ్ముతున్నాను'' అన్నారు. ''చక్కని కథాంశంతో రూపొందిన మా సినిమాను ప్రేక్షకులు చూసి, యూనిట్‌ని ఆశీర్వదించాలి'' అన్నారు వినాయక్‌ దేశాయ్. ''అందమైన పల్లెటూరి ప్రేమ కథా చిత్రమిది'' అన్నారు వెంకటేష్. ''విలేజ్‌ లవ్‌ డ్రామాలకు ఆడియన్స్‌ నుంచి ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. ఆ కోవలో వస్తున్న మరో చక్కని గ్రామీణ ప్రేమ కథా చిత్రం ఇది'' అన్నారు దాసరి ఇస్సాకు.

దేవి వచ్చేశారు!



• మాళవిక శర్మ

సుధీర్‌ బాబు హీరోగా నటిస్తున్న పాన్‌ ఇండియా చిత్రం 'హరోం హర'. జ్ఞానసాగర్‌ ద్వారక దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మాళవిక శర్మ హీరోయిన్. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్‌పై సుమంత్‌ జి.నాయుడు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మాళవిక శర్మను దేవిగా పరిచయం చేస్తూ ఫస్ట్‌ లుక్‌ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్‌. చీరలో సంప్రదాయకంగా ఉన్న ఆమె లుక్‌ ఆకట్టుకుంటోంది. ''చిత్తూరు జిల్లా కుప్పంలో 1989 నాటి నేపథ్యంలో సాగే చిత్రం 'హరోం హర'. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది'' అని చిత్రయూనిట్‌ పేర్కొంది. సునీల్‌ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: చేతన్‌ భరద్వాజ్, కెమెరా: అరవింద్‌ విశ్వనాథన్.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

नैनं छिन्दन्ति शस्त्राणि नैनं दहति पावकः ।
न चैनं क्लेदयन्त्यापो न शोषयति मारुतः ॥



~ Endless Inspiration. Matchless legacy ~

Hon'ble Saharasri Ji

(1948 – 2023)

Sahara India Pariwar expresses its collective sense of grief at the loss of its beloved Chief Guardian, Hon'ble 'Saharasri' Ji, who left for his heavenly abode on 14th November, 2023.

The strength of his character, the influence of his personality and the power of his presence have all left a lasting memory. As he passes from the turmoil of life to eternal tranquillity, he leaves behind a legacy that remains as a profound and precious imprint in the hearts of billions to whom his life brought hope and encouragement.

The man who enlightened us to the supremacy of human emotions over business interests, will continue to guide us, inspire us to new frontiers, for he exemplified human spirit in its true essence - unconquerable and supremely courageous.

SAHARA
INDIA PARIWAR

WhatsApp number : +91 98399 90501 | Email Id : contact@sahara.in